Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 116 • ఆదివారం 6 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 6.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం
శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శుద్ధ చతుర్దశి రా. 9.50 వరకు, అనంతరం పూర్ణిమ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 2.15 వరకు, అనంతరం శ్రవణం;
అమృతకాలం: రా. 7.25 నుండి 11.05 వరకు; వర్జ్యం: ఉ. 8.50 నుండి 10.35 వరకు; దుర్ముహూర్తం: సా. 4.47 నుండి 5.38 వరకు; రాహుకాలం: సా. 4.30 నుండి 6.00 వరకు; యమగండం: మ. 12.00 నుండి 1.30 వరకు;

ఉపరాష్ట్రపతి వెంకయ్య

• వెంకయ్యజీ... కంగ్రాట్స్



భారీ మెజారిటీతో విజయం

ప్రతిపక్షాల నుంచి భారీగా క్రాస్ ఓటింగ్
వెంకయ్య నాయుడుకు 516 ఓట్లు
గోపాలకృష్ణ గాంధీకి 244 ఓట్లు
చెల్లని ఓట్లు 11... ఓటేయని వారు 14
ఇద్దరు బీజేపీ, ఇద్దరు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నలుగురు గైర్హాజరు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ముందే ఊహించిన ఫలితాల్లో వెంకయ్య నాయుడే గెలుపొందారు. ఊహించినదాని కంటే అదనంగా ఓట్లు సాధించి 13వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. పోలైన ఓట్లలో రెండింట మూడొంతుల కంటే ఎక్కువ ఓట్లు సాధించి ప్రత్యర్థి గోపాలకృష్ణ గాంధీని చిత్తు చేశారు. సాయంత్రం గం.6.45ని. సమయంలో రిటర్నింగ్ అధికారిగా ఉన్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ శంషేర్ కే. షరీఫ్ ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. మొత్తం పోలైన 771 ఓట్లలో వెంకయ్య నాయుడు 516 ఓట్లు సాధించారు. యూపీఏ తరపున పోటీ చేసిన గోపాలకృష్ణగాంధీ 244 ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 11 ఓట్లు చెల్లనివిగా అధికారులు పక్కనపెట్టారు. ప్రత్యర్థిపై 272 ఓట్ల భారీ మెజారిటీతో వెంకయ్య నాయుడు గెలుపొందారు. లోక్‌సభ 545, రాజ్యసభ 245 (నామినేటెడ్ సభ్యులతో సహా) మొత్తం 790 మంది సభ్యులు కల్గిన ➪ 2వ పేజీలో...

ఎగువసభ ప్రతిష్టను మరింత పెంపొందించేలా వ్యవహరిస్తా. రాజ్యసభ గౌరవ మర్యాదలు కాపాడటంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తా. నాకు మద్దతు పలికిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, పార్టీ నేతలకు, ఓటేసిన ప్రతి ఎంపీకి కృతజ్ఞతలు.
- వెంకయ్య తొలి పలుకులు



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సందర్భంగా సహధర్మచారిణి ఉషాతో సంతోషాన్ని పంచుకుంటున్న వెంకయ్య. చిత్రంలో కుమార్తె దీప 2

తెలుగువారికి పెద్దదిక్కు

ఉపరాష్ట్రపతికి సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

ఎంపీ కవిత చిరు సెల్ఫీ



అభిమాన నటుడితో సెల్ఫీ అంటూ ట్వీట్ ఉపరాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ సందర్భంగా.. 3వ

మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులపై జీఎస్టీ తగదు

న్యాయపోరాటమే

నీటి పారుదల, మంచినీటి పథకాలు, గృహ, రహదారుల నిర్మాణం లాంటి అనేక ముఖ్యమైన కార్యక్రమాలకు జీఎస్టీని వర్తింపజేస్తే రాష్ట్ర ప్రభుత్వాలకు పరోక్షంగా కీడు తలపెట్టినట్లే. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా కొన్ని రంగాలను జీఎస్టీ నుంచి మినహాయించాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేయాల్సి వస్తుంది. తద్వారా రాష్ట్రాల హక్కులను కాపాడుకుంటాం.
- ముఖ్యమంత్రి కేసీఆర్



- పురోగతి ప్రాజెక్టులపై జీఎస్టీ వద్దంటూ పదేపదే కేంద్రానికి వివరించినా ఫలితం లేదు
- పొరుగు సీఎంలు మా వాదన బలపరిచారు
- అయినా కేంద్రానిది ఏకపక్ష నిర్ణయమే
- ఈ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఊరుకోను
- ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ
- నేడు ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా తెలంగాణలో చేపట్టిన అనేక ప్రజోపయోగ ప్రాజెక్టులపై తీవ్రమైన ఆర్థికభారం పడుతోంది. వేలకోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ, కోట ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ప్రాజెక్టుల నిర్మాణం పనులకు జీఎస్టీ మినహాయించాలని కోరుతూ పంపిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ విధానం సరైనది కాదని పేర్కొన్నారు. ఈ రెండు రంగాల్లోనే సరాసరిగా రూ.19,200 కోట్ల ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించక తప్పడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. జీఎస్టీలో కొన్ని మినహాయింపులు అవసరమని మొదటినుంచీ తాము సూచిస్తూ వస్తున్నామని, అయినప్పటికీ కేంద్రం తమ ప్రతిపాదనను పెడచెవిన పెట్టడం దురదృష్టకరమని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా నిర్మాణ రంగంలో అనేక ప్రాజెక్టులను ప్రారంభించిన మిగతా రాష్ట్రాల్లోనూ కేంద్రం అవలంబిస్తున్న విధానంపై తీవ్రమైన వ్యతిరేకత వస్తోందన్నారు. అయితే, తెలంగాణపై పడే ఆర్థిక భారాన్ని ఎట్టి ➪ 3వ పేజీలో...

ప్రాజెక్టులపై పన్నుభారం తగ్గించాలంటూ

ఢిల్లీలో కేటీఆర్ పోరు



3

జీఎస్టీ కౌన్సిల్‌లో పట్టుబట్టిన ఐటీ మంత్రి
తలొగ్గిన మండలి... కొంత తగ్గిన భారం
18 నుంచి 12శాతం పన్ను పరిధిలోకి
మరింత తగ్గించాలి.. లేదంటే న్యాయపోరాటం

ఆ పదవులు మరో మూడేళ్లు?

వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలక మండళ్లకు సర్కార్ భరోసా • పదవీ కాలం పొడిగింపునకు సీఎం సూచనప్రాయ అంగీకారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సహకార చట్టం ప్రకారం మూడేళ్ళ కాలపరిమితితో ఎన్నుకోబడిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (ప్యాక్స్) పాలక మండళ్ళపట్ల కేసీఆర్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగిసిపోనున్న ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను మరో మూడేళ్ళు పొడిగించాలన్న ప్రతిపాదనకు ఆయన సూచనప్రాయంగా ➪ 10వ పేజీలో...



అధికారికంగా
ప్రొ. జయశంకర్ జయంతోత్సవాలు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ 10

డోక్లామ్ వివాదం

చైనా సైనిక చర్య?

చిన్న ఆపరేషన్‌తో లేపేస్తాం • భారత్‌పై మళ్లీ మాట తూలిన డ్రాగన్
చైనా దురాక్రమణను నిలదీయండి • ఆగ్నేయాసియా దేశాలకు వియత్నాం పిలుపు

న్యూఢిల్లీ/బీజింగ్: సరిహద్దు వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకుందామని భారత్ ఎంత సంయమనం పాటిస్తున్నా చైనా నుంచి సానుకూల స్పందన కానరావడం లేదు. ఆ దేశ అధ్యక్షుడి దగ్గర నుంచి, సైన్యం మీదుగా, మీడియాతో పాటు ఇతర నిపుణులు కూడా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా తక్కువ స్థాయిలో మిలటరీ ఆపరేషన్ ద్వారా డొక్లాంలో భారత్‌ను అక్కడి నుంచి తరిమి కొడతామని, అదీ రెండు వారాల్లో చైనా చేసేస్తుందని అక్కడి ప్రభుత్వ అధికార పత్రిక ఒక వార్తను ప్రచురించింది. షాంఘై అకాడెమీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ కు చెందిన హు ఝియాంగ్ ఈ మాటలను అన్నట్లు పేర్కొన్నారు. జూన్ 16 నుంచి డొక్లాం త్రికూడలిలో భారత్- చైనా దళాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోందన్నది తెలిసిందే. ఇక్కడ చైనా రోడ్డు వేయబోతుంటే భారత్ అడ్డుకుంది. ఆ భూభాగం భారత్‌ది కాదని చైనా దబాయిస్తుంటే, అది తమదని, తాము అభ్యర్థిస్తేనే భారత్ చైనాను అడ్డుకుందని భూటాన్ చెబుతోంది. అసలు ఈ భూభాగం మీద బారత్ కూడా తమదని అంటోంది. కానీ చైనా, భూటాన్‌లతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుతోంది. ఈ క్రమంలో దేశంలో మిగిలిన భూభాగం నుంచి ఈశాన్య రాష్ట్రాలకు ఈ భూభాగం అనుసంధానంగా ఉంది. దీన్ని కనుక చైనా ఆక్రమిస్తే ఈశాన్య రాష్ట్రాలతో భారత్ లింకులు చాలా వరకూ తెగిపోతాయి.

డ్రాగన్ దేశం తరచు ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని భూటాన్ ఆందోళన చెందుతోంది. వివాదాస్పద ప్రాంతం ఎవరిదన్న విషయం తేలేవరకూ అక్కడ ఎవరూ ఉండకూడదన్నది భూటాన్ వాదన. ఈ భూభాగంలో భారత్ ఉన్నా భూటాన్‌కు భయం లేదు కానీ ➪ 10వ పేజీలో...





సింగరేణి చూపు సోలార్ వైపు

- విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- 50-100 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లపై కసరత్తు
- టీఎస్ఆర్ఈడీసీఎల్‌తో సింగరేణి చైర్మన్ శ్రీధర్ చర్చలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి సంస్థ చూపు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై పడింది. ఇప్పటికే బొగ్గు ఉత్పత్తే కాక.. ఆదిలాబాద్ జిల్లా జైపూర్‌లో 1200మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పిన యాజమాన్యం ఇపుడు మరో ముందడుగు వేస్తోంది. థర్మల్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 7,255మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ➪ 8వ పేజీలో...



మాటిచ్చిన మరుసటి రోజే నిధులు విడుదల

ఆ రెండు గ్రామాలకు స్పెషల్ కంపోనెంట్ ఫండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తానంటే ఏమిటో నిరూపించుకోవాలని ప్రజాక్షేత్రంలోకి దిగిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు వినూత్న ప్రయోగాన్ని మొదలుపెట్టారు. గ్రామాల పర్యటనల్లో తన దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నారు. ప్రజల నుంచి వచ్చే విజ్ఞప్తులు, ➪ 10వ పేజీలో...

ట్రంప్ మరో షాక్



అమెరికాకు వెళితే ఐదేళ్ల వరకు సంక్షేమ ఫలాలు నిల్ 11

కొనసాగుతున్న వేట



ముగ్గురు ఎల్ఈటీ ఉగ్రవాదుల హతం 11

చర్చలే పరిష్కారం



ప్రధాని నరేంద్ర మోడీ 11



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యకు శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయి తినిపిస్తున్న ఆయన సతీమణి ఉష



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యకు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్ తినిపిస్తున్న ప్రధాని మోడీ



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యానాయుడు శుభాకాంక్షలు తెలుపుతున్న రైల్వే మంత్రి సురేష్ ప్రభు



ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యానాయుడుకు గెలుపు పత్రం అందజేస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ షంశేర్ షరీఫ్

ఉపరాష్ట్రపతి వెంకయ్య

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటులో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన 785 మంది సభ్యులే ఓటర్లుగా జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో 771 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరో 14 మంది వివిధ కారణాల వల్ల ఓటు వేయలేకపోయారు.

శనివారం ఉదయం గం. 10కి మొదలైన పోలింగ్ ప్రక్రియంలో తొలి 2 గంటల్లోనే 90 శాతం మంది అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం గం. 5కు పోలింగ్ ముగియగా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి చెందిన ఒకరిద్దరు సభ్యులు చివరి నిముషాల్లో చేరుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే సమయం మించిపోవడంతో అధికారులు ఓటు వేయడానికి అనుమతించలేదు. ఓటు వేయని 14 మందిలో ఇద్దరు బీజేపీ సభ్యులు కూడా ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన సావర్లాల్ జాట్ అనారోగ్యంతో ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతుండగా, కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న విజయ్ గోయల్ కూడా అనారోగ్యంతో ఓటు వేయలేకపోయారు. మిగతా 12 మందిలో మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ సహా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు నలుగురున్నారు. కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీల నుంచి చెరో ఇద్దరు కూడా ఓటు వేయలేకపోయారు. ఎన్సీపీ నుంచి ఉదిత్ రాజ్ భోస్లే, పీఎంకే నుంచి అన్బుమణి రాందాస్ కూడా ఓటు హక్కును వినియోగించుకోలేదు. స్వతంత్ర సభ్యుడు నభాకుమార్ శరణ్యతో పాటు లోక్‌సభ నామినేటెడ్ ఆంగ్లో- ఇండియన్ సభ్యుడు ఒకరు ఓటు వేయలేదు.

వెంకయ్య వైపే క్రాస్ ఓటింగ్

రాష్ట్రపతి ఎన్నికల్లో మాదిరిగానే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ క్రాస్ ఓటింగ్ జరిగింది. ఎన్డీయే అభ్యర్థికి పడాల్సిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు అనుకూలంగా పోలవ్వడమే ఇందుకు నిదర్శనం. నిజానికి ఎన్డీయే అభ్యర్థిగా



బరిలో దిగిన వెంకయ్యనాయుడుకు సంఖ్యాబలం ప్రకారం గరిష్టంగా అన్ని ఓట్లు పోలైనప్పుడు 505 ఓట్లు పడాలి. ఉభయ సభల్లో కలిపి బీజేపీ 337 మంది సభ్యులను కలిగి ఉండగా, తెలుగుదేశం, శివసేన తదితర ఎన్డీయే భాగస్వామ్య పార్టీలకు తోడు తటస్థంగా ఉన్నప్పటికీ ఎన్డీయే అభ్యర్థికి మద్దతు ప్రకటించిన అన్నాడీఎంకే(50), టీఆర్ఎస్, వైకాపా వంటి పార్టీలను కలిపితే ఈ సంఖ్యకు చేరుకుంటాం. నిజానికి రాష్ట్రపతి ఎన్నికల్లో ఈ పార్టీలకు తోడు జేడీ(యూ), బీజేడీలు కూడా ఎన్డీయే వెంట నడిచాయి. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయానికి వచ్చేసరికి ఈ రెండు పార్టీలూ యూపీఏ అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీకి మద్దతు ప్రకటించాయి. బీహార్‌లో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో జేడీ(యూ) కూడా ఎన్డీయే గూటికి చేరినప్పటికీ, ముందే ఇచ్చిన మాట ప్రకారం ఓటు వేస్తామని చెప్పాయి.

ఈ లెక్కలన్నీ పరిశీలిస్తే జేడీ(యూ), బీజేడీ తీసివేయగా, వెంకయ్య నాయుడుకు గరిష్టంగా 505 ఓట్లు రావాలి. అయితే ఇద్దరు బీజేపీ సభ్యులు, ఒక నామినేటెడ్ సభ్యులు ఓటు వేయనందున, వారి ఓట్లను తీసేసినా 502 రావాలి. కానీ 516 ఓట్లు వెంకయ్య నాయుడుకు అనుకూలంగా రావడంతో మరో 14 ఓట్లు యూపీఏ కూటమి లేదా తటస్థ రాజకీయ పార్టీల నుంచి వెంకయ్యనాయుడుకు బదిలీ అయ్యాయని స్పష్టంగా అర్థమవుతోంది. తనకు వ్యక్తిగతంగా వివిధ పార్టీల నేతలతో సన్నిహిత సంబంధాలున్నాయని, వారు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తనకే ఓటు వేస్తారని వెంకయ్యనాయుడు ముందు నుంచీ చెబుతూ వచ్చారు. అన్నట్టుగానే కొందరు సభ్యులు ఆయనకే తమ ఓటు వేసి మద్దతు ప్రకటించారు. అయితే ఈ ఎన్నికల్లో పార్టీల విప్ ఉండదు కాబట్టి సభ్యులు తమకు నచ్చిన ఎవరికైనా స్వేచ్ఛగా ఓటు వేసుకునే వెసులుబాటుంది. దాన్ని కొందరు సభ్యులు ఉపయోగించుకున్నారని తెలుస్తోంది.



తనకు మద్దతు పలికిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, పార్టీ నాయకులందరికీ వెంకయ్యనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని చెప్పారు.రాజ్యసభ గౌరవ మర్యాదలు కాపాడటంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

బాధ్యతాయుతంగా నడుచుకుంటా

అందరికీ ధన్యవాదాలుః గోపాల కృష్ణ గాంధీ

ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడుకు ప్రతిపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థి గోపాలకృష్ణ గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.తన అభ్యర్థిత్వాన్ని బలపరిచిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు ఊహించిన దానికంటే ఎక్కువ ఓట్లు వచ్చాయన్నారు.

వెంకయ్యకు అభినందనల వెల్లువ

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వెంకయ్య నాయుడును రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నుంచే ఆయన నివాసం వద్ద వాతావరణం కోలాహలంగా మారింది. బీజేపీతో పాటు పలు ఇతర రాజకీయ పార్టీల నేతలు సైతం ఆయన్ను కలిసి అభినందించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ పార్టీల అధినేతలు, సినీ, క్రీడా రంగాల ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు. గెలుపొందిన తర్వాత వెంకయ్య తొలిసారిగా మాట్లాడుతూ ఎగువసభ ప్రతిష్టను మరింత పెంపొందించేలా వ్యవహరిస్తానని అన్నారు. ఢిల్లీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన స్టేజి మీద పలువురు ఆయనకు పుష్ప గుచ్చాలు అందిండంతో పాటు పూలమాలలు వేసి తమ హర్షం వ్యక్తం చేశారు.

రైతు కుటుంబం నుంచి ఉప రాష్ట్రపతి వరకు



ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రస్థానం సామాన్య రైతు కుటుంబం నుంచి ప్రారంభమైంది. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకున్న ఆయన..అంచలంచెలుగాఎదిగి దేశంలోనే అత్యున్నత పదవిని అందుకున్నారు. సొంత ప్రతిభతో పాటు తాను ఎంతో నమ్ముకున్న పార్టీని చివరి వరకు వదలలేదు. మాటల మాంత్రికుడిగా పేరున్న వెంకయ్య..ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడగలరు.

1949 జులై 1న నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని చవటపాళెం గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వెంకయ్య...చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో మేనమామ మస్తాన్ నాయుడు దగ్గర పెరిగారు. ప్రాథమిక విద్యాభ్యాసం ముగిసిన తర్వాత ఉన్నత విద్య కోసం నెల్లూరు వెళ్లటానికి సుమారు 6 కి.మీలు నడిచి వెళ్లేవారు. నెల్లూరులో డిగ్రీ వరకు చదివిన వెంకయ్య ఆంధ్రా యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ప్రతికూల పరిస్థితులను సైతం అనుకూలంగా మార్చుకోవడంలో వెంకయ్య దిట్ట. సమయ స్ఫూర్తి, మాటకారితనం, లౌక్యం వెంకయ్యను ఈ స్థాయికి తీసుకువచ్చాయి.

వెంకయ్య గురించిన 10 కీలకాంశాలు

- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా వెంకయ్య భారీ విజయం. వెంకయ్యకు పోలైన ఓట్లు516. ప్రతిపక్షాల అభ్యర్థి గోపాలకృష్ణగాంధీకి పోలైన ఓట్లు 244.
- దేశంలోని అత్యున్నత పదవుల్లో రెండోదైన ఉప రాష్ట్రపతి పదవిని అందుకున్న తెలుగువారిలో వెంకయ్యనాయుడు మూడో వ్యక్తి. సర్వేపల్లిరాధాకృష్ణన్ మొదటి తెలుగు వ్యక్తి కాగా..వి.వి గిరి రెండో తెలుగు వ్యక్తి.
- కర్నాటక నుంచి మూడుసార్లు, రాజస్థాన్ నుంచి ఒకసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు.
- జులై 2002 నుంచి అక్టోబర్ 2004 వరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించార. 2004 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత ఆ పదవి నుంచి తప్పుకున్నారు.
- వాజ్‌పేయి హయాంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రిగా, సమాచార ప్రసార మంత్రిగా, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా సేవలందించారు.
- పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు. స్మార్ట్ సిటీ మిషన్,అటల్ మిషన్,స్వచ్ఛ భారత్ మిషన్, అందరికీ ఇల్లు పథకం. ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన ప్రారంభంలోనూ కీలక పాత్ర పోషించారు.
- దక్షిణ భారత దేశానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ హిందీ లో మంచి ప్రావిణ్యం కలిగిన వ్యక్తి. ఉత్తరాధిన నిర్వహించి న ఎన్నో ర్యాలీల్లో వెంకయ్య హిందీలో ఆకట్టుకునే ప్రసంగాలు చేశారు.
- ఏపీలోని నెల్లూరు జిల్లాలోని సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన వెంకయ్య 1973 నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు.
- రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

వెంకయ్యకు గవర్నర్, కేసీఆర్ అభినందనలు


హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వతంత్ర భారతదేశంలో 13వ ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవికి భారీ మెజారిటీతో ఎన్నికైన తెలుగుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాజ్యాంగ పదవికి వన్నె తేవడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఆయన ఎంతో సమర్థుడని పేర్కొన్నారు. పరిపాలనా వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రజాస్వామ్య ఫలాలను పూర్తిస్థాయిలో ప్రజలకు చేర్చేలా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

వెంకయ్యకు జగన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికల్లో గెలుపొందిన వెంకయ్యనాయుడుకు ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్య నాయుడు భారీ మెజారిటీతో విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగపరమైన పదవులకు ఏకగ్రీవ ఎన్నికనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆకాక్షింస్తుందన్నారు. రాజ్యసభ ఛైర్మన్‌గా తెలుగు వ్యక్తి ఉండటం తమకందరికీ గర్వకారణం అని జగన్ ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెంకయ్య గెలుపుతో బీజేపీలో సంబురాలు

- ఉపరాష్ట్రపతికే వన్నె తెస్తారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఆ పార్టీ ఎల్పీ నేత కిషన్‌రెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు భారీ మెజార్టీతో గెలవడంతో రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. బాణా సంచా పేల్చుతూ స్వీట్లు పంచారు. బీజేపీకి వెంకయ్య చేసిన సేవలు ఎనలేనివని, కీలక పదవులకు వన్నె తెచ్చారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎల్పీ నేత కిషన్‌రెడ్డి అన్నారు. భారత ఉపరాష్ట్రపతి పదవికి కూడా ఎంతో గౌరవం తెస్తారని వారు అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోడికి, పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు కృతజ్ఞతలు తెలిపారు. సామన్య కార్యకర్త నుంచి అత్యున్నత స్థానానికి ఎదగడం బీజేపీలోనే సాధ్యమని లక్ష్మణ్ అన్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ప్రధాని, సామాన్య కార్యకర్త రాష్ట్రపతి, గోడలకు పార్టీ పోస్టర్లు అతికించిన వెంకయ్య ఉపరాష్ట్రపతి అయ్యారని లక్ష్మణ్ గుర్తు చేశారు. వెంకయ్య విజయం పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషిస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. అనేక పదవుల్లో కీలక పాత్ర పోషించారని, ఉపరాష్ట్రపతి పదవికి కొత్త పేరు తెస్తారని ఆయన అశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారు అనందిస్తున్నారని వివరించారు. దేశసేవకు ఆయన పునరంకితం అవుతారని పేర్కొన్నారు.

తెలుగువారికి పెద్ద దిక్కు..



- మాటల మాంత్రికుడు
- విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు
- ఏ అంశంపైనైనా అనర్గళంగా మాట్లాడే సత్తా కలిగిన నాయకుడు
- సమయస్ఫూర్తి, లౌక్యం ఆయన సొంతం

వెంకయ్యానాయుడు... తెలుగువారికి పరిచయం అక్కరలేని పేరు. గంగాప్రవాహసదృశమైన ఆయన ప్రసంగాలను వినని వారు లేరు. ఏ అంశంపైనైనా సరై ఊకదంపుడు కాకుండా, చెప్పింది చెప్పకుండా గంటల తరబడి మాట్లాడం ఆయనకు దేవుడిచ్చిన వరం. తెలుగులోనే కాదు, ఏ భాషలోనైనా అంత ధారాళంగానూ ఆయన మాట్లాడగలరు. తన వాదనా పటిమచేత ఆవలి వారిని ఒప్పించగలరు. ఆయన అజాత శత్రువు. అన్ని పార్టీల్లోనూ ఆయనకు మిత్రులు ఉన్నారు. ఆయన మాటల్లోనే బాల్యంలో తల్లిప్రేమకు దూరం కావడంతో ఆయన సొంత పార్టీనే తల్లిలా భావించారు. అది మొక్కుబడిగా అన్న మాట కాదు, హృదయాంతరాళాల్లోంచి వచ్చిన మాటే. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)గా పేరు మార్చుకోవడానికి ముందు భారతీయ జనసంఘ్ కేవలం ఉత్తరాది పార్టీగానే అందరికీ చిరపరిచితం. ఆ పార్టీకి జాతీయాధ్యక్షునిగా వ్యవహరించిన వారిలో రాజమహేంద్రవరానికి చెందిన సుప్రసిద్ధ న్యాయవాది అవసరాల రామారావు కూడా ఉన్నారు. ఆయన సుప్రీంకోర్టు అడ్వొకేట్‌గా పని చేయడం వల్ల ఉత్తరాదిన జనసంఘ్ నాయకులతో పరిచయాలు ఏర్పడటం, తద్వారా పార్టీ జాతీయాధ్యక్షునిగా వ్యవహరించే అవకాశంరావడం జరిగింది.

ఆయన మేధావి వర్గానికి చెందిన వారు కావడం వల్ల ఎక్కువ ప్రాచుర్యం పొందలేదు. గుంటూరుకు చెందిన జూపూడి యజ్ఞనారాయణ, విజయనగరానికి చెందిన ఒబిలిసెట్టి రామారావు, వరంగల్‌కి చెందిన జంగారెడ్డి, విశాఖకు చెందిన ఎన్ఎస్ఎన్ రెడ్డి హైదరాబాద్ న్యాయవాది వెంట్రప్రగడ వెంకటరామారావు ప్రభృతులు కూడా ఉమ్మడి రాష్ట్రంలో భారతీయ జనసంఘ్ కోసం కృషి చేశారు. అయితే, వీరందరి ప్రభావం స్థానికమే. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజక వర్గాల నుంచి మేధావి వర్గం మద్దతుతో జనసంఘ్ నాయకులు శాసనమండలిలో ప్రవేశించేవారు. అలాంటి నేపథ్యంలో విశాఖలో ఆంధ్రా యూనివర్శిటీలో న్యాయశాస్త్ర విద్యార్థి సంఘం నాయకునిగా పేరు సంపాదించుకున్న ముప్పవరపు వెంకయ్య నాయుడు తన వాగ్ధాటితో, ఉపన్యాస చాతుర్యంతో అనతికాలంలోనే అందరికీ తలలో నాలుక అయ్యారు. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమం ఆయన రాజకీయంగా ఎదగడానికి ఎంతో తోడ్పడిందంటే అది అతిశయోక్తి కాదు. అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఎబివిపి) లోనూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లోనూ పొందిన శిక్షణ ఆయనను సౌశీల్యం, నిబద్ధత, అంకిత భావం కలిగిన నాయకునిగా తీర్చిదిద్దింది. సంఘ్ పరివార్ సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా విశ్వసించి ఆచరించారు. నమ్మిన సిద్ధాంతాలను చిత్తశుద్ధి, నిజాయితీలతో ఆచరించే పాతతరం నాయకులతో కలిసిమెలిసి తిరగడం వల్ల వారి ప్రభావంఆయనపై పడింది. జైఆంధ్ర ఉద్యమంలో తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, ఆత్యయిక స్థితిలో (ఎమర్జెన్సీ కాలంలో) అగ్రనాయకులైన వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషిలతో కలిసి పనిచేసే అవకాశం, అదృష్టం ఆయనకు కలి గింది. భారతీయ జనసంఘ్ బీజేపీగా మారుతుందని కానీ, అది అధికారంలోకి వస్తుందని కానీ అప ్పట్లో ఎవరూ ఊహించ లేదు కూడా. వారందరినీ ఆయన పితృ సమా నంగానే గౌరవించగా, ఆయనపై వారంతా పుత్ర వాత్సల్యాన్ని కనబర్చారు. వాజ్‌పేయి అం తటి మేరు నగధీరుడైన నాయకుని మంత్రివర్గంలో సభ్యునిగానూ, అదే సమయంలో ఆయన ప్రాతి నిథ్యం వహించిన పార్టీకి జాతీయాధ్యక్షునిగానూ పని చేసే అవకాశం కలగడం వెంకయ్య నాయుడు ఎదుగదలకు సోపాన మైంది. నిజానికి వెంకయ్య కన్నా వయసులో, అనుభవంలో పెద్దలు ఎంతో మంది ఉన్నా, దూసుకుని పోయే చొరవ, ఉత్తరాది భాషల్లో ప్రావీణ్యం, వాదించి, మెప్పించే చాతుర్యం వారందరినీ ఆకట్టుకుంది. అందుకే, ఎన్‌డిఏ-1హయాంలో వెంకయ్య నాయుడుని పార్టీ జాతీయాధ్యక్షునిగా చేస్తామన్నా ఎవరూ వ్యతిరేకించలేదు. వెంకయ్య నాయుడుకి ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ అంటే ఎంత గౌరవమో, అగ్రనాయకులైన వాజ్‌పేయి, అద్వానీలంటే అంత ఆరాధనా భావం. ముఖ్యంగా, వాజ్‌పేయి కవితలతో సాగే హిందీ ప్రసంగాలను తెలుగునాట ఆయన పర్యటించిన సందర్భాల్లో వెంకయ్యనాయుడు అనువదించిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

కేంద్రమంత్రిగా...

వాజ్‌పేయి కేబినెట్‌లో వెంకయ్య గ్రామీణాభివృద్ధి శాఖను నిర్వహించారు. గ్రామాల రూపురేఖలను మార్చేందుకు ఉద్దేశించిన పథకాలను ప్రవేశపెట్టారు. అలనాడు వాజ్‌పేయి కేబినెట్‌లో పని చేసినప్పుడు కానీ, ఇటీవల మోడీ మంత్రివర్గంలో సభ్యునిగా కొనసాగినప్పుడు కానీ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంలో వెంకయ్య కనబర్చిన ప్రతిభ అగ్రనాయకులను ఆకట్టుకుంది. వాజ్‌పేయి హయాంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేసిన పనికి ఆహారం పథకం, స్వర్ణచతుర్భుజి పథకం గురించి విస్తృత ప్రచారం జరిపింది వెంకయ్యే. అలాగే, మోడీ ప్రభుత్వంలో పార్లమెంటరీ వ్యవహారాలు, ప్రసారాలు, ప్రచారశాఖల మంత్రిగా ఆయన మోడీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్, మన్‌కీ బాత్, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల గురించి ఇతర కేంద్ర మంత్రుల కన్నా ఎక్కువగా ప్రచారం జరిపి మోడీకి దగ్గరయ్యారు. పార్లమెంటులో ముఖ్యంగా, రాజ్యసభలో ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొనే సమర్థునిగా వెంకయ్యనాయుడు పేరొం దారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాల గురించి తడుముకోకుండా, పొల్లుపోకుండా అనర్గళంగా ప్రాసలో చెప్పగల నేర్పు వెంకయ్య నాయుడుకు ఉంది. తెలుగులో ప్రాసకు ఎంత ప్రాధాన్యమిస్తారో, ఆంగ్ల, హిందీ భాషల్లో కూడా అంతే ప్రావీణ్యాన్ని కనబర్చడం ఆయనకు వెన్నతో బెట్టిన విద్య. ఆయనను ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేయడం పార్టీ పరంగా ప్రధాని మోడీకి నష్టమే. అలాగే, ఆయనకు కూడా పార్టీ రాజకీయాల నుంచి తప్పుకోవడం సుతరామూ ఇష్టం లేదు. అయినప్పటికీ ప్రధాని మోడీ సలహాను గౌరవించి ఈ పదవిని అంగీకరించినట్టు వెంకయ్యే స్వయంగా ప్రకటించారు.

వెంకయ్య ఉపరాష్ట్రపతి పదవిలో కూర్చుంటే, గతంలో మాదిరిగా తెలుగు రాష్ట్రాల సమస్యల గురించి కేంద్రంలో గట్టిగా వినిపించేనాయకులు కొరత ఏర్పడుతుంది. పట్టణాభి వృద్ధి శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కొంచెం ఇంచుమించుగా స్మార్ట్ సిటీస్, అమృత నగరాలను ప్రకటించారు. సున్నితమైన, భావోద్వేగ వాతావరణంలో ఆయన ఎవరినీ నొప్పించకుండా తెలుగువారి ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడి పథకాలు, ప్రాజెక్టులు సాధించారు. ముఖ్యం గా రాజధాని నగరం కూడా లేని ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని అమరావతి నిర్మాణంలో ఎంతో తోడ్పాటు ను అందిస్తూ వస్తున్నారు. ఇప్పటికి నాలుగు సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇందులో మూడు

తెలుగువారి వాణి వినిపించేవారేరీ?

సార్లు కర్నాటక నుంచి, ఒక సారి రాజస్థాన్ నుంచి. తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కసారి కూడా రాజ్యసభకు ఎన్నిక కాలేదు. కేంద్ర మంత్రిగా ఆయన కొనసాగింది ఇతర రాష్ట్రాల ద్వారా లభించిన రాజ్యసభ సభ్యత్వం ద్వారానే. అయినప్పటికీ, తెలుగు రాష్ట్రాల పట్ల అభిమానంతో ఆయన కేంద్రం నుంచి రావల్సిన సాయం కోసం, ప్రాజెక్టులు, పథకాల కోసం కృషి చేసి ఆదర్శంగా నిలిచారు. జన్మభూమికోసం, రాజకీయంగా జన్మనిచ్చిన బీజేపీ కోసం నిర్విరామంగా సేవలందిస్తున్న వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా కూడా తన పలుకుబడినీ, హోదానీ ఉపయోగించి తెలుగురాష్ట్రాల అభివృద్ధి కోసం పాటు పడగలరని ఆశిద్దాం.

న్యాయపోరాటమే

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితుల్లోనూ భరించబోమని స్పష్టంచేశారు. ఈ అంశంపై న్యాయ పోరాటం చేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. జీఎస్టీ అమల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న ఏకపక్ష విధానాన్ని తెలంగాణ రాష్ట్రం తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తామని సీఎం కేసీఆర్ తేల్చిచెప్పారు. శనివారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం లో తీసుకున్న నిర్ణయాలపై నిరసన వ్యక్తంచేశారు. ఈ అంశంపై స్పందిస్తూ, రాష్ట్రా నికి జరుగుతున్న అన్యాయాన్ని వివిధ రంగాల వారీగా వివరిస్తూ ఆదివారం ప్రధాని నరేంద్రమోడీకి ప్రత్యేకంగా లేఖ రాయాలని నిర్ణయించారు. అన్ని ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలన్న స్పష్టమైన అభిప్రా యాన్ని వ్యక్తం చేయనున్నారు. గతంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఈ విషయాన్ని పదేపదే స్పష్టం చేసినప్పటికీ పెడచెవిన పెట్టడం దుర దృష్టకరమని వ్యాఖ్యానించారు. నీటి పారుదల, మంచినీటి పథకాలు, గృహ నిర్మాణం, రహదారుల నిర్మాణం లాంటి అనేక ముఖ్యమైన కార్యక్రమాలకు జీఎస్టీని వర్తింపజేస్తే రాష్ట్ర ప్రభుత్వాలు పరోక్షంగా పేదల నెత్తిన భారం మోపినట్లేనని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా కొన్ని రంగాలను జీఎస్టీ నుంచి మినహాయించాలని, లేనిపక్షంలో న్యాయపోరాటం ద్వారా సాధించుకుంటామని హెచ్చరించారు. తాజాగా జీఎస్టీ కౌన్సిల్‌లో ఆన్ గోయింగ్ ప్రాజెక్టులపై ఉన్న పన్నుశాతాన్ని 18 నుంచి 12కు తగ్గించాలన్న నిర్ణ యం కూడా సమంజసం కాదన్నారు. ఈ ప్రాజెక్టులకు పూర్తిగా పన్ను మిన హాయింపు కల్పిస్తేనే నిర్దేశించుకున్న గడువులోగా లక్ష్యాలను చేరుకోగలమని, ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోగలమని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ఇదివరకు తాను ఢిల్లీ వెళ్లిన ప్రతి సందర్భంలోనూ ప్రధానితో పాటు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి తాగునీరు, సాగునీరు, గృహనిర్మాణ ప్రాజెక్టులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. పలుమార్లు లేఖలు కూడా రాశానని వెల్లడించారు. జీఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిన జూలై 1వ తేదీనుంచి ముందు ప్రారంభించిన ప్రాజెక్టులకు కూడా పన్ను తప్పదన్న సంకేతాలు ఇవ్వడం అర్థరహితమని ఖండించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత చేపట్టే ప్రాజెక్టులకు కూడా జీఎస్టీ తగదన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఈ అంశంపై ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీ వర్తింపజేయడం వల్ల అంచనా వ్యయాలు తారుమారవుతాయని, ఆ ప్రతిపాదనలను తిరిగి బడ్జెట్‌లో పొందుపరచలేమని సీఎం స్పష్టంచేశారు. పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఇప్ప టికైనా రాష్ట్రాల అభిప్రాయాలను ఏకీభవిస్తూ జీఎస్టీని మినహాయించాలని కేంద్రా నికి విజ్ఞప్తి చేశారు. ఆఖరుగా ఒకసారి ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాస్తానని, అప్ప టికీ సానుకూలంగా స్పందించకుంటే న్యాయపోరాటం తప్పదని తేల్చిచెప్పారు.

తుమ్మలకు మంత్రుల పరామర్శ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అస్వస్థతకు గురై యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శని వారం పలువురు మంత్రులు పరామర్శిం చారు. రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి హరీష్ రావు, గృహనిర్మాణ శాఖా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పశు సంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత తదితరులు పరామ ర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

సర్పంచ్, కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీలో జాయింట్ చెక్ పవర్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. గ్రామ సర్పంచ్, పంచా యతీ కార్యదర్శిలకు జాయింట్ చెక్‌పవర్‌ను కల్పించింది. ఈ మేరకు శనివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాశ్‌రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం జరగకుండా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలకు జాయింట్ చెక్‌పవర్ కల్పించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో ఉన్న జీఓ 40ను సవరిస్తున్నట్లు పేర్కొన్నారు.

కేటీఆర్ కనుసన్నల్లోనే ఇసుక మాఫియా

- మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఇసుకు మాఫియాకు నాయకుడు మంత్రి కేటీఆర్ అని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ విమర్శించారు. నీళ్లు, నిధులు,నియామకాలు అనే నినాదంతో.. కోస్తాంధ్ర పెట్టు బడిదారులు తెలంగాణ వనరులను తరలించుకుపోవడాన్ని వ్యతిరేకిస్తూ వనరుల సంరక్షణ నినాదంతో తెలంగాణ పోరాటం నడిచిందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కానీ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని కొండలు, గుట్టలు, గోదావరి ఇసుకను తరలించి వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.



ప్రాజెక్టులపై పన్నుభారం తగ్గించాలంటూ

ఢిల్లీలో కేటీఆర్ పోరు

- జీఎస్టీ కౌన్సిల్‌లో పట్టుబట్టిన ఐటీ మంత్రి
- తలొగ్గిన మండలి... కొంత తగ్గిన భారం
- 18 నుంచి 12శాతం పన్ను పరిధిలోకి
- మరింత తగ్గించాలి.. లేదంటే న్యాయపోరాటం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పలు పథకాలు, ప్రాజెక్టులకు గుదిబండగా మారిన జీఎస్టీని తగ్గించాలన్న తెలంగాణ ప్రభుత్వం డిమాండ్‌కు కేంద్రం కొంతమేర తలొగ్గింది. కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ ద్వారా 18 శాతం పన్ను పరిధిలోకి వచ్చిన ప్రాజెక్టులు, పథకాలకు 12 శాతం వర్తింపజేసేందుకు జీఎస్టీ కౌన్సిల్ సుముఖత వ్యక్తం చేసింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగిన 20వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి తెలంగాణ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తరపున మంత్రి కే.టీ. రామారావు హాజర య్యారు. ఆయనతో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వివేక్, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ అనిల్ కుమార్ సహా పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం గం. 3.30 ని. లకు ప్రారంభమైన ఈ సమావేశం రాత్రి గం.8.30 ని. వరకు 5 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన కౌన్సి ల్ సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులపై జీఎస్టీ ఎంత ఆర్థిక భారాన్ని మోపుతుందో గణాంకాలతో సహా వివరించారు.

ప్రజాస్వామ్య ప్రభుత్వానికున్న ప్రాథమిక కర్తవ్యం ప్రజలకు తాగునీరు, వ్యవసాయదారుడికి సాగునీరు, పేదల కు నివాస గృహాలేనని పేర్కొన్న కేటీఆర్, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందు వరుసలో నిలిచిందని గుర్తు చేశారు. మొత్తం రూ. 2.3 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులు నిర్మాణంలో ఉన్నాయని ఆయన వివరించారు. ఇందులో రూ. 1 లక్ష కోట్లకు పైగా సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేస్తుండగా, మిషన్‌కాకతీయ కోసం రూ. 20 వేల కోట్లు, మిషన్ భగీరథ కోసం రూ. 40వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తు న్నామని వెల్లడించారు. అలాగే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రూ. 18వేల కోట్ల పైగా ఖర్చు చేస్తుండగా, రోడ్లు మరియు భవనాలు, పంచాయతీ రాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు కలిపి మరో రూ. 30వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నా యని వివరించారు. ఈ ప్రాజెక్టులన్నీ ఇప్పటికే మొదలయ్యా యని, కొన్ని టెండర్లు ఖరారైన దశలో ఉన్నాయని తెలిపారు.

జీఎస్టీ అమల్లోకి రాకముందు రాష్ట్ర ప్రభుత్వ విలువ ఆధారిత పన్ను (వ్యాట్) కేవలం 5 శాతం మాత్రమే ఉండేదని, కానీ ఇప్పుడు జీఎస్టీలో ఏకంగా 18 శాతం పన్ను విధించారని కేటీఆర్ అన్నారు. తద్వారా తమ ప్రభుత్వంపై అదనంగా రూ. 19,200 కోట్ల మేర భారం పడుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి గణాంకాలతో పాటు వివరించారు. ఇంత భారీ మొత్తంలో పన్ను రేటు పెంచడాన్ని కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. 18 శాతం పన్ను రేటును ససేమిరా అంగీకరించేది లేదని తెగేసి చెప్పారు. అవసరమైన న్యాయపోరాటం చేస్తామని కౌన్సిల్ సమావేశంలోనే కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ లేవనెత్తిన ఈ అంశాన్ని కౌన్సిల్‌లోని మిగతా రాష్ట్రాల నుంచి కూడా మద్దతు లభించింది. చివరకు బీజేపీ పాలిత రాష్ట్రాల మంత్రులు సైతం కేటీఆర్ వాదనను బలపరిచారు. తమ రాష్ట్రాల్లోనూ అభివృద్ధి ప్రాజెక్టులకు ఇదే పరిస్థితి ఎదురవుతుందని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్ (ఎస్.ఎస్.ఆర్) ముందే నిర్ణయించి పెట్టినందున, ఆ పాత రేట్ల ప్రకారమే పన్ను రేటు ఉండాలని తెలంగాణతో పాటు జార్ఖండ్, రాజస్థాన్, గుజరాత్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల తోపాటు పంజాబ్, పశ్చిమ బెంగాల్ బాసటగా నిలిచాయి. దీంతో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కౌన్సిల్ సభ్యుల ఒత్తిడికి కొంతమేర తలొగ్గారు. 18 శాతం నుంచి 12 శాతం పన్ను రేటు పరిధిలోకి తీసుకొచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న పనులకైనా పాత పన్ను రేటు

పన్ను రేటు కొంతమేర తగ్గించడాన్ని స్వాగతించిన కేటీఆర్, ఇప్పటికే టెండర్లు ఖరారై నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రాజెక్టులకు పాత పన్ను రేటునే కొనసా గించాలని పట్టుబట్టారు. 5 శాతం పన్ను రేటుతో ప్రాజెక్టు లను కొనసాగించడానికి అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మరింత సమాచారం సేకరించి పరిశీలిస్తానని జైట్లీ హామీ ఇచ్చారు. అయితే ఎట్టిపరిస్థి తుల్లోనూ తాము 5 శాతానికి మించి పన్ను రేటును ఒప్పుకునేది లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ సమా వేశం ముగిసిన తర్వాత విజ్ఞాన్ భవన్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

తదుపరి కౌన్సిల్ భేటీ హైదరాబాద్‌లో

ప్రాజెక్టులు, పథకాలపై పన్నురేటు అంశంతో పాటు పలు ఇతర సమస్యలపైనా కేటీఆర్ మాట్లాడారు. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ నుంచి ఎదురవుతున్న ఆందోళనను దృష్టిలో పెట్టుకుని పన్ను రేటు తగ్గించాలని కోరారు. అయితే ఇందులో జాబ్‌వర్క్ మీద 18 శాతం నుంచి 5శాతానికి పన్ను రేటు తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అలాగే గ్రానైట్, బీడీ పరిశ్రమల పన్ను రేటు సమస్యలను కేటీఆర్ ప్రస్తావించగా, పరిశీలిస్తామని జైట్లీ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు 20 సమావేశాలు జరగ్గా, ఒక్కటి కూడా తెలంగాణలో జరగలేదని, తదుపరి సమావేశాన్ని హైదరాబా ద్‌లో ఏర్పాటు చేయాలని కేటీఆర్ కోరగా, అందుకు జైట్లీ వెంటనే అంగీకరించారు. సెప్టెంబర్ 9న జరిగే తదుపరి జీఎస్టీ సమావేశానికి హైదరాబాద్ వేదిక కానుంది.

వ్యూహాత్మకంగా కేటీఆర్ హాజరు

ఇప్పటి వరకు జరిగిన అన్ని జీఎస్టీ సమావేశాలకు కౌన్సిల్ సభ్యుడిగా రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ హాజ రవుతూ వచ్చారు. కానీ శనివారం ఢిల్లీలో జరిగిన 20వ సమావేశానికి వ్యూహాత్మకంగానే కేటీఆర్ హాజరైనట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు పన్ను రేటు తగ్గించాలన్న ప్రతిపాదన చాలా రోజుల నుంచి చేస్తున్న ప్పటికీ కౌన్సిల్‌లో దీనిపై పెద్దగా స్పందన కనిపించలేదు. దీంతో కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి గట్టిగా వాదిం చాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రకారం ఆయన ఇవాళ్టి సమావేశంలో ఈ అంశంపైనే సుదీర్ఘంగా చర్చించి, మిగతా సభ్యుల మద్దతును సైతం కూడగట్టారు. దీంతో కౌన్సిల్ అధినేతగా ఉన్న కేంద్ర ఆర్థిక మంత్రి తలొగ్గక తప్పలేదు. అయితే శనివారం సాధించింది పూర్తి విజ యం కాకపోయినా, పాక్షికంగా విజయం సాధించినట్టు చెప్పుకోవచ్చు. 18 నుంచి 12 శాతానికి పన్ను రేటు తగ్గడంతో కొన్ని వేల కోట్ల రూపాయల భారం తగ్గి నప్పటికీ, దాన్ని 5 శాతానికి తగ్గించే వరకు కేటీఆర్ ఇదే పట్టు కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో జరిగే తదుపరి సమావేశంలో కేటీఆర్ లేదంటే నేరుగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.



మెగాతో ఎంపీ కవిత సెల్ఫీ

- అభిమాన నటుడితో సెల్ఫీ అంటూ ట్వీట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సినీ అభిమానానికి ప్రాంతాలు, హద్దులు ఉండ వని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత మరోసారి చాటారు. పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతి ఓటింగ్‌లో పాల్గొన్న సందర్భంగా రాజ్యసభ సభ్యుడైన చిరంజీవి ఓటింగ్‌కు రాగా, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అతనితో సెల్ఫీ దిగారు. సెల్ఫీ దిగడమే కాక అభిమాన నటుడు మెగాస్టార్‌తో సెల్ఫీ అంటూ ఫొటోను ట్వీట్ చేశారు. నెటిజన్లు ఈ ఫొటోకు పెద్ద ఎత్తున స్పందించారు.

ఆ చట్టాలతోనే అక్రమాలు!

- సనద్ హక్కుల పేరుతో కొత్త ఆట
- మియాపూర్, బాలానగర్‌లో జరిగిందిదే
- వేలాది ఎకరాల భూములు వివాదాల మయం
- నిజాం వారసులమని బుకాయింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ఒకటా రెండా...నిజాం ఏటుబడి భూము లన్నీ వివాదాలమయమే అవుతున్నాయి. నిజాంకాలంనాటి నుంచి వస్తున్న ప్రత్యేక పరిస్థితులతో రాష్ట్రంలో భూమాయ జరుగుతోంది. ఇనాం, వక్ఫ్, బిల్లా దాఖలా, పైగా భూములు, కాందిశీకుల భూములు, సనద్ భూము లు ఇలా అన్నీ వివాదాలకు కేంద్రమే అవుతున్నాయి. రాష్ట్రంలో భిన్నమైన రెవెన్యూ వ్యవస్థ అమలులో ఉంది. నిజాం కాలంనాటి రెవెన్యూ చట్టా లు కొంత ప్రత్యేకత సంతరించుకున్నాయి. నాటి హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనమైన తర్వాత కూడా తెలంగాణలో ఆయా చట్టాలు కొనసా గుతుండటం విశేషం. నాటి నిజాం కాలంలో వేలాది ఎకరాల భూములను రకరకాల అవసరాలకు నిజాం ప్రభువులు కేటాయిం చారు. అయితే వీటి కేటాయింపు దస్త్రాలు, ఫైళ్లు, ఆర్డర్లు, నోట్‌ఫైల్‌లు అన్నీ ఉర్దూలోనే ఉన్నాయి. దీంతో ఇవి అక్రమాలకు కేంద్రబింధువులు గా ఉంటు న్నాయనే అనుమానాలను రాష్ట్ర రెవెన్యూ శాఖ వ్యక్తం చేస్తోంది. అప్పటి దస్త్రాలు, ఆర్డర్‌లను ఏవి అసలువో, ఏవి నకిలీవో తేల్చని స్థితి కారణంగా రోజు కో భూ దందా తెరపైకి వస్తోంది. ప్రధానంగా పూర్వపు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని విలు వైన భూములన్నీ ఏదో ఒక వివాదంలో ఇరు క్కుని ఉన్న పరిస్థితి సాక్షాత్కారమవుతోంది. అప్పటి పేర్లతో నకిలీ పత్రాలను సృష్టించిడం, దానితో న్యాయ స్థానాలను ఆశ్రయించడం ఇప్పుడు సర్కార్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. మియాపూర్ భూ కుంభకో ణం తర్వాత ప్రభుత్వ, ఇతర భూముల పరిరక్షణకు తీసు కుంటున్న అనేక చర్యలకు అంతరాయాలు కల్గుతు న్నాయి. ఏదో ఒక పేరుతో అక్రమార్కులు వివాదాల నుసృష్టించిభూపరిరక్షణకు ఆటంకాలు కల్గిస్తున్నారు.

మియాపూర్, బాలానగర్‌లో ఇదే తంతు...

మియాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి పరిధిలో చోటుచేసుకున్న అక్రమాల్లో సనద్ భూముల అంశం కీలకంగా నిలిచినట్లుగా అధికారులు గుర్తించారు. మియాపూర్ పరిధిలోని సర్వే నెంబర్లు 20, 28, 40, 45, 100, 101లలోని 836 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి యాజమాన్య హక్కులను మార్చడం, బాలానగర్‌లో మియాపూర్ పాత గ్రామంలోని 75 శాతం భూము లతోపాటు సమీపంలోని 7 గ్రామాల భూములను హద్దులు, సర్వే నెంబర్లు లేకుం డానే రిజిస్ట్రేషన్ చేసినట్లుగా రుజువైంది. ఈ రెండు ఉదంతాల్లో వారు వినియో గించుకున్న ఏకైక అస్త్రం పేరే 'సనద్'...ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇంకా కొందరు మరో అడుగు ముందుకువేసి నిజాం వారసులమంటూ సర్టిఫికెట్లు సృష్టిస్తూ సర్కార్ భూములకు ఎసరు పెడుతున్నట్లుగా తేలింది. ఇటీవలే శంషాబాద్ మండలంలో ఒక వ్యక్తి నిజాం వారసుడిగా చెప్పుకుని 200 ఎకరాల భూమిపై కోర్టుకు వెళ్లాడు. సదరు గ్రామంలోని 30 సర్వే నెంబర్లలో భూమంతా తనదేనని పత్రాలు కోర్టుకు సమర్పించాడు. దీంతో విలువైన భూమిపై రాద్ధాంతం మొదలైంది. అయితే నిజం కాలంనాటి భూములు, కేటాయింపు లపై అప్పట్లో బ్లూ బుక్ పేరుతో రాసి నిక్షిప్తం చేసి నట్లుగా రెవెన్యూ ఉన్నతాధికారులు చెబు తు న్నారు. ఈ పుస్తకం నిజాం ట్రస్టు ఆధ్వ ర్యంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. దీని ప్రతి ప్రభుత్వం వద్ద కూడా రికార్డు రూపం లో ఉన్నది. ప్రస్తుతం ఈ రికార్డు పరిశీలన కు ప్రభుత్వం చర్యలు తీసుకునే ప్రయత్నా లను పరిశీలిస్తోంది. ఉర్దూ వచ్చిన నిపుణు ల సహాయం తీసుకునేందుకు పరిశీలిస్తోంది.

సనద్ భూములేమిటీ...?

దేశ విభజన సమయంలో పాకిస్తాన్ నుంచి భారత్‌లోకి వలస వచ్చిన కొందరికి అప్పట్లో నిజాం సర్కార్ కొంత భూమిని కేటాయించారు. ఇలా ఆయా వ్యక్తులకు



ఇచ్చిన భూమిపై హక్కుల కల్పననే సనద్‌గా పేర్కొంటారు. ఇవి కాకుండా ఎవాక్యూ, కస్టోడియన్, వక్ఫ్, ఎనిమి ప్రాపర్టీలు కూడా ప్రాచు ర్యంలో ఉన్నాయి. కాగా ఇవన్నీ కూడా చాలా స్వల్ప సంఖ్యలో ఉండగా అక్రమార్కులు ఇప్పుడు వీటినే ఆధారంగా చేసుకుని నకిలీ పత్రాలతో ప్రభుత్వానికి నష్టం కలిగిస్తున్నారు. విలువైన భూములున్న ప్రాం తాల్లో అధికారులు వారికి సహకరించడంతో వారి ఆటలు మరింత సులువుగా సాగుతున్నాయి. ఆ తర్వాత రెవెన్యూ అధికారుల పరిశీలనతో ప్రభుత్వ భూములుగా తేలడంతో వివాదాలు కోర్టులకు వెళు తున్నాయి. ఇప్పుడు ఆయా భూముల యాజమాన్య హక్కులు, అసలు పత్రాలు కోర్టులకు సమర్పిం చడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. కోర్టుల్లో ఏమి తేల నుందనే అంశంలో తీవ్ర ఉత్కంఠ నెలకొన్నప్పటికీ ఈ వివాదానికి కాలమే సమాధానం చెప్పనుంది.

చలో కాళేశ్వరం

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శిఅజయ్‌మిశ్రా నేతృత్వంలో 20మంది ఐఏఎస్‌ల బృందం పర్యటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేప ట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును శనివారం సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం పరిశీలించింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టారంటూ పనులు వేగంగా చేస్తున్న మేఘా ఇంజ నీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పనితీరును అధికారులు అభినందించారు. శనివారం ఉదయం హైదరా బాద్‌లో బయలుదేరిన 20మంది అధికారుల బృందం మొత్తం కాళే శ్వరం ప్రాజెక్టులో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్యాకేజీ-8పనులను పరిశీలించారు.ఈ బృందానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా నాయకత్వం వహించగా, చిత్రా రామ చంద్రన్, రాజేశ్వర్ తివారీ, రాజీవ్‌త్రివేది, శశాంక్ గోయల్, సునీల్ శర్మ,



జి.అశోక్‌కుమార్, జయేష్‌రంజన్, వికాస్ రాజ్, ఎన్.శివశంకర్, బుర్రా వెంకటేశం, అనితారాజేంద్ర తదితరులు పనులను క్షుణంగా పరిశీలించారు.

బిందెలో చిన్నారి తల



కేసముద్రం, కెఎన్‌ఎన్ : ఆటలాడు కుంటుడగా ప్రమాదవశత్తు మంచి నీటి బిందెలో అద్వైత్వి అనే రెండు సంవత్స రాల చిన్నారి తల ఇరికిన సంఘటన శని వారం వరంగల్ జిల్లా, కోరుకొండపెల్లి గ్రామం లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండలం లోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన సట్ల కరుణా కర్ కుమార్తె అద్వైత్వి ఇంటి ప్రాగణంలో ఆడుకుం టుంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఖాళీ బిందెలో తల ఇరుక్కుపోగా చిన్నారి రోదనలు మిన్నాంటాయి. దీనిని గమ నించిన తల్లిదండ్రు లు ఆ చిన్నారిని కేసముద్రం గ్రామానికి తీసుకవచ్చి పనిముట్ల సహా యంతో బిందెను కత్తిరించి పాపను సురక్షితంగా బయటకు తీశారు. సూమారు గంట పాటు చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందారు.

పక్కా ఇల్లు... ప్రయోజనం నిల్లు!

- లబ్దిదారులపై రుణభారం... వడ్డీ వ్యాపారుల నిలువు దోపిడీ
- చేతులు మారిన గృహాలు
- కొత్తగా ఇళ్లిచ్చినా షరా మామూలే
- ప్రభుత్వాలకు గుర్తింపు రాదు లబ్దిదారునికి కృతజ్ఞతా ఉండదు
- రుణ భారం ప్రభుత్వాలు మోస్తేనే ఉభయతారకం

అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: గతపదేళ్ళుగా రాష్ట్రంలో ప్రభుత్వం పేదలకు కల్పించే గృహ నిర్మాణ పథకాలు అచేతనమయ్యాయి. ఈ పథకాల పట్ల లబ్ది దారుల్లో ఆసక్తి కొరవడింది. లక్షల ఇళ్ళ నిర్మాణం గురించి ప్రకటనలే తప్ప క్షేత్రస్థా యిలో పనులు ముందుకుసాగడంలేదు. గతంలోలా ఈ ఇళ్ళకోసం పేదలు వెంపర్లాడ్డంలేదు. ఇందు క్కారణం ఇళ్ళ మంజూరు నుంచి నిర్మాణ ప్రక్రియ వరకు ప్రతి అంశంలోనూ లబ్దిదారుడు ఆర్థికంగా అధిక భారానికి గురౌతున్నాడు. అప్పుల పాలౌతు న్నాడు. ప్రైవేటు వడ్డీవ్యాపారుల దోపిడీకి గురౌతున్నా డు. వాటిని తీర్చేందు కు చివరకు ఈ ఇళ్ళను తెగనమ్ముకోవాల్సిన దుస్థితికి గురౌతున్నాడు.

ఒక అధ్యయనం మేరకు గత ఇరవయ్యేళ్ళలో రాష్ట్రంలో నిర్మిం చిన పక్కా ఇళ్ళలో 20శాతం కూడా అసలు, సిసలైన లబ్దిదార్ల చేతుల్లో లేవు. 80శాతానికిపైగా ఇళ్ళు చేతులు మారిపోయాయి. అదికూడా మూడ్నాలుగుసార్లు క్రయవిక్రయాలకు గురయ్యాయి. ఇప్పుడీ ఇళ్ళను అనుభవిస్తున్న వారెవరికీ అప్పట్లో ఈ ఇళ్ళు నిర్మించిచ్చిన ప్రభుత్వం లేదా పార్టీ పట్ల కృతజ్ఞత వ్యక్తం కావాల్సిన అవసరం లేదు. ఇలా ఇళ్ళు చేతులు మారడానికి కారణం నిర్మాణ సమయంలో లబ్ది దారుడు తీవ్ర ఆర్థిక ఒత్తిళ్ళకు లోనుకావడమేనని ఈ అధ్యయనం గుర్తించింది. ఇప్పుడున్న గృహనిర్మాణ పథకాల మేరకు లబ్దిదారుడ్ని రెవెన్యూ అధికారులు ఎంపిక చేస్తారు. హౌసింగ్ కార్పొరేషన్ ఇళ్ళు మంజూరు చేస్తుంది. భాగస్వామ్య మొత్తాన్ని లబ్దిదారుడు భరించాలి. ఆ తర్వాత ఇళ్ళ నిర్మాణ బాధ్యతంతా లబ్దిదారుడిదే. నిర్మాణ పనులు అంచలవారీగా పూర్తయ్యే కొద్దీ విడతల్ని బట్టి బిల్లుల కోసం దరఖాస్తు చేయాలి. ఇందుకోసం లబ్దిదారుడు సదరు నిర్మాణ వ్యయాన్ని ముందుగా భరించాలి. వాస్తవానికి ఇలా ఇళ్ళ కోసం ఎగబడే వారంతా అతిపేదలు, రోజువారి కూలీలే. భాగస్వామ్య. మొత్తం చెల్లింపుకే వీరు అప్పుల్ని ఆశ్రయిస్తున్నారు. ఇక నిర్మాణ పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారుల వెంట పడుతున్నారు. బిల్లులు మంజూరై చేతికొచ్చినప్పటికీ అసలుతో పాటు పెరిగిన వడ్డీలు చెల్లించేందుకు ఏమాత్రం సరిపోవు.దీంతో ఓ వైపు ఇంటి నిర్మాణం సాగుతుంటే మరో వైపు తెచ్చిన అప్పు, వడ్డీ ఫాయిదాల్తో కలసి తడిచిమోపెడౌతోంది. ఈ అప్పు తీర్చేందుకు ఈ ఇల్లును తాకట్టుపెట్టడమో లేదా అమ్ముకోవడమో లబ్దిదారునికి తప్పనిసరౌతోంది.

దేశంలోని ప్రతిఒక్కరికి ఇల్లుకల్పించాలంటూ రాజ్యాంగం ప్రభుత్వాన్ని నిర్దేశించింది. అయితే ఇందిర హయాం వరకు ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోలేదు. ఇందిర ప్రధాని కాగానే దేశవ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టిలకు చిన్న చిన్న ఇళ్ళు కట్టించిచ్చారు. ఇందుకైన మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరించేది. కాగా తమిళనాట ఎమ్‌జిఆర్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రులయ్యాక ఈ ఇళ్ళ పథకాన్ని విస్తృతపర్చారు. లక్షల సంఖ్యలో పేద, బడుగు, బలహీనవర్గాలకు ఇళ్ళ నిర్మాణం మొదలెట్టారు. ఇందులో కొంత భాగాన్ని కేంద్రం ఆర్థికసాయంగా భరించేది. మరికొంత రాష్ట్రం తన వాటాగా ఇచ్చేది. కొంతమొత్తం లబ్దిదారుడు కట్టాల్సొచ్చేది. మిగిలిన మొత్తాన్ని హడ్కో నుంచి రుణంగా అందించేవారు. నిర్మాణ బాధ్యతను గృహనిర్మాణ సంస్థే పర్యవేక్షించేది. లబ్దిదారుడికి ఇనుపఊచలు, సిమెంట్, ఇటుక, ఆఖరకు ఇంటి గుమ్మాలు కూడా సరఫరా చేసేది. కేవలం పనివారి వేతనాలు మాత్రం ముందుగా లబ్దిదారుడు భరిస్తే సరిపోయేది.ఆ మొత్తాన్ని కూడా గృహనిర్మాణ సంస్థ చెక్కులరూపంలో లబ్ధిదారునికి తిరిగి చెల్లించేది. హడ్కో కేంద్రప్రభుత్వరంగ సంస్థ కావడంతో అప్పుతీర్చాలంటూ పెద్దగా ఒత్తిళ్ళుతెచ్చేదికాదు. ఒకటీ ఆరా నోటీసులిచ్చినా ఒకట్రెండు వాయిదాలు చెల్లిస్తే తిరిగి హడ్కో అటువైపు చూసేదికాదు.

'గజల్'కు అఫ్గాన్ అవార్డు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రఖ్యాత గజల్ గాయకులు, స్వచ్ఛ ఆంధ్ర బ్రాండ్ అంబాసిడర్ డా. గజల్ శ్రీనివాస్ ఆఫ్ఘనిస్తాన్ లో శాంతి యాత్రలో భాగంగ శాంతి యాత్రను ప్రశంసిస్తూ ఆఫ్ఘనిస్తాన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డా.మొహమద్ జహీర్ అక్బర్, ఒలింపిక్ అసోసియేషన్ అత్యున్నత శాంతి గౌరవ పతకాన్ని ఒక ప్రత్యేక సమావేశంలో అందజేసి సత్కరించారు.డా. గజల్ శ్రీనివాస్ తన గానంతో దరి, ఫష్త భాషలలో శాంతి, స్నేహ గీతాలను ఆలపించి తన శాంతి యాత్ర ద్వారా సాంస్కృతిక, క్రీడలు, చలనచిత్ర, సేవా రంగాల ద్వారా భారత్ - ఆఫ్ఘనిస్తాన్‌ల మధ్య ప్రజలలో సుహృద్భావాన్ని నెల కొల్పుతున్నారని, వారు ఆశించినట్లుగా భవిష్యత్తులో ఆఫ్ఘనిస్తాన్ లో శాంతి సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని, వారు చేసే శాంతి యాత్రకు ఎల్ల పుడూ మా మద్దతు ఉంటుందని ఆఫ్ఘనిస్తాన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డా.మొహమద్ జహీర్ అక్బర్ తెలిపారు.

ఆ ఆటే ఆత్మహత్య

ఇప్పుడు మనం సామాజిక మాధ్యమాల యుగంలో ఉన్నాం.మన జీవితాలు తెరిచిన పుస్తకాలు.ఇది నా సొంత విషయం,లేదా ప్రైవేటు వ్యవహారం అని చెప్పడానికీ, దాచడానికీ ఏమీ లేదు. సామాజిక మాధ్యమాలకు రెండు పార్శ్వాలు ఉన్నాయి. అవి ఎంతో వినోదాన్ని అందిస్తున్నాయి. ఒంటరితనాన్ని దూరం చేస్తున్నాయి. వాటికి మరో పార్శ్వం కూడా ఉంది. అవి మనిషికి ప్రాణాంతకంగా మారుతున్నాయి.

సామాజిక మాధ్యమాల్లో హింసనూ, లైంగిక దాడులను చూసిన యువతరం ఎలా ప్రభావితం అవుతోందో, విలువైన ప్రాణాలను ఎలా తీసుకుంటోందో మనం తరచూ వింటున్నాం...చూస్తున్నాం...

ప్రాణాలు తీసే నీలి తిమింగలాలు మన మధ్య ఉన్నాయి. నీలి తిమింగలం అంటే అగాధమౌ జలనిధిలో ఉండేది కాదు. సామాజిక మాధ్యమంలో అది ఒక ఆట.. ఎన్నో ప్రాణాలు తీస్తోంది. ఈ ఆట ఒక్క రష్యాలోనే ఇంతవరకూ 130 ప్రాణాలను బలిగొంది. ఇది అక్కడే ప్రారంభమైంది. మన దేశంలో నీలి తిమింగలం (బ్లూవేల్) ఆటకు ఈ వారంలో ముంబాయిలో మొదటి ఆత్మహత్య నమోదైంది. ఈ ఆత్మహత్య క ు నీలి తిమింగలం ఆటే ప్రేరణా? కాదా ? అనేది పోలీసులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఆ నోటా, ఈ నోటా వినిపించిన దానిని బట్టి చూస్తే అదే కారణమనిపిస్తోంది. ఒళ్ళు గగుర్పాటు కలిగించే ఈ క్రీడ యువత మెదళ్ళను తినేస్తోంది. ఈ ఆటలో పాల్గొన్నవారు చివరికి తమ జీవితాలను అంతం చేసుకుంటున్నారు. యువతరాన్ని ఆకట్టుకునేందుకు ఈ ఆటల్లో చాలా పద్ధతులుంటాయి. వారు ఇరవై ఏళ్ళ లోపు వారైతే, వారి మేధనూ, ఆలోచనలనూ ప్రభావితం చేసే వీలుంటే. వారు ఒంటరిగా, ఎవరితోనూ కలవని వారిగా ఉండేవారైతే, వారు అంతర్ముఖులై, తమ అభిప్రాయాలను వెల్లడించలేని వారైతే, ఇలాంటి గ్రూపులను నిర్వహించలేరు.

ఆట కోసం బరిలోకి దిగిన అతడికి లేదా ఆమెకు ఆ క్రీడా నిర్వాహకుడు రోజువారీ పరీక్ష ఏభై రోజుల పాటు పెడతాడు. ఒక్కొక్క పరీక్ష పూర్తి కాగానే, పోటీదారు తానుపూర్తి చేసిన పని ఫొటో ప్రూఫ్ తీసి పంపాలి. తొలుత ఈ పరీక్ష సులభంగానూ, తేలికగానూ ఉంటుంది . పాత కాలపు హారర్ చిత్రాలలోని ఒళ్ళు గగుర్పొడిచే దృశ్యాలు చూసినట్టుఉంటుంది. ఈ దశలో పోటీలో పాల్గొన్న వారు పోటీ నిర్వాహకునికి సన్నిహితమవుతారు. తమ జీవిత భాగస్వాములైనంత సన్నిహితమవుతారు. ఈ ఆట దానిలో లీనమైపోయిన వారిని క్రమంగా అది మింగేస్తుంది. తమకు తామే హాని చేసుకునేట్టుగా ప్రేరేపిస్తుంది. రక్తాన్ని చిమ్మే పచ్చబొట్లు వేసుకున్నట్టు, అరచేతిలో కొంత భాగాన్ని కోసుకుని రక్తం కారుతుంటే ఆనందించడం వంటి వికృత రూపాల్లోకి తీసుకుని వెళ్తుంది. 40 నుంచి 50వ రోజుకు వచ్చేసరికి ఇంకా వికృత రూపంలోకి నెట్టుతుంది. 50వ రోజున అంటే చివరి రోజున ఆట నుంచి వైదొలగి ఆత్మహత్య చేసుకునేట్టు పురికొల్పుతుంది. ఆత్మహత్యకు సన్నాహాల దృశ్యాల ఫొటోలు ఆట నిర్వాహకునికి పంపాల్సి ఉంటుంది. హింసకు దారి తీసే ఈ అసహజమైన ఆటలో కొనసాగలేక భయపడేవారు తప్పుకుంటామంటారు. అప్పుడు నిర్వాహకుడు వారిని ఈ ఫొటోలు, వీడియోలు బయటపెడతానని బెదిరిస్తాడు. మీకూ,మీ వాళ్ళకూ హాని జరుగుతుందని హెచ్చరిస్తాడు.

ఈ ఆట రష్యాలో ఏకారణం చేతనో విజయం సాధించింది. ఇరవై ఏళ్ళ లోపు యువకుల ఆత్మహత్యల్లో న్యూజిలాండ్ మొదటి స్థానంలో ఉండగా, రష్యా రెండో స్థానంలో ఉంది. ఈ ఆటల్లో పాల్గొనేట్టు యువతరాన్ని ప్రేరేపించే గ్రూపులు రష్యాలో ఉన్నాయి. యువతరం నడవడికలో మార్పులు వచ్చేట్టు ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి గ్రూపుల్లో వికెగా ప్రసిద్ధమైన వి కొంటేక్టే ముఖ్యమైనది. ఈ గ్రూపు సభ్యుల్లో అంతా ముప్పయి ఏళ్ళలోపు వారేనని మీడియా సర్వేలో తేలింది. ఈ గ్రూపులు యువతతో వీడియో, పోర్నోగ్రాఫిక్ ఇమేజ్‌లు షేర్ చేసుకోవడం వంటివి చేస్తున్నాయి. ఆత్మహత్యలను ప్రేరేపించే ఇతర గ్రూపుల్లో సైలెంట్ హౌస్, సీ ఆఫ్ వేల్స్, మిస్టరీయస్ 57వంటివి ఉన్నాయి! తమ దేశంలో యువతరంలో కొందరు ఇలా ఆత్మహత్యలు చేసుకునే క్రీడలకు బానిసలవుతుంటే రష్యాలో అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న సందేహం ఎవరికైనా కలగవచ్చు. ఆత్మహత్యలను ప్రేరేపించే వెబ్‌సైట్లను మూసివేయాలన్న చట్టం రష్యాలో ఉంది. పాత వెబ్‌సైట్లు మూతబడుతుంటే కొత్తవి పుట్టుకొస్తున్నాయి.

బ్లూవేల్

అటువంటి గ్రూపులకు యువత ఎందుకు ఆకర్షితమవుతోందన్న ఆశ్చర్యం కలగవచ్చు ఎవరికైనా. ఆత్మహత్య చేసుకోవాలనే భావం జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో సందర్భంలో అందరికీ కలుగుతుంది. అది మనలో నిద్రాణమై ఉంటుంది. పరిస్థితులు ప్రకోపించినప్పుడు బయటపడుతుంది. ముఖ్యంగా, మానసికంగా దెబ్బతిన్నప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు, సంబంధాలు తెగిపోయినప్పుడు ఈ భావం మనిషిని కుదిపేస్తుంది. మనిషి తనకు తాను హాని చేసుకునే స్థితికి రావడంతో ఇది ప్రారంభమవుతుంది. తనకు హాని చేసుకునేందుకు వాతావరణం ఒక కారణం కాగా, ఆవేశం, సామాజికంగా ఏకాకులు కావడం వంటి కారణాలు కూడా ఇందుకు పురికొల్పుతూ ఉంటాయి. తమ జీవితాలను అంతం చేసుకునే తెగింపు ధోరణి ఉన్న యువతరమే ఈ బ్లూవేల్ గేమ్‌కి ఆకర్షితులవుతున్నారని స్పష్టమవుతోంది. ఈ గేమ్ అందుబాటులోకి రావడంతో వారి ఆలోచనలు అమలులో పెట్టడానికి సులభమవుతోంది.

మన దేశంలో పరిమితమే అయినా అప్రమత్తత అవసరం మన దేశంలో ఈ గేమ్ పరిమితంగానే ఉంది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లోనే ఉంది. ఇందుకు కారణం మన దేశంలో కుటుంబ వ్యవస్థ బంధాలు పటిష్ఠమైనవి. అది మన సంస్కృతి గొప్పదనం. యువతరానికి ఇంట్లో రక్తసంబంధీకులు, బంధువుల ఆదరణ, ఆప్యాయత లభిస్తుంది. అందువల్ల అటువంటి ప్రాణాంతక క్రీడల వైపు వెళ్ళే అవకాశమూ, పరిస్థితి వారికి ఉండదు. రాదు కూడా. అలా అని ఇటువంటి వికృత క్రీడల పట్ల ఉదాసీనంగా ఉండటం తగదు. తల్లితండ్రులు, విద్యావేత్తలు , మేధావులు యువతరాన్ని సరైన మార్గంలో నడిపించేందుక ు పూనుకోవాలి. అటువంటి వెబ్‌సైట్ల వైపు దృష్టి మరల్చకుండా యువతరానికి సలహాలిస్తుండాలి. వాటి వల్ల కలిగే హాని గురించి వివరిస్తూ ఉండాలి.

సింగపూర్ లో స్కూలు జాగృతి సింగపూర్‌లో యువతరాన్ని జాగృతం చేసే కార్యక్రమాన్ని ఓ స్కూలు చేపట్టింది.

మన దేశంలోని మానసిక శాస్త్రవేత్తలు, తల్లితండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరించాలి. ము ఖ్యం గా, య ువ త రం లో డిప్రెషన్ ఎందుక ు కలుగుతోందో తెలుసుకుని దా ని ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. మీడియా కూడా ఈ విషయంలో సానుకూల ధోరణిలో తన వంతు బాధ్యతను నిర్వహించాలి.మిడిమిడి సంచలనాలను సృష్టించే గ్రూపుల జోలికి, ఆటల జోలికి వెళ్ళవద్దని యువతరాన్ని హెచ్చరిస్తూ ఉండాలి. యువతరం అభిప్రాయాలను తెలుసుకోవాలి. వాటిల్లో మంచివి ఉంటే గౌరవించాలి.

సామాజికంగా ఎదురయ్యే సమస్యలపై వారి స్పందన ఎలా ఉందో తెలుసుకోవాలి. వారు తమ మనసులో మాట చెబుతున్నప్పుడు పెడచెవిన పెట్టడం,ముఖం ఎటో తిప్పేసుకోవడం వంటి చర్యల వల్ల యువత మనసు గాయపడుతుంది.


అలాంటి పరిస్థితి రాకుండా తల్లితండ్రులు, పెద్దలు జాగ్రత్త పడుతుండాలి. ఆధునిక పోకడల్లోని మంచిని ప్రోత్సహించడంలో తప్పులేదు. స్వామి వివేకానంద అలనాడు చికాగో సర్వమత సమ్మేళనంలో చెప్పినట్టు భారత్ ఎప్పుడూ మంచిని ఆహ్వానిస్తుంది. ఆస్వాదిస్తుంది. అదే మన సంస్కృతి విశిష్టత.

-శంకర్ రాజ్



దూరంగా ఉంచడానికి ఇలా చేయండి...

- బ్లూవేల్ గేమ్‌లో పాల్గొనాలన్న ఆ సక్తి కనబర్చే పిల్లలను గుడ్డి ఎద్దు చేలో పడినట్టుగా మందితో కలిసి పోవద్దని హెచ్చరించాలి. సురక్షితం కాని ఆటల్లో పాల్గొనకుండా నిరోధించాలి.
- యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇలాంటి ఆటల జోలికి వెళ్ళొద్దని పిల్లలకు ఇచ్చే సలహాలు కొన్ని... ఆత్మవిశ్వాసంతో మాట్లాడండి
- మిమ్మల్ని మీరు దిటవు చేసుకోండి. మీకు ఏది సురక్షితం కాదో, ఏది అసౌకర్యంగా ఉంటుందో నిర్ణయించుకోవడం మీ చేతిలోని పని. మీ అభిప్రాయాలు ఇతరులపై రుద్దకండి.
- ఎదుటి వారి అభిప్రాయాలను గౌరవిస్తే, వారూ మీ అభిప్రాయాలను గౌరవిస్తారు.
- ఇలాంటి ఆటలకు విముఖంగా ఉండే స్నేహితులతో గడపండి.



- మీ స్నేహితులతో నో అని చెప్పడానికి సరిపడే ధైర్యాన్నీ, ఆత్మవిశ్వాసాన్ని అది ఇస్తుంది.
- ఇంకేదైనా చేయడానికి సూచించండి.
- మీ మిత్రులు చేసే పని అసౌకర్యంగా ఉన్నట్టు అనిపిస్తే, ధోరణి మార్చుకోమని చెప్పండి.

తల్లితండ్రులకు...

- పిల్లలకు అనువైన వాతావరణాన్ని ఇంటిలో సృష్టించండి.
- ఇరువురు మాట్లాడుకోవడానికి తగినంత వ్యవధి, వాతావరణం ఉండేట్టు చూడండి. ఇది సంభాషణా కాదు, ప్రశ్నించడమూ కాదనే భావన వారికి కలిగించండి.
- పిల్లలు చెప్పేది శ్రద్ధగా వినండి. వారి సమస్యలేమిటో, వారి అనుభవాలు ఏమిటో తెలుసుకోండి. వారి సమస్యలను గుర్తిస్తున్నామనే అభిప్రాయాన్ని వారికి కల్పించండి.
- తమకు సమస్యలున్నప్పుడు మీ వద్దకు వచ్చి చెప్పుకునే వాతావరణాన్నీ, స్వేచ్ఛనూ వారికివ్వండి. తమ పిల్లలతో ఏ విధంగా మాట్లాడాలో తెలియని వారికి హెల్ప్‌లైన్ ఉంది. మన దేశంలోనూ అలాంటి హెల్ప్‌లైన్లున్నాయి. ముఖ్యంగా, ప ట్టణ, నగర ప్రాంతాల్లో యువత ఆత్మహత్యలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో ఇలాంటి హెల్ప్‌లైన్ల అవసరం ఎంతైనా ఉంది.

తెలుగుతేజంలా

విరాజిల్లాలి



ఒక్కొక్క జాతికి ఒక్కొక్క సాంప్రదాయకమైన వేషం ఉంటుంది. అది జాతీయ వేషం. అదే వస్త్రధారణం అలవాటుగా అందరూ ధరిస్తారు. అది ఆరోగ్యం కూడా. తెలుగువాళ్లకు పంచెకట్టు కట్టుబాటు. మన పూర్వీకులందరూ అదే ధరించేవారు. ఇప్పుడూ గ్రామసీమల్లో అక్కడక్కడా పెద్దలు పంచే కట్టుతున్నారు. ఇందులో కూడా బిళ్లగోచి అని ఓరగోచి అని రకాలున్నాయి. విద్యావంతులైన పెద్దలు, పండితులు బిళ్లగోచి పెట్టుకునేవారు. మిగిలినవారు ఓరగోచి పెట్టుకునేవారు. బిళ్లగోచి కంటే ఓరగోచి కొంత అందంగా ఉండేది. తమిళులు గోచి లేకుండా పంచె కట్టుకుంటారు. దాన్ని లుంగీ అంటున్నాం. కన్నడిగులు మనమాదిరిగానే గోచి పెట్టుకుంటారు. ఉత్తర భారతంలో కూడా కౌపీన ధారణ ఉంది. తమిళులు వాళ్ల ఇంటిపేర్లు మర్చిపోయినట్లే గోచీని క ూడా మర్చిపోయి విడిచి పెట్టారు. మనకు స్థిరమైన గృహనామం ఉంది. వారికి లేదు. తండ్రిపేరు ముందు కలుపుకుంటారు. గోపాలన్ నారాయణన్. నారాయన్ తండ్రి గోపాలన్ అన్నమాట. నారాయణన్ క ుమారుడు ముత్తుస్వామి అయితే ఆతడు నారాయణన్ ముత్తుస్వామి అవుతాడు. ఆతడి కుమారుడు వెంకటరామన్ అయితే ముత్తుస్వామి వెంకటరామన్ అవుతాడు. ఇలా ఇనీషియల్ మారిపోతూ తండ్రిపేరుతో కొనసాగుతుంది. వాళ్లకు స్థిరమైన గృహనామం ఉండేదే. మధ్యలో విడిచిపెట్టారు. గోచీ కూడా అంతే. గాంధీ, నెహ్రూ, టాటా, బిర్లా ఇవి గృహ నామాలే కదా! కాగా ఉత్తరభారతంలో కూడా ఇంటిపేర్లున్నాయి. విదేశీయులు ఐదు వందల సంవత్సరాలు పరిపాలించారు. ఆ రోజుల్లో మనవి బానిస బ్రతుకులు. వారు ప్రభువులు, దొరలు. వార్ని అనుకరించడం కూడా మర్యాదగా, గొప్పగా ఉండేది. దాంతో వస్త్రధారణ మారింది. వేషమూ మారింది. ఎక్కువగా యూరోపియన్లను, అందులోనూ ఆంగ్లేయుల్ని అనుకరించారు. నెమ్మదిగా ప్యాంటు, షర్టు, ఇన్‌షర్టు, కోటు, టక్కు, టై వగైరాలు వచ్చాయి. ప్యాంటుల్లో కూడా లూజును బట్టి న్యారో, బెల్‌బాటం మొదలైన రకాలు వచ్చాయి. తెలుగువారు మారినంతగా మన సోదరులు తమిళులు మారలేదు. ప్రొఫెసర్లు, చివరకు వి.సి.లు కూడా పంచెలోనే వస్తారు. అయితే ప్యాంటు, షర్టు ధరించేవారూ ఉన్నారు. వారంతా ఎక్కువగా యువకులు. మనం ఎక్కువగా మారాం. ఆంధ్రులం అనుకరణ ప్రియులం. ప్యాంటు షర్టుల్లో కంటే మనవారు పంచె కట్టులోనే అందంగా ఉంటారు.నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, డా. సి.నారాయణ రెడ్డి, డా. వై.ఎస్.రాజశేఖర రెడ్డి మొదలైనవారు పంచెకట్టులో పైన పైపంచెతో ఎంతో అందంగా ఉండేవారు. అప్పుడప్పుడూ వారు ప్యాంటు షర్టుల్లో, సఫారీల్లో, కోటుల్లో కన్పించేవారు. అది ఆయా సందర్భాల్లో అవసరాన్ని బట్టి. మరీ ముఖ్యంగా రాజశేఖరరెడ్డి గార్ని సఫారీలో గుర్తు బట్టలేక పోయేవాళ్లం. పొడవుగా, బలంగా ఉండేవాళ్లకు పంచెకట్టు ఎంతగానో నప్పుతుంది. గాలి ఆడి ఆరోగ్యాన్ని యిస్తుంది. మనది ఎంత కాదన్నా ఉష్ణదేశం. గాలి సులభంగా ప్రవేశించే వదులు బట్టలు మంచివి. యూరప్, అమెరికా మొదలైనవి శీతల దేశాలు. వారికి దళసరిగా శరీరానికి అంటుకుని బిగుతుగా ఉంటే మంచిది. దేశాన్ని, ప్రాంతాన్ని బట్టి వస్త్రం ఉండాలి. ఈ విషయం ఏనాడో సాక్షి వ్యాసాలలో పానుగంటి వారు హాస్యాన్ని జోడించి మొట్టికాయవేసి మరీ చెప్పారు. వినేది ఎవ్వరు?

ఇక ప్రస్తుతానికి వస్తాను. వారు కాబోయే భారత ఉపరాష్ట్రపతి మాన్యశ్రీ ముప్పవరపు వెంకయ్యానాయుడు గారు. మధ్యతరగతి సామాన్యమైన రైతు కుటుంబంలో పుట్టినవారు. ఆర్ఎస్ఎస్ లో చేరి క్రమశిక్షణ గల కార్యకర్తగా, విద్యార్థి నేతగా, ఎంఎల్ఏ గా, ఎంపి గా, భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధ్యక్షుడుగా, జాతీయ అధ్యక్షుడుగా, మంత్రిగా ఎంతగానో రాణించిన మహానేత. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బిఎల్. చదువుతూ ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమంలో విద్యార్థి నాయకుడుగా కోస్తా, రాయలసీమ ప్రాంతమంతా

తిరుగుతూ మా రేపల్లె రాలేదు కాని, తెనాలి వచ్చారు. ఆకర్షణీయంగా మాట్లాడారు. నేను అప్పుడు భాషాప్రవీణ చదువుతున్నాను. వారిపై అప్పుడే అభిమానం ఏర్పడింది. తర్వాత ఇంగ్లీషు, హిందీ భాషల్లో కూడా ప్రావీణ్యం ఏర్పడింది. అనర్గళంగా మాట్లాడుతున్నారు. పదాలు ప్రాసలతో దొర్లి పోతుంటాయి. తెలుగు భాష అంత్యప్రాసలకు అనుకూలం. అది పద్యం కావచ్చు, గేయం కావచ్చు అంత్యప్రాస అందగిస్తుంది.ఈ మర్మం వారికి బాగా తెలుసు. అనుసరించి అలరిస్తున్నారు. వారు ఇంతగా ఎదగడానికి తెలివితేటలకు తోడు నిబద్ధత - భాషాపటిమతో కూడిన వాగ్ధాటి రెండూ ముఖ్యమైన కారణాలు. వారి సతీమణి కూడా మొన్ననే చెప్పారు. వారి ప్రాసంటే తనకూ ఇష్టమని.

ఆయన నెల్లూరు జిల్లా వారు. పదహారు అణాల తెలుగువారు. ప్యాంటు షర్టు ఎలాగూ వేసుకోవడం లేదు. తమిళసోదరుల లాగా పంచె లుంగీలాగా కట్టుకోకుండా ఓరగోచీతో పై పంచెతో తెలుగువాళ్ల లాగా పంచె కట్టుకుంటే ఎంతో అందంగా ఉంటుంది. తెలుగుదనం ఉట్టిపడుతూ ఉంటుంది. ఎన్‌టిఆర్ ప్రభంజనంతో తెలుగువారికి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. అంతకుముందు ఉత్తరాదివారు మనల్ని కూడా మదరాసీలూ అనేవారు. అటువంటి మదరాసీ వస్త్రధారణ మనకెందుకు? లుంగీపంచె వేగంగా నడవడానికి కూడా ఇబ్బంది.

కాళ్లకు అడ్డం పడుతుంది. పైకి మడిచి దోపి బయట తిరగడం పెద్దలకు మర్యాదకాదు. ఎప్పటినుంచో వారిని చూసినప్పుడల్లా నా మనసులో ఈ ఆలోచన కల్గుతున్నది. ఒక్కొక్కప్పుడు ఆవేదనగా కూడా మారుతుంది. చెప్పాలనిపిస్తుంది. కానీ, ఎందుకో చెప్పలేకపోయాను. నాలాగే ఎందరో ఈ విధంగానే అనుకుంటున్నారని భావిస్తున్నాను. ఈ శుభసందర్భాన మనవి చేస్తున్నాను. మన్నించి తెలుగుదనంతో క ూడిన వస్త్రధారణతో ప్రకాశించండి! డా. సర్వేపల్లి వారు తెలుగువారైనా వారికి కొంతైనా తమిళ ముద్ర ఉంది. అలాగనే వి.వి.గిరి గారికి కూడా. అసలు సిసలైన తెలుగు రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారే. పంచెకట్టులో పై పంచెతో ఎంతో అందంగా ఉండేవారు. నేటి ఉపరాష్ట్రపతి, రేపటి రాష్ట్రపతి అయిన మీరు అచ్చ తెలుగు తేజంగా కన్పించాలని ఆకాంక్ష.

-సిహెచ్.బాబావలి రావు
9989792247

తెలంగాణ ఉద్యమ దిక్సూచి ఆచార్య జయశంకర్



(నేడు జయంతి)

తన గురించి కాకుండా సమాజం గురించి ఆలోచించే వారు కొందరే ఉంటారు. అటువంటి వారిలో ప్రొఫెసర్ జయశంకర్ ఒకరు. తన జీవిత కాలమంతా, తెలంగాణ నాదంకోసమే పనిచేసిన వ్యక్తి తెలంగాణ సిద్ధాంత కర్త అయిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి నేడు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష వాస్తవ రూపం దాల్చడంలో కీలక భూమిక పోషించిన వ్యక్తి.1952 నుంచి ప్రత్యేక ఉద్యమం కోసం పరితపించి అహరహం ప్రత్యేక రాష్ట్రం కోసం పరితపించారు. స్వయంపాలన లోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. భావ జాల వ్యాప్తితోనే ప్రత్యేక రాష్ట్రా న్ని సాధించుకోవచ్చని నమ్మారాయన. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో ప్రొఫెసర్ జయశంకర్ 1934 ఆగస్టు 6న జన్మించారు. విద్యార్థి దశ నుండే సమస్యల పట్ల ఎట్లా స్పందించాలో, దాన్ని ఉద్యమంగా ఎలా తీర్చిదిద్దాలో ఆయనకు తెలుసున్నంతగా మరెవరికీ తెలీదు. 1952 లో గైర్ ముల్కి ఉద్యమం మొదలు 1969లో జరిగిన ఉద్యమం వరకు జయశంకర్ పాల్గొన్నారు. మలిదశ ఉద్యమం 2000 సంవత్సరం నుంచి 2011 వరకు తెలంగాణ సాధనకోసం అవిరళ కృషి చేశారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రా ల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా 1954లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై గణాంకాలతో సహా సాధికారిక ప్రసంగాలతో ఉద్యమ శ్రేణులను ఏకతాటిపై తెచ్చారు. 1960లో ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ఆరంభించారు. ఆచార్యుడిగా, ప్రిన్సిపాల్‌గా, సీఫెల్ రిజిస్ట్రార్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా వివిధ ప్రభుత్వ హోదాల్లో పనిచేసి 1994లో ఉద్యోగ విరమణ చేశారు. నా ఆలోచన అంతా సామాజిక న్యాయం కోసం అనేవారు. తెలంగాణ అభివృద్ధి ఎలా ఉండాలనే దానిపై, రాష్ట్రావతరణకు ముందే ఆయన సమగ్రపథకం సిద్ధం చేశారు. స్వయంగా ఆర్థికవేత్త అయిన జయశంకర్ తెలంగాణలో ఆంధ్రా పాలకుల దోపిడీ విధానాలను సోదాహర ణంగా నిరూపించారు. జూన్ 21, 2011న తుది శ్వాస విడిచే వరకూ తెలంగాణ సాధన కోసం ప్రజలనే కార్యక్షేత్రంగా ఎంచుకున్నారు. తెలంగాణ కోసం ఆర్ఎస్ఎస్ నుండి రాడికల్ స్టూడెంట్ యూనియన్ వరకు అన్నివర్గాలలో శక్తులతో చర్చించి ఒప్పించడమే, వారితో కలిసి నడిచిన అరుదైన వ్యక్తి జయశంకర్. తెలంగాణ మలి దశ ఉద్యమంలో స్వీయ రాజకీయ శక్తి తెలంగాణ రాష్ట్ర సమితి అవతరించిన తరువాత రాజకీయ రంగంలో పెనుమార్పు మొదలైంది. ఆనాటినుంచి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రా న్ని సాధిస్తారనే ప్రగాఢ విశ్వాసాన్ని జయశంకర్ వ్యక్తం చేశారు. 2004 డిసెంబర్ తొమ్మిదిగా తెలంగాణ ప్రకటన రూపకల్పన సందర్భంలోనూ ఆయన పాత్ర విస్మరించరానిది. ప్రతి మనిషి గౌరవంగా తలఎత్తుకుని తిరగగలిగిన బతుకు తెలంగాణను కోరుకున్నారు.

-కె.రామ్మోహన్ రావు

రెండో జీవితం

పిల్లలకు చదువులు చెప్పించారు. ప్రయోజకులనూ చేశారు. పెళ్లిళ్లూ చేశారు. జీవితంలో వారు స్థిరపడ్డారు.

మీరూ రిటైర్ అయ్యారు. మనవళ్లు, మనవరాళ్లు ఎప్పుడో చుట్టపు చూపుగా కన్పిస్తారు. ఈ రోజుల్లో ఎవరి బిజీలో వారుంటున్నారు. ఎవరి కాపురాలు వారివి.

మీరూ మీ అర్ధాంగి కలిసి కాలక్షేపం చేస్తున్నారు. ఒంట్లో ఓపికా, ఉత్సాహం నిండుగా ఉంది. కానీ మనసులో ఏదో తెలియని వెలితి. అందరూ ఉన్నా ఒంటరిగా మిగిలిపోయామేననే బాధ. బజారుకెళ్తే మనవడినో, మనవరాలినో స్కూలు బస్సు ఎక్కించి ఆనందంగా బైబై చెప్తున్న దృశ్యాలు కనబడితే మీమనసులో ఎక్కడో మూగబాధ.

నేనూ మనవరాలిని ఇలా స్కూలుకు సాగనంపితే బావుండేది గదా! కొడుకు ఊళ్లోనే ఉన్నా ఆఫీసుకు దగ్గరగా ఉండాలని వేరు కాపురం పెట్టాడు. వాడు పిల్లలతో వచ్చి చాలా రోజులైంది. ఏమీ పొద్దుపోవడం లేదు. ఆ టీవీలు ఎంతసేపని చూడగలం. కొడుకు ఎప్పుడేనా ఫోను చేసి రమ్మనమని స్వాగతాలు పలుకుతుంటారు. పెదాలపై నుంచి వచ్చేమాటే గానీ మనస్ఫూర్తిగా అంటున్నట్లు ఉండదు. అచ్చంగా ఇదే పరిస్థితిలో ఉన్న ఓ పెద్దాయనకు డబ్బుకేమీ లోటులేదు. అప్పుడాయన ఏం చేశారో తెలుసా? తెలిసిన దంపతులకు కబురు పెట్టారు. వాళ్ల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. వారి కుటుంబానికి చేయూత నివ్వాలనుకున్నారు. మీ అమ్మాయిని మా ఇంటికి పంపించండి చదువు నేనే చెప్పిస్తాను. మాకూ చేదోడు వాదోడుగా ఉంటుంది. ఏమీ కాలక్షేపం లేక బోరుకొడుతోంది అన్నాడు. ఆ దంపతులు మొదట్లో తటపటాయించినా కుమార్తెకు చదువు అబ్బుతుందనే ఆశతో చివరకు సరేనన్నారు. ఆ వృద్ధ దంపతులకు ఆ అమ్మాయే కూతురైంది. స్కూలుకు పంపడం, స్కూలు నుంచి తీసుకురావడం. ముప్పై నలభై ఏళ్ల క్రితం తన కుమారుడి, కుమార్తె అచ్చటా ముచ్చట మళ్లీ మరోమారు పెంపుడు కూతురు ద్వారా చవిచూశారా దంపతులు. దత్తప ుత్రికకు బిటెక్ చెప్పించారు. ఎంసెట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నప్పటి నుంచే బిటెక్‌లో ఏ కోర్సులకు డిమాండ్ ఉంటుంది. ఏ కాలేజీలో చేర్పిస్తే బావుంటుందనే వివరాలను అడిగి తెలుసుకున్నాడు. ఆ అమ్మాయి వారి జీవితంలో ప్రవేశించాక వారికి క్షణం తీరుబడి లేనట్లనిపించేది.



అవసానదశలో తోడుగా ఉండి, కన్నతండ్రి కంటే ఎక్కువగా చూసుకుందా పెంపుడు కూతురు. ఆ పెద్దాయన ఒక ు సముచిత నిర్ణయం ద్వారా ఒకే జీవితంలో రెండు జీవితానుభవాలను పొందగలిగాడు.

రిటైర్ అయి బాధ్యతలు తీరినవారు తాము ఇంకా చేయాల్సిందేమీ లేదనుకుంటూ నిస్సారంగా నిస్తేజంగా జీవితాలు గడపాల్సిన పనిలేదు.ఆసక్తి ఉండీ, చిన్నప్పుడు కుదరక వదలేసిన విద్యలను నేర్చుకోవచ్చు.

చిన్నప్పటి నుంచీ శాస్త్రీయ సంగీతం ఇష్టమైతే వయసును, బేషజాలను పక్కనపెట్టి పిల్లలతో పాటు మీరూ టీచరు దగ్గర శిష్యరికం చేసి సాధన మొదలుపెట్టవచ్చు.

చదువుపై ఆసక్తి ఉంటే ఓపెన్ యూనివర్శిటీలో మీకు నచ్చిన కోర్సులో చేరవచ్చు. కాంటాక్టు క్లాసులకు వెళ్తూ, సందేహాలు తీర్చుకుంటూ, ఈ కాలపు కుర్రకారుతో కలిసిమెలిసి తిరుగుతూ వారి ఆలోచనలను అభిరుచులను తెలుసుకోవచ్చు. మీ కాలేజీ రోజులను మరొక్కసారి అనుభవంలోకి తెచ్చుకోవచ్చు.

లేటు వయసులో దంపతుల్లో ఎవరేనా ముందుగా కాలధర్మం చేస్తే మిగిలిన వారి పరిస్థితి దయనీయంగా మారింది ఈ రోజుల్లో. కన్నబిడ్డలు ఉన్నా ఉద్యోగాల కోసం ఎక్కడో ఉంటారు. తల్లినో తండ్రినో తమతోపాటు తీసుకువెళ్లి చూసుకునే పరిస్థితులు ఉండకపోవచ్చు. దీంతో నిస్సహాయంగా వృద్ధాప్యంలో ఆశ్రమాల్లో ఒంటరిగా, భారంగా బతుకులు వెళ్లదీస్తున్నారు.

ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా హైదరాబాద్‌లోని ఒక స్వచ్ఛంద సంస్థ సహజీవనానికి వెసులుబాటు కల్పిస్తోంది. అభిరుచులు కలిసిన ఒంటరి వారు వైవాహిక బంధంలో ప్రవేశించకుండా తోడుగా బాసటగా నిలవటానికి ఈ సంస్థ ద్వారా వీలేర్పడింది.

ఉద్యోగ జీవితంలో ముప్పై నలభై ఏళ్ల పాటు క్షణం తీరిక లేకుండా పీకల్లోతు పనుల్లో కూరుకుపోయిన వారికి రిటైర్ కాగానే శూన్యం ఆవరిస్తోంది. జీవితంలో ఏదో కోల్పోయామన్న భావన వారిని వెంటాడుతోంది.

ఈ స్థితిలో కొందరు ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్లుతున్నారు. సేవా కార్యక్రమాలపైకి దృష్టి సారిస్తున్నారు. మరికొందరు పూర్తిగా శేషజీవితాన్ని ఏదో ఒకస్వామీజీ సేవకు అంకితం చేసి వారి ఆశ్రమంలోనే గడిపేస్తున్నారు. వైద్య పరిజ్ఞానం బాగా పెరిగి అందుబాటులోకి రావడం. బలమైన ఆహారం తీసుకోగలిగిన ఆర్థిక వెసులుబాటు ఉండటం వంటి కారణాలతో జీవన ప్రమాణ స్థాయిలు పెరుగుతున్నాయి. అరవైఏళ్లకు రిటైరైన వారు మరో ముప్పై నలభై ఏళ్లపాటు అలవోకగా బండి లాగించగలు గుతున్నారు.

బ్యాంకు అధికారిగా రిటైర్ అయినవారు ప్రైవేట్ బ్యాంకుల్లోనో, ఫైనాన్స్ చిట్ కంపెనీల్లోనో మళ్లీ ఉద్యోగాల్లో చేరుతున్నారు.ఆర్థిక సంస్థల నిర్వహణలో వీరికున్న అనుభవాన్ని పురస్కరించుకుని ఈ సంస్థలూ వారికి అవకాశం కల్పిస్తున్నాయి.

దక్షిణ కొరియాలో ఎవర్ యంగ్ అనే ఐ.టి.సంస్థ 55 ఏళ్లు పైబడిన వారినే ఉద్యోగాల్లోకి తీసుకుంటూ వారి సేవలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటోంది. వయో వృద్ధులకు అనుగుణంగా కార్యాలయంలో తగిన ఏర్పాట్లు కూడా చేసింది ఈ సంస్థ.

వయో వివక్షను రూపుమాపుతూ కొత్త పంథాలో ముందుకు సాగుతోందిఎవర్ యంగ్ సంస్థ. సర్వస్వం కోల్పోయి జీవితం మొదటి కొచ్చినా భవిష్యత్తు మాత్రం చెక్కుచెదరకుండా మిగిలే ఉంటుంది. ఆ ఆశాదీపాలే మనిషిని ముందుకు నడిపిస్తాయి. సినీనటి గౌతమి కేన్సర్ బారినపడి, చెక్కుచెదరని ఆత్మస్థైర్యంతో తేరుకుని, కొత్త జీవితం మొదలుపెట్టారు. లైఫ్ ఎగైన్ ఫౌండేషన్‌ను నెలకొల్పి మహిళా సాధికారత, ఆరోగ్యం, అందరికీ విద్య సాధనకు పాటుపడుతున్నారు.ఆరోగ్యమే కాదు ప్రమాదాల రూపంలో కొందరి జీవితాల్లో అనుకోకుండా అనూహ్య పరిణామాలు చోటు చేసుకోవచ్చు. ఒకానొక ఆఫీసులో బాసు ఉన్నాడు. కింది ఉద్యోగులను దడదడ లాడించేవాడు. అతగాడికి పనిరాక్షసుడని పేరు. ఇల్లూ వాకిలి పట్టకుండా ఆఫీసే సర్వస్వంగా ఉండేవారు. అలాంటి అతగాడు ఒకరోజు ఆఫీసుకు కారులో వస్తుంటే ఎదురుగా లారీవచ్చి ఢీ కొట్టింది.

బతకడనుకున్న బాసు, ఆస్పత్రులు, ఐసియూల ఘట్టం ముగించుకుని మూడు నెలల విశ్రాంతి తర్వాత తేరుకున్నాడు. కారు ప్రమాదం అతడి ఆలోచనా ధోరణిని పూర్తిగా మార్చేసింది.

అప్పటినుంచి సాటి ఉద్యోగుల బాధలను సానుభూతితో అర్థం చేసుకోగలుగుతున్నాడు. ఆఫీసే ఇల్లనుకున్నాయన పెళ్లాం బిడ్డలతోనూ గడుపుతున్నాడు.ప్రమాదం జరిగితే జరిగింది గానీ బాసులో గొప్ప మార్పు తెచ్చిందని సహోద్యోగులు ఆనందపడ్డారు. అతడికి మాత్రం అది రెండో జీవితం. అరవైలలోనూ ఇరవైల ఉత్సాహాన్ని సొంతం చేసుకోండి. నిస్తేజం, నిర్వేదం వదిలి పెట్టి జీవన మధురిమలను ఆస్వాదిస్తూ ముందుకు సాగండి.

-గోవిందరాజు చక్రధర్
98498 70250

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం.బి1/3274/2017, తేది:28-07-2017
గెజిట్ నెం.21 ఫారము-సి తేది:28-07-2017

(సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)

ప్రాథమిక ప్రకటన

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కొరకు మేడిపల్లి గ్రామము, యాచారం మండలము, రంగారెడ్డి జిల్లాలో 2088.03½ ఎకరముల భూమి అవసరమైనదిగా కలెక్టరు, రంగారెడ్డి జిల్లా వారు భావించుచున్నారు.

కావున రంగారెడ్డి జిల్లా, యాచారం మండలము, మేడిపల్లి గ్రామములోని పైన పేర్కొన్న సదరు ప్రాజెక్టు కొరకు దిగువ వివరించబడిన విధంగా గుర్తించిన ప్రామాణిక కొలతలు ఎ.238.06½ గుంటలు ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణపు భూమి యొక్క భాగము భూసేకరణ క్రింద కలదని ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా: రంగారెడ్డి మండలము: యాచారం గ్రామము: మేడిపల్లి

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం (టైటిల్/రకం)	సేకరణ విస్తీర్ణం ఎ.గు	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు, చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం (తూ / ప / ఉ / ద)	చెట్లు రకం/సంఖ్య	నిర్మాణాలు రకం	నిర్మాణాలు విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	
1	65/1	పట్టా మెట్ట	4.11	ఎం.డి.హనీఫ్ తండ్రి దాస్	[illegible]	వేప 1	బోర్	3
	65/2	పట్టా మెట్ట	1.13	గవర్నమెంటు [illegible]				
	65	పట్టా మెట్ట	2.10	గద్దం రాములు తండ్రి లక్ష్మయ్య				
	65/అ/1	పట్టా మెట్ట	1.05	లక్ష్మి నిర్మలమ్మ భర్త కృష్ణారెడ్డి				
	65/ఆ	పట్టా మెట్ట	1.04	లక్ష్మి జంగమ్మ భర్త కృష్ణారెడ్డి				
	65/ఇ	పట్టా మెట్ట	1.36	గద్దం రాములు తండ్రి లక్ష్మయ్య				
	65/ఇ/1	పట్టా మెట్ట	0.11	గద్దం మహేష్ [illegible]				
	65/ఈ	పట్టా మెట్ట	2.09	గద్దం మహేష్ [illegible]				
	65/ఉ	పట్టా మెట్ట	2.09	[illegible]				
	65/ఊ	పట్టా మెట్ట	0.18	[illegible]				
2	66/అ	పట్టా మెట్ట	1.00	లక్ష్మి జంగమ్మ భర్త కృష్ణారెడ్డి	[illegible]			
	66/అ/1	పట్టా మెట్ట	1.00	లక్ష్మి నిర్మలమ్మ భర్త కృష్ణారెడ్డి				
	66/ఆ	పట్టా మెట్ట	1.14	నాగభూషణ రావు [illegible]				
	66/ఇ	పట్టా మెట్ట	1.14	[illegible]				
	66/ఈ	పట్టా మెట్ట	1.14	[illegible]				
3	67/అ	పట్టా మెట్ట	6.07	[illegible]	[illegible]		బోర్	2
	67/ఆ	పట్టా మెట్ట	3.00	[illegible]				
	67/ఆ/1	పట్టా మెట్ట	3.00	[illegible]				
	67/ఆ/2	పట్టా మెట్ట	3.00	[illegible]				
4	68/అ	పట్టా మెట్ట	2.21	లక్ష్మి జంగమ్మ భర్త కృష్ణారెడ్డి	[illegible]		బోర్	1
	68/ఆ	పట్టా మెట్ట	2.21	లక్ష్మి నిర్మలమ్మ భర్త కృష్ణారెడ్డి				
	68/ఇ	పట్టా మెట్ట	1.20	[illegible]				
	68/ఈ	పట్టా మెట్ట	1.20	[illegible]				
	68/ఉ	పట్టా మెట్ట	3.38	[illegible]				
	68/ఊ/1	పట్టా మెట్ట	2.36½	[illegible]				
	68/ఊ/2	పట్టా మెట్ట	2.36½	[illegible]				
	68/ఋ	పట్టా మెట్ట	1.02	[illegible]				
5	69/అ	ఖారిజ్ మెట్ట	1.10	[illegible]	[illegible]	వేప 1		
	69/ఆ	పట్టా మెట్ట	6.03	[illegible]				
6	71/అ	పట్టా మెట్ట	2.09	[illegible]	[illegible]	మామిడి 1, వేప 2		
	71/ఆ	పట్టా మెట్ట	2.09	[illegible]				
	71/ఇ	పట్టా మెట్ట	2.09	[illegible]				
7	73/అ	పట్టా మెట్ట	1.35	[illegible]	[illegible]			
	73/ఆ	పట్టా మెట్ట	1.34	[illegible]				
	73/ఇ	పట్టా మెట్ట	1.35	[illegible]				
8	80/అ	పట్టా మెట్ట	0.27	[illegible]	[illegible]	వేప 8		
	80/అ/1	పట్టా మెట్ట	0.27	[illegible]				
	80/ఆ	పట్టా మెట్ట	1.36	గౌర లక్ష్మయ్య తండ్రి వీరయ్య				
	80/ఇ	పట్టా మెట్ట	0.27	గౌరిగ జంగయ్య తండ్రి సోమయ్య				
	80/ఇ/1	పట్టా మెట్ట	5.00	[illegible] రాములమ్మ భర్త రామయ్య				
9	81/అ	పట్టా మెట్ట	1.14	గౌరిగ పర్వతాలు తండ్రి సోమయ్య	[illegible]			
	81/అ/1	పట్టా మెట్ట	1.14	గౌరిగ జంగయ్య తండ్రి సోమయ్య				
	81/అ/2	పట్టా మెట్ట	1.14	గౌరిగ [illegible] తండ్రి సోమయ్య				
	81/ఆ	పట్టా మెట్ట	3.05	గౌరిగ పర్వతాలు తండ్రి సోమయ్య				
	81/ఆ/1	పట్టా మెట్ట	3.05	గౌరిగ జంగయ్య తండ్రి సోమయ్య				
	81/ఆ/2	పట్టా మెట్ట	3.04	గౌరిగ [illegible] తండ్రి సోమయ్య				
10	84/అ	పట్టా మెట్ట	1.09	[illegible]	[illegible]			
	84/అ/1	పట్టా మెట్ట	1.20	[illegible]				
	84/ఆ	పట్టా మెట్ట	2.00	[illegible] భర్త జంగయ్య				
	84/ఇ	పట్టా మెట్ట	3.08	[illegible] భర్త జంగయ్య				
11	85/అ	పట్టా మెట్ట	4.30	[illegible]	[illegible]			
	85/అ/1	పట్టా మెట్ట	1.05	[illegible]				
	85/ఆ	పట్టా మెట్ట	1.04	[illegible]				
	85/ఆ/1	పట్టా మెట్ట	1.05	సింధం [illegible] భర్త శ్రీశైలం				
	85/ఇ	పట్టా మెట్ట	2.09	[illegible]				
12	86/అ	పట్టా మెట్ట	1.01	సింధం [illegible] తండ్రి ఎల్లయ్య	[illegible]			
13	87/అ	పట్టా మెట్ట	0.38	[illegible]	[illegible]			
	87/ఆ	పట్టా మెట్ట	2.12	[illegible]				
	87/ఇ	పట్టా మెట్ట	1.26	[illegible]				
14	88/అ	పట్టా మెట్ట	1.02	[illegible]	[illegible]			
15	93/అ	పట్టా మెట్ట	2.16	[illegible]	[illegible]			
16	94/అ	పట్టా మెట్ట	3.04	[illegible]	[illegible]	వేప 7	బోర్	2
	94/ఆ	పట్టా మెట్ట	2.35	[illegible]				
	94/ఆ/1	పట్టా మెట్ట	2.09	[illegible]				
	94/ఆ/2	పట్టా మెట్ట	0.09	[illegible]				
17	98	ఖారిజ్ మెట్ట	3.32	[illegible]	[illegible]			
18	99/అ	పట్టా మెట్ట	0.16	[illegible]	[illegible]			
	99/ఆ	పట్టా మెట్ట	0.16	[illegible]				
	99/ఇ	పట్టా మెట్ట	2.09	[illegible]				
	99/ఈ	పట్టా మెట్ట	4.23	[illegible]				
	99/ఉ	పట్టా మెట్ట	[illegible]	[illegible]				
19	102/అ	పట్టా మెట్ట	2.07	[illegible]	[illegible]	కొబ్బరి 2		
	102/ఆ	పట్టా మెట్ట	4.00	[illegible]				
	102/ఇ	పట్టా మెట్ట	1.20	[illegible]				
20	105/అ	పట్టా మెట్ట	0.22	[illegible]	[illegible]	సీంది 1		
	105/ఆ	పట్టా మెట్ట	0.22	హోతె శ్రీశైలం తండ్రి రాములు				
	105/ఇ	పట్టా మెట్ట	0.22	హోతె బాపయ్య తండ్రి రాజయ్య				
	105/ఈ	పట్టా మెట్ట	1.30	ఎస్.రాధ భర్త నాగభూషణరావు ఎడుపుల రాములు				
	105/ఈ/1	పట్టా మెట్ట	0.22	నాగభూషణరావు, ఎడుపుల రాములు				
	105/ఈ/2	పట్టా మెట్ట	1.30	ఎస్.బ్రహ్మన్న తండ్రి నాగభూషణరావు				
	105/ఈ/3	పట్టా మెట్ట	1.30	[illegible]				
	105/ఈ/4	పట్టా మెట్ట	1.30	[illegible]				
	105/ఈ/5	పట్టా మెట్ట	0.22	[illegible]				
21	107/అ	పట్టా మెట్ట	3.09	[illegible]	[illegible]			
22	119/అ	పట్టా మెట్ట	3.00	[illegible]	[illegible]			
	119/ఆ	పట్టా మెట్ట	3.11	[illegible]				
	119/ఇ	పట్టా మెట్ట	0.11	[illegible]				
	119/ఈ	పట్టా మెట్ట	0.11	[illegible]				
	119/ఉ	పట్టా మెట్ట	2.17½	[illegible]				
	119/ఉ/1	పట్టా మెట్ట	0.10½	[illegible]				
	119/ఊ	పట్టా మెట్ట	0.04½	[illegible]				
	119/ఊ/1	పట్టా మెట్ట	0.04½	[illegible]				
	119/ఋ	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ఋ/1	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ౠ	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ౠ/1	పట్టా మెట్ట	0.04	[illegible]				
	119/ఎ	పట్టా మెట్ట	0.04½	[illegible]				
	119/ఎ/1	పట్టా మెట్ట	0.04½	[illegible]				
	119/ఏ	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ఏ/1	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ఐ	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ఐ/1	పట్టా మెట్ట	0.05	[illegible]				
	119/ఒ	పట్టా మెట్ట	0.11	అమ్మ నర్సింహా తండ్రి పెంటయ్య				
	119/ఒ/1	పట్టా మెట్ట	0.11	అమ్మ పాండు తండ్రి పెంటయ్య				
	119/ఒ/2	పట్టా మెట్ట	0.31½	కంకోండ వీరప్ప తండ్రి బాలయ్య				
	119/ఒ/3	పట్టా మెట్ట	0.10½	అమ్మ శంకర్ తండ్రి పెంటయ్య				
	119/ఓ	పట్టా మెట్ట	0.03	అమ్మ నర్సింహా తండ్రి పెంటయ్య				
	119/ఓ/1	పట్టా మెట్ట	0.03	అమ్మ పాండు తండ్రి పెంటయ్య				
	119/ఓ/2	పట్టా మెట్ట	0.02	అమ్మ శంకర్ తండ్రి పెంటయ్య				
	119/ఔ	పట్టా మెట్ట	0.02	అమ్మ నర్సింహా తండ్రి పెంటయ్య				
	119/ఔ/1	పట్టా మెట్ట	0.03	అమ్మ పాండు తండ్రి పెంటయ్య				
	119/ఔ/2	పట్టా మెట్ట	0.03	అమ్మ శంకర్ తండ్రి పెంటయ్య				
23	120	పట్టా మెట్ట	3.24	[illegible] భర్త యాదయ్య, పి.జంగారెడ్డి, పి.శ్రీనివాస్, [illegible] & కృష్ణయ్య	[illegible]			
24	146/అ	పట్టా మెట్ట	3.34	సింధం జంగయ్య తండ్రి ఎల్లయ్య	[illegible]			
25	148/అ	పట్టా మెట్ట	2.13	[illegible]	[illegible]	వేప 6		
	148/ఆ	పట్టా మెట్ట	6.20	[illegible]				
	148/ఇ	పట్టా మెట్ట	2.00	[illegible]				
	148/ఈ	పట్టా మెట్ట	2.00	[illegible]				
	148/ఉ	పట్టా మెట్ట	1.00	[illegible] జంగయ్య తండ్రి రాములు				
26	151/అ	పట్టా మెట్ట	2.16	సింధం రమేష్ తండ్రి మల్లయ్య, లేట్ రాములు	[illegible]	వేప 6		
	151/ఆ	పట్టా మెట్ట	2.16	సింధం శ్రీశైలం				
	151/ఇ	పట్టా మెట్ట	2.16	[illegible]				
	151/ఈ	పట్టా మెట్ట	1.14	[illegible]				
	151/ఉ	పట్టా మెట్ట	3.13	[illegible]				
	151/ఊ	పట్టా మెట్ట	3.13	[illegible]				
	151		0.21	[illegible]				
27	152	పట్టా మెట్ట	2.04	[illegible]	[illegible]	వేప 4		
	152	పట్టా మెట్ట	1.19	[illegible]				
	152	పట్టా మెట్ట	2.02	[illegible]				
	152	పట్టా మెట్ట	[illegible]	[illegible]				
28	153/అ	పట్టా మెట్ట	3.34	[illegible]	[illegible]			
	153/ఆ	పట్టా మెట్ట	2.14	[illegible]				
	153/ఇ	పట్టా మెట్ట	1.02	[illegible] తిరుపతమ్మ, ఇందిరా దేవి, రాజశేఖర్				
29	154/అ	పట్టా మెట్ట	9.28½	సంగం ఎల్లయ్య తండ్రి కోటయ్య, తిరుపతమ్మ, ఇందిరాదేవి, రాజశేఖర్	[illegible]			
	154/ఆ	పట్టా మెట్ట		సంగం [illegible] తండ్రి కోటయ్య, తిరుపతమ్మ, ఇందిరాదేవి, రాజశేఖర్				
మొత్తం			238.06½					

భూసేకరణలో పారదర్శకం న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్రప్రభుత్వ చట్టం 30/2013)లోని సెక్షన్ 11(1) క్రింద మరియు సవరించిన న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం2016 (చట్టం నెం.21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికీ తెలియ చేయడమైనది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తి గల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పనిదినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారము కల్పించిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, భూమి పరిశీలన కొరకు, భూమి పొరలను త్రవ్వుటకు మరియు సంబంధిత పనులు చేయుటకు కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.


చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు/లేదా ఏవేని బాకీల్ని రుణభారాలను చేయరాదు.

భూసేకరణకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60(అరవై రోజులు) లోపు ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

తహసీల్దారు, యాచారం మండలము, రంగారెడ్డి జిల్లా — భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా — జాయింట్ కలెక్టర్, రంగారెడ్డి జిల్లా — జిల్లా కలెక్టర్, రంగారెడ్డి

ఓరుగల్లు ఆలయ చారిత్రక శోధనా శిఖరం

ఆచార్య శివకుమార్ కన్నుమూత




వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : వరంగల్ చరిత్రకు సరికొత్త భాష్యం చెప్పి కాకతీయుల కళాప్రాభావాన్ని, సాంస్కృతిక వికాసాన్ని తనదైన శైలిలో ప్రపంచానికి తెలియజేసిన ఓరుగల్లు చరిత్ర పరిశోధకులు, ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య హరిశివకుమార్ శనివారం నాడు వరంగల్‌లోని క్రిష్ణకాలనీలో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శివకుమార్ మృతి వరంగల్ జిల్లా సాహితీ లోకానికి తీరని లోటు 1942 ఏప్రిల్ 19న జన్మించిన శివకుమార్ వరంగల్‌లో డిగ్రీ, హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డీ పట్టా ఆందుకున్నారు. వరంగల్ చరిత్రపై ఆసక్తి కలిగిన శివ కుమార్ కాకతీయులకు సంబంధించిన మరుగున పడిన చరిత్రను వెలుగులోకి తెచ్చారు. వేయిస్తంభాల దేవాలయం, రామప్ప ఆలయాల శతాబ్ధి ఉత్సవాల ప్రాధాన్యాన్ని ప్రపంచానికి తెలియజేశారు.

'టీటా' సాంకేతిక అక్షరాస్యతలో

మరో మైలురాయి

● నూరు శాతం డిజిటల్ లిటరసీ సాధించిన గుజ్జ గ్రామం: ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామీణులను సాంకేతిక అక్షరాస్యులను చేసే క్రమంలో వేగంగా ముందుకు సాగుతున్న తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) మరో మైలురాయిని అధిగమించింది. యాదాద్రి జిల్లాలోని గుజ్జ గ్రామాన్ని వందశాతం సాంకేతిక అక్షరాస్యత పూర్తి చేసుకున్న గ్రామంగా నిలిచింది. ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ స్వయంగా ఈ విషయాన్ని గ్రామస్తులు, టీటా సభ్యుల సమక్షంలో ప్రకటించారు. గుజ్జ గ్రామాన్ని కాలిఫోర్నియాలో నివసిస్తున్న ఎన్నారై రాంబాబు మంచికంటి దత్తత తీసుకున్నారు. అనంతరం టీటా వాలెంటీర్లు గ్రామంలోని 135 మందికి డిజిటల్ టూల్స్‌పై శిక్షణ అందించారు.

స్థానిక శాసనసభ్యులు కూనుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శనివారం జరిగిన కార్యక్రమంలో ఉత్తీర్ణులైన వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. డిజిథాన్ ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశంసించారు. ఈ ప్రయత్నం గ్రామీణులకు ఎంతో మేలు చేస్తుందని, నగదురహిత లావాదేవీలు నిర్వహించడంతో పాటు సాంకేతికరంగంలో వస్తున్న నూతన మార్పులకు తగిన రీతిలో సన్నద్ధమయ్యేందుకు ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. తను దత్తత తీసుకున్న సర్వేల్ గ్రామాన్ని దత్తత తీసుకొని అక్కడ కూడా ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆయన టీటా వాలంటీర్లను కోరారు.

టీటా అంతర్జాతీయ అధ్యక్షులు సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ, పల్లెవాసులకు డిజిటల్ టూల్స్‌పై శిక్షణ ఇవ్వడం ఒక విశిష్టమైన కార్యాచరణ అని తెలిపారు. ఈ ప్రయత్నం చక్కటి ఫలితాలను అందిస్తున్నదని ఆయన వివరించారు. ఎన్నారై రాంబాబు మంచికట్లను ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ ఎన్నారైలు ముందుకువచ్చి తమకు నచ్చిన గ్రామాలను ఎంచుకొని ఈ ప్రయత్నం పాలుపంచుకోవాలని కోరారు. గ్రామీణ ప్రజానీకం సాంకేతిక అక్షరాస్యతను అందిపుచ్చుకోగలిగితే అది రాష్ట్రానికి, దేశానికి నిజమైన అభివృద్ధి చిహ్నంగా నిలుస్తుందని తెలిపారు. టీటా సారథ్యంలోని తమ బృందం గ్రామీణులకు సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందించడం కొనసాగిస్తుందని తెలిపారు. తద్వారా గ్రామీణులు మెరుగైన జీవన విధానంవైపు ముందుకు సాగు క్రమంలో తమ వంతు పాత్రను పోషిస్తామని స్పష్టంచేశారు.

ఈ సందర్భంగా రాంబాబు మంచికట్ల తల్లిదండ్రులను ఎమ్మెల్యేలతో పాటుగా టీటా సభ్యుల బృందం సన్మానించింది. టీటా ఉపాధ్యక్షులు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి అశ్విన్‌చంద్ర, సంయుక్త కార్యదర్శి విశ్వక్ లక్కిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ మడిపోజు, టీటా వాలంటీర్లు పాల్గొన్నారు.

రేపు రాజ్‌భవన్‌లో రక్షాబంధన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అన్నా చెల్లెళ్ళ ఆత్మీయ అనుబంధానికి పవిత్ర దినంగా భావించి దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా సోమవారం రాజ్‌భవన్‌కు అన్ని వర్గాల ప్రజలకు అనుమతి ఇచ్చారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ దంపతులు వచ్చే వారందరినీ ఆదరించి మిఠాయిలు పంపిణీ చేయనున్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాజ్‌భవన్ అధికారులు ఏర్పాట్లు చేస్తారు. మీడియా ప్రతినిధులను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

వ్యవసాయ వర్సిటీలో హరితహారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ హరితహారంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం భారీఎత్తున మొక్కలునాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉపకులపతి డాక్టర్ వి.ప్రవీణ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. విశ్వ విద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది మొక్కలు నాటారు. గత ఏడాది రాజేంద్రనగర్ క్యాంపస్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ తదితర సంస్థలతో కలిసి సుమారు 60 వేల మొక్కలు నాటామని, ఈ ఏడాది బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరంలో చేరే ప్రతి ఒక్కరూ విధిగా ఒక మొక్కను నాటి నాలుగేళ్ళ వరకు వాటిని సంరక్షించే విధంగా చర్యలు తీసుకున్నామని ప్రవీణ్‌రావు తెలిపారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ మనోహర్‌రావుతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సుధీర్‌కుమార్, విశ్వ విద్యాలయం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'ప్రపంచ గిరిజనోత్సవాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ట్రైబల్ స్టుడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో గోడపత్రికలను ఆవిష్కరించారు. గిరిజనులు తమ హక్కుల కోసం పోరాటం నిర్వహించిన ఆగస్టు 9 రోజును ఐక్యరాజ్య సమితి గుర్తించిన విషయాన్ని గుర్తు ఆమె గుర్తు చేశారు. ఈ సమావేశంలో గిరిజన స్టుడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భుక్యా చందు నాయక్, మూడ్ శోభన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ విద్యార్థులకు

అంతర్జాతీయ ఫైనాన్స్ కెరీర్

● ఏసీసీఏతో స్ట్రాటజెమ్ ఫైనాన్స్ స్కూల్ ఎంవోయూ ● కోర్సుకు 181 దేశాల్లో గుర్తింపు




హైదరాబాద్, ఆంధ్రప్రభ: కామర్స్ చదివే విద్యార్థులకు అంతర్జాతీయ ఫైనాన్స్ కెరీర్‌కు బాటలు పడనున్నాయి. అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ ఎక్కౌంటెంట్స్ (ఏసీసీఏ)తో స్ట్రాటజెమ్ ఫైనాన్షియల్ స్కూల్ శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎక్కౌంటెన్సీ, ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను అందిస్తోంది. రెండు సంస్థల అవగాహన ఒప్పందం ద్వారా భారత దేశానికి అంతర్జాతీయ ఫైనాన్స్ కెరీర్ అవకాశాలు, అంతర్జాతీయ గుర్తింపు, అంతర్జాతీయ ప్రభావం, సౌకర్యవంతమైన అభ్యాసం విస్తృతస్థాయి విద్యార్థి సహకార వ్యవస్థ ఉంటుంది. ఏసీసీఏ ప్రతినిధి లూసియా రియల్ మార్టిన్, స్ట్రాటజెమ్ సీఈవో జి మహేశ్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.

రెండు సంవత్సరాల కోర్సు అని ఇది ఇంటర్నేషనల్ డిగ్రీ అని మహేష్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 181 దేశాల్లో గుర్తింపు పొందిన ప్రొఫెషనల్ డిగ్రీకోర్సుగా గుర్తింపు ఉందన్నారు. ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఇప్పటికే దీనిని 80 దేశాల్లో ఉపయోగిస్తున్నారని తెలిపారు. బహుళజాతి కంపెనీలు, ప్రైవేటు బ్యాంకింగ్ సంస్థలు కూడా వీటిని ఉపయోగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్‌లోనే ఒక లెవల్‌ను పూర్తి చేయవచ్చని చెప్పారు. డిగ్రీ పూర్తి అయ్యే సరికి ఏసీసీఏ కోర్సును కూడా పూర్తి చేస్తారని తెలిపారు. ఈ కోర్సు చదవాలనుకునే వారికి విద్యా సంస్థను బట్టి విద్యార్థులకు ఫీజులో 65 శాతం స్కాలర్‌షిప్‌గా ఇస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఈ కోర్సుపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ వీసీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కామర్స్‌లో ప్రస్తుతం ఉపాధి అవకాశాలు ఉన్నాయని స్ట్రాటజెమ్ అవగాహన చేసుకున్న కోర్సును నాగార్జున యూనివర్సిటీలో ప్రవేశ పెట్టడంపై ఆలోచిస్తామన్నారు.

గద్వాలకు త్వరలో సాగునీరు

● ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా త్వరలోనే గద్వాల సెగ్మెంట్‌లోని అన్ని ఆవాసాలకు సురక్షిత తాగునీటిని అందిస్తామని గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ బీ సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మిషన్ భగీరథ గద్వాల సెగ్మెంట్‌లో ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి పర్యటించారు. ముందుగా గద్వాల జిల్లా రాజోలి దగ్గర సీపీడబ్ల్యూ స్కీంలో భాగంగా నిర్మించిన ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ఈ పథకాన్ని త్వరగా భగీరథలో విలీనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత కోరుకొండయ్య గుట్ట మీద నిర్మిస్తున్న జీఎల్‌బీఆర్‌ను పరిశీలించారు. అక్కడి నుంచి జూరాల ప్రాజెక్టు దగ్గర నిర్మిస్తున్న 70 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించారు.

నీటి శుద్ధీకరణ జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. గద్వాల సెగ్మెంట్‌కు సంబంధించిన భగీరథ ఇంజనీర్లు, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులతో అక్కడే సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ సమయంలోనే వాటర్ ట్రీట్‌మెంట్ పనులను నాణ్యతతో పూర్తి చేశారని సురేందర్‌రెడ్డి ప్రశంసించారు. ఇదే పట్టుదలతో పని చేసి చివరి ఆవాసంలోని ఇంటికి కూడా తాగునీటిని అందించాలని సూచించారు. కష్టపడి పనిచేస్తున్న ఇంజనీర్లను ప్రోత్సహించడంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. క్వాలిటీ విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సెగ్మెంట్‌లో జరుగుతున్న ఇంట్రా విలేజ్ పనుల స్థితిని తెలుసుకున్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఓహెచ్ఎస్ఆర్, అంతర్గత పైప్‌లైన్ పనులకు కావాల్సిన మెటీరియల్‌ను ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని తెలిపారు. ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నిర్వహించిన హరితహారంలో సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మిషన్ భగీరథ దగ్గర పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఈ పర్యటనలో మిషన్ భగీరథ సీఇ కృపాకర్‌రెడ్డి, ఎస్ఈలు చిన్నారెడ్డి, జగన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి

నిధుల ఖర్చు వివరాలివ్వండి

● హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మెల్యే/ ఎమ్మెల్సీలకు ఏటేటా కేటాయించే నియోజకవర్గ అభివృద్ధి నిధుల (సీడీఎఫ్) ఖర్చుపై అకౌంటెంట్ జనరల్ ఆడిట్ చేసిన గత మూడేళ్ల వివరాలను సమర్పించేలా తెలంగాణ సర్కారును ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో ప్రజాహిత వాజ్యం దాఖలైంది. ఎమ్మెల్యే/ ఎమ్మెల్సీలకు నియోజక వర్గ అభివృద్ధి నిధులు, మంత్రులకు ప్రతిఏటా ప్రత్యేక నిధులకింద విడుదల చేసిన సుమారు రూ. 700 కోట్ల సొమ్ముపై ట్రెజరీ అధికారుల నియంత్రణ, ఆడిట్/తనిఖీ లేకపోవడం అక్రమమని ప్రకటించాలని, ఆ నిధులను స్థానిక సంస్థల ద్వారా ఖర్చు చేసేలా ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స్వచ్ఛంద సంస్థ కార్య దర్శి ఎం.పద్మనాభ రెడ్డి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. నియోజక వర్గ నిధుల ఖర్చు పై ఆడిట్, అధికారుల తనిఖీ, ట్రెజరీ నియంత్రణ లేకపోవడం వల్ల, ఆ నిధుల విడుదలలో పారదర్శకత లోపించడం వల్ల దుర్వినియోగమయ్యే అవకాశముందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ప్రతి ఎమ్మెల్యే/ ఎమ్మె ల్సీకి ఏటా రూ.మూడు కోట్లు మంజూరు చేస్తుందని తెలిపారు. అభివృద్ధి నిధుల కేటాయింపు, ఖర్చు వ్యవహారంపై సంబంధిత జిల్లా పరిషత్, పట్టణ స్థానిక సంస్థల్లో ఎలాంటి చర్చ జరగదు. ఆ నిధులు తాగు నీటి సరఫరా, సాగునీటి కుంటలు, కాలువల మరమ్మతు కోసం వినియోగించాలి. అయితే అందుకు విరుద్ధంగా, ఆ నిధులను మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పనులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 120 మంది ఎమ్మెల్యేలు, 40 మంది ఎమ్మెల్సీలకు మొత్తం రూ.480 కోట్లు ఏటా విడుదల చేస్తోందన్నారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ, ప్రణాళిక ముఖ్య కార్యదర్శులను చేర్చారు.

'టెట్'లో రాయితీలపై వ్యాజ్యం

ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఉపాధ్యాయుల నియామ కంలో విద్యార్హత్తల విషయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల అభ్యర్థులకు కొన్ని రాయితీలు ఇవ్వాలని జాతీయ సాంకేతిక విద్యామండలి (ఎన్‌సీటీఈ) రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు సూచిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ఎన్‌సీటీఈ మార్గదర్శ కాల మేరకు ఆయా వర్గాలకు 20 శాతం రాయితీ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం టీఎస్ టెట్-2017 పేరుతో తేది. 12.6.2017న నోటిఫికేషన్ జారీ చేసింది. జనరల్ అభ్య ర్థులకు ఉత్తీర్ణత మార్కులు 60 శాతం, ఆపైన. కాగా వెనుకబడిన తరగతుల (బీసీలు) అభ్యర్థులకు ఉత్తీర్ణత మార్కులు 50శాతం. ఇక ఎస్సీ, ఎస్టీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం, ఆపై మార్కులు సాధించిన వారు మాత్రమే అర్హులని పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో ఆయా వర్గాలకు కేవలం 5 శాతం మినహాయింపు మాత్రమే ఇచ్చినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే 20 శాతం రాయితీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ చర్య జనరల్ కేటగిరి అభ్యర్థుల పట్ల వివక్ష చూపడమేనని, పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్యా చట్టం, 2009 లోని సెక్షన్-23ను ఉల్లంఘించడమేనని పిటిషనర్ తెలిపారు. భిన్న వర్గాలకు విభిన్నమైన అర్హత మార్కులను నిర్ణయించడం అక్రమమని ప్రకటించాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా తెలంగాణ పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యా డైరెక్టర్, కార్య దర్శి, ఎన్‌సీటీఈ కార్యదర్శిని చేర్చారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టే అవకాశముంది.







గోల్డ్	సిల్వర్	క్రూడ్
పాయింట్లు	పాయింట్లు	రూ.
28,400	37,246	3,154.00
176.00	781.00	11.00
0.62% (-)	2.05% (-)	0.35%

ట్రాక్టర్ల విడిభాగాలపై 18% జీఎస్టీ



న్యూఢిల్లీ : 28శాతమున్న కొన్ని ట్రాక్టర్ విడిభాగాల పన్ను రేట్లను 18 శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. అలాగే 20 అంగుళాల కంప్యూటర్ మానిటర్లపై ఉన్న 28శాతం జీఎస్టీ పన్ను రేట్లను 18శాతానికి తగ్గించినట్టు చెప్పారు. ఈ-వే బిల్లు వంటి పలు అంశాలపై శనివారం భేటీ అయిన జీఎస్టీ కౌన్సిల్ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నది. రూ.50వేల కంటే ఎక్కువ విలువున్న ప్యాకేజీలకు ఈ-వే బిల్లు కచ్చితంగా అవసరమని అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. వీటిని ఎలక్ట్రానిక్‌గా జనరేట్ చేయాలని చెప్పారు. అయితే మినహాయించిన గూడ్స్‌కు ఈ-వే బిల్లు అవసరం లేదని తెలిపారు. ఇన్‌పుట్ క్రెడిట్ ప్రయోజనాలను కన్స్యూమర్లకు బదలాయించాని ఆదేశించారు.

ఈ-వే బిల్లు అమల్లోకి దేశవ్యాప్తంగా తీసుకురావడానికి అక్టోబర్ 1ని తాత్కాలిక తేదీగా జీఎస్టీ కౌన్సిల్ అంగీకరించింది. కానీ దీనికోసం ఎలాంటి చెక్‌పోస్టులు అవసరం లేదని, కేవలం టెక్నాలజీతోనే వీటిని అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇప్పవరకు 71 లక్షలకుపైగా పన్ను చెల్లింపుదారులు జీఎస్టీలోకి మళ్లారని, కొత్త 15.67 లక్షల దరఖాస్తులు అందినట్టు వివరించారు. అయితే వాటిలో 12లక్షలకు మాత్రమే ఆమోదించినట్టు సమాచారం. వర్క్ కాంట్రాక్ట్‌లపై కూడా జీఎస్టీని 18శాతం నుంచి 12శాతానికి తగ్గించినట్టు జైట్లీ వెల్లడించారు. అలాగే చీరలపై జీఎస్టీ 5శాతమేనని బీహార్ ఆర్థికమంత్రి వెల్లడించారు.

మరోవైపు ఈ సమావేశాలకు తెలుగు రాష్ట్రాల మంత్రులు యనమల, కేటీఆర్ హాజరయ్యారు. గ్రానైట్, బీడీ పరిశ్రమపై జీఎస్టీ భారాన్ని వివరించారు. వచ్చే జీఎస్టీ సమావేశాలు హైదరాబాద్‌లో జరపాలని జైట్లీని కోరారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్టీ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.తెలంగాణలో చేపడుతున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు జీఎస్టీ నుంచిమినహాయింపు ఇవ్వాలని అరుణ్ జైట్లీ కోరారు.



ఫ్రీ ఎల్పీజీకి ఆధార్ గడువు పెంపు

న్యూఢిల్లీ: ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లకు కచ్చితంగా సమర్పించాల్సిన ఆదార్ గడువును కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ చివరినాటికి పొడిగించింది. సెప్టెంబర్ చివరికల్లా 12 అంకెల బయోమెట్రిక్ నెంబర్ ఆధార్‌ను సమర్పించాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఏడాది మార్చిలోనే ఆధార్ తప్పనిసరి చేసి సంగతి తెలిసిందే. ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పీఎంయూవై) కింద ఉచిత ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లను పొందవచ్చని, వీటికోసం మే 31 వరకు ఆధార్‌ను దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. కానీ పెట్రోలియ్, నేచురల్ గ్యాస్ మంత్రిత్వశాఖ తాజాగా జారీచేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది. గతేడాది అక్టోబర్‌లోనే ఎల్పీజీలపై సబ్సిడీలను పొందాలంటే ఆధార్ నెంబర్ తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది.

మార్చిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గృహ మహిళలకు అందించే ఉచిత వంటగ్యాస్ కనెక్షన్లకు ఆధార్ తప్పనిసరి అని పేర్కొంది. ప్రస్తుతం ఈ గడువును సెప్టెంబర్ వరకు పొడిగించింది.

పీఎంయూవై కింద ప్రయోజనాలుపొందే మహిళలు, ఆధార్ నెంబర్ లేకపోతే 2017 మే 31 వరకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించుకోవాలని మార్చి 6న జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇటీవల జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈ గడువును సెప్టెంబర్ వరకు పెంచుతున్నట్టు పేర్కొంది. గతేడాది లాంచ్ చేసిన పీఎంయూవై స్కీమ్ కింద్ 5కోట్ల మంది పేద మహిళలు ఉచితంగా మూడేళ్లపాటు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్లను అందజేయనున్నారు. ఇప్పటికే 2.6 కోట్ల మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లను అందించారు.

అక్టోబరు నుండి ఈ-వేబిల్ అమలు

- ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం
- ఆర్థికమంత్రి యనమల ప్రతిపాదనలకు కౌన్సిల్ అంగీకారం

అమరావతి, ఆంధ్రప్రభ : ఒకే దేశం.. ఒకే పన్ను విధానాన్ని గత నెలరోజులుగా అమలు చేస్తున్న జిఎస్‌టి కౌన్సిల్ సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టికి సంబంధించిన పలు అంశాలపై సరవరణలను జిఎస్‌టి 20వ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. శనివారం ఢిల్లీలో జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో ఆదాయేతర అంశానికి సంబంధిన నిబంధనలను కౌన్సిల్ సవరించింది. అలాగే ఈఏడాది అక్టోబరు 1వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా ఈ-వేబిల్లును ప్రారంభించాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు ఈ-వేబిల్లుకు సంబంధించి కౌన్సిల్ ముందు ఉంచిన ప్రతిపాదనలను జిఎస్‌టి కమిటీ సభ్యులు ముక్తకఠంతో అంగీకారం తెలిపారు. ప్రభుత్వ కాంట్రాక్టు పనులపై విధించిన 18శాతం పన్నును 12 శాతానికి తగ్గిస్తూ జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నాపరాళ్లపైనా కౌన్సిల్ కనికరం ప్రదర్శించి 18 శాతం ఉన్న పన్నును కేవలం 5శాతానికి తగ్గించాలని నిర్ణయించింది. చింతపండుపైనా పన్నును 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించాలని తీర్మానించారు. రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు ఈ-వేబిల్లుకు సంబంధించి రూ.50 వేలకు మించిన వాణిజ్య వ్యాపార లావాదేవీలకు మాత్రమే ఈ-వేబిల్లు తప్పనిసరిగా ఉండాలన్న ప్రతిపాదనపై జిఎస్‌టి కౌన్సిల్ ఏకగ్రీవంగా అంగీకరించింది. అలాగే మత్స్యకారులు ఎంతో కాలంగా ఎండుచేపల విషయంలో పన్నుశాతం తగ్గించాలని చేస్తున్న డిమాండ్‌తో పాటు టెక్స్‌టైల్స్, చేనేత వస్త్రాలు, ట్రాక్టర్లు, గ్రానైట్‌శ్లాబ్స్, పొగాకు, తయారు కాని పొగాకు, విలాసవంతమైన కార్ల విషయంలో ప్రస్తుతం జిఎస్‌టి నిర్ణయించిన పన్ను విధానమే కొనసాగుతుందని, ఈ అంశాలపై 21వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని నిర్ణయించింది.



జియోకి ధీటుగా ఎయిర్‌టెల్ ఆఫర్

న్యూఢిల్లీ : టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ యూజర్లకు ఓ కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ అచ్చం రిలయన్స్ జియో ప్లాన్ రూ.399 మాదిరిగానే ఉంది. ఎయిర్‌టెల్ శనివారం ప్రకటించిన స్పెషల్ ఆఫర్ కింద రూ.399కి రోజుకు 1జీబీ డేటాను 84 రోజుల పాటు తన ప్రీపెయిడ్ యూజర్లకు అందించనున్నట్టు తెలిపింది. ఎయిర్‌టెల్ వెబ్‌సైట్ ప్రకారం ఈ ఆఫర్ కేవలం 4జీ సిమ్‌తో 4జీ హ్యాండ్‌సెట్ వాడేవారికేనని తెలిపింది. ఈ ఆఫర్‌నుఓ స్పెషల్ కోసం, కమర్షియల్ లేదా ఎంటర్‌ప్రైజ్ ఉద్దేశంతో అందుబాటులో ఉంచడం లేదని, ఏ ఇతర ప్లాన్‌తో దీనిని కలపవద్దని ఎయిర్‌టెల్ స్పష్టం చేసింది. డేటాతోపాటు ఈప్లాన్‌లో అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకునే సౌకర్యం ఉంది.

అంతేకాదు మరో ప్లాన్‌ను కూడా ఎయిర్‌టెల్ ఆఫర్ ఇస్తోంది. రూ.244తో రీచార్జ్ చేసుకుంటే 70 రోజులపాటు రోజుకు1జీబీ డేటాను అందించనున్నట్టు పేర్కొంది. ఈ ఆఫర్ కింద కేవలం ఎయిర్ టెల్ నెట్‌వర్క్ కస్టమర్లకు మాత్రమే ఉచిత కాల్స్ చేసుకునే సదుపాయముంటుంది. టెలికాం రంగంలో సంచలనాలుసృష్టిస్తున్న రిలయన్స్ జియోకి కౌంటర్ ఇచ్చేందుకు టెలికాం దిగ్గడాలు ప్లాన్లను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్, వొడాఫోన్, ఐడియా, ఎయిర్‌సెల్ వంటి సంస్థలు తమ యూజర్లను కాపాడుకోవడానికి కొత్త ఆఫర్లను ప్రకటిస్తూనే ఉన్నాయి. జియో తెరతీసిన ధరల యుద్ధంలో టెలికాం కంపెనీలు సతమతమవుతున్నాయి. టెలికాం దిగ్గజం ఎయిర్‌టెల్, ఐడియా కంపెనీలు భారీగా కుదేలవుతున్నాయి.గత నెలలో జీరోకే జియో ఫోన్‌ను లాంచ్ చేసి, పోటీ వాతావరణాన్ని మరింత పెంచింది జియో.


స్మార్ట్ వాచ్ నుంచే కాల్స్

- యాపిల్ సరికొత్త ఆవిష్కరణ



న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీదారు యాపిల్ తాను తీసుకురాబోతున్న స్మార్ట్ వాచ్‌లో కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. ఇకపై ఫోన్ అవసరం లేకరుండానే స్మార్ట్ వాచ్ నుంచే నేరుగా కాల్స్‌ను చేసుకునే వెసులుబాటు అందులో కల్పిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం స్మార్ట్ వాచ్‌లో ఎల్‌టీఈ చిప్స్‌ను అమర్చనున్నారు. ఇప్పటి వరకు యాపిల్ స్మార్ట్ వాచ్‌లకు ఐఫోన్‌ను అనుసందానం చేస్తేనే సందేశాలు పంపడంగానీ, డైరెక్షన్లను పొందడం గానీ వీలుంటుంది. యాపిల్ తయారీ చేయబోయే ఈ వాచీలకు ఇంటెల్ కార్పొరేషన్ ఎలీటీఈ మోడెమ్స్‌ను సరఫరా చేయనుంది.దీనిపై అటు ఇంటెల్ గానీ, యాపిల్ నుంచి గానీ ఎలాంటి అధికారికప్రకటన వెలువడకపోవడం గమనార్హం.

వాట్సాప్ వెర్షన్‌లో జియో ఫోన్!



న్యూఢిల్లీ: జియో నుంచి ఫీచర్ ఫోన్ వస్తుండటంతో చాలామంది దానిపై ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ప్రకటన వెలువడిన నాటితో పోలిస్తే ప్రస్తుతం దానిపై అంతకంతకూ ఆసక్తి తగ్గుతున్నట్టు సమాచారం. నెట్ బ్రౌజింగ్, ఫోన్ కాల్స్ అందుబాటులో ఉండే ఈ ఫోన్‌లో అందరికీ చేరువైన వాట్సాప్, ఫేస్‌బుక్ యాప్స్ లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. దీంతో జియో ఆ దిశగా దృష్టి సారించింది. కొత్తగా తీసుకొస్తున్నజియో ఫోన్‌లో పనిచేసే విధంగా వాట్సాప్ కొత్త వెర్షన్‌ను తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం జియో తీసుకొస్తున్న ఓఎస్‌లో వాట్సాప్ సౌకర్యం లేదు. దీంతో ఈ ఫోన్‌లోనూ వాట్సాప్ పనిచేసే విధంగా కొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం జియో ఫేస్‌బుక్‌తో సంప్రదింపులు జరుపుతోంది. అయితే ఈ చర్చలుప్రస్తుతం ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, సాంకేతికంగా ఇదో సవాల్ అని జియోకు చెందిన విశ్వసనీయవర్గాలు తెలిపాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే త్వరలో తీసుకువచ్చే జియో ఫోన్‌లో వినియోగదారులకు కావాల్సిన అన్నిప్రాథమికఫీచర్లు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఈఫోన్‌కు ఈ నెల 15 నుంచి టెస్టింగ్ నిర్వహించనుంది. 24 నుంచి ప్రీ బుకింగ్స్ ప్రారంభించి సెప్టెంబర్‌లో పూర్తి స్థాయిలో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానుంది.



ఐఫోన్ ఎస్ఈపై రూ.7వేల తగ్గింపు!

న్యూఢిల్లీ : భారత్‌లో ఆపిల్ ఐఫోన్ కొనేందుకు ఇదే మంచి తరుణం.ఐఫోన్ ఎస్ఈ 32 జీబీ మోడల్ ఫోన్ పేటీఎం ఆన్‌లైన్ స్టోర్‌లో రూ.22,990కే లభిస్తోంది. దీనికితోడు పేటీఎం రూ.3వేల క్యాష్ బ్యాక్ ఆఫర్ చేస్తోంది. అంటే ఈ ఫోన్‌ను పేటీఆర్ ద్వారా రూ.19,990కే కైవసం చేసుకోవచ్చు.నిజానికి పేటీఎంమాల్‌లో ఐఫోన్ ఎస్ఈ ధర రూ.27,200. కంపెనీ 15శాతం ఫ్లాట్ డిస్కౌంట్‌తోపాటు రూ.3వేల క్యాష్ బ్యాక్ ఇస్తుండటంతో ధర గణనీయంగా తగ్గింది. ఐఫోన్ ఎస్ఈలో 4 అంగుళాల రెటీనా డిస్‌ప్లే, 12 మెగాపిక్సల్ రియర్ కెమెరా, ఫింగర్ ప్రింట్ సెన్సార్ తదితర ఫీచర్లున్నాయి. ఈ ఫోన్‌పై పేటీఎం రూ.9వేల బైబ్యాక్ గ్యారంటీ ఆఫర్ కూడా ప్రకటించింది.

బీఓబీ సేవింగ్స్ ఖాతాపై వడ్డీ రేట్లలో కోత

న్యూఢిల్లీ: సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్లలో డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటు అరశాతం తగ్గిస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రకటించింది. ఇప్పటివరకు రూ.50 లక్షలలోపు ఉండే ఎస్‌బీ అకౌంట్లపై బ్యాంకు 4శాతం వడ్డీ చెల్లిస్తోంది. శనివారం నుంచి దీనిని 3.50 శాతానికి తగ్గించింది. రూ.50లక్షలకు మించిన ఎస్‌బీ ఖాతాలపై మాత్రం 4శాతం వడ్డీ కొనసాగుతోంది. ఎస్‌బీఐ తర్వాత బ్యాంక్ ఆఫర్ బరోడానే ఎస్‌బీ ఖాతాలపై వడ్డీ రేటు తగ్గించింది. త్వరలో మరిన్ని బ్యాంకులు ఇదే బాట పడతాయని భావిస్తున్నారు.

డెల్ ఉద్యోగులకు వార్నింగ్



న్యూఢిల్లీ: లే ఆఫ్స్ బెడదతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఐటీ ఉద్యోగులను డెల్ సీఈవో, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బస్కు అయ్యర్ హెచ్చరించారు. ప్రస్తుతం టెక్నాలజీలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని, ఎవరికి వారు రీ స్కిల్ అవుతూ ఉండాలన్నారు. లేకపోతే ఐటీ ఉద్యోగాన్ని వీడి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరించారు. తమ ఐటీ ఉద్యోగులంతా లేఆఫ్స్ బెడద ప్రమాదం బారిన పడకుండా, రెవెన్యూలను ఆర్జించడానికి ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దబడాలని భరోసా వ్యక్తం చేశారు. రాబోయే స్కిల్స్‌ను నేర్చుకోవాల్సిన బాధ్యత ఉద్యోగుల్లోనే ఉందని, అది ఆర్గనైజేషన్‌కు సంబంధించింది కాదంటూ అయ్యర్ పేర్కొన్నారు. ఏ ఆర్గనైజేషన్ కూడా రీస్కిలింగ్ అందించదని, ఎందుకంటే ఉద్యోగులకు ఏం శిక్షణ ఇవ్వాలో వారికే తెలియదన్నారు. ఐటీ ఉద్యోగులు తమ భవిష్యత్‌ను అంచనా వేసుకొని, దానికి అనుగుణంగా ఎప్పటికప్పుడూ తమ స్కిల్స్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ ఉండాలని సూచించారు. కొత్త టెక్నాలజీలను టెకీలు వాడుతూ, వాటిని తెలుసుకొని ఉండాలన్నారు. ప్రస్తుతం కొత్త టెక్నాలజీలు ఐటీ కంపెనీలు రెవెన్యూలను ఆర్జిస్తున్నాయి. సంప్రదాయ ఐటీ కంపెనీల్లో ఉన్న సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ మెయింటనెన్స్‌లలో తక్కువ వ్యాపారం కొనసాగుతోంది. దీంతో కొత్త టెక్నాలజీలకు కచ్చితంగా రీస్కిలింగ్ అవసరం పడుతుందని, ఒకవేళ రీస్కిల్ చేసుకోలేని ఉద్యోగులు కచ్చితంగా ఉద్వాసనకు గురవుతారని అయ్యర్ హెచ్చరించారు.

నీతి ఆయోగ్‌కు కొత్త సారథి



న్యూఢిల్లీ : నీతి ఆయోగ్‌కు పనగారియా వారసుడిగా ఆర్థికవేత్త రాజీవ్ కుమార్ నియమితులయ్యారు. నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా ఆయనను నియమించారు. బనారస్ హిందూ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అయిన రాజీవ్ కుమార్ లక్నో యూనివర్‌ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో డీ.ఫిల్ పూర్తి చేశారు. 1995లో ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లో పనిచేశారు. పదేళ్లపాటు పలు సీనియర్ పదవులు నిర్వహించారు. 2004లో కాన్ఫెడలేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ చీఫ్ ఎకనామిస్ట్‌గా పనిచేశారు. 2006 నుంచి 2008 వరకూ నెషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డ్ సభ్యుడిగా కొనసాగారు. ట్రాయ్ సభ్యుడిగా కూడా పనిచేశారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖలో ఆర్థిక సలహాదారుడిగా సేవలందించారు.



బీఎస్ఎన్ఎల్ రక్షాబంధన్ ఆఫర్


న్యూఢిల్లీ : బీఎస్ఎన్ఎల్ రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రీ పెయిడ్ వినియోగదారులకు నూతన ఆఫర్లను ప్రకటించింది. ఎస్టీవవీ-74, ఎస్టీవీ -188, ఎస్టీవీ -289, ఎస్టీవీ -389 రకాల ఆఫర్లను ప్రకటించింది. వీటిలో ఎస్టీవీ-74 ఐదు రోజుల కాలపరిమితితో పాటు 1జీబీ డేటా, 74 నిమిషాల వాయిస్ కాల్స్, అన్‌లిమిటెడ్ కాల్స్ వర్తిస్తాయి. అదేవిధంగా ఎస్టీవీ-188తో టాక్ టైం రూ.189తోపాటు మెయిన్ బ్యాలెన్స్‌లో రూ.31, 1జీబీ ఫ్రీ డేటా, 14 రోజుల కాలపరిమితి, ఎస్టీవీ -289తో టాక్‌టైం 289తోపాటు మెయిన్ బ్యాలెన్స్‌లో రూ.51, 1జీబీ ఫ్రీ డేటా, 28 రోజుల కాలపరిమితి, ఎస్టీవీ -389తో టాక్‌టైం రూ.389తోపాటు మెయిన్ బ్యాలెన్స్‌లతో రూ.71, 1జీబీ ఫ్రీ డాటా 30 రోజుల కాలపరిమితి లభిస్తోందని పేర్కొంది.

వాట్సాప్‌లో సరికొత్త స్టేటస్ ఫీచర్



న్యూఢిల్లీ : ప్రముఖ మేనేజింగ్ యాప్ వాట్సాప్ మరో సరికొత్త ఫీచర్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురాబోతోంది. ఇటీవల వాట్సాప్‌కు సంబంధించిన అనేక కొత్త ఫీచర్ల సంగతులు బయటికొచ్చాయి. వీడియో కాల్‌లో ఇమేజ్ ఇన్ మోడ్ స్టిక్కర్లు పంపుకునే సౌలభ్యం, టెక్ట్స్ కొత్త ఎఫెక్ట్స్ జోడించేలా ఫీచర్ల వంటివి కొన్ని పరిశీలన దశలో ఉండగా మరికొన్ని త్వరలో అందుబాటులోకి రానున్నాయి. తాజాగా ఫేస్‌బుక్ తరహాలో వాట్సాప్‌లోనూ రంగురంగుల బ్యాగ్రౌండ్‌తో స్టేటస్ పెట్టుకోవచ్చు. ఇందులో ఫేస్‌బుక్ తరహాలో ఫాంట్ ఎమోజీలను ఉపయోగించడం, బ్యాగ్రౌండ్ మార్చుకోవడం వంటి ఫీచర్లను అందుబాటులోకి తీసుకురాబోతోంది. ప్రస్తుతం ఈ ఫీచర్ పరిశీలన దశలో ఉంది. ఆండ్రాయిడ్ బేటా వెర్షన్ 2.17.291లో ఈ కొత్త ఫీచర్‌ను జోడించినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతానికి ఇది కొంతమంది ఎంపిక చేసిన వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉందని సమాచారం. స్టేటస్‌లో ఏదైనా టెక్ట్స్ రాశాక నచ్చిన కలర్ బ్యాగ్రౌండ్ పెట్టడం, ఫాంట్ స్టయిల్ మార్చడం, ఎమోజీలను జోడించడం వంటివి ఈ ఫీచర్ ద్వారా చేయొచ్చు.

గడువు ముగిసినా ఐటీ రిటర్నులు దాఖలు చేయడమెలా?



న్యూఢిల్లీ : ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్‌లు దాఖలు చేయడానికి శనివారంతో గడువు ముగిసింది. అయినా ఆదాయపన్ను రిటర్న్‌లు దాఖలు చేయలేదా? ఇబ్బంది పడాల్సిన పనలేదు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి గాను ఆగస్టు 5 తర్వాత కూడా ఐటీఆర్ ఫైల్ చేయొచ్చు. అయితే సెక్షన్ 139 (1) ప్రకారం చేసే రిటర్నుల ఫైలింగ్ కాస్తా 139(4) ప్రకారం చేయాల్సి ఉంటుంది.

ఏయే మార్గాల్లో ఆదాయాన్ని పొందారనే దానినిబట్టి ఐటీరిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. 2018 మార్చి 31లోపు ఐటీ రిటర్నులు సమర్పించవచ్చు. టీడీఎస్ పోనూ మీరు ఇంకా పన్ను చెల్లించాల్సి వస్తే నెలకు 1శాతం చొప్పున పెనాల్టీ కట్టాల్సి ఉంటుంది. ఐటీఆర్‌ను రెండు రకాలుగా ఫైల్ చేయొచ్చు. ఒకటి ఆన్‌లైన్‌కాగా.. ఎక్స్‌ఎల్ లేదా జావా యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకొని, వాటిలో వివరాలను నింపి అప్‌లోడ్ చేయడం రెండోది.

ఆడపిల్ల చదువు ఇంటికే అందం

హోంమంత్రి నాయిని నరసింహా రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆడపిల్ల విద్యావంతురాలైతే ఇంటికి అందం వస్తుందనీ, తద్వారా కుటుంబ సభ్యులు చైతన్యవంతులై వారి జీవితాల్లో వెలుగులు వస్తాయని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆడపిల్లకు విద్యాబుద్ధులు నేర్పిస్తే ఆమె తన వారసులను కూడా సభ్యత, క్రమశిక్షణతో పెంచుతుందని, ఇది సామాజిక ప్రగతికి ఎంతో దోహద పడుతుందని ఆయన అన్నారు. ప్రతి తల్లితండ్రి ఆడపి ల్లలను ప్రోత్సహించి వారిని ఉన్నత విద్యావంతులను చేసి సమాజాభివృద్ధికి కృషి చేయాలని హోంమంత్రి పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్త, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు దివంగత బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ఆయన నగదు పురస్కారం అందజేశారు. రాష్ట్రంలో పాఠశాల స్థాయి నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ వరకు అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతిభావంతులకు పిత్తి ట్రస్టు ద్వారా 1500 మందికి రూ.75 లక్షల నగదు ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో పిత్తి ట్రస్టు చైర్మన్ శరద్ బి.పిత్తి, ట్రస్టు సభ్యులు అక్షయ పిత్తి, శరత్ గుప్తా కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయిని



మాట్లాడుతూ, ఆడపిల్లలను విద్యావంతులను చేయడం, 18 ఏళ్ళ తర్వాత వివాహం చేసుకుంటే కళ్యాణలక్ష్మీ పథకం కింద వారికి రూ.75,116 నగదు, వారి రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఆడపిల్లలను వేధించే వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల ముందే కౌన్సెలింగ్ చేస్తున్నామని, రెండోసారి అదే తప్పు చేస్తే చంచల్‌గూడ జైలుకు పంపిస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 100 షీ టీమ్స్ ఏర్పాటు చేశామని, సివిల్ డ్రెస్‌లో ఉండే పోలీసులు మార్కెట్లు, మాల్స్, సినిమా హాల్స్, కాలేజీలు, బస్టాప్‌లు, చౌరస్తాలలో ఉంటారని హోంమంత్రి తెలిపారు. తన రాజకీయ జీవితం బద్రి విశాల్ పిత్తితోనే ఆరంభమైందని, ఆయన ఆశిస్సులతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని హోంమంత్రి చెప్పారు. సోషలిస్టు పార్టీ కార్యకర్తగా ఉన్న తనను దేవరకొండ నుంచి హైదరాబాద్‌కు పిలిపించి ప్రోత్సహించారని, అప్పటి నుంచి తాను ఆయన శిష్యుడిగా ఉంటూ కార్మిక నేతగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. బద్రి విశాల్ పిత్తిని గురువుగా గౌరవించి ఆయన వెంటే నడిచానని నాయిని నర్సింహారెడ్డి చెప్పారు. ఎంతో సంపన్నుడైన బద్రి విశాల్ కార్మికపక్షాన నిలిచేవాడని, వారిలో ఒకరిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పనిచేశారని చెప్పారు. సామాజిక సేవ కోసం ఆయన సంపదను ఎంతో ఖర్చు చేశారని చెప్పారు. తెలంగాణ కోసం ఆయన ఎన్నో ఉద్యమాలు చేశారని, 1969లో జరిగిన ఉద్యమంలో ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధించారని హోంమంత్రి గుర్తుచేశారు.

సామాజిక సేవకు ఏటా 2 కోట్లు : శరద్ పిత్తి

బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్టు ఏటా రూ.2 కోట్లు సామాజిక సేవకు ఖర్చు చేస్తోందని ఈ ట్రస్టు చైర్మన్ శరద్ పిత్తి తెలి పారు. ఇందులో రూ.75 లక్షలు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌కు అందిస్తున్నామని వివరించారు. అంతేగాక కృత్రిమ అవయవాల ఏర్పాటుకు ఆర్థికసాయం, 500 కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు, చికిత్స చేయిస్తున్నామని ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంగా ఏటా 1500 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని శరద్ పిత్తి తెలిపారు.

పోరాటాలకు రూపకల్పన చేయాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : కమ్యునిస్టు పార్టీ కార్యకర్తలుగా గ్రామాల్లోని సమస్యలు ఒడిసిపట్టి పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీ ఎం పోలి ట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు సూచించారు. వచ్చే ఏడాది జరగనున్న పార్టీ అఖిల భారత మహాసభలు, రాష్ట్ర సభలు జరు గుతాయని, అంతకు ముందే రైతులు, వ్యవ సాయ కార్మికుల సమస్యలపై లోతైన అధ్య యనం చేయాలన్నారు. ఆ తర్వాత సమస్యల పరిష్కారానికి పోరాటాల రూపకల్పన చేయాలని పార్టీ నేతలకు వివరించారు. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొడెపుడి వెంకటేశ్వరరావు 20 వర్ధంతి సభను పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు ప్రజా నాయకుడిగా రాష్ట్రానికి విశేష సేవలు అందించారన్నారు. తెలంగాణ రైతాంగ పోరటంలో పాల్గొన్నారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యునిస్టు అనే వాడికి ప్రజలతో సంబంధాలు ఉండటమే కీలకమన్నారు. ప్రజలతో సంబంధాలు లేనప్పుడు పదవులు ఉన్నా లేనట్లేనని చెప్పారు.

రాయ్‌పూర్‌లో పర్యాటక రోడ్‌షో



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రారంభమైన ఈ ఈవెంట్ ఆదివారం ముగియనుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ వర్గాలు తెలిపాయి. 80ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు ఇందులో పాల్గొన్నారు. ఛత్తీస్‌గడ్ పర్యాటక శాఖా మంత్రి దయాళ్‌దాస్ బాగల్, కార్యదర్శి నీహారిక బరిక్ సింగ్, ఎండి ఎంటి నంద్య, తెలంగాణ టూరిజం కమిషనర్ సునిత ఎం.భగత్, ఈడి బి.మనోహర్ పాల్గొన్నారు.

నిర్మాణరంగ

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో నిర్మాణ పనుల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని కూడా రెగ్యులరైజ్ చేయాలని అసెంబ్లీ బీజేపీ పక్షనేత జి.కిషన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కిషన్ రెడ్డి శనివారం విద్యు త్‌సౌధలో ట్రాన్స్‌కో, జన్కో సంస్థల సీఎండీ ప్రభాకర్ రావును కలిశారు. ఇటీవల సీఎం 20903 మంది కాంట్రాక్టర్లను పర్మినెంట్ చేస్తూ వారికి కల్పిస్తున్న సౌకర్యాల్లాగే మిగి లిన నాలుగువేల మంది కార్మికులకు కూడా కల్పించాలన్నారు. నిర్మాణ కార్మికులుగా గత 15ఏళ్లనుంచి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. ప్రస్తుతం 7వ దశలో పనిచేస్తున్న కార్మికులకు ఇతర కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన సౌకర్యాలు , వేతనాలు చెల్లించి పేద కార్మిక కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కిషన్‌రెడ్డి ఈ మేరకు సీఎండి ప్రభాకర్ రావుకు విజ్ఞప్తి చేశారు.


8న మెగా కెమిస్ట్రీ జాబ్ మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీ హానర్ ల్యాబ్స్ లిమిటెడ్, హెచ్‌ఆర్ స్క్వేర్ సంయుక్తంగా మెగా కెమిస్ట్రీ ఉద్యోగ మేళాను ఈనెల 8న నిర్వహించనున్నామని హెచ్‌ఆర్ స్క్వేర్ సీనియర్ మేనేజర్ అనిత తెలిపారు. ప్రొడక్షన్ కెమిస్ట్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం నిర్వహిస్తున్న ఈ మెగా ఉద్యోగ మేళలో మొత్తం 260 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. గత మూడేళ్ళలో బీఎస్సీ లేదా ఎంఎస్సీ కెమిస్ట్రీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే ఈ మెగా జాబ్‌మేళాలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగమేళలో ఎన్నికైన అభ్యర్థులకు నెలకు రూ.9వేలు వేతనంతో పాటు ఉచిత భోజన, హాస్టల్ వసతి కల్పిస్తామని ఆమె చెప్పా రు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8న మియాపూర్‌లోని ఫా ర్మా పాఠశాల స్కిల్ డెలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే కెమిస్ట్రీ ఉద్యోగ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు.

జగన్ వ్యాఖ్యలపై నోటీసులు జారీ

అమరావతి – ఆంధ్రప్రభ : ఎట్టకేలకు వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ స్పందించింది. నంద్యాల బహిరంగసభలో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడుపై తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు వైసీపీ అధినేత జగన్‌పై టీడీపీ నాయకులు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయమై టీడీపీ మంత్రులు, నాయకులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.నంద్యాల సభలో జగన్ ముఖ్యమంత్రి ప్రతిష్టతను దిగజార్చుతూ వ్యాఖ్యలు చేయడమే కాకుండా హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడినట్లు టీడీపీ శ్రేణులు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాయి. దీంతో కమిషన్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్నట్లు ఎన్నికల శనివారం ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఏం జరిగిందో నివేదిక ఇవ్వాలని కర్నూలు జిల్లా కలెక్టర్,రిటర్నింగ్ అధికారి అయిన సత్యనారాయణకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. వెంటనే జిల్లా కలెక్టర్ కూడా జగన్‌కు నోటీసులు జారీ చేశారు.

చేనేతకు ఏపీ సర్కార్ చేయూత



అమరావతి, ఆంధ్రప్రభ: సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చేనేతకు చేయూతనిచ్చేందుకు ఇప్పటికే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా చేనేత వృద్ధాప్య పింఛన్‌ను రూ. 200 నుంచి రూ. 1000కి పెంచింది. అంతేకాకుండా ఇప్పటి వరకు రూ.85 కోట్ల రుణమాఫీ చేసి ఆర్థిక చేయూతను అందించింది. వ్యవసాయం తరువాత అధికంగా చేనేతపైనే అధారపడి అనేక కుటుంబాలు ఉన్నట్లుగా ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో 2.5లక్షల మంది చేనేత కార్మికులు రైతు కూలీల కన్నా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా చేనేత కార్మికుల ప్రయోజనాలకై కేంద్ర ప్రభుత్వం సామూహిక సదుపాయాల కేంద్రాలు, శిక్షణ, డైయింగ్ యూనిట్లు, డిజైన్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ వినియోగానికి బ్లాక్ స్థాయిలో గ్రూపులను ఏర్పాటు చేసి రూ.2కోట్లను కేటాయించింది. ఇటువంటి 17 క్లస్టర్లను రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఉన్న 25వేల మంది చేనేత కార్మికులను ఆదుకునేందుకు సమీకృత చేనేత సమూహాల అభివృద్ధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలు చేయనుంది. ఈ రెండు జిల్లాల్లోనే 31 సిఎఫ్‌సిలు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా చేనేత కార్మికుల కోసం పొదుపు పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో కార్మికుడు 8శాతం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా మరో 8శాతాన్ని చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని త్రిఫ్ట్ ఫండ్ ఖాతాలో జమచేస్తారు. 2016-17 సంవత్సరానికి సంబంధించి రూ. 267.89లక్షలు 2,298 మంది చేనేత కార్మికులకు పొదుపు మొత్తం నుంచి రుణాలు అందచేశారు.

చేనేత కార్మికులకు వృద్ధాప్య పింఛనులు

పూట గడవని స్థితిలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకొని వారికి సమాజిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో వృద్ధ కార్మికులకు పింఛన్ పథకాన్ని రాష్ట్రప్ర భుత్వం ప్రవేశపెట్టింది. గతంలో రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 1000కి పెంచింది. 2016-17కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 73,368 మంది చేనేత కార్మికులు ఈ ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఇది కాక 2017-18 సంవత్సరంలో అదనంగా మరో 25 వేల మందికి వృద్ధాప్య పింఛన్‌లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన

చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ బునకర్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించింది. చేనేత కార్మికులు రూ. 80లు చెల్లిస్తే బీమా సౌకర్యంతో పాటు వారి కుటుంబంలో ఇద్దరు పిల్లలు చదువుకునేందుకు ఉపకార వేతనాలు కూడా అందజేస్తారు. ప్రమాద వశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం సంభవించినా రూ. 5లక్షల పరిహారం చెల్లిస్తారు. సాధారణ మరణం, పాక్షిక అంగవైకల్యానికి కూడా పరిహారం అందిస్తారు.

రుణమాఫీ పథకం

అప్పుల ఊబిలో చిక్కుకున్న చేనేత కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని అమలు చేసింది. ఇప్పటి వరకు 23,897 మంది చేనేత కార్మికులు రూ. 85కోట్ల లబ్దిని పొందారు. వీటిలో 527 స్వయం సహాయక గ్రూపులు కూడా ఉన్నాయి. 2014 నుంచి 2016 సెప్టెంబర్ వరకు ఉన్న వడ్డీని సైతం ప్రభుత్వం మాఫీ చేసింది.

ముద్ర స్కీం

మైక్రోయూనిట్ డెవలప్‌మెంట్ రీ ఫైనాన్స్ ఏజెన్సీ (ముద్ర) పథకం ద్వారా బ్యాంక్‌లు, చేనేత పారిశ్రామిక వేత్తల నుంచి కార్మికులకు రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నూలు ఉత్పత్తులకు రూ. 50వేలు, సిల్క్ ఉత్పత్తులకు లక్ష రూపాయలు, గ్రూపులకు రూ. 5లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నారు. ప్రాజెక్టు ఖర్చులో 20 శాతం సబ్సిడీ ఇస్తారు.

రాజమండ్రి–విశాఖ రైళ్ల వేళల్లో మార్పులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాజమండ్రి - విశాఖపట్టణం - రాజమండ్రి మెమ్యూ రైళ్ల వేళల్లో మార్పులు జరిగాయి. ఆదివారం నుంచి మారిన వేళలు అమలులోకి వస్తాయి. రైలు నంబర్ 67295 రాజమండ్రి - రవికం పాడు రైలు రాజమండ్రిలో 11.15 గంటలకు బయలుదేరుతుంది. 67247 రవికంపాడు - విశాఖపట్టణం రైలు రవికంపాడులో 13.15 గంటలకు, రైలునంబర్ 67296 విశా ఖపట్టణం - తుని రైలు విశాఖపట్టణంలో 18.20 గంటలకు బయ లుదేరుతుందని దక్షిణమధ్యరైల్వే (దమరై) ప్రధాన పౌరసంబంధాల అధికారి ఎం ఉమాశంకర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా 67248 నంబర్ గల రైలు తుని నుంచి 20.45 గంటలకు రాజమండ్రి బయలుదేరుతుంది.

ఆరేకటిలను ఎస్సీ జాబితాలో చేర్చాలి



హై ద రాబాద్ ,ఆం ధ్ర ప్ర భ: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆరెకటికలను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆరే కటిక పోరాట సేవా సమితి డిమాండ్ చేసింది. తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10 నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కళ్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి తెలి పారు.ఆరెకటికలు దేశంలో కొన్ని రాష్ట్రా ల్లో ఎస్సీ జాబితాలోనూ మరికొన్ని రాష్ట్రా ల్లో బీసీ-ఏ జాబితాలోనూ కొనసా గుతున్నారని తెలిపారు. కానీ 15 లక్షల జనాభా ఉన్నత తాము మాత్రం తెలంగాణ రాష్ట్రంలో బీసీ- డీ జాబితాలో కొనసాగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గం నుంచి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఒక్కరు క ూడా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా ఎన్నిక కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత వెనుకబడిన కులాల వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు.

ఇప్పటి వరకు తమ సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యేక ఫెడరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వీడు మామూలోడు కాదు

● ఖరీదైన జీవితం...ఓల్డ్ సిటీ గర్ల్‌తో వివాహం ● సిట్ కస్టడీలో వెల్లడవుతున్న నిజాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న నెదర్లాండ్స్‌కు చెందిన మైక్ కమింగా సిట్ కస్టడీలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడి చేస్తున్నట్లు సమాచారం. కాల్విన్ కంటే మైక్ కమింగానే డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా ఎక్సైజ్ సిట్ భావిస్తోంది. డ్రగ్స్ వ్యవ హారంలో సినీ నటి ఛార్మిని విచారించిన రోజునే మైక్ కమింగాను సిట్ అధికారులు అరెస్టు చేశారు. గడిచిన ఏడేళ్లుగా హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న మైక్ కమిం గా పాతబస్తీ యువతిని ప్రేమ వివాహం చేసుకుని నాన క్‌రాంగూడలోని ఒక అపా ర్టుమెంట్‌లో ఫ్లాట్ తీసుకుని కాపురం చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి మూడేండ్ల కుమారుడు కూడా ఉన్నాడు. నెదర్లాండ్స్ నుంచి ఖరీదైన డీఎంటీ డ్రగ్స్ (డీమిథైల్ ట్రిప్టమైన్)ను కాలేజీ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ నిపుణులకు విక్రయించేవాడని వెలుగు లోకి వచ్చింది. డ్రగ్స్ విక్రయాలతో వచ్చిన డబ్బుతో ఖరీదైన జీవితం గడుపుతూ జల్సాలు చేస్తున్నట్లు గుర్తించారు. మైక్ కమింగాను అరెస్టు చేసిన రోజునే కమింగా వద్ద నుంచి 2.6 గ్రాముల డీఎంటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ అత్యంత ఖరీదైనదనీ, ఒక్కో యూనిట్ రూ.4 వేల నుంచి ఐదు వేల వరకూ ఉంటుందని తెలుస్తోంది. తొలుత డ్రగ్స్ కేసులో సూత్రధారిగా కాల్విన్‌ని భావించిన సిట్ అధికారులకు తర్వాత నెదర్లాండ్స్‌కు చెందిన మైక్ కమింగా పట్టుబడ్డాడు. డ్రగ్స్ మాఫియా డాన్ మైక్ కమింగాయేనని సిట్ అధికారులు పసిగట్టారు. హైద రాబాద్‌లోనే ఉంటూ నెదర్లాండ్స్ నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి ఇక్కడి సంపన్నులని భావించిన వారికి అందజేసేవాడని తెలుస్తోంది. మైక్ కమింగా ఫోన్ కాల్ డేటాను సైతం సిట్ అధికారులు పరిశీలించి మరింత లోతైన సమాచారాన్ని గ్రహించినట్లు తెలుస్తోంది. నటి ఛార్మి విచారణ రోజునే మైక్ కమింగా పట్టుబడటం వెనుక మైక్ కమింగా సమాచారం ఛార్మి సిట్ అధికారులకు అందించి ఉండవచ్చని అంటు న్నారు. మైక్ కమింగాకు సినీస్టార్స్‌తో పరిచయాలు ఎక్కువేనని.. ఈ క్రమంలో పలు వురు సినీ ప్రముఖులకు మైక్ కమింగా డ్రగ్స్ సరఫరా చేసి ఉంటాడని సిట్ అను మానిస్తోంది. మైక్ కమింగా నుంచి విలువైన సమాచారాన్ని సిట్ సేకరి స్తుండటంతో మైక్ కమింగాతో సన్నిహితంగా మెసిలిన కొందరు సినీస్టార్స్ హడ లెత్తి పోతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మైక్ కమింగా ఓ సంస్థను నెలకొల్పి వంద మందికిపైగా ఉపాధి కల్పించాడని తెలు స్తోంది. పలుమార్లు నెదర్లాండ్స్ వెళ్లి వచ్చి నట్లుగా సిట్ అధికారులు గుర్తించారు. డైరెక్టుగా కాలేజీ విద్యార్థులకు, సాఫ్ట్‌వేర్ నిపు ణులకు సైతం డ్రగ్స్‌ను అందించేవాడని, ఇక టాలీవుడ్‌లో కొందరు సినీ ప్రముఖులు సైతం కమింగా డ్రగ్స్‌ను అందించాడన్న ప్రచారం సాగుతోంది. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకున్న సిట్ అధికారులు డ్రగ్స్ మాఫియా డాన్ మైక్ కమింగాను కస్టడీకి తీసుకుని మరీ విచారణ కొన సాగిస్తున్నారు. మొన్న కాల్విన్, నిన్న లేడీ డాన్ సంగీత, నేడు మైక్ కమింగా విచార ణలలో ఆసక్తికర విష యాలు సిట్ అధికారులకు లభ్యమవుతున్నట్లు సమాచారం. వీరిచ్చిన సమాచారం ఆధా రంగా డ్రగ్స్ బానిసలైన వారిని సిట్ బృందాలు గుర్తించి వారిని విచారించడంతో పాటు వారి రక్తనమూనాలను సైతం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. మైక్ కమింగా ఎంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను డ్రగ్స్ బానిసలుగా చేశారన్న దానిపై సిట్ అధికారులు సమగ్రసమాచారాన్ని సేకరించినట్లు సమాచారం.

ఆపరేషన్ గంజా సక్సెస్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గంజాయి మత్తు గమ్మత్తులో యువత చిత వుతున్న దృష్ట్యా గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని డీజీపీ రైల్వేస్ కృష్ణప్రసాద్ ఆదేశాలతో స్పెషల్ టీమ్‌లు రంగంలోకి దిగాయి. ఆపరేషన్ గంజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ప్రధాన రైళ్ల ద్వారా గంజాయి అక్రమ రవాణా కొనసాగుతుండటంతో వికారాబాద్, సికిం ద్రాబాద్, వరంగల్, కాజీపేట, డోర్నకల్ రైల్వే స్టేషన్లలో జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు స్పెషల్ టీమ్‌లు దాడులు కొనసాగించాయి. మొత్తం 13 కేసులు రిజిస్టర్డ్ అవ్వగా, 18 మంది నిందితులను అరెస్ట్‌చేశారు. అరెస్టయిన నిందితులలో ఒరిస్సా, యూపీ, ఏపీ, న్యూఢిల్లీకి చెందిన వారున్నారు. 55 లక్షల విలువచేసే 392 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులను కొనసాగిస్తున్నారు.

విక్రమ్‌గౌడ్
కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌ను నాలుగు రోజుల కస్టడీ ఇవ్వాలని కోరుతూ బంజారాహిల్స్ పోలీసులు నాంపల్లి కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. కాల్పుల డ్రామాలో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించింది విక్రమ్‌గౌడ్. ఈ కేసులో ఎ1 నిందితుడిగా విక్రమ్‌గౌడ్ ఉన్నారు. సానుభూతి కోసమే విక్రమ్‌గౌడ్ కాల్పుల డ్రామాను రక్తి కట్టించాడని పోలీసులు తెలిపారు. చివరికి తాను తీసిన గోతిలో తానే పడ్డాడు విక్రమ్‌గౌడ్. కాగా, విక్రమ్‌గౌడ్ నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని కస్టడీకి ఇవ్వాల్సిందిగా బంజారాహిల్స్ పోలీసులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు.

కంటైనర్ - టెంపో ఢీ
ఐదుగురు దుర్మరణం

● మృతుల్లో నలుగురు స్పెయిన్ దేశస్థులు ● 9 మందికి గాయాలు ● క్షతగాత్రులను బెంగుళూరుకు తరలింపు



తిరుపతి, కెఎన్‌ఎన్ బ్యూరో : జిల్లాలో మదనపల్లె- పుంగనూరు రహదారిలో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు స్పెయిన్ దేశస్థులతో పాటు ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. అనంతపురం నుంచి పాండిచ్చేరి వెళ్తున్న టెంపో ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 9 మందిని మెరుగైన చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. సంఘటన గురించి తెలియగానే చిత్తూరు నుంచి సంఘటనా స్థలానికి కలెక్టర్ ప్రద్యుమ్న, జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు తదితర సిబ్బంది అవసరమైన సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ రాజశేఖరబాబు కథనం ప్రకారం ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా వున్నాయి.అనంతపురం జిల్లాలోని బత్తలపల్లె కేంద్రంగా పనిచేసే ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు కార్యక్రమంలో పాల్గొనడానికి స్పెయిన్ దేశం నుంచి వచ్చిన 14 మంది శుక్రవారం రాత్రి పాండిచ్చేరికి టెంపో ట్రావెలర్ వాహనంలో బయలుదేరారు. శనివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో జిల్లాలోని మదనపల్లె- పుంగనూరు రహదారిలోని ఈడిగపల్లె దర్గా సమీపంలో వారు ప్రయాణిస్తున్న టెంపో ట్రావెలర్ వాహనం ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో టెంపోలో వున్న స్పెయిన్ దేశస్థులలో ఇద్దరు పురుషులు విసింటే పెరీజ్(50) ప్రాన్సిస్కో పెడ్రోసా(31),ఇద్దరు మహిళలు జోసెఫా మోరన్(65), లోపెజ్ నీవిస్(62)లతో పాటు స్థానిక స్థానిక డ్రైవర్ సాదిక్ ఆలీ(48) దుర్మరణం పాలయ్యారు.ఆ ఐదుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా ఇద్దరు ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయారు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 9 మందిని పుంగనూరు, మదనపల్లె ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. టెంపో వాహనం పూర్తిగా ధ్వంసం కాగా కంటైనర్ ముందుభాగం దెబ్బతిన్నదని, కంటైనర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు తగిలాయని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. ఇదిలా వుండగా సంఘటన గురించి తెలియగానే కలెక్టర్ ప్రద్యుమ్న, జిల్లా ఎస్‌పి రాజశేఖరబాబు, మదనపల్లె సబ్ కలెక్టర్ వెట్రిశెల్వి తదితర అధికారులు హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అత్యవసర సహాయక చర్యలను చేపట్టారు. వారి చొరవతో గాయపడిన 9 మందిని మెరుగైన చికిత్స కోసం బెంగుళూరులోని కొలంబియా ఆసియా ఆసుపత్రికి తరలించారు. అనంతపురంలోని ట్రస్టు నిర్వాహకులతో మాట్లాడి వారిని రప్పించారు. మరణించిన వారి మృత దేహాలకు త్వరగా పోస్టుమార్టం చేయాలని కలెక్టర్ ప్రద్యుమ్న వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఢిల్లీలోని స్పెయిన్ ఎంబసీతో మాట్లాడి ఆ దేశానికి చెందినవారి మృత దేహాలను వీలైనంత త్వరగా వారి దేశానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రద్యుమ్న తెలిపారు.

పుంగనూరు రోడ్డు ప్రమాదంపై సిఎం చంద్రబాబు విచారం

చిత్తూ రు జిల్లా పుంగనూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందటం పట్ల ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు విచా రం వ్యక్తం చేశారు. సామాజిక సేవ చేసేందుకు రాష్ట్రానికి వచ్చిన ముగ్గు రు స్పెయిన్ దేశస్తులు ఈ ప్రమా దంలో మరణించటం బాధా కరమ న్నారు. ఆదేశ దౌత్య కార్యాలయంతో సంప్రదించి మృతుల వివరాలు తెలుసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్పీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

పెద్దిరెడ్డి రెండో విజయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నగర శివారు జీడిమెట్లలోని సూపర్‌మాక్స్ (మల్హోత్ర) బ్లేడ్ కంపెనీకి జరిగిన కార్మికసంఘం ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన టీఎన్‌టియుసి కార్మిక సంఘం ఘన విజయం సాధించింది. కార్మిక సంఘం నేతగా తెదేపా సీనియర్ నాయకుడు ఇ. పెద్దిరెడ్డి వరసగా రెండోసారి కూడా విజయం సాధించారు. పెద్ది రెడ్డికి ప్రత్యర్థిగా రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయినీ నర్సింహ్మారెడ్డి అల్లు డు, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి బరిలో దిగారు. ఈ పోటీ లో విజయం సాధించడానికి శ్రీని వాస్‌రెడ్డి చివరి నిమిషం వరకు యత్నించినప్పటికీ కార్మికులు మా త్రం పెద్దిరెడ్డి పక్షానే నిలిచారు.పెద్దిరెడ్డికి మొత్తం 433 ఓట్లు రాగా,హెచ్‌ఎంఎస్ అభ్యర్థిగా 315 ఓట్లు వచ్చాయి. కాగా సిఐటియుకు మరో 278 ఓట్లు పడ్డాయి. దీంతోపెద్దిరెడ్డి సుమారు 83 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించినట్లు అయింది. పెద్దిరెడ్డిని తెదేపా రాష్ట్ర అగ్రనేతలు ఎల్. రమణ, రేవంత్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలు అభినందించారు.

విశాఖలో సిట్ విచారణ వేగవంతం

విశాఖపట్నం, కెఎన్‌ఎన్ బ్యూరో: విశాఖలో వేలకోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల రికార్డుల ట్యాంపరింగ్, ఆక్రమణల వ్యవహారంపై ప్రభుత్వం నియమించిన సిట్ విచారణను వేగవంతం చేసింది. సుమారు 2553 ఫిర్యాదులు అందగా అన్నింటిని పూర్తి స్థాయిలో పరిశీ లించి అవసరమైన చర్యలు చేపడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ భూముల కుంభకోణంలో గతంలో ఇక్కడ కలెక్టర్లుగా పనిచేసిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు సిట్ గుర్తించినట్లు సమాచారం. ఐదు ఏన్‌ఓసిల జారీలో ఇద్దరు ఐఎఎస్‌లు అక్రమాలకు పాల్పడినట్లు సిట్ బృందం ఇప్పటికే ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. మొత్తం నాలుగు బృందాలు విచారణ వేగవంతంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యాయి. ఎన్‌ఓసిల జారీలో ఐఏఎస్‌ల పాత్రపై వివరణ కోరుతూ నేడో రేపో నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తుంది. అయితే ప్రస్తుతానికి ఐఏఎస్‌లకు నోటీసులు జారీ చేసే అవకాశం లేదని , వారిని విచారించేపరిస్థితి కూడా లేదని సిట్‌కు చెందిన ఒక ఉన్నతాధికారి చెబుతున్నారు. అసలు ఈ వ్యవహారంలో వారు ఎందుకు అలా వ్యవహరించారన్నది లోతుగా విచారణ జరిపి అప్పుడు ప్రభుత్వానికి నివేదించిన తరువాత తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని ప్రస్తుతం ఆయా ఐఏఎస్‌ల వ్యవహారంపై తాము ఎటువంటి చర్యలకు ఉపక్రమించే అవకాశం లేదని సిట్ అధికారులు స్పష్టంగా చెబుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఈ వ్యవహారంలో ఐఏఎస్‌లపై ఇప్పట్లో చర్యలు ఉండే అవకాశాలు కనిపించడం లేదు.

ఇదిలా ఉండగా సుమారు 30 మంది రెవె న్యూ సిబ్బంది ఆయా అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు సిట్ ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. వీరిపైనా కూడా త్వరలో ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే ఇద్దరు టీడీపీ నేతలను అరెస్టు చేయగా మరికొంత మందిపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.

వర్షాభావంతో ఎండుతున్న పంటలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావంతో పంటలు ఎండిపోతుంటే చంద్రబాబు ప్రభుత్వం కేవలం నంద్యాల ఉప ఎన్నికల పైనే దృష్టిని కేంద్రీకరించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. శనివారం విజయవాడలోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊహించిన విధంగా వర్షాలు కురవకపోవడంతో చెరువులు నిండలేదని, దీనితో రైతులు మెట్ట ప్రాంతాల్లో కూడా పంటలు వేయలేదన్నారు. అనంతపురంలో కేవలం 29 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటల సాగు చేస్తున్నారని, వర్షాభావ ప్రభావంతో రాయలసీమ రైతులు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7వ తేదీన అనంతపురంలో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘ నేతలతో వ్యవసాయ రంగ సమస్యలు, పరిష్కారాలు, వలసలు, నివారణ చర్యలపై చర్చలు జరపనున్నట్లు తెలిపారు.

కల్తీ పాల తయారీ కేంద్రంపై దాడులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కల్తీ కాదేదీ కనర్హం అన్న చందాన కల్తీ పదార్థాలు తయారైపోతున్నారు. ధనార్జనే ప్రదాన ధ్యేయంగా కల్తీరాయుళ్లు చెల రేగిపోతున్నారు. ప్రజల ప్రాణా లతో చెలగాటవమాడుతున్నారు. సరూర్‌నగర్ పీఎస్ పరిధిలోని మాధవ్‌నగర్‌లో కల్తీ పాల తయారీ కేంద్రంలో ఎస్ వోటీ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు.200 లీటర్ల కల్తీ పాలు, కల్తీ పౌడర్ స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో యజమానిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని వెల్లడించారు.

తాడిచర్ల బొగ్గు బ్లాక్ ప్రైవేటుకే



తాడిచర్లలో భూసేకరణలో అధికారులు (ఫైల్)

ఏఎంఆర్ కంపెనీకి బొగ్గు తవ్వకం బాధ్యతలు

- కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యం నిర్ణయం
- ఓపెన్‌కాస్ట్ బావిలో 25సం॥ల పాటు బొగ్గు తవ్వకాలకు ఒప్పందం
- పనులు ప్రారంభించిన కాంట్రాక్టు కంపెనీ

భూపాలపల్లి, కెఎన్ఎన్ : బొగ్గును ఉత్పత్తి చేయడంతో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సింగరేణి సంస్థ, కార్మికులకు, సంఘాల అభిప్రాయాలకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పట్ల ఆసక్తి చూపిస్తున్నది. బొగ్గు ఉత్పత్తిలో వంద సంవత్సరాలపాటు అనుభవం విశేష శక్తి సామర్థ్యాలు కల్గిన సైనికుల వంటి కార్మిక శక్తి ఉన్న సింగరేణి మలహర్ మండలంలోని తాడిచర్ల -1 బొగ్గు బ్లాక్‌ను ప్రైవేటు కంపెనీకి అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. సింగరేణి చరిత్రలో ఇప్పటి వరకు ప్రైవేటీకరణకు తావులేకుండా ఉంది. తాడిచర్ల -1 బొగ్గు బ్లాక్ నుండే ప్రైవేటుకు మార్గం సుగమం చేసింది. దేశంలోనే సింగరేణి సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విదేశాల్లో కూడా బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు రచిస్తున్న సింగరేణి స్వంత గడ్డపైన బొగ్గు వెలికితీత పనులు ప్రైవేటుకు అప్పగించడం ఉన్నతస్థాయిలో జరిగిన కీలక నిర్ణయంగా బావించవచ్చని తాడిచర్ల బ్లాక్‌ను సంవత్సారం క్రితమే ప్రైవేటీకరణ చేయడానికి టెండర్లను సింగరేణి పిలిచింది. అప్పుడే కార్మికుల నుండి వ్యతిరేకత వచ్చింది. కొంత కాలం దాటవేత వైఖరిని అవలంభించిన సింగరేణి తాడిచర్ల -1 బ్లాకును ఓసీ తవ్వకం పనులను ఏఎంఆర్ అనే ప్రైవేటు కంపెనీకి టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించింది. ఇటీవలే ఒప్పంద ప్రక్రియ పూర్తి కావడంతో తాడిచర్ల శివారు కాపురం గ్రామ శివారులో ఏఎంఆర్ కంపెనీ పనులను ప్రారంభించింది. ఈ సంవత్సరం భూపాలపల్లి ఏరియా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రెండు ఓపెన్‌కాస్టు బావుల పనులు ప్రారంభం జరిగాయి. ఒకటి ఇప్పటి వరకు 2-ఇంక్లైన్‌గా ఉన్న బావినే సింగరేణి ఓపెన్ కాస్టు -2గా అభివృద్ధి చేస్తున్నది. ఈ బావికి కూడా జంగేడు, ఖాసీంపల్లి తదితర గ్రామాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. ఒక దశలో బాధిత గ్రామాల ప్రజలు పనులను అడ్డగించారు. పర్యావరణ పరిరక్షణ ప్రేమికుల నుంచి కూడా నిరసనలు వ్యక్తం అయ్యాయి. బీజేపీ నేత కిషన్ రెడ్డి , టీడీపీ నేత రేవంత్ రెడ్డి బాధిత గ్రామాలను పర్యటించి ప్రజాభిప్రాయం మేరకు ముఖ్యమంత్రిని సింగరేణి సీఎండీని కలిసి ప్రజల అభిప్రాయాలను వివరించినప్పటికి ఫలితం శూన్యంగా మిగిలింది. ఒపెన్‌కాస్టు -2 పనులు ప్రారంభం అయ్యాయి. వాస్తవానికి తాడిచర్ల -1 బొగ్గు బ్యాక్ సింగరేణి కూడా కాదు. తాడిచర్ల -1 బ్లాక్ జెన్‌కోకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూర్ శివారులోని కేటీపీపీలోని 600 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు కావాల్సిన బొగ్గు అవసరాలను తీర్చడానికి తాడిచర్లను కేటాయించారు. జెన్‌కో తాడిచర్లకు బొగ్గును మొదట సింగరేణికి కాకుండా ప్రైవేటు కంపెనీతో చేసిన ఒప్పదం రద్దు జరిగింది. ఆ బ్లాకును సింగరేణికి అప్పగించింది. ఆ బ్లాక్‌లో సింగరేణి సంస్థ బొగ్గును ఉత్పత్తి చేయకుండా గత నాలుగు సంవత్సరాలుగా కాలయాపన చేస్తున్నది. జెన్‌కో ఒత్తిడి చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి సింగరేణి సంస్థకూడా తాడిచర్ల -1 నుప్రైవేటుకు అప్పగించింది. సింగరేణి ఆడుతున్న బొగ్గు గేమ్‌లో జెన్‌కో పావుగా మారింది.

సింగరేణి చూపు సోలార్ వైపు

(మొదటిపేజీ తరువాయి)

ఉత్పత్తి చేసిన సింగరేణి సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇపుడు సోలార్ విద్యుత్ రంగంలోనూ తనదైన ముద్రవేసేందుకు తహతహలాడుతోంది. సింగరేణి సంస్థ పరిధిలోని వివిధ ఏరియాలలో సోలార్ విద్యుత్‌ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించింది. సంస్థ టర్నోవర్‌ను పెంచేందుకు బహుముఖ వ్యూహాలు రూపొందిస్తున్న చైర్మన్ శ్రీధర్.. ఇపుడు సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలు, లాభనష్టాలపై పరిశీలన జరుపుతున్నారు. సింగరేణిలో పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ (టిఎస్ఆర్ఈడిసిఎల్) చైర్మన్‌కు ఒక నివేదికకూడా అందజేసింది. ఈ నేపథ్యంలో సంస్థకు చెందిన ఉన్నతాధికారులతో 50నుండి 100మెగావాట్ల ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై ఆయన కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్..

సింగరేణిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి టిఎస్ఆర్ఈడిసిఎల్ ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సింగరేణిభవన్‌లో శనివారం ఇచ్చింది. సింగరేణి సంస్థలో 50లేదా 100మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పివి పవర్ ప్లాంట్ల ఏర్పాటుగురించి ఆసక్తి వ్యక్తీకరణకై పలు అంశాలను సోదాహరంగా వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏర్పాటైన సోలార్ ప్లాంట్లు, వాటి పనితీరు, ప్రయోజనం, ఆదాయ-వ్యయాలు వంటి అంశాలు వివరిస్తూ సింగరేణిలో వీటి ఏర్పాటు వల్ల బహువిధ ప్రయోజనం ఉంటుందని వివరించారు. సోలార్ ఉత్పత్తి ద్వారా రాష్ట్రానికి, సింగరేణి సంస్థకు ఒనగూరే ప్రయోజనాల గురించి టిఎస్ఆర్ఈడిసిఎల్ చైర్మన్ సుధాకర్, మేనేజర్ సునిల్‌కుమార్‌లు వివరించారు. సోలార్ విద్యుత్‌ప్లాంట్లకు అవసరమయ్యే యంత్ర సాంకేతిక విడిబాగాలు తయారుచేసే బీహెచ్ఈఎల్ కూడా సింగరేణి యాజమాన్యానికి ఒక ప్రజంటేషన్‌ను వీటిపై సమర్పించింది. దీనిలో వివిధ మెగావాట్ల స్థాయి గల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చు , ప్లాంట్ల ఏర్పాటుకు తీసుకునే సమయం గురించి వివరించారు.

తక్షణ నివేదికకు ఆదేశం

సింగరేణిలోని 12ఏరియాలలో అవకాశాలు ఉన్న చోట 50నుండి 100మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి తక్షణమే నివేదిక అందజేయాలని సింగరేణి చైర్మన్ శ్రీధర్ శనివారం ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుకు తగిన ప్రదేశాల పరిశీలనతో పాటు ఇతర ఆర్థిక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని సత్వరమే నివేదిక తయారుచేయాలని అధికారులను కోరారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో అనుకూలతలపై అధ్యయనం చేయాలన్నారు.

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుపై సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి థర్మల్‌విద్యుత్ ప్రాజెక్టుపై చైర్మన్ శ్రీధర్ శనివారం సమీక్ష జరిపారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 7,255మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దీనిలో 6757మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికి అందించింది. ఈ క్రమంలో యూనిట్1, యూనిట్-2 ప్లాంట్లు కొన్నినెలల్లో రికార్డుస్థాయిలో 95శాతం నుండి నూరుశాతం పిఎల్ఎఫ్‌ను సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. సగటున 95శాతం పిఎల్ఎఫ్ తో ముందుకు పోవాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ (ఈ అండ్‌ఎం) శంకర్, కో-ఆర్డినేటింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఈడి సంజయ్ సూర్, జిఎం (ఎస్టీపిపి) రాజేష్, చీఫ్ ఓ అండ్ ఎం జెఎన్ సింగ్ పాల్గొన్నారు.




వ్యవసాయ రంగంలో కొత్త శకానికి

కేసీఆర్ శ్రీకారం

పీపుల్స్ పార్లమెంట్ సదస్సులో చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యవసాయరంగంలో సిఎం కెసిఆర్ నవశకానికి నాందిపలికారని ప్రభుత్వ చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 1,2తేదీల్లో కడపలో జరిగే పీపుల్స్ పార్లమెంట్ సదస్సు బ్రోచర్లను శనివారం అసెంబ్లీలో ఆవిష్కరించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయరంగంలో తెలంగాణను అగ్రబాగాన నిలబెట్టడం కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కెసిఆర్ రైతుసంక్షేమానికి తీసుకున్న చర్యలఫలితాలు ఇప్పటికే కనిపిస్తున్నాయన్నారు. వచ్చే ఏడాది నుండి ఎకరాకు రూ.8వేలు ప్రభుత్వసాయం అందివ్వనున్నట్లు సిఎం ప్రకటించారన్నారు. పీపుల్స్ ఎగెనెస్ట్ కరప్షన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పీపుల్స్ పార్లమెంట్ సదస్సుకు రెండు రాష్ట్రాలకు చెందిన అన్ని పార్టీల ప్రతినిధులను ఆహ్వానించడం శుభపరిణామమన్నారు. పీపుల్స్ పార్లమెంట్ నిజమైన పార్లమెంట్ తరహాలోనే జరుగుతుందని సదస్సు నిర్వహణా సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీపుల్స్ ఎగెనెస్ట్ కరప్షన్ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. వచ్చే ఏడాది పీపుల్స్ పార్లమెంట్ ఢిల్లీలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

వ్యవసాయ పరిస్థితులపై అవగాహన లేదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటే తెరాస ప్రభుత్వం మాత్రం వ్యక్తిగత ప్రచారం చేసుకుంటూ, ప్రతిపక్షాలను దూషిస్తూ కాలయాపన చేస్తోందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. అసలు సిఎం కేసీఆర్‌కు వ్యవసాయ పంటల పరిస్థితులపై సమీక్షచేసే అవగాహన కూడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 45 లక్షల ఎకరాల్లో వరి పంట వేసే అవకాశం ఉండగా ముందస్తూ వర్షాలు రావడం వల్ల 30 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారన్నారు. ఈ నెల ప్రారంభనాటికి రాష్ట్రంలో 40శాతం తక్కువగా వర్షపాతం నమోదు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయిందని విమర్శించారు. పైగా ప్రభుత్వం రోజుకొక ప్రాజెక్టు పేరు చెప్పడం లేదంటే వాటి అంచనాలను పెంచుకుంటూ పోవడం అనే రెండు కార్యక్రమాలకు మాత్రమే ప్రాధాన్యతను ఇస్తున్నారని ఆయన మండిపడ్డారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్నాటకలో ఆల్మట్టి నిండి, నారాయణపూర్ నిండినా జూరాల వరకు నీరు రావడం లేదన్నారు.

కరీంనగర్‌కు వైద్య కళాశాల కోసం

పొన్నం దీక్ష

- ప్రభాకర్ దీక్షకు సంఘీభావం
- ఆమరణ దీక్ష వద్దన్న జానారెడ్డి



కరీంనగర్, కెఎన్ఎస్ బ్యూరో : కరీంనగర్ నగరానికి మెడికల్ కళాశాలను సీఎం కేసీఆర్ మంజూరు చేస్తారన్న నమ్మకం తనకు లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కళాశాలను మంజూరు చేసుకుందామని సీఎల్పీ నేత కె జానారెడ్డి అన్నారు. కరీంనగర్‌లో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ చేపట్టిన నిరాహారదీక్షా శిబిరాన్ని సీఎల్పీ ఉప నేత టీ జీవన్ రెడ్డితో పాటు శనివారం జానారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆమరణ దీక్షలు చేపడితే డిమాండ్లు నెరవెరతాయన్న కాలం పోయిందని, అందుకే రిలే నీరాహార దీక్షలు చేపట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య పద్దతిలో పొన్నం నిరాహార దీక్ష చేస్తుంటే విద్యార్థులు శిబిరానికి రాకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమని ఆరోపించారు. కళాశాలల యాజమాన్యాలకు లేఖలు రాయడం సరికాదని, ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన వారు సైతం ఇంత దారుణంగా వ్యవహారించలేదని జానారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కంటే నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి మెరుగైన సిఎం అని జానారెడ్డి కితాబిచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆయన పరిపాలనను అందించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని భావించిన ప్రజలను కేసీఆర్ నిరాశకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జానా వ్యాఖ్యలతో కంగుతిన్న కార్యకర్తలు

జానారెడ్డి తన ప్రసంగంలో మెడికల్ కళాశాల మంజూరు కాకపోతే పొన్నం ప్రభాకర్ ఆత్మక్షోభిస్తుందని అనడంతో అక్కడున్న వారంతా కంగుతిన్నారు.తప్పు తెలుసుకున్న జానారెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను సరి చేసుకున్నారు. ఆమరణ దీక్ష వద్దన్నదే తన అభిప్రాయమని చెప్పారు. అందుకే జిల్లా వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని సూచించారు.

నిర్బంధం మధ్య పొన్నం దీక్ష ప్రారంభం


అంతకు ముందు పోలీసుల నిర్బంధాల మధ్య పొన్నం ప్రభాకర్ తన నిరాహార దీక్షను ప్రారంభించారు. తొలుత ఇందిరాచౌక్ వద్ద నిరాహార దీక్షను చేపట్టాలని ఆయన నిర్ణయించారు. పోలీసులు అనుమతించకపోవడంతో తన నివాసంలోనే ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు తన తల్లి ఆశీస్సులతో ఆయన దీక్షను ప్రారంభించారు. పొన్నంకు ఉమ్మడిజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మృత్యుంజయం పూలమాల వేసి దీక్షను ప్రారంభించారు. దీక్షకు పూర్వ జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు, విద్యార్థులు తరలివచ్చారు. దీక్ష ప్రారంభం కాగానే ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సదానందం దీక్షా శిబిరానికి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని అభ్యంతరంచెప్పారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ప్రారంభించడంతో ఆయన వెళ్లిపోయారు.మధ్యాహ్నం కూడా అదే పరిస్థితి ఏర్పడింది. టూటౌన్ ఇన్స్‌పెక్టర్ మహేష్ గౌడ్ శిబిరం వద్దకు రావడంతో మరోమారు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పొన్నంను అరెస్టు చేస్తారేమోనని అనుకున్నారు.

ఎన్ఓసీ జారీ అయ్యేవరకు దీక్ష ఆగదు - పొన్నం

మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఓసీ జారీ చేసేంతవరకు దీక్షను విరమించే ప్రసక్తిలేదని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.తన తల్లి ఆశీర్వాదాలతో దీక్షను ప్రారంభించానని, దీక్ష కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా అనుమతిమంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షా శిబిరంలో జానారెడ్డి, జీవన్ రెడ్డితో పాటుటీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ ఆరెపల్లి మోహన్, మాజీ ఎమ్మెల్యేలు ప్రవీణ్‌రెడ్డి, సుద్దాల దేవయ్య, బొమ్మ వెంకటేశ్వర్, కొడూరి సత్యనారాయణగౌడ్ తదితరులు ప్రసంగించారు.

పెద్దషాపూర్‌లో డిజిటల్ అక్షరాస్యత అభియాన్ కేంద్రం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోస్ట్ ట్రేడ్ టెక్నాలజీ, ప్రొఫెషనల్ సర్వీస్ సంస్థ ఆర్సేసిమ్, నాస్కామ్ మద్దతుతో ప్రధానమంత్రి డిజిటల్ అక్షరాస్యత అభియాన్ కేంద్రాన్ని పెద్దషాపూర్ వద్ద శనివారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా ఈ ప్రాంతంలోని వెయ్యి కుటుంబాలకు డిజిటల్ లిటరసీ సెంటర్‌కు దోహద పడునుందని ఆర్సేసిమ్ కంట్రి హెడ్ రాజీవ్ లాంబ చెప్పారు. కంప్యూటర్, మొబైల్ ఫోన్లను ఉపయోగించే విధంగా గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ అక్షరాస్యత అభియాన్ పని చేస్తుందని చెప్పారు. డిజిటల్ శూన్యత, డిజిటల్ చేరిక తక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అంతరాన్ని పూరించేందుకు ఇది ఒక వారధిగా పనిచేస్తుందని ఆయన అన్నారు. శిక్షణ పొందిన తర్వాత లబ్దిదారులు ఆధార్, రేషన్, పాన్‌కార్డుల కోసం రిజిస్టర్ చేసుకోవడం, ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించడం, ఇ-మెయిల్స్ పంపడం, ఆర్థిక, విద్య, ఆరోగ్యం కమ్యూనికేషన్ల అవసరాల కోసం ఇంటర్నెట్‌ను వినియోగించుకోగలుగుతారని రాజీవ్ లాంబ చెప్పారు. తమ నిర్వహణ భాగస్వామి నిర్మల్ సంస్థ ద్వారా ఆర్సేసిమ్ కేంద్రం వద్ద శిక్షణ, మౌలికసదుపాయాలు, శిక్షకులకు సహాయం అందిస్తుందన్నారు.రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామీణ విద్యార్థులు తమ విస్తరిస్తున్న ఐటి టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ-డిజిటల్ అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు పరిజ్ఞానం పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. నాస్కామ్ ఫౌండేషన్ రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, గ్రామీణ తెలంగాణ ప్రాంతంలో తమ సంస్థ మొదటి డిజిటల్ అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో ఇది 10వ కేంద్రమని చెప్పారు. గత 9 కేంద్రాలు నగరాల్లోనే ఉన్నాయని, ఆ కేంద్రాలు ఇప్పటి వరకు 7వేల మందికి శిక్షణ ఇచ్చాయని తెలిపారు. దేశంలో నాస్కామ్ ఇంతవరకు 170 డిజిటల్ లిటరసీ కేంద్రాలు ప్రారంభించిందని, ప్రతి ఇంటికి కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారిలా తయారు చేయడమే ప్రధానమంత్రి డిజిటల్ అక్షరాస్యత అభియాన్ లక్ష్యమని శ్రీనివాసన్ చెప్పారు.



వీడిన వైద్యురాలి అదృశ్యం మిస్టరీ

హత్యా..ఆత్మహత్యా?

అమరావతి, ఆంధ్రప్రభ: గత నెల 31వ తేదీ రాత్రి ఇంటి నుంచి వెళ్లిన వైద్యురాలు సూర్యకుమారి అదృశ్యం మిస్టరీ వీడింది. విజయవాడలోని రైవస్ కాల్వ నుంచి ఆమె మృతదేహాన్ని శనివారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమె మృతదేహం వెలుగు చూసిన నేపథ్యంలో ఇందుకు ప్రేరేపించిన కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె కుటుంబ సభ్యులు స్నేహితుడు విద్యాసాగర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తుండగా..పోలీసులు మాత్రం అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..విజయవాడ ఎల్ఐసీ కాలనీకి చెందిన డాక్టర్ సూర్యకుమారి కృష్ణాజిల్లా విస్సన్నపేట మండలం తెలదేవరపల్లి గ్రామ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యురాలిగా పని చేస్తోంది. ఈమె తండ్రి విజయకుమార్ విజయవాడ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగంలో పని చేసి పదవీ విరమణ చేయగా, సోదరి కర్నాటకలో ఐఎఎస్ అధికారిగా పని చేస్తోంది. కొంతకాలంగా మాజీ ఎమ్మెల్యే బి.ఎస్.జయరాజు కుమారుడు విద్యాసాగర్(బాబి)తో సన్నిహితంగా ఉంటున్నట్లు తెలిసింది. వివాహమై పిల్లలున్న విద్యాసాగర్‌తో ఆమె ఉండటంపై ఇటీవల వివాదం చోటు చేసుకుం టున్నట్లు చెపుతున్నారు. ఈ క్రమంలోనే వైద్య కోర్సులో అడ్వాన్సు చదువు కోసం మూడు నెలల పాటు వెళ్లాల్సి ఉంది. ఏం జరిగిందో తెలియదు కాని గత నెల 31వ తేదీ అర్ధరాత్రి వరకు విద్యాసాగర్‌తో ఆమె మాట్లాడింది. ఆ తర్వాత ఆమె కనిపించకుండా వెళ్లిపోవడంతో మరుసటి రోజు ఉదయం మొబైల్ తన ఇంటి ముందు ఉందంటూ విద్యాసాగర్ తీసుకెళ్లి సూర్యకుమారి కుటుంబ సభ్యులకు అందజేశాడు. దీంతో ఆమె అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు జరిగిన విషయాన్ని పేర్కొంటూ విజయవాడ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో విద్యాసాగర్‌పై వారు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసులు విద్యాసాగర్‌ను పోలీసులు విచారిస్తున్నారు.

ప్రాజెక్టులను అడ్డుకుంటూ అభివృద్ధి గురించి మాటలా



నారాయణపేట, కెఎన్ఎన్ :తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వెనుకబడిన పాలమూరు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని, అందులో భాగంగా జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు అడ్డుతగులుతున్నారని, ప్రజల మేలుకోసం చేపట్టే ప్రాజెక్టులను అడ్డుకొనే ఇలాంటి ప్రతిపక్ష పార్టీలను తానెప్పుడూ చూడలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ చర్లకోళ లక్ష్మారెడ్డి అన్నారు. నారాయణపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేసేందుకు వచ్చిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు ప్రతి దానిని అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. అదే మాటకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తే ఎగిరిపడుతున్నారే తప్పా.. వాస్తవాలను తెలుసుకోలేక పోతున్నారన్నారు. కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టులకు ప్రతిపక్ష పార్టీలు అడ్డుతగలలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులకై భూ సమీకరణ చేయగా ప్రతిపక్షపార్టీలు అడ్డుకోవడమో, రైతులను రెచ్చగొట్టే పనులు చేయలేదన్నారు. ప్రస్తుతం నీటి ప్రాజెక్టులు నడుస్తుంటే కాంగ్రెస్ నాయకులు కేసులు వేయడం సరి కాదన్నారు. జిల్లా వెనకబాటు తనాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లాకు అతిపెద్ద పాలమూరు ప్రాజెక్టు చేపడుతుంటే కొల్లాపూర్‌లో, దేవరకద్రలో కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టు లకు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రాజెక్టులను అడ్డుకున్నవారే అభివృద్ధి గురించి మాట్లాడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కల్వకుర్తి ప్రాజెక్టు చేపట్టినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలో సగం కూడా నష్టపరిహారం ఇవ్వలేదని, ప్రస్తుతం తెరాస ప్రభుత్వం మంచి ప్యాకేజీ ఇస్తుందని తెలిపారు. ప్రతిపక్షాలు క్రియాశీలకంగా ఉండాలని ప్రభుత్వం తప్పు చేస్తే ఎత్తి చూయించాలని, మంచి పనులు చేస్తే సహకరించాలని హితవుపలికారు.

స్వైన్‌ఫ్లూ విజృంభణ

- జనవరి నుంచి ఇప్పటి వరకు 32 మరణాలు
- 160 కేసులు నమోదు
- నోడల్ ఆసుపత్రి గాంధీలో ప్రస్తుతం 9 మంది బాధితులు
- వర్షాకాలం కావడంతో సర్కారు అప్రమత్తం
- ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. పాజిటీవ్ కేసులు పెరగడమే కాకుండా మరణాలు సైతం పెరుగుతున్నాయి. జనవరి నుంచి జూలై వరకు 160 పాజిటీవ్ కేసులు నమోదు కాగా వాటిలో 32 మంది మరణించారు. స్వైన్ ఫ్లూ చికిత్సక ు గాంధీ ఆసుపత్రి నోడల్ హాస్పిటల్‌గా ఉండటంతో క్రిటికల్‌గా ఉన్న కేసులు ఇక్కడకు వస్తున్నాయి. ప్రస్తుతం గాంధీలో 9 మందికి చికిత్స అందిస్తున్నారు. ఒక్క జూలై నెలలోనే ముగ్గురు స్వైన్ ఫ్లూతో మరణించారు. తక్కువ ఉష్ణోగ్రతల్లో స్వైన్‌ఫ్లూ కేసులు పెరుగుతాయి. వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని సర్కార్ ఆదేశించింది. అయితే ప్రజల్లో స్వైన్ ఫ్లూపై అవగాహన లేకపోవడంతో పాజిటీవ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రజల్లో స్వైన్‌ఫ్లూపై అవగాహనను పెంచే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

అవగాహన లేకపోవడంతో...

తీవ్రమైన దగ్గు, జలుబు ఉండటంతోపాటు ఒళ్లు నొప్పులు ఉండటం, తెమడ రావడం స్వైన్‌ఫ్లూ ప్రధాన లక్షణాలు. ఆ లక్షణాలు ఉన్న వారు వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకుని స్వైన్‌ఫ్లూ రాకుండా నివారించుకునేలా చూడాలి. స్వైన్‌ఫ్లూ ప్రధానంగా ఎక్కువ వయస్సు వారికి, పిల్లలు, గర్భిణీలకు వచ్చే అ వ కా శా ల ు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గర్భిణీల్లో స్వైన్‌ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అయితే అదృష్టవశాత్తు వారిలో తక్కువ మరణాలే ఉంటున్నాయి. గాంధీ నోడల్ హాస్పిటల్ కావడంతో కేవలం ఇక్కడ నమోదు అయిన కేసులు మాత్రమే బయటికి తెలుస్తున్నాయి. జిల్లాల్లో నూ, అలాగే ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ నమో దు అయ్యే స్వైన్‌ఫ్లూ కేసులు బయటికి రావడం లేదు. జూలై నెలలో ముగ్గురు పిల్లలు స్వైన్‌ఫ్లూతో మరణించారు. ప్రస్తుతం కూడా 9 మంది చికిత్స పొందుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు

వర్షాకాలం కావడంతో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో ఈ కాలంలో స్వైన్‌ఫ్లూ ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి గ్రామీణ ప్రాంతాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధపెట్టి స్వైన్‌ఫ్లూతోపాటు ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను సర్కార్ ఆదేశించింది. స్వైన్‌ఫ్లూకు సంబంధించిన మందులను సరఫరా చేయడంతోపాటు ప్రధానంగా దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. శుభ్రంగా ఉండటంతో పాటు, ఇల్లు, ఇతర పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలనే అవగాహనను కల్పించాల్సిన అవసరం ఉంది.

వేసవి కాలంలోనూ పాజిటీవ్ కేసులు నమోదు

ఈ ఏడాదిలో ఏప్రిల్, మే నెలల్లో కూడా స్వైన్‌ఫ్లూ పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి. సాధారణంగా ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే స్వైన్‌ఫ్లూ లక్షణాలు కనిపిస్తాయి. కానీ వేసవి కాలంలో పాజిటీవ్ కేసులు నమోదు కావడంతో వారి రక్తం శాంపిల్స్‌ను ముంబయి పంపించి పరీక్షలు చేయించాలని సర్కార్ నిర్ణయించింది. కానీ ఇప్పటి వరకు వాటికి సంబంధించిన నివేదికలను బయటపెట్టలేదు. ఇప్పుడు కొత్తగా పాజిటీవ్ కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పుడు కూడా శాంపిల్స్‌ను సేకరిస్తున్నారు. శాంపిల్స్‌ను సేకరించడమే కానీ వాటి నివేదిక ఆధారంగా ఎందుకు వస్తుంది, వాటికి గల కారణాలపై అధ్యయనం చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం శాంపిల్స్ నివేదికను త్వరగా బయట పెట్టి వాటి ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వీఓఏలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్రామైఖ్యసంఘం సహాయకులకు (వీఓఏ) ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్ట ర్స్‌లో మంత్రి జూపల్లిని వీఓఏలను కలిసి కృత జ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రతి నెల రూ.3వేలు గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు మార్గదర్శకాలను విడుదల చేశామని తెలిపారు. రాష్ట్రంలో 18,836మంది వీఓఏలకు ప్రయోజనం కల్గుతుందని తెలిపారు. గ్రామాల్లో మహిళా చైతన్యంతో పాటు సామాజిక రుగ్మతలు రూపుమాపడం, అక్షరాస్యతను పెంచడంలో వీఓఏలు కృషి చేయాలని సూచించారు. అలాగే ఉపాధిహామీ, హరితహారం లాంటి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయ వంతం చేసేందుకు వీఓఏలు పనిచేయాలన్నారు.

సింగరేణి 'థర్మల్' ప్రాజెక్టులపై సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి థర్మల్‌విద్యుత్ ప్రాజెక్టుపై చైర్మన్ శ్రీధర్ శనివారం సమీక్షజరిపారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 7,255మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి దీనిలో 6757మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికి అందించింది. ఈ క్రమంలో యూనిట్1, యూనిట్-2 ప్లాంట్లు కొన్ని నెలల్లో రికార్డుస్థాయిలో 95శాతం నుండి నూరుశాతం పిఎల్ఎఫ్‌ను సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇకపై కూడా సగటున 95శాతం పిఎల్ఎఫ్‌తో ముందుకు పోవాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డైరెక్టర్ (ఈ అండ్ఎం) ఎస్.శంకర్, కో-ఆర్డినేటింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఈడి సంజయ్ సూర్, జిఎం (ఎస్టీపిపి) రాజేష్, చీఫ్ ఓ అండ్ ఎం జెఎన్ సింగ్ పాల్గొన్నారు.

బీసీ బిల్లుపై 7న ఛలో ఢిల్లీ

10వరకు ఆందోళన కార్యక్రమాలు: బీసీ సంక్షేమ సంఘం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల(బీసీ) వారికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 7న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. 7 నుంచి 10 వరకు బీసీ సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో బీసీల లొల్లి పేరుతో ఆందోళనా కార్యక్రమాలను చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చలో ఢిల్లీ సన్నాహాక సమావేశం శనివారం బీసీ భవన్ లో జరిగింది. ఈసమావేశంలో నిరంజన్, లక్ష్మినారాయణ, ఎస్ దుర్గయ్యగౌడ్, చీపూరు మల్లేష్, సింగం నాగేష్, కుల్కచర్ల శ్రీనివాస్, రేపాక రాంబాబు, విక్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బీసీ ఓట్లతో గెలిచిన రాజకీయ పార్టీలు చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బిల్లుపై తమ వైఖరిని స్పష్టం చేయకుండా గోడమీద పిల్లి వాటంగా వ్యవహరిస్తున్నాయని జాజుల విమర్శించారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



వెనుకబడిన తరగతుల(బీసీ) వారికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన హోదా కల్పించే బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం శనివారం ఢిల్లీలో పార్లమెంటు దగ్గర భారీ ప్రదర్శన నిర్వహించినట్టు సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య తెలిపారు. ప్రదర్శన సందర్భంగా బీసీ సంఘం కార్యకర్తలు బారీకేడ్లను దాటుకొని వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

వ్యవసాయ రంగంపై

సర్కారు నిర్లక్ష్యం

కిసాన్‌మోర్చ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. ప్రధానమంత్రి పసల్ బీమా ద్వారా పంట నష్టపోయిన రైతుకు 33 శాతం పరిహారం ఇచ్చే విధంగా కేంద్రం అమలు చేస్తోందని ఆయన తెలిపారు. శనివారం బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర సమావేశం గోలి మధుసుదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన లక్ష్మణ్ మాట్లాడారు. రైతులకు సంబంధించిన బీమా ప్రిమియానికి సంబంధించిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా మినమేశాలు లెక్కిస్తోందని ఆయన విమర్శించారు. దీంతో రైతులు నష్టపోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కూడా కాంట్రాక్టర్లకే మేలు జరిగే విధంగానే ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రైతును రాజును చేస్తానన్న సీఎం.. బేడీలు వేసి జైల్లో పెట్టారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణాలను మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వం నాలుగు విడతలుగా విడుదల చేసిన డబ్బులు వడ్డీలకే సరిపోయిందన్నారు. దీంతో రైతు పాసుపుస్తకాలు బ్యాంకుల్లోనే ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు నష్టపోతున్నారని, బ్యాంకుల నుంచి కొత్త రుణాలు పొందడం లేదన్నారు. ప్రభుత్వంపై రోజు రోజుకు వ్యతిరేకత పెరుగుతుండటంతో.. మరో కొత్త నాటకంతో ప్రభుత్వం ముందుకు వస్తోందన్నారు. ఎన్నికల కోసమే ఎకరాకు 8 వేలు ఇస్తామని అమలు కానీ హామీలను ఇస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. రైతు వ్యతిరేకి విధానాలను ప్రజలకు వివరించేందుకు కిసాన్‌మోర్చ కీలకంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసుదన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై దశలవారిగా మోర్చ చేస్తున్న కార్యక్రమాలను వివరించారు.

లైంగిక వేధింపులపై సమష్టి పోరు

మహిళ కమిషన్ పిలుపు



హైదరాబాద్.ఆంధ్రప్రభ: మహిళలపట్ల జరుగుతున్న లైంగిక వేధింపులను సమిష్టిపోరుతో ఎదుర్కోవాలని రాష్ట్ర మహిళా కమీషన్ పిలుపునిచ్చింది. శనివారం హరిత ప్లాజాలో మహిళలపై లెంగిక వేధిపుల నిరోధం చట్టం అమలు అన్న అంశంపై రాష్ట్ర మహిళా కమీషన్ ,మహిళా సంక్షేమ శాఖలు సంయుక్తంగా వర్క్‌షాప్ ఏర్పాటు చేశాయి. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యతిరాజులు ఈ కార్య క్రమానికి మఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు దశాబ్దాల కిందటి పరిస్థితులతో పోలిస్తే సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. మహిళల్లో రోజురోజుకు చైతన్యం పెరుగుతూ వస్తోందన్నారు. తమ హక్కులను కాపాడు కోవటంలో ముందుండి పోరాడుతున్నారన్నారు. ప్రభుత్వం మహిళా రంగానికి ఉద్యోగ, ఉపాధి అవహకాశాల్లో కూడా సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తోందన్నారు. ప్రభుత్వ , ప్రవేటు సంస్థల్లో మహిళలు పనిచేసే చోట ఉద్యోగు లందరినీ సమదృష్టితో చూసి అందరి హక్కులు కాపాడా ల్సిన బాద్యత యాజమాన్యం ప్రతినిధులుగా వ్యవహరిసు న్న బాస్‌లదే అన్నారు. ఉద్యోగులకు పైస్థాయిలో ఉంటూ వారిని అజమాయిషీ చేసే వారు తమ బాధ్యతలను విస్మరిస్తేనే సమస్యలు వస్తాయన్నారు. లైంగిక వేధింపుల సంఘటనల్లో సమాచారాన్ని సాటి మహిళలతో పంచుకుని వేధింపులను సంఘటితంగా ఎదుర్కొవాలని జస్టిస్ యతిరాజులు పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం మహిళలకు అన్నిరంగాల్లో సమాన ప్రాతినిద్యం, సమాన అవకాశాలు ఉండాలన్నారు. ఒకపుడు ఇంటికే పరిమితమైన మహిళ ఇపుడు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రభేత్వతర రంగాల్లో , సంఘటిత, అసంఘటిత రంగాల్లో ప్రత్యేకతను చాటుకుంటూ విజయవంతంగా కర్తవ్య నిర్వహణ చేస్తున్నారన్నారు. మహిళలు పనిచేసే చోట వారిని లైంగిక వేధిపులకు గురిచేస్తున్న సంఘటనలు రోజురోజుకూ పెరుగుతూ ఉన్నాయని ఆందోళన వెలిబుచ్చారు. అన్ని సంఘటనలు బయటకు రావటంలేదన్నారు. ఏ రంగంలోనైనా పనిచేసే చోట మహిళలకు లైంగిక వేధింపుల నుంచి భద్రత ,రక్షణ ఉండాలన్న ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వం పనిచేసే చోట మహిళలపై లైంగిక విధింపుల (నిరోధ, నిషేధ, పరిష్కార)చట్టం -2013ను రూపొం దించిం దన్నారు. ఈ చట్టం పట్ల మహిళల్లో అవగాహన , చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్మీడియట్ పూర్తి అయిన విద్యార్థులు ఉన్నత విద్యను చదవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. 2017-18 విద్యా సంవత్సరంలో దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబర్ 31 వరకు అవకాశం కల్పిస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. 2016-17లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. తెలంగాణ రాష్ట్రంలో 2570 మందికి మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఇవ్వనున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో ఎంపికయిన వారి లిస్టును ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని అశోక్ తెలిపారు. ఇప్పటికే మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆగస్టు 31లో రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు స్కాలర్‌షిప్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్టు తెలిపారు.


నేరేడుగొమ్ము అభివృద్ధికి రూ.కోటి

హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి



చందంపేట, కెఎన్ఎన్ : నల్గొండ జిల్లా, నేరేడుగొమ్ము మండల కేంద్ర అభివృద్ధికి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.కోటి కేటాయిస్తానని రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన తన సొంత గ్రామమైన నేరేడుగొమ్మును పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోడల్‌స్కూల్‌లో నిర్వహించే విద్యార్థినుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించి కాసేపు క్రికెట్ ఆడారు. నేరేడుగొమ్ము మండల అభివృద్ధికి సీఎంతో ప్రత్యేకంగా మాట్లాడి అధిక నిధులు కేటాయించేలా చూస్తానని అన్నారు. అనంతరం హోంమంత్రి తన వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అక్కడ నిర్మించనున్న ఇంటి పనులకు భూమిపూజ చేసి, నూతనంగా వేస్తున్న బోరును పరిశీలించారు. కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు వాటి అమలు తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని గ్రామస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సంక్షేమ రంగంలో మన రాష్ట్రం దేశంలోనే ముందుందని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

గుర్తింపు లేని కాలేజీలపై కేసులు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ నగరంలో గుర్తింపు లేకుండా క్లాసులు నిర్వహిస్తున్న కార్పొరేట్ కాలేజీలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబివిపి) డిమాండ్ చేసింది. అదే విధంగా గుర్తింపు లేని కార్పొరేట్ కాలేజీలను మూసేయిస్తున్న విద్యార్థి నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏబివిపి నాయకులు శనివారం ఐజికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో శ్రీచైతన్య, నారాయణ కార్పొరేట్ కాలేజీల్లో 21 వాటికి ఇంటర్‌బోర్డు గుర్తింపును ఇవ్వలేదని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్ అయ్యప్ప తెలిపారు. ఆయా కాలేజీల్లో సుమారు 14వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని వారికి అవగాహన కల్పించడం కోసం తాము కాలేజీలను మూసేయిస్తున్న సందర్భంలో స్థానిక పోలీసులు విషయం తెలియక తమపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని ఐజీ దృష్టికి తీసుకొచ్చారు.

రాహులపై దాడిని నిరసిస్తూ...

రాష్ట్రవ్యాప్త నిరసనలు

- బీజేపీ కార్యాలయం ముట్టడికి యూత్ కాంగ్రెస్ యత్నం
- మోడీ దిష్టిబొమ్మదహనం




హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గుజరాత్‌లో రాహుల్ గాంధీపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తుల దాడిని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. పలు చోట్ల బీజేపీ కార్యాలయాల ముట్టడికి యత్నించింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మలను దహనం చేసింది. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ పిలుపుమేరకు నగరంలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం ముట్టడించారు. లోపలికి చొరపడేందుకు ప్రయత్నించగా ఉద్రిక్తవాతావరణ నెలకొంది. అప్రమత్తమైన పోలీసులు కార్యకర్తలను అడ్డుకున్నారు. అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగెస్ కార్యకర్తలు దాడి చేస్తారని ముందస్తు సమాచారం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈసందర్భంగా బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. బీజేపీ కార్యాలయం ప్రహరికి కాంగ్రెస్ జెండాలు కట్టి నిరసన ప్రకటించారు. కార్యాలయం ఎదుట మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శులు శ్రీకాంత్, వెంకట్ గురిజాల, సికింద్రాబాద్ పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కోటం అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు కిరణ్, రవి, ముషీరాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ ఇతర నాయకులు మెట్టు సాయి, నీరజ్, సాయిరాజ్, అభిషేక్‌తో పాటు పెద్దయెత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాదళ్ నేతృత్వంలో ...,

టీపీసీసీ సేవాదళ్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. గాంధీభవన్ ఎదురుగా మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కనుకుల జనార్ధనరెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీని ఎదుర్కోలేక బీజేపీ సర్కార్ దాడులకు పాల్పడు తోందని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు పట్టుగొమ్మలు బడుగులే

ఓబీసీ సమావేశంలో రాహుల్ గాంధీ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎస్సీ,ఎస్టీ వెనుకబడిన వర్గాలు కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచి పట్టుగొమ్మలని,ఈ వర్గాలను తిరిగిపార్టీ వైపు మరల్చేందుకు ఇంత వరకు పార్టీ చేసిన కార్య క్రమాలను వివరించాలని ఎఐసీసీ ఉపాధ్య క్షులు రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో దక్షిణాది రాష్ట్రా ల బీసీ నేతలతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సమావేశానికి తెలం గాణ, ఏపీ, తమిళనాడు, కేరళ,కర్నాటక రాష్ట్రా ల నుంచి 120 మంది ముఖ్య నాయకులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 30 మంది పాల్గొన్నారు. పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర విషయాలను ఈ వర్గాల ప్రజలతో చర్చించి నివేదికలు సమర్పించాలని పార్టీ రాష్ట్రా ల బీసీ శాఖలను ఆదేశించారు.


రాహుల్‌పై దాడి అమానుషం: గూడురు నారాయణ రెడ్డి

గుజరాత్‌లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన ఎఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు దాడి చేయడం అమానుష చర్యగా టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి అభివర్ణించారు.

అమిత్‌షాను తిరగనివ్వం: కొనగాల మహేష్

రాహుల్ పై దాడికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేష్ డిమాండ్ చేశారు. లేకపోతే అమిత్ షా రాష్ట్ర పర్యటనలను అడ్డుకుంటామని మహేష్ హెచ్చరించారు.

ఏసీ గదుల్లో కేసీఆర్ తెలంగాణ ఉద్యమం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై సీఎం కేసీఆర్ విమర్శలు చేయడం ఆయన స్థాయికి తగదని టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి విమర్శించారు. ఏసీ గదుల్లో కూర్చుని తెలంగాణ ఉద్యమం చేసిన కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కులేదని మండిపడ్డారు. శనివారం గాంధీ భవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. 1969 ఉద్యమంలో తనతో పాటు వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు లాఠీ దెబ్బలు తిన్నారని, జైళ్లకు వెళ్లారని చెప్పారు. అంతేగాక మలి విడత ఉద్యమంలో సైతం సకలజనులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నేతలు వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. రెండు ఉద్యమాల్లో తాను కూడా ఉన్నా నని గుర్తు చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీని పిశాచీఅని అనటం ,అబద్ధాలు మాట్లాడడం కేసీఆర్ స్థాయికి తగదన్నారు.

పరిహారం ఇస్తే కోర్టులకు ఎందుకు వెళతారు : మల్లు రవి

ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందజేస్తే బాధితులు కోర్టులకు ఎందుకు వెళతారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ప్రశ్నించారు.

ప్రజలను కేసీఆర్ గంగిరెద్దులు అనుకుంటున్నారు : గండ్ర

ప్రజలను గంగిరెద్దులుగా భావించి సీఎం కేసీఆర్ అబద్ధాలు వల్లిస్తున్నారని మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు.

రుణాలపై స్పీడ్ పెంచండి

జిల్లాల ఈడీలకు ఎండీ లచ్చిరాం భూక్యా ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : స్వయం ఉపాధి పథకాల కింద ఎస్సీ నిరుద్యోగులకు ఇచ్చే రుణాలను వేగవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భుక్యా సూచించారు. శనివారం కరీంగనర్, పెద్దపల్లి, జగిత్యాల, వికారాబాద్, సూర్యపేటకు చెందిన జిల్లాల ఈడీలతో సమావేశం నిర్వహించారు. జిల్లాల వారిగా అమలవుతున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ భూమి కొనుగోలు, బ్యాంకుల సహకారం, గుడుంబా తయారిదారుల పునరావ స్వయం ఉపాధి పథకాల అమలుపై చర్చించి, ఎప్పటికప్పుడు నివేదికలు ప్రధాన కార్యాలయానికి అందజేయాలని సూచించారు. భూ పంపిణి పథకం కింద దళితులకు 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 వరకు 551.10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి లబ్దిదారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. అట్టి భూమికి సంబంధించిన పంట ఖర్చు కింద అందజేయాల్సిన నిధులను వెంటనే అందేలా చూడాలని ఎండీ లచ్చిరాం అదేశించారు. భూగర్భ జలశాఖ వారి సహకారంతో బోర్లు వేయించి విద్యుత్ సౌకర్యం, మోటార్లను అందజేయాలన్నారు. బ్యాంక్‌లు సహయంతో అందజేసే రుణాల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని, మిగిలిపోయిన యూనిట్లకు సంబంధించి ఎంపీడీవోల సహకారంతో ఈ నెల 20 వరకు గ్రౌండ్ చేయాలన్నారు. 2016-17 సంవత్సరంలో మిగిలిన లోన్ ఆకౌంట్స్ వివరాలు ఆగస్టు 15 లోగా అందించాలన్నారు. దీంతో పాటు 2017- 18 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న వివరాలపై సమీక్ష చేపట్టి 15లోగా పూర్తి చేయాలని, అర్హులైన వారి వివరాలను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు తగినంత సమయం ఇవ్వాలన్నారు.

ఆస్ట్రేలియా వీసాల పట్ల జాగ్రత్త

టీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆస్ట్రేలియా బోగస్ వీసాల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ ప్రజలకు టిఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగందర్‌రెడ్డి సూచించారు. శనివారం ఈమేరకు ఆయన పత్రికాప్రకటన విడుదల చేశారు. శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు విద్య, ఉపాధి అవకాశాలు ఆస్ట్రేలియాలో గణనీయంగా ఉన్నాయన్నారు. ఈ కారణంగా నెలకొన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకోవాల్సిందిగా కొందరు నకిలీ ఏజెంట్లు తెలంగాణ లోని వివిధ జిల్లాల్లో వర్క్ పర్మిట్‌ల పేరుతో నకిలీపత్రాలు సృష్టించి విచ్చలవిడిగా మోసగిస్తున్నారన్నారు. విక్టోరియా స్టేట్ ఇన్‌ఛార్జి సాయిరాం మాట్లాడుతూ ఇటీవల కాలంలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో కొందరు నకిలీ ఏజెంట్లు ఆస్ట్రేలియాలోని వీసాలు, పర్మిట్ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఆస్ట్రేలియాలోని వివిధ కంపెనీల పేరుతో సొంతంగా జాబ్‌లెటర్‌లు ముద్రించి ఉపాధి కోసం యత్నిస్తున్న యువకుల్ని లక్ష్యంగా చేసు కుని లక్షల్లో డబ్బులు వసూలుచేసి కుంటిసాకులు చూపిస్తున్నారన్నారు. నెలల తరబడి ఏ విధమైన పురోగతి లేకుండా వారి ఆఫీసుల వెంబడి తిప్పుకుం టున్నారన్నారు. ఆస్ట్రేలియాలోని సదరు కంపెనీలను సంప్రదించగా, ఇవన్నీ ఫేక్ లెటర్లని తేలిందన్నారు. యాజమాన్యాలకు తెలియపరిచి ఇలాంటి బూట కపు ప్రకటనలు, ఉత్తర్వులను నమ్మవద్దని సందేశం పెట్టించామన్నారు. కొంద రు నకిలీఏజెంట్లు హైదరాబాద్, ముంబై, ఢిల్లీ కేంద్రాలుగా చేసుకుని ఈ దందా చేస్తున్నారన్నారు.

చైనా సైనిక చర్య

(మొదటిపేజీ తరువాయి)

చైనా ఉంటే పక్కలో బల్లెమే. త్రికూడలి ప్రాంతంతో పాటు ఇండో-చైనా సరిహద్దుల్లో పలు ప్రాంతాల్లో ఇలాంటివే ఉన్నాయి. అక్కడల్లా చైనా ఆ ప్రాంతాల్లోకి వచ్చి హడావిడి చేస్తుంటుంది. తాజా వివాదంలో భూటాన్‌కు భారత్ అండగా నిలబడడం చైనాకు కంటగింపుగా ఉంది. ఆసియాలో తాను తప్ప మరో పెద్దన్న ఉండకూడదన్న తరహాలో చైనా వ్యవహరిస్తోంది. అందరూ తన మాటే వినాలన్న ధోరణితో దక్షిణ చైనా సముద్రంలోనూ ఆయా దేశాల సముద్ర ప్రాంతాలపై హక్కును కోరుతోంది. దీంతో ఫిలిప్పైన్స్, వియత్నాం, మారిషస్ వంటి పలు చిన్న దేశాలకు చైనా బూచిగా తయారైంది. చిన్న స్థాయి మిలిటరీ ఆపరేషన్‌ను భారత్ ప్రభుత్వానికి తెలిపి మరీ చైనా చేస్తుందని, అక్కడి భారత్ సైనికులను తరిమి వేస్తుందని హు అన్నారు. అయితే.. చర్చలు జరుపుదామని భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ అంటుంటే, వైదొలగితేనే చర్చలని చైనా బింకంగా ఉంది. ఎన్ని సార్లు రెచ్చగొట్టినా భారత్ వెనక్కు తగ్గడం లేదు అయితే.. యుద్ధం మాత్రం వద్దని, చర్చలే పరిష్కారమని అధికారికంగా ప్రకటిస్తోంది. ఈ విషయమై చైనా మాత్రం అధికారిక ప్రకటన చేయడం లేదు. ఈ విషయంలో చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ టాబ్లాయిడ్ భారత్ వ్యతిరేక వార్తలను రాయడమే పనిగా పెట్టుకుంది. చైనా అధికార పత్రికకావడంతో ఆ దేశ ప్రభుత్వ ఆలోచనా ధోరణిని ఆ పత్రిక ప్రచురిస్తుంటుంది. తాజాగా టిబెట్‌లో చైనా సైనిక విన్యాసాలను ఆ పత్రిక పేర్కొంది. అవి భారత్ కోసమేనని హెచ్చరిస్తోంది. అయితే.. సెప్టెంబర్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం లోపే సమస్య పరిష్కారం కావడానికే చైనా బింకం మాటలు మాట్లాడుతోందని విశ్లేషకుల అంచనా.

అయితే.. చైనా ఈ విషయంలో ఒంటరిదై పోయింది. దక్షిణ చైనా సముద్రంలో ఆ దేశం తెంపరితనాన్ని వియత్నాం కూడా ఎండగట్టింది. ఫిలిప్పైన్స్ రాజధాని మనిలాలో జరుగుతున్న ఆగ్నేయాసియా దేశాల ప్రాంతీయ భద్రతా సమావేశాల్లో చైనా వైఖరిని వ్యతిరేకించాలని ఆసియన్ సభ్యదేశాలను కోరింది. ఆసియన్‌లోని పది సభ్య దేశాలతో పాటు చైనా, ఐరాస, రష్యా, అమెరికా, ఉత్తర కొరియాల నుంచి కూడా దౌత్యవేత్తలు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఆదివారం నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయి. ఉత్తర కొరియా మీద ఆంక్షలు విధించడానికి ఐరాస సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశంలో వియత్నాం చైనాతో పాటు ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా వైఖరి తీసుకోనుంది. ఆసియన్ దేశాలన్నీ ఉత్తర కొరియా అణ్వస్త్ర క్షిపణి కార్యక్రమాలను వ్యతిరేకిస్తున్నాయి. వియత్నాం చొరవతో చైనానూ వ్యతిరేకించే అవకాశం ఉంది. అయితే.. ఫిలిప్పైన్స్ మాత్రం చైనాకు వ్యతిరేకంగా మాట్లాడడానికి జంకుతుండడం వల్ల ఆసియన్ దేశాలు ఏ మేరకు కలిసి వస్తాయో అనుమానమే. కానీ ఆసియన్‌లోనూ ఫిలిప్పైన్స్ తప్ప మిగిలిన దేశాలన్నీ చైనా పెత్తనానికి వ్యతిరేకమే. ఫిలిప్పైన్స్‌ను కూడా బిలియన్ల కొద్దీ డాలర్లను పెట్టుబడి పెట్టి చైనా తన వైపునకు మరల్చుకుంది.దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ ఏకంగా కృత్రిమ ద్వీపాలనే నిర్మించే ప్రయత్నం చేస్తోంది. ఈ కారణంగా పలు దేశాలకు ముంపు ప్రమాదమూ ఉండొచ్చు. అయినప్పటికీ వారం రోజుల్లో చైనాతో ఎలా వ్యవహరించాలో ఆసియన్ ఒక కోడ్ రూపొందించే అవకాశం ఉంది.మొత్తానికి భారత్ దౌత్యం ప్రస్తుతానికి అంతర్జాతీయంగా చైనాకు వ్యతిరేకంగా పని చేస్తోంది.

మాటిచ్చిన మరుసటి రోజే నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అర్జీలు, గ్రామ సమస్యలను నెలల తరబడి నాన్చకుండా సాధ్యమైనంత త్వరలో పరిష్కరించే దిశగా అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేస్తున్నారు. పాత విధానాలకు స్వస్తి చెప్పి తనదైనశైలిలో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజా ప్రతినిధులను స్వయంగా దగ్గరకు పిలిచి మాట్లాడుతున్నారు. స్థానిక ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి అజెండాకు సంబంధించి చర్చించి అక్కడికక్కడే నిధులు మంజూరు చేస్తున్నారు. తాజాగా కేశవరం, లక్ష్మాపూర్ గ్రామాలను సందర్శించి తన వినూత్న ప్రయోగాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చారు. ఆ గ్రామాల సమస్యల పరిష్కారానికి స్థానిక నేతలు అడిగిన కన్నా ఎక్కువ నిధులను మంజూరుచేసి, ఆ మరుసటి రోజే నిధులను విడుదల చేయడం ఆసక్తికరంగా మారింది. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కేశవరం గ్రామానికి రూ.12.26 కోట్లు, లక్ష్మాపూర్ గ్రామానికి రూ.15.50 కోట్లను కేవలం ఒకే రోజు తేడాతో విడుదలచేసి మాట నిలబెట్టుకున్నారు. మొత్తం రూ.27.76 కోట్ల మొత్తాన్ని విడుదల చేస్తూ ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రణాళికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డీపీ ఆచార్య జీవో విడుదల చేశారు. దీంతో ఇక సీఎం కేసీఆర్ ఏ గ్రామాన్ని సందర్శించినా, ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని కోరినా, ఏ సమస్యను విన్నవించినా ఇదే తరహాలో స్పందిస్తారన్న నమ్మకాన్ని, ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తంచేస్తున్నారు. సమీప భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యలు పేరుకుపోయి ఉన్న గ్రామాలన్నింటిని గుర్తించి వరుస పర్యటనలకు సిద్ధమవుతోంది. సీఎంకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు పలికేందుకు ప్రజలు సంసిద్ధమయ్యారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా కోరిన వెంటనే నిధులు విడుదల చేస్తున్నందుకు అదే తరహాలో జనంలో స్పందన కనిపిస్తోంది. స్పందిస్తోంది.

ప్రతియేటా అధికారికంగా ఆచార్య జయశంకర్ జయంతోత్సవాలు

అన్ని శాఖలు, జిల్లా కలెక్టర్లకు సర్కార్ ఆదేశాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రతియేటా ఆగస్టు 6న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు ఈ ఉత్సవాలను నిర్వహించాలని స్పష్టంచేసింది. ఈ మేరకు శని వారం సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా జీవో విడుదల చేశారు. అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరెక్టర్లు, జిల్లా కలెక్టర్లు విధిగా ఆచార్య జయశంకర్ జయంతోత్సవాలను నిర్వహించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు.

నితీశ్ వెనక ఆ 'ఇద్దరు'..

• నితీశ్‌ను ఎన్డీయే వైపు నడిపించిందెవరు? • షా లేకుండానే నడిచిన రాజకీయం • లాలూపై దాడులకు, నితీష్ రాజీనామాకు లింకేటి?

న్యూఢిల్లీ: రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులుండరంటారు. ఇటీవల బీహార్‌లో జరిగిన పరిణా మాలు చూస్తుంటే అదినిజమేనని మరోసారి రుజువైంది. సార్వ త్రిక ఎన్నికలకు ముందు దాయాదుల్లా పోటీ పడిన బీజేపీ, జేడీయూ రాత్రికి రాత్రి దోస్తీ కట్టడం వెనకున్న మర్మమేంటన్న ఆసక్తి సర్వత్రా కొనసాగుతోంది. నితీ ష్ చెప్పినట్లు అవినీతి మకిలిని తొలగించుకునేందుకే లాలూ నేతృత్వంలోని ఆర్జేడీకి రాం..రాం.. పలకడం అంత నమ్మశక్యంగా లేకపోవడంతో తెరవెనక నడిచిన అసలు కథ ఏంటన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీని విస్తరించడంలో ఎత్తులు వేయడంలో ప్రస్తుతానికి అమిత్ షాను మించిన నాయకుడు బీజేపీలో లేడన్నది ఆపార్టీ నేతలే చెప్పేమాట. మరి బీహార్ రాజకీయాల్లో షా వేలుపెట్టకుండా నితీష్ ను ఎలా దరిచేర్చుకున్నారనేదానిపైరాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

బీజం వేసింది ఆ ఇద్దరే

జేడీయూను బీజేపీకి దరికి చేర్చడంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, బీజేపీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ మోడీలదే కీలక పాత్ర అని తెలుస్తోంది. బీహార్‌లో రాజ్యాధికారమే కాకుండా పెద్దల సభలో పెత్తనం కోసం జైట్లీ ముందస్తుగానే ప్లాన్ వేసినట్లు సమాచారం. ఆదాయపుపన్ను, ఎన్ ఫోర్స్ మెంట్ డిపార్ట్ మెంట్ల తన మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉండటంతో వాటిని లాలూపై ప్రయోగించడం ద్వారా నితీష్‌ను దరిచేర్చుకోవచ్చని ప్రణాళికలు రచించినట్లు ప్రచారం జరుగుతోంది. సుశీల్ మోడీ కూడా జైట్లీ రాజకీయ చతురతకు కృతజ్ఞతలు తెలిపారని సమాచారం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న లాలూ కుటుంబంపై సీబీఐ,ఐటీ, ఈడీలు వరుస దాడులు చేయడమే కాకుండా ఆస్తులను సైతం జప్తు చేయడంతో సీన్ రివర్సయింది. ఇదే క్రమంలో లాలూ కుమారుడు,బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్‌ను తన పదవికి రాజీనామాచేసి, ఆయనపై ఉన్న మచ్చను తొలగించుకోవాలని కోరారు. అందుకు లాలూ సరేమిరా అనడంతో నితీష్ కొంతకాలంగా రచిస్తున్న వ్యూహాలకు పదునుపెంచకతప్పలేదు.

ఆ ఘటనతో గాయపడిన నితీష్ హృదయం

ఆర్జేడీ, జేడీయూ సయోధ్యతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నితీష్‌కు గతేడాది సెప్టెంబర్‌లో భయంకరమైన నేరచరిత్ర కలిగి, విజయవంతమైన రాజకీయ ప్రస్థానం ఉన్న ఆర్జేడీ మాజీ ఎంపీ షహబుద్దీన్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైనప్పుడు చేసిన





వ్యాఖ్యలు నితీష్‌ను ఘోర పరాభవానికి గురిచేసినట్లు పార్టీ వర్గాలు చెబుతుంటాయి.

తనకు లాలూ కంటే ఎవరూ సుప్రీం కాదని...నితీష్ ప్రస్తుతానికి సీఎం కావచ్చు గానీ..లాలూయే అసలు హీరో అని వ్యాఖ్యానించడం నితీష్ మదిలో చెరగని ముద్ర వేసుకుందట. తనపై జంగిల్ రాజ్‌గా ముద్ర పడక ముందే అవినీతి మకిలికి దూరంగా ఉండాలని అప్పుడే నితీష్ నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే క్రమంలో నితీష్ ను మళ్లీ ఎన్డీఏ కూటమిలోకి రావాలని ఆహ్వానం కూడా అందిందట. అయితే అందుకు నితీష్ ప్రత్యక్షంగా స్పందించకపోయినా..జేడీయూ కు చెందిన ఇద్దరు కీలక నాయకులు బీజేపీ అధినాయకత్వంతో టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

పెద్దనోట్ల రద్దుకు నితీష్ సంపూర్ణ మద్దతు

గతేడాది నవంబర్ లో ప్రధాని మోడీ పెద్దనోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించనప్పుడు నితీష్ బాహాటంగానే ఆ నిర్ణయాన్ని స్వాగతించడంతో జేడీయూ నుంచి తమకు అనుకూల సంకేతాలు వస్తున్నాయని బీజేపీ భావించింది. ఈనేపథ్యంలో బీహార్ బీజేపీ అధ్యక్షుడు సుశీల్ కుమార్ మోడీ, జేడీయూ నాయకులతో రహస్య మంతనాలు జరపడం, కొన్నిసార్లు జేడీయూ నాయకులు బీజేపీ ఢిల్లీ పెద్దలతో చర్చలు జరపడం చకచకా జరిగిపోయాయి. ఈనేపథ్యంలో ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు తన సంపూర్ణ సహకారాన్ని నితీష్ అందించినట్లు తెలుస్తోంది.

జూలై 22న జేడీయూ యూ టర్న్

జూలై 22న అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వీడ్కోలు కార్యక్రమానికి వచ్చేందుకు అన్ని ప్రతిపక్షాలు ససేమిరా అన్నప్పటికీ నితీష్ మాత్రం ఓకే చెప్పారు. అయితే చివరి క్షణంలో తనకు బదులు జేడీయూ నుంచి ఇద్దరు నాయకులు హాజరౌతున్నట్లు ప్రకటించారు. అదే రోజు జేడీయూ నాయకులు బీజేపీ అధినాయకత్వంతో ఎన్డీఏతో దోస్తీపై కూలంకుశంగా చర్చించినట్లు సమాచారం. జులై 7వ తేదీ నుంచి లాలూ కుటుంబంపై సీబీఐ దాడులు మొదలవడంతో నితీష్ కూడా అవినీతి మకిలి నుంచి బయటపడేందుకే సముఖంగా ఉన్నట్లు జేడీయూ నేతలు బీజేపీ అధినాయకత్వానికి వివరించినట్లు ప్రచారం జరుగుతోంది. బీహార్ రాజకీయాల్లో తనకంటూ చెరగని ముద్ర వేసుకోవాలని మొదటి నుంచి భావిస్తున్న నితీష్...ఆర్జేడీతో తెగతెంపుల కోసం ఎన్నోరోజులుగా ఎదురుచూస్తుండగా..తేజస్వి వ్యవహారాన్ని తనకు అనుకూలంగా మలచుకున్నారు. పైకి రాజీనామా చేయాలని తేజస్విని కోరినప్పటికీ...లాలూ అండ్ కో నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ముందే ఊహించి ఈ పాచిక వేశారు. తాను ఊహించినట్లుగానే ఆర్జేడీ ప్రవర్తించడంతో నితీష్ కు మార్గం సుగమమైంది. చివరగా మరోసారి రంగంలోకి దిగిన బీహార్ బీజేపీ అధ్యక్షుడు సుశీల్ మోడీ మొత్తం ఎపిసోడ్‌పై నితీష్ తో చర్చించి ఆయన నేతృత్వంలోనే ప్రభుత్వ ఏర్పాటుకు జై కొట్టారు. దీంతో రాజీనామా చేసిన 12 గంటలకు మళ్లీ ప్రమాణ స్వీకారం చేసిన సీఎంగా నితీష్ రికార్డు సృష్టించారు.

ఈ మొత్తం వ్యవహారంలో తెరవెనక షా, మోడీ రాజకీయం చేసినా...కీలక పాత్ర దారులు మాత్రం జైట్లీ, సుశీల్ మోడీయే. బీహార్ రాజకీయాలపై ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకుంటూ ముందుకు సాగిన వీరిద్దరు 2013 లో ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వెళ్లిన నితీష్ మళ్లీ తమ దరికి చేరేలా చేశారు. తనకు తెలియకుండా మోడీని 2014 ఎన్నికల బీజేపీ ప్రచార సారథిగా ఎంపిక చేశారని నితీష్ ఎన్డీఏ కూటమి నుంచి వాకౌట్ చేశారు.

ఆ పదవులు మరో మూడేళ్లు?

(మొదటిపేజీ తరువాయి)

అంగీకారం తెలిపినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 903 సహకార సంఘాలకు ఓటే విధానాన్ని వర్తింపజేయాలని కూడా ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. చట్టం ప్రకారం సంఘాల పదవీకాలం ముగిసే సమయానికి 45 రోజులు ముందుగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. అంతకన్నా మూడు నెలల ముందుగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ప్రక్రియ, పరిశీలన తుది జాబితాలు సిద్ధంచేసి బహిరంగంగా ప్రకటించాల్సి ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎన్నికలకు వెళితే రాజకీయ వ్యవస్థతో ముడిపెట్టుకుని ఉన్న క్షేత్రస్థాయి పరపతి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. 2019 ఎన్నికల నేపథ్యంలో సహకార ఎన్నికలను వాయిదా వేయాలన్న దిశగా సీఎం కేసీఆర్ యోచిస్తున్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందింది.

ప్రభుత్వానికుండే విశిష్టాధికారాల మేరకు ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగిసిన తర్వాత గరిష్టంగా ఆరు నెలల్లోగా గడువును పొడిగిస్తూ ఆర్డినెన్స్‌ను జారీ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మూడుసార్లు ఆర్డినెన్స్‌ల ద్వారా పదవీ కాలాన్ని పొడిగించేందుకు వీలుంది. ఆ తర్వాత తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని చట్టం చెబుతోంది. కానీ ప్రభుత్వం తలుచుకుంటే మంత్రిమండలి తీర్మాణంతో మరోసారి కూడా గడువును కొడిగించే అధికారం ఉందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. అయితే, ఆ ఆర్డినెర్స్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే సార్వత్రిక ఎన్నికల నాటికి సహకార సంఘాల గడువు పొడిగింపుల ప్రక్రియను కొనసాగించి, 2019 ఎన్నికల్లో మరోసారి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాతే ప్యాక్స్‌లకు కొత్త పాలకమండళ్ళ ఏర్పాటుకు సం బంధించి చర్యలకు పూనుకోవాలన్న ఆలోచనతోనే కేసీఆర్ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రామ స్థాయిలో ప్యాక్స్ కీలక పాత్ర

గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో, చిన్న సన్నకారు రైతు కుటుంబాలతో పెనవేసుకొని ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వ్యవసాయ రంగానికి అవసరమైన మౌళిక వనరులను సమకూర్చడంతో పాటు ప్రభుత్వం విడుదల చేసే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర ప్రోత్సాహకాలను బట్వాడా చేస్తుంది. రాజకీయ వ్యవస్థతో ముడిపెట్టుకొని ఉన్నప్పటికీ, ఈ సంఘాలను రద్దు చేస్తే మరో కోణంలో అనేక సమస్యలు ఎదుర్కొనక తప్పదని ఆర్థిక సామాజిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గతంలో 2004లో నియమించిన వైద్యనాథన్ కమిటీ సిఫారసుల మేరకు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 17రాష్ట్రాల్లోని 53వేల సహకార సంఘాలకు రూ.9వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. 2009లో మరోసారి అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం ప్రకాష్ భక్షి కమిటీని నియమించి సహకార సంఘాలే అవసరం లేదని తేల్చింది.

అప్పట్లో జరిగిన వ్యవహారమిదీ

రైతులు, రైతు సంఘాల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని అప్పట్లో ప్రకాష్ భక్షి సిఫారసుల అమలులో కేంద్ర ప్రభుత్వం కాస్త వెనక్కి తగ్గింది. ఈ విషయంలో కేంద్రం చేసిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరిగా అమలు చేయాలన్న నిబంధన ఏమీలేదని స్పష్టం చేయడంతో సహకార సంఘాల మనుగడకు కాస్తంత బరోసా లభించింది. సహకార వ్యవస్థను మూడంచెల నుంచి రెండంచెలకు కుదించాలన్న ఆలోచనకు తాత్కాలిక బ్రేక్ పడింది. దీంతో వ్యాపార పరంగా సహకార బ్యాంకులను బలోపేతం చేయాలన్న నాబార్డు ఆలోచన కార్యరూపం దాల్చలేదు. కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో, ఆర్థికశాఖ ఆదేశాల మేరకు ఈ సిఫారసులు కేవలం మార్గదర్శక సూత్రాలు మాత్రమేనని అప్పట్లో నాబార్డు రాష్ట్ర ప్రాంతీయ కార్యాలయం వెల్లడించింది.

తీవ్రస్థాయిలో వ్యతిరేకించిన రైతులు

జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు చైర్మన్ ప్రకాష్ భక్షి నేతృత్వంలో నియమించిన నిపుణుల కమిటీ గతంలో చేసిన సిఫారసులపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఎదురైంది. రైతు సంఘాలు ఉద్యమబాట పట్టాయి. నాబార్డు ద్వారా అన్ని రాష్ట్రాల సహకార బ్యాంకులకు ఆదేశాలు వెలువడడంతో ఉద్యోగులు కూడా తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. రెండంచెల సహకార విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని, అందుకోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని దిశానిర్దేశాలు చేసిన అప్పట్లో యూపీఏ నేతృత్వంలోని కేంద్ర సర్కారు సందిగ్ధంలో పడింది. వ్యవసాయ రంగాభివృద్ధికి, రైతు సంక్షేమానికి పరోక్షంగా కీడు చేసే విధంగా ఉన్న ఈ నిర్ణయంపై జాతీయస్థాయిలోనూ ఉద్యోగ, కార్మిక, రైతు సంఘాలు, సామాజిక, ఆర్థిక రంగ నిపుణులు మొదట్లోనే వ్యతిరేకించారు. నాడు అవసరం లేదనుకున్న సహకార పరపతి వ్యవస్థను పునరుద్ధరించి పూర్వవైభవం తీసుకురావాలన్న ఆలోచనతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహాత్మకంగా ముందడుగు వేస్తున్నారు. అవసరమైతే ఇప్పుడున్న వ్యవస్థకు అనుబంధంగా రాజకీయ జోక్యం లేకుండా మరో పరపతి వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామస్థాయిలో రైతులకు మరింత చేదోడు, వాదోడుగా ఉండాలన్న కోణంలో ఆలోచిస్తున్నారు. అందులో భాగంగానే ఇప్పుడున్న సహకార సంఘాల పాలక మండళ్ళ కాల పరిమితిని మరోమారు పొడిగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ప్రజలకు వారసత్వ సంపద చెరువులే

• పుస్తకావిష్కరణలో మంత్రి హరీశ్‌రావు

నల్లకుంట, కెఎన్ఎన్ : తెలంగాణ ప్రజలకు వారసత్వ సంపద చెరువులేనని, ప్రజల బతుకుదెరువు చెరువులేనని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. సత్కళాబారతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కవిసామ్రాట్ డాక్టర్ తిరుమల శ్రీనివాసరావు రచించిన కాకతీయ వైభవము పద్యకావ్యం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి హరీష్‌రావు పుస్తకం ఆవిష్కరించారు. కవి తన పద్య పుస్తకాన్ని హరీష్‌రావుకు అంకిత



చేశారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ ఈ పుస్తకం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతమని ఇది తెలంగాణ ప్రజలు, ప్రభుత్వంకు ఇచ్చినట్లుగా తాను భావిస్తున్నాని చెప్పారు. కవి తన 80యేళ్ళ వయసులో గొప్ప కావ్యాన్ని రాశారని అభినందించారు. కాకతీయుల వైభవాన్ని సిఎం కేసిఆర్ ఉద్యమ సమయంలోనే గుర్తించారని, 65వేల చెరువుల బాగుకు సీఎం ప్రత్యేక చర్యలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో పంటలు ఎండకుండా, వలసలు జరగకుండా, ఆత్మహత్యలు జరగకుండా సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పద్యానికి ప్రసిద్ది అన్నారు. దాశరధి, వానమాముల వరదాచారి, జగన్నాదాచారి నుంచి నేటి శ్రీనివాసులచారి వరకు పద్యకావ్యం కొనసాగడం అబినందనీయమన్నారు. పుస్తక రచయిత కవి శ్రీనివాసాచారి మాట్లాడుతూ మిషన్‌కాకతీయ అంటే జలసమృద్ధి అని కవులకు హృదయం లేకపోతే కవి కాదన్నారు.

కొలిక్కిరాని సహకార సమస్యలు

• ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం జరుపుతున్న చర్చల్లో ప్రతిష్టంభన • పది రోజులు పూర్తయినా కమిషనర్ నుంచి స్పందన కరువు • ఉద్యోగుల్లో మళ్లీ మొదలైన ఆందోళన • సోమవారం మరోసారి సమ్మె నోటీసు ఇవ్వాలని నిర్ణయం

• జోవో 151ని సవరించే వరకు వదలిపెట్టం: సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర వ్యాప్తంగా సహకార ఉద్యోగుల డిమాండ్లపై కొనసాగుతున్న ఆందోళనకు ఇప్పటికీ పరిష్కారం లభించలేదు. ప్రభుత్వాదేశాల మేరకు ఉద్యోగ సంఘాల నాయకులతో సహకారశాఖ కమిషనర్ చర్చలు జరిపినప్పటికీ భరోసా ఇవ్వలేదు. దీంతో ఉద్యోగులు మరోసారి సమ్మెకు సిద్ధమవుతున్నారు. సోమవారం రెండోసారి సమ్మె నోటీసు అందజేయనున్నట్లు తెలంగాణ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ సర్దార్ తెలిపారు. సమస్యలు పరిష్కారమవుతాయన్న నమ్మకం కోల్పోయిన సహకార ఉద్యోగులు సమ్మెబాట పట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రధానమైన డిమాండ్ ఉమ్మడి రాష్ట్రంలో విడుదల చేసిన జీవో 151ని సవరించడంతో పాటు సంఘాల బలోపేతం, ఉద్యోగుల భద్రతకు సంబంధించి 13 డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ సంఘాల నేతలు పది రోజుల క్రితం సమ్మెనోటీసు అందజేశారు. అప్పటి నుంచి సహకారశాఖ కమిషనర్ వీరభద్రయ్య నేతృత్వంలో పలుసార్లు పాక్షిక చర్చలు జరిపినప్పటికీ అవి కొలిక్కి రాలేదు. ప్రస్తుతం ఈ చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. సమస్యల పరిష్కారానికి స్పష్టమైన భరోసా రానిపక్షంలో తక్షణమే సమ్మెకు పూనుకుంటామన్న విషయాన్ని నాయకులు మరోసారి తేల్చిచెప్పారు. సరిగ్గా ఖరీఫ్ సీజన్ ప్రారంభ సమయంలోనే కీలక పాత్ర పోషించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగులంతా సమ్మెకు పూనుకోవడంతో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాల మేరకు క్షేత్రస్థాయిలో వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి దోహద పడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులకు ప్రత్యేక రాష్ట్రంలోనూ అన్యాయమే జరుగుతోందన్న ఆందోళన నానాటికీ పెరుగుతోంది. ఈ సంఘాల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు అన్యాయం జరిగే విధంగా, వేతనాలు పెరగకుండా ఉండే విధంగా, ఉద్యోగాలకు భద్రత లేకుండా ఉమ్మడి రాష్ట్రంలో విడుదల చేసిన జీవో 151ని ఇప్పటి వరకు రద్దు చేయకపోవడంపట్ల తీవ్రమైన నిరసనలు కొనసాగుతున్నాయి. 2009, జూన్ 22న విడుదల చేసిన ఈ జీవోపై ఇప్పటి వరకు కేసీఆర్ ప్రభుత్వం సమీక్షించకపోవడాన్ని నిరసిస్తూ ఉద్యోగ సంఘాల నాయకులు సమ్మెకు పిలుపునిచ్చారు. ఈ అంశంపై తక్షణమే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామంటూ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎండి సర్దార్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ గౌడ్, కోశాధికారి నరేందర్‌రెడ్డిల నేతృత్వంలో ప్రభుత్వానికి సమ్మె నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే.

సంబంధిత మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి పార్థ సారధి, సహకార శాఖ కమిషనర్, టెస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్‌లకు ఈ నోటీసులను ఇచ్చినట్లు అధ్యక్షుడు ఎండి సర్దార్ తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించి మూడేళ్ళు గడుస్తున్నా ఏడేళ్ళ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తంచేశారు. సహకార చట్టం ప్రకారం 2009లో జారీ చేసిన 151 జీవోను ఐదేళ్ళ తర్వాత సవరించాల్సి ఉందన్నారు. అయినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిర్ధిష్టమైన కాలవ్యవధిలో తమ శాఖ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.


దశల వారీగా ఆందోళనలు పూర్తి

ఇప్పటి వరకు సహకార ఉద్యోగుల సంఘం తీర్మాణించిన ఆందోళన కార్యక్రమాల్లో గత నెల 10న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా, డిడిఎం, నాబార్డు, డీసీవో, డీసీసీబీ కార్యాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు పూర్తయ్యాయి. అలాగే 14న రాజధాని నగరంలోనూ సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముందు భారీ ధర్నాతో నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించే పరిస్థితులు కనిపించకపోవడంతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉన్న సహకార ఉద్యోగుల డిమాండ్లు

1. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
2. జీవో 151ని సమీక్షించి వెంటనే సవరించాలి.
3. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా కొత్త వేతనాలు అమలు చేయాలి.
4. పీఏసీఎస్ సీఈవోలకు బ్యాంక్ సూపర్‌వైజర్ స్కేలును, స్టాఫ్ అసిస్టెంట్లకు క్లార్క్ స్కేలును, సబ్ స్టాఫ్‌కు అటెండర్ స్కేలును వర్తింపజేయాలి.
5. వేతనాల చెల్లింపు ప్రక్రియలో నాబార్డు గైడ్‌లైన్స్‌ను తొలగించాలి.
6. డీసీసీబీలకు ఉన్న 2శాతం వర్కింగ్ ఫండ్‌ను పీఏసీఎస్‌లకు వర్తింపజేయాలి.
7. టెస్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్‌లు వేతన మొత్తాలను సమానంగా భరించాలి.
8. డీసీసీబీల్లో 5వ కేడర్ ఉద్యోగాల ఖాళీలను పీఏసీఎస్ ఉద్యోగుల పదోన్నతులతో భర్తీ చేయాలి.
9. సహకార సంఘాలను బలోపేతం చేయాలి.
10. ప్రత్యేక నిధులు కేటాయించి సంక్షేమ పథకాలను ఈ సంఘాల ద్వారానే అమలు చేయాలి.
11. ఉద్యోగులందరికీ ప్రభుత్వ హెల్త్‌కార్డులు అందజేయాలి.
12. డీసీసీబీల్లో ఉన్న పీఏసీఎస్‌ల వాటాధనంపై 6శాతం సంఘాలకు వడ్డీ చెల్లించాలి.
13. పీఏసీఎస్ ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలి.

సముద్ర గర్భంలో అన్వేషణలు



సబ్‌మెర్సిబుల్ తయారీలో భారత్

అంతరిక్ష యాత్రల్లో అనేక విజయాలు సాధించిన భారత్, భూమ్మీద సముద్రాల శోధనలో వెనకబడే ఉంది. ఆ వెనకబాటుతనాన్ని తొలగించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) పూనుకుంది. సబ్‌మెర్సిబుల్స్ పేరిట బుల్లి జలాంతర్గాముల తయారీకి సిద్ధమైంది. వచ్చే ఐదేళ్లలో భారత్‌కు సొంత సబ్‌మెర్సిబుల్ వచ్చేస్తుంది. దీంతో శాస్త్రజ్ఞులు సముద్రాల్లో ఆరు కిలోమీటర్ల లోతు వరకు వెళ్లి పరిశోధనలు జరపవచ్చు. ఈ బుల్లి జలాంతర్గామి సిద్ధమైతే భారత్ కూడా చైనా, అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్ సరసన చేరుతుంది. ఈ దేశాలు మాత్రమే ఇప్పటి వరకు సముద్రాల్లో సొంతంగా పరిశోధనలు జరుపగలవు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అనుమతులు రాగానే ఇస్రో, డీఆర్‌డీఓ, ఐఐటీల నుంచి నిపుణులు వచ్చి తయారైన డిజైన్లను చూసి తమ సలహాలతో మెరుగుపరుస్తారు. ఈ సబ్‌మెర్సిబుల్‌ను ఒక ఓడ నుంచి సముద్రంలోకి వదులుతారు. దీని వ్యాసం 3.2 మీటర్లు ఉంటుంది. ఈ వాహనాన్ని టైటానియంతో తయారు చేస్తారు. శాస్త్రజ్ఞులు ఈ వాహనంలో నీటి అడుగున 10 గంటల వరకు ఉండి లోహాలు, రత్నాలు, భూమ్మీద లేని జీవరాశుల మీద పరిశోధనలు చేయొచ్చు. గాజు కిటికీల ద్వారా సముద్రాన్ని వీరు చూస్తారు.

ట్రంప్ మరో షాక్

• అమెరికాకు వెళితే ఐదేళ్ల వరకు సంక్షేమ ఫలాలు నిల్ • నిబంధనలు కఠినతరం • ఇమ్మిగ్రంట్స్ విలవిల • కొత్త ఆంక్షలపై వలసదారుల ఆందోళన



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసదారులకు మరో షాక్ ఇచ్చారు. విదేశాల నుంచి తమ దేశానికి వలస వచ్చే వారు ఐదేళ్ల వరకు సంక్షేమ పథకాలను పొందలేరని స్పష్టం చేశారు. ప్రతిభ ఆధారిత వలస విధానానికి మద్దతు పలికిన ట్రంప్...తమ దేశ కార్మికులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. గతంలో లాగా ఇప్పుడు అమెరికాకు వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల లబ్ధి పొందడం కుదరదు. మా దేశంలోకి వలస వచ్చేవారి సంక్షేమ ఫలాలు అందుకోవాలంటే ఐదేళ్లు ఆగాల్సిందే.. అమెరికన్ కాంగ్రెస్‌లో చేసిన నా ప్రసంగంలో చెప్పినట్టు ..''మాదేశం ఉన్నతంగా కలలు కంటోంది. సాహసోపేతంగా ముందుకు వెళ్తోంది'' అని ప్రవేశాల నిర్వహించే వెబ్ రేడియో కార్యక్రమంలో ట్రంప్ అన్నారు. ''అమెరికాకు వల ..వచ్చేవారు ఐదేళ్లపాటు మా సంక్షేమ పథకాలను అడగను గానీ, వినియోగించడం గానీ చేయబోమని చెప్పాలి'' అని వెల్లడించారు. ప్రతిభ ప్రాతిపదికన గ్రీన్ కార్డులు జారీ చేయాలంటూ రూపొందించిన రైజ్- రిఫార్మింగ్ అమెరికన్ ఇమిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్ బిల్లుకు ఇటీవల ప్రభుత్వం మద్దతు తెలపడంతో ట్రంప్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇన్నాళ్లు గ్రీన్ కార్డుల జారీకి అనుసరించిన లాటరీ విధానానికి స్వస్తి పలుకుతున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి గ్రీన్ కార్డులు పొందాలంటే ఇంగ్లీష్‌లో నైపుణ్యం, ఉన్నతవిద్య, అధిక వేతనం, వయసులను ప్రాతిపదికగా తీసుకుంటామని చెప్పారు. ట్రంప్ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన నూతన బిల్లు భారతీయులకు వరమేనని భావిస్తున్నప్పటికీ...అమెరికా రోజురోజుకూ ఆంక్షలను పెంచడంపై వలసదారులు ఆందోళన చెందుతున్నారు.

చర్చలే పరిష్కారం



న్యూఢిల్లీ: మత ఛాందసవాదాలు, భిన్న మతాల మధ్య ఘర్షణలు, వివక్ష తదితర సమస్యలు చర్చలతోనే పరిష్కారమవుతాయని భారత ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచమే ఒక కుగ్రామం అయిందని, దీంతో యావత్ ప్రపంచాన్ని ఎన్నో సమస్యలు పట్టిపీడిస్తున్నాయన్నారు. ఇటువంటి సమస్యలన్నింటికీ చర్చలే అసలైన మార్గమని ఉద్ఘాటించారు. భారత గత సాంప్రదాయాలు కూడా ఇదే విషయాన్ని చెప్పాయని గుర్తుచేశారు. 'తర్క శాస్త్ర' పేరుతో ప్రతి సమస్యపై ఆయా సమాజాలకు పెద్దలు దృష్టి సారించేవారన్నారు. 'సంవాద్-గ్లోబల్' అనే కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ఓ వీడియో సందేశంలో మాట్లాడారు. భారత్‌కు అద్భుతమైన నాగరికత ఉందని, ఇక్కడి ప్రజానీకం భిన్నత్వంలో ఏకత్వంగా నివాసం కొనసాగిస్తారని అభిప్రాయపడ్డారు. ఇతిహాసాల్లో రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, భక్త ప్రహ్లాదులంతా సగటు మనిషి చేయాల్సిన కర్మల గురించి క్షుణ్ణంగా వివరించారన్నారు. వాతావరణ పరిరక్షణలో కూడా ఇదే విధానం అందరికీ వర్తించాలన్నారు. వాతావరణాన్ని మనమంతా ఐక్యంగా రక్షించాలని చెప్పారు. వాతావరణ పరిరక్షణే ఆధునిక సమాజ నినాదం కావాలని మోడీ అభిప్రాయపడ్డారు. అప్పుడే దేశ ప్రజానీకానికి వాతావరణ రక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలుగుతుందన్నారు.

నింగికెగరనున్న మోడీ పతంగులు



కాన్పూర్: భారత స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ప్రధానమంత్రి మోడీ ఫొటోతో రూపొందించిన పతంగులు నింగికెగరనున్నాయి. మోడీ ఫొటోతో పాటు 'మహా నాయక్', 'అచ్చే దీన్' పదాలున్నటువంటి పతంగులను ఆ రోజు పెద్ద ఎత్తున ఎగురవేయనున్నారు. స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా కాన్పూర్ మొత్తం మోడీ పతంగులు ఎగురవేయాలని స్థానిక నాయకులు, ప్రజానీకం నిర్ణయించుకున్నారు. దీంతో, ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా మోడీ పతంగుల తయారీ కేంద్రాలు దర్శనమిస్తున్నాయి. దంగల్ సినిమాలోని కార్టూన్‌క్యారెక్టర్‌లైన డోర్‌మన్, బార్బీ, టామ్ అండ్ జెర్రీచిత్రాలున్నాయి. అయితే, గత సంవత్సరం కంటే ప్రస్తుతం మోడీ పతంగులకు భారీగా గిరాకీ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

పీఓకేలో చైనా ఆనకట్టలు: కేంద్రం



న్యూఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో చైనా సాయంతో పాకిస్థాన్ ఆరు ఆనకట్టలను నిర్మిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ ఈ మేరకు రాజ్యసభకు రాతపూర్వకంగా తెలియజేసారు. ఈ నిర్మాణాలను వ్యతిరేకిస్తూ పాక్, చైనాలకు కేంద్ర ప్రభుత్వం నోటీసులిచ్చిందని సింగ్ తన సమాధానంలో తెలిపారు. పీఓకేలో పాక్, చైనాల నిర్మాణాల భారత సార్వభౌమాధికారానికి వ్యతిరేకమని స్పష్టం చేసారు. పీఓకేలోని ప్రాంతాలు.. పాక్, చైనాల అక్రమణలో ఉన్నాయని తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. ఈ విషయంపైనే తాము పాక్, చైనాలకు నోటీసులు జారీ చేసామని, ఇదే విధానాన్ని కొనసాగిస్తామని ఆయన ప్రకటించారు. మంత్రి ప్రకటనపై సోషల్ మీడియాలో తీవ్ర స్పందన వచ్చింది. అసలు ఈ నిర్మాణాల మీద బాంబులు వేయకుండా భారత్ ఎందుకు ఊరుకుంటోందని ప్రశాంత్ పటేల్ అనే వ్యక్తి ట్విటర్లో ప్రశ్నించాడు.

చైనా డ్రోన్స్ మాకొద్దు: అమెరికా



న్యూయార్క్: చైనా తయారీ మానవ రహిత విమానాలను వాడొద్దని అమెరికా నిర్ణయించింది. ఆ దేశానికి చెందిన ఎస్‌జడ్ డీజేఐ టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్ తయారు చేసిన డ్రోణులను తేలిగ్గా హ్యాకర్లు నియంత్రించవచ్చని తేలింది. డ్రోణులే కాదు, ఇతర పరికరాలు, సాఫ్ట్‌వేర్‌లను కూడా వాడొద్దని మిలిటరీ నిర్ణయించింది. అమెరికా సైన్యం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల చైనా కంపెనీ డీజేఐ నిరసన వ్యక్తం చేసింది. సైబర్ లోపాల పేరిట అమెరికా ఈ కంపెనీ పరికరాలను వాడరాదని నిర్ణయించింది. దీంతో ఆ లోపాలేమిటో తెలుసుకుంటామని డీజేఐ ప్రతినిధి చెప్పారు. తమ కంపెనీకి ప్రపంచ డ్రోన్ మార్కెట్లో 70 శాతం వాటా ఉందని ఆయన అనన్రు. అయితే.. అమెరికాలోని ఆర్మీ రిసెర్చ్ లేబరేటరీ సిఫార్సుల మేరకే అమెరికా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

నిరసనలొద్దు.. సాయం చేయండి



అహ్మదాబాద్: కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై దాడికి యత్నించిన కేసులో గుజరాత్ పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడు జయేష్ దర్జి అలియాస్ అనిల్ రాథోడ్‌గా గుర్తించినట్లు బనస్కాంతా జిల్లా ఎస్పీ నీరజ్ బడ్గ్ జార్ తెలిపారు. కాంగ్రెస్ నేతలు పేర్కొన్న అనుమానితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. అయితే రాహుల్‌పై దాడికి యత్నించింది స్థానిక బీజేపీ ఆఫీస్ బేరరేనని ఆరోపించారు. పోలీసులు అరెస్ట్ చేసిన జయేష్ దర్జి బనస్కాంత జిల్లా బీజేపీ యువమోర్చా కార్యదర్శి అని ఆరోపించారు. రాహుల్‌పై దాడికి నిరసనగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. అయితే.. తనపై దాడికి యత్నించినందుకు నిరసన తెలిపేకంటే వరద బాధితులను ఆదుకునేందుకే సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ పిలుపునిచ్చారు. రాస్తారోకో, ధర్నాలతో మీ శక్తిని హృదా చేసుకోకం డి.. గుజరాత్‌లోని వరద బాధితులకు సాయం చేయండి అంటూ రాహుల్ గాంధీ కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. వరదబాధితుల బాధలను పంచుకునేందుకు శుక్రవారం గుజరాత్‌లో పర్యటించిన రాహుల్ గాంధీపై కొందరు దాడికి యత్నించడంతో గుజరాత్, చండీగఢ్, ఢిల్లీ, ముంబై ప్రాంతాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. దీంతో స్పందించిన రాహుల్ గాంధీ.. బాధితులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

టార్గెట్ రాజ్యసభ

• సభలో దూకుడు పెంచడమే లక్ష్యం • పావులు కదుపుతున్న అమిత్ షా



న్యూఢిల్లీ: కేంద్ర కేబినెట్‌లోకి రావడం లేదు సరే, మరి రాజ్యసభకు ఎందుకొస్తున్నట్టు? తాను మంత్రి కాబోవడంలేదని అమిత్ షా ప్రకటన తర్వాత దేశవ్యాప్తంగా తలెత్తుతున్న సందేహాలు. గుజరాత్ నుంచి అమిత్ షా రాజ్యసభ ఎన్నికల్లో బరిలో దిగినందున, కేంద్ర మంత్రివర్గంలో చేరతారని జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ తాను పార్టీలోనే కొనసాగుతానని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో బీజేపీలో చోటు చేసుకుంటున్న అనూహ్య మార్పులు సర్వత్రా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. అమిత్ షా బీజేపీ సారధ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీని దేశం నలుమూలలా విస్తరించడంలో చాలా వరకు విజయం సాధించారు. విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి సంఖ్యాబలం ప్రకారం అతి పెద్ద రాజకీయ పార్టీగా బీజేపీని రికార్డుల్లోకెక్కించిన ఘనత కూడా ఆయనదే. అటు ప్రజాక్షేత్రంలోనూ, ఇటు చట్టసభల్లోనూ ఎవరికీ అంతు చిక్కని రాజకీయ వ్యూహాలతో పార్టీని పరుగులు తీయిస్తున్నారు. అలాంటి నేత రాజ్యసభలో అడుగు పెట్టాల్సిన అవసరమేముంది?

రాజకీయ పార్టీల్లో అధ్యక్షుడిగా ఉన్నవాళ్లు ఏ ఇతర పదవులు చేపట్టకూడదన్న నిబంధనేమీ లేదు. ప్రాంతీయ పార్టీల్లో పార్టీ అధినేతలే ముఖ్యమంత్రులుగా ఉంటున్నారు. ఆ క్రమంలో ప్రస్తుతం అమిత్ షా గుజరాత్ అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో అమిత్ షా ఆ రాష్ట్ర హోంమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం జాతీయాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినందున ఎమ్మెల్యేగా మాత్రమే కొనసాగారు. అయితే గుజరాత్ రాష్ట్రానికి ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. తద్వారా ఎమ్మెల్యే పదవీకాలం కూడా ముగుస్తోంది. ఇప్పుడు రాజ్యసభకు వెళ్లడం వల్ల పార్టీకి మరింత ఉపయోగకరంగా ఉంటుందని భావించారు. ప్రత్యర్థుల రాజకీయ వ్యూహాలను దగ్గరుండి పరిశీలించే అవకాశం కూడా కలుగుతుంది. కేంద్ర రాజకీయాల్లో మరింత చురుకైన పాత్రను పోషించే వీలు కలుగుతుంది. ఇలాంటివన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

పార్లమెంటరీ పార్టీపై దృష్టి

రాజ్యసభలో అడుగుపెట్టడం ద్వారా పార్లమెంటరీ పార్టీపైనా అమిత్ షా దృష్టి పెట్టినట్టు అర్థమవుతోంది. రాజ్యసభలో సంఖ్యాబలం తక్కువ కావడం వల్ల కీలకమైన బిల్లుల విషయంలో ప్రతిపక్షాలే పైచేయి సాధిస్తున్నారు. తాజాగా బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పిస్తూ ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలను అధికార పార్టీ గట్టిగా వ్యతిరేకించినప్పటికీ, ఓటింగ్ జరపగా ప్రతిపక్షాల మాటే నెగ్గింది. దాంతో సవరణలను రాజ్యసభ ఆమోదించక తప్పలేదు. ఇది ఎన్డీయేను తీవ్ర ఇరకాటంలో పడేసింది. రాజ్యసభలో పార్టీ బాధ్యతలు ప్రస్తుతం అరుణ్ జైట్లీ చూస్తున్నారు. కానీ ఆయన చేతిలో కీలకమైన ఆర్థికశాఖతో పాటు ప్రస్తుతం రక్షణశాఖ అదనంగా ఉండడం, ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల రాజ్యసభలో పార్టీపై ఆయన దృష్టి పెట్టలేకపోతున్నారు. అందుకే సభలో పార్టీ బాధ్యతలు చేపట్టాలని చూస్తున్నారు.

భవిష్యత్తులో మంత్రిగా

తాను పార్టీ అధ్యక్షుడిగానే కొనసాగుతానని చెప్పిన అమిత్ షా మరో మాట కూడా అన్నారు. 2019లో మరోసారి పార్టీని అధికారంలో కూర్చోబెట్టే వరకు పార్టీలోనే ఉంటానని అన్నారు. 2019 తర్వాత పార్టీ సారధ్య బాధ్యతలు వేరొకరికి అప్పగించిన పక్షంలో, తదుపరి అమిత్ షా చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర మంత్రి పదవే. ఇప్పుడు రాజ్యసభలోకి అడుగు పెట్టడం ద్వారా 2023 వరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతారు. అంటే 2019లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అవసరం లేకుండానే పార్టీ నుంచి నేరుగా ప్రభుత్వంలోకి చేరిపోవచ్చు.

విస్తరిస్తున్న బీజేపీ

• అన్ని రాష్ట్రాల్లోనూ ఉనికి కోసం ప్రయత్నం • కుదిరితే అధికారం.. లేకుంటే సంకీర్ణంలో భాగస్వామ్యం • అదీ కుదరకుంటే ప్రతిపక్ష స్థానానికి యత్నం

న్యూఢిల్లీ: విభజించి పాలించాలనే సూత్రాన్ని అధికార భారతీయ జనతా పార్టీ ప్రతిపక్షాల మీద ప్రయోగిస్తున్నట్లు కనిపిస్తోంది. పదేళ్లు అధికారంలో ఉండి 2014లో మట్టికరిచిన కాంగ్రెస్‌తో సహా వివిధ రాష్ట్రాల్లో హేమాహేమీలైన ప్రాంతీయ పార్టీలూ మోడీ-షా ద్వయం ఎత్తులకు చిత్తవుతున్నాయి. మహారాష్ట్రలో ఏకంగా సంకీర్ణ భాగస్వామి శివసేనను అదుపులో పెట్టేసారు. సంకీర్ణంలో తమదే పెత్తనమని, తానే పెద్ద భాగస్వామినని తేల్చేసారు. శివసేనకు కూడా ఆ రాష్ట్రంలో బీజేపీతో జట్టు కట్టడం కంటే వేరు గత్యంతరం లేదు. తాను కాదంటే సంకీర్ణంలో చేరడానికి ఎన్సీపీ సిద్ధంగా ఉంది. దీంతో అవసరాన్ని బట్టి స్పందిస్తూ ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ నెట్టుకొస్తున్నారు. 2014 ఎన్నికల తరువాత ఢిల్లీ బీహార్‌లలో ఓడిపోయినా, తాజాగా బీహార్‌ను సరి చేసేసారు కమలనాథులు. మహాకూటమి నుంచి నితీశ్‌ను బయటకు తెచ్చి విడిపోయిన బంధాన్ని మళ్లీ వేసేసారు. ప్రభుత్వంలో చేరిపోవడమే కాక జేడీ(యూ) కూడా కేంద్రంలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రంలో మూడు బలమైన పార్టీలున్నప్పుడు ఏమైనా రెండు పార్టీలు జట్టు కడితే ఆ కూటమిదే విజయం అవుతుంది. దీంతో ఆ రాష్ట్రంలో 2019 నాటికి బీజేపీ కూటమిదే విజయం తథ్యమని అంచనా. ప్రస్తుతానికైతే రాజ్యసభలో ఎన్డీయే పరిస్థితి జనతాదళ్ చేరిక వల్ల మెరుగైంది. అలాగే ఇప్పటికే వరుసగా గుజరాత్‌ను ఏలుతూ వస్తున్న బీజేపీ అక్కడ అంతంత మాత్రంగా ఉన్న కాంగ్రెస్‌ను మాయం చేయడానికి పూనుకుంది. పార్టీకి రాష్ట్రంలో బలంగా ఉన్న శంకర్ సింగ్ వాఘెలాను బయటికి లాగేసింది. ఆయన ఒకప్పుడు బీజేపీ నాయకుడే కావడం గమనార్హం. ఇప్పుడు ఆ రాష్ట్రం నుంచి ఒక రాజ్యసభ సభ్యుడిని గెలిపించుకోవడం కూడా కాంగ్రెస్‌కు కనాకష్టంగా మారింది. అహ్మద్ పటేల్‌ను గెలిపించుకోవడానికి ముప్పతిప్పలు పడుతోంది. గుజరాత్‌లో రాజ్యసభకు పోటీ చేసి ఇలా ఉత్తర ప్రదేశ్‌కు అమిత్ షా రాగానే ఎస్పీ, బీఎస్పీలకు చెందిన ముగ్గురు ఎమ్మెల్సీలు తమ పార్టీలకు రాజీనామా చేసారు. ఎస్పీలో అయితే.. ఏకంగా ముగ్గురు ఎమ్మెల్యేలే రాజీనామా చేసారు. అసలే బలహీనంగా ఉన్న ఆయా పార్టీల్లో కొంత మంది నాయకులను బయటకు లాగడం ద్వారా ఎన్నికల సమయానికి ప్రత్యర్థులు బలహీనంగా ఉండేలా చూసుకోవడం అమిత్ షా వ్యూహంగా కనిపిస్తోంది. అయితే.. ఇందుకు ఆయనొక్కడే కష్టపడుతున్నాడనుకోవడానికి వీల్లేదు. క్షేత్రస్థాయి బలాన్నే మోడీ-షా ద్వయం నమ్ముకుంటుంది. దీనితో ఏ రాష్ట్రంలోనైనా కీలకమైన వాళ్లకు బాధ్యతలను అప్పగించి ఇతర పార్టీల్లో క్షేత్రస్థాయిలో పని చేసే నాయకులను ఆకర్షించడం ఒక విధానంగా వారు పెట్టుకున్నట్లు కనబడుతోంది. పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి వచ్చే స్థాయి లేకున్నా, అసలేమీ లేని స్థాయి నుంచి ప్రతిపక్షం స్థాయికి ఎదగడమే లక్ష్యంగా పార్టీ పని చేస్తోంది. యూపీ లాంటి పెద్ద రాష్ట్రంలో 2014, 2017లో ప్రతిపక్షంగానే బీజేపీ పోటీ చేసింది. 2019లో మాత్రం అధికార పక్షంగా పోటీ చేసి ప్రతిపక్షాలు ఐక్యంగా ఉన్నా లేకున్నా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు ప్రతిపక్షాలను సాధ్యమైనంత వరకూ బలహీనపరచడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోంది. కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత ఉండడంతో అక్కడ 2019లో తమదే అధికారం అన్న నమ్మకంతో పార్టీ ఉంది. ఆ పరిస్థితిని చెడగొట్టకుండా ఉంటే చాలని షా భావిస్తున్నారు. దీంతో పాటు దక్షిణాదిన ఒడిషాలో అధికారపక్షానికి గట్టి పోటీనిచ్చే స్థాయికి ఎదిగింది. వారు పొత్తుకోసం తమ దగ్గరకు వచ్చే ఎత్తులు వేస్తోంది. అలాగే తమిళనాడులోనూ జయలలిత మరణం తరువాత ఏఐఏడీఎంకేతో పొత్తు కోసం మోడీ-షా వ్యూహం రచిస్తున్నారని, అది అగస్టులోనే సఫలీకృతమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే టీడీపీతో పొత్తు ఉండగా, అక్కడ ప్రతిపక్షమైన వైసీపీ కూడా బీజేపీతో జట్టుకట్టడానికి ఉత్సాహంగా ఉంది. దీంతో



2019లో అక్కడ బీజేపీ నిర్ణయంపైనే సంకీర్ణాలు వెల్లడవుతాయి. కాగా మరో తెలుగు రాష్ట్రం తెలంగాణలో బీజేపీ తగినంత బలం పెంచుకోవడానికి ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్, వామపక్షాలు వంతులవారీ పాలించే కేరళలోనూ కాలూనడానికి ప్రయత్నిస్తున్నా, ఇంకా సాధ్యం కావడం లేదు. చివరకూ జమ్మూకశ్మీర్‌లో కూడా పీడీపీతో జతకట్టి అధికారాన్ని పంచుకున్న బీజేపీ అక్కడ ఉగ్రవాదులను ఏరివేయడం ద్వారా తమ ఓటుబ్యాంకును పెంచుకునే దిశగా పని చేస్తోంది.

నవాజ్ లేకుంటే పాక్‌లో సైన్యమే!



న్యూఢిల్లీ: పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఉద్వాసన ఏమోగానీ, ఆయనపై అవినీతి ఆరోపణలు ఆ దేశంపై మళ్లీ మిలటరీకి అధికారం ఇచ్చేలా ఉన్నాయి. అసలే కశ్మీర్ సరిహద్దుల్లో దూకుడుగా ఉన్న ఉగ్రవాద సంస్థలకు తోడు పాక్-చైనాల కుమ్మక్కు భారత్‌కు కంటకంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో సైన్యం పెత్తనం పెరిగితే సరిహద్దుల్లో శాంతి కరవవుతుందని భారత్ ఆందోళనగా ఉంది. పాక్ ప్రధానిగా అబ్బాసీ ఎన్నికైనా, సైన్యం ప్రభుత్వాన్ని కుదురుగా ఉండనివ్వదేమోనని ఆ పార్టీ నాయకత్వానికే గుబులుగా ఉంది. పాక్ సైన్యాధ్యక్షుడు జనరల్ రాహిల్ షరీఫ్ నవంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. ఆ లోపే ఆయన దేశంలో మార్షల్ లా విధించే అవకాశం లేకపోలేదని పరిశీలకుల అంచనా. నవాజ్ షరీఫ్‌ను అనర్హుడిగా ప్రకటించిన చట్టాన్ని పాక్ మిలటరీ పరిపాలకుడు జనరల్ జియా ఉల్ హక్ కాలంలో రూపొందించారు. ఈ కారణంతోనూ సైన్యం చొరవ తీసుకునే అవకాశం లేకపోలేదు. నవాజ్ పై అవినీతి ఆరోపణలను విచారించిన జేఐటీలోనూ మిలిటరీ ఇంటెలిజెన్స్, ఐఎస్ఐ వారే ఎక్కువగా ఉన్నారు. ఏప్రిల్ 20న సుప్రీంకోర్టు నవాజ్‌పై ఆరోపణలకు ఆధారాలు చాలా స్వల్పమంది. కానీ జూలైలో జేఐటీ నివేదికలో కావాల్సిన ఆధారాలు దొరికాయి. షరీఫ్ పై అవినీతి ఆరోపణలు, ఆయన తన సోదరుడిని కాక వచ్చే ఎన్నికల్లో తన భార్య కుల్సూమ్‌ను నాయకురాలిని చేయాలనే ఆలోచన వల్లా, పాక్‌లో రాజకీయ అనిశ్చితి పెరిగి, సైన్యం పాలన రావచ్చని అంచనా.



కొనసాగుతున్న వేట

ముగ్గురు ఎల్ఈటీ ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో శనివారం తెల్లవారుజామున భద్రతా బలగాలు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు లష్కరే తొయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ పోలీస్‌కు గాయాలయ్యాయి. బారాముల్లా జిల్లా సోపోర్‌లోని అమర్‌గఢ్ ప్రాంతంలో ఉగ్రవాదులు తలదాచుకున్న విషయం తెలుసుకున్న కశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, సైన్యం జాయింట్ ఆపరేషన్ నిర్వహించి ముష్కరులను మట్టుపెట్టారు. ముందుగా భద్రతా దళాలపై ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో సైన్యం ఎదురు కాల్పులు ప్రారంభించారు. హతమైన ఉగ్రవాదుల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మిలిటెంట్ల మృతుల్లో ఇద్దరు స్థానికులేనని అధికారులు గుర్తించారు. మరొక మృతదేహాన్ని గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన కానిస్టేబుల్ సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సోపోరా ప్రాంతంలోని అన్ని, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించినట్లు అదనపు డీసీపీ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అంతర్జాల సేవలను నిలిపి వేసినట్లు చెప్పారు. కాగా, శుక్రవారం అనంత్‌నాగ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ ముజాయిద్దీన్ సంస్థ తీవ్రవాది యామన్‌ను సైన్యం హతమార్చిన విషయం తెలిసిందే.



ఎన్‌కౌంటర్లను ఆపాలంటూ శ్రీనగర్‌లో హురియత్ ధర్నా

నిరసన చెదరగట్టే క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురికి గాయాలు

తాజా ఎన్‌కౌంటర్లకు నిరసనగా ఆందోళన చేస్తున్న స్థానిక ప్రజానీకాన్ని నియంత్రించే క్రమంలో భద్రతా బలగాలు గాల్లోకి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు పౌరులు తీవ్రంగా గాయపడినట్లు స్థానికవర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటన బందిపొరాలో చోటు చేసుకుంది. ఘటనలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు.



నిద్ర భంగానికి కారణం కండరాలే!

టెక్సాస్: సాధారణంగా నిద్ర క్రమభంగానికి కారణం మెదడని అనుకుంటాం మనమంతా. కానీ, అందుకు బ్రెయిన్ కారణం కాదంట. నిద్ర క్రమభంగానికి కండరాలే ప్రధాన కారణమని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ అధ్యయనకారులు శనివారం వెల్లడించారు. మెదడుకు ప్రొటీన్స్ సమయానికి అందినా, అందకపోయినా దాని ప్రభావం నిద్ర పెద్దగా ఏం ఉండదన్నారు. కానీ కండరాలకు అటువంటి సమస్యే ఎదురైతే నిద్రలేమి సమస్య ఉంటుందని చెప్పారు. దీంతో సగటు మనిషి నిద్రలేమి సమస్య ఎదుర్కొంటారన్నారు. కండరాలకు సరైన ప్రొటీన్లు లేనప్పుడు ఏ విధంగా సందేశం వెళుతుందన్న అంశం, అందుకు సంబంధించిన కారణాలపై తాము లోతుగా అధ్యయనం చేసినట్లు తెలిపారు. దీనికి భవిష్యత్‌లో ప్రత్యేక ఔషధాన్ని కనుక్కోవాల్సి ఉంటుందని చెప్పారు. తమ అధ్యయనం ఇటీవల ఈలైఫ్ అనే జర్నల్‌లో జోసెఫ్ తఖషాషీ అనే శాస్త్రవేత్త వెల్లడించారు.

ఆంధ్రప్రభ
క్రీడాప్రభ
ఆదివారం 6 ఆగస్టు 2017 | హైదరాబాద్ | 12


పడి.. లేచారు!

● ఫాలోఆన్‌లో పోరాడుతున్న లంక ● మెండిస్ సెంచరీ; చేరువలో కరుణరత్నే ● తొలి ఇన్నింగ్స్‌లో 183కే ఆలౌట్ ● అశ్విన్‌కు ఐదు వికెట్లు

రెండు గంటల్లో 133 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయిన జట్టది. ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వకుండా పేకమేడలా కుప్పకూలిన బ్యాటింగ్ ఆర్డర్ ఉన్న జట్టు కూడా. అలాంటి జట్టు పోరాటపటిమ గురించి ఏమనుకుంటాం. ఓ వైపు సాధించాల్సిన స్కోరు కొండలా (439) ఉంటే ఫాలోఆన్‌లో పడిన వాళ్లు ఇక ఏం పోరాడతారులే అనుకుంటాం. తొలి ఇన్నింగ్స్ మాదిరిగానే చేతులెత్తేస్తారనుకుంటాం. భారత జట్టు కెప్టెన్ కోహ్లి సైతం ఆ విధంగానే భావించి వుంటాడు. అందుకే లంకతో ఫాలోఆన్ ఆడించాలని నిర్ణయించాడు. కానీ అనూహ్యంగా చండిమాల్ జట్టు పోరాడుతోంది. అద్భుతాలైతే చేయలేక పోయినా కనీసం ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవాలని లంక బ్యాట్స్‌మెన్ కృతనిశ్చయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో పట్టుదల ప్రదర్శించి వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ (110) సెంచరీ నమోదు చేశాడు. ఓపెనర్ తరంగ (2) మరోసారి నిరాశ పరిచినప్పటికీ మరో ఓపెనర్ కరుణరత్నే పోరాడుతున్నాడు. శనివారం మూడోరోజు ఆట ముగిసేసరికి లంక రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లకు 209 పరుగులు చేసింది. మరో 230 పరుగులు వెనుకబడిన లంక చేతిలో ఇంకా 8 వికెట్లున్నాయి. కరుణరత్నే 92 పరుగులతో, పుష్పకుమార 2 పరుగులతో క్రీజులో ఉన్నారు. లంక తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి స్పిన్నర్ అశ్విన్ మరోసారి రికార్డు పుటలకెక్కాడు.


మెండిస్ 110

కొలంబో: లంచ్ విరామానికి తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైన శ్రీలంక... విరామం తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. ఐతే ఆదిలోనే ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన తరంగ (2) రెండో ఇన్నింగ్స్‌లోనూ నిరాశపరిచాడు. మూడో ఓవర్లోనే యాదవ్ బౌలింగ్‌లో బౌల్డయి వెనుదిరిగాడు. ఆ ఔట్ లంక ఇన్నింగ్స్‌లో కీలక మలుపైంది. కరుణరత్నే (92 బ్యాటింగ్, 200 బంతుల్లో, 12 ఫోర్లు)తో జత కలిసిన మెండిస్ (110, 135 బంతుల్లో, 17 ఫోర్లు) భారత బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నాడు. ఒక పరుగు వద్ద ఇచ్చిన క్యాచ్‌ను మిడాన్‌లో ధావన్ విడిచిపెట్టడంతో మెండిస్ తర్వాత జాగ్రత్తగా ఆడాడు. స్పిన్నర్లు అశ్విన్, జడేజాల బౌలింగ్‌కు వెరవకుండా సునాయాసంగా బౌండరీలు బాదుతూ సహచరుడిలోనూ విశ్వాసం నింపాడు. పిచ్ గురించిన సందేహాలు పటాపంచలు కావడంతో కరుణరత్నే, మెండిస్ స్వేచ్ఛగా షాట్లు కొడుతూ స్కోరును ముందుకు ఉరికించారు. వీరిద్దరు దాటిగా ఆడుతూ రెండో సెషన్లో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డారు. మూడో సెషన్లోనూ వీరు అదే జోరును కొనసాగించారు. ఆ క్రమంలో మెండిస్ సెంచరీ సాధించాడు. ఆట మరికొద్ది సేపట్లో ముగుస్తుందనగా కోహ్లి వేసిన ఎత్తు పారింది. అతను బంతిని పాండ్యకిచ్చాడు. పాండ్య కెప్టెన్‌ను నిరాశపరచలేదు. రెండో వికెట్‌కు ఏకంగా 191 పరుగులు జోడించి ప్రమాదకరంగా పరిణమిస్తున్న కరుణరత్నే, మెండిస్ జంటను విడదీశాడు. పాండ్య వేసిన బంతిని ఆడబోయి మెండిస్.. కీపర్ సాహాకు క్యాచ్ ఇచ్చాడు. ఫాలోఆన్ ఆడుతున్న లంకకు రెండో వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. తర్వాత క్రీజులోకి వచ్చిన నైట్‌వాచ్‌మన్ పుష్పకుమార 18 బంతులాడి 2 పరుగులే చేసినా వికెట్‌ను కాపాడుకోగలిగాడు.


అశ్విన్ 5/69

అశ్విన్.. 26 సార్లు...: లంక శనివారం ఉదయం 50-2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. కానీ భారత బౌలర్ల ధాటికి లంక బ్యాట్స్‌మెన్ నిలవలేకపోయారు. క్రమం తప్పకుండా ఒకరి తర్వాత ఒకరుగా పెవిలియన్ దారిపట్టారు. కీపర్ డిక్వెల (51, 48 బంతుల్లో, 7 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే భారత బౌలర్లను ప్రతిఘటించగలిగాడు. శుక్రవారం ఓపెనర్లను ఔట్ చేసిన అశ్విన్ (69/5) శనివారం మరో మూడు వికెట్లు పడగొట్టి టెస్టుల్లో 26వ సారి ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఆ క్రమంలో 25 సార్లు ఆ ఘనత సాధించిన హర్భజన్ (103 టెస్టుల్లో)ను అధిగమించాడు. అశ్విన్ 51 మ్యాచ్‌ల్లోనే ఆ ఘనత దక్కించుకున్నాడు. కుంబ్లే (132 టెస్టుల్లో 35 సార్లు) వీరిద్దరికంటే ముందున్నాడు.

అప్పుడూ ఇలాగే: శ్రీలంక 2015లో జరిగిన సిరీస్‌లో కూడా గాలె టెస్టులో భారత్‌పై తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటి మాదిరిగానే సరిగ్గా 49.4 ఓవర్లలోనే 183 స్కోరుకు ఔటైనా మ్యాచ్‌ను గెలుచుకుంది. మరి చరిత్ర పునరావృతమవుతుందా.. వేచి చూడాల్సిందే!

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622-9 డిక్లేర్డ్

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25; తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0; మెండిస్ (సి) కోహ్లి (బి) యాదవ్ 24; చండిమాల్ (సి) పాండ్య (బి) జడేజా 10; మాథ్యూస్ (సి) పుజారా (బి) అశ్విన్ 26; డిక్వెల (బి) షమి 51; డిసిల్వ (బి) జడేజా 0; పెరెరా (బి) అశ్విన్ 25; హెరాత్ (బి) షమి 2; పుష్పకుమార నాటౌట్ 15; ఫెర్నాండో (బి) అశ్విన్ 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (49.4 ఓవర్లలో ఆలౌట్) 183, **వికెట్ల పతనం:** 1-0 (తరంగ), 2-33 (కరుణరత్నే) 3-60 (చండిమాల్) 4-64 (మెండిస్) 5-117 (మాథ్యూస్) 6-122 (డిసిల్వ) 7-150 (డిక్వెల) 8-152 (హెరాత్) 9-171 (పెరెరా) 10-183 (ఫెర్నాండో)

బౌలింగ్: షమి 6-1-13-2; అశ్విన్ 16.4-3-69-5; జడేజా 22-6-84-2; యాదవ్ 5-1-12-1

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: కరుణరత్నే (బ్యాటింగ్) 92: తరంగ (బి) యాదవ్ 2; మెండిస్ (సి) సాహా (బి) పాండ్య 110; పుష్పకుమార (బ్యాటింగ్) 2; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (60 ఓవర్లలో 2 వికెట్లకు) 209, **వికెట్ల పతనం:** 1-7 (తరంగ) 2-198 (మెండిస్)

బౌలింగ్: యాదవ్ 9-2-29-1; అశ్విన్ 24-6-79-0; షమి 6-2-13-0; జడేజా 16-2-76-0; పాండ్య 5-0-12-1

బోల్ట్‌దేనా స్వర్ణం?

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్



లండన్: ప్రపంచమేటి స్ప్రింటర్, మానవ చిరుతగా ప్రసిద్ధిపొందిన జమైకా అథ్లెట్ 30 ఏళ్ల ఉసేన్ బోల్ట్ 100 మీటర్ల బంగారు పతకం (ఈ వార్త చదివే సమయానికి 100 మీ ఫైనల్ ఫలితం తెలిసే ఉంటుంది) గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడు.బోల్ట్ 12వ ప్రపంచ టైటిల్ అందుకుంటాడా? లేదా? దశాబ్ధకాలంగా 100మీ, 200 మీటర్లలో తనకంటూ సరైన పోటీ లేకుండా అమోఘంగా రాణిస్తూ వచ్చిన ఫాస్టెస్ట్ రన్నర్ బోల్ట్ లండన్‌లో మొదలైన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆదివారంనాడు (భారత కాలమానం ప్రకారం తెల్లవారుఝామున 2 గం) ఫైనల్‌లో పోటీపడుతున్నాడు. దీని తర్వాత 100 మీటర్ల రిలేలోనూ పోటీ చేసిన అనంతరం అతడు ఇక విశ్రాంతి తీసుకోనున్నాడు. అందువల్ల బోల్ట్ పరుగుకు విశేష ప్రాధాన్యత లభించింది. చాలాకాలంగా ఈ భూ ప్రపంచంలోనే బోల్ట్‌ను ఓడించే అథ్లెట్ ఆ రెండు స్ప్రింట్స్‌లో లేకపోవడం గమనార్హం. ఇప్పటివరకు 11 ప్రపంచ 8 ఒలింపిక్ బంగారు పతకాలు సాధించిన బోల్ట్ 2011 లో 100 మీటర్లో ఓ ఫాల్స్‌స్టార్ట్ వల్ల విఫలమయ్యాడు. తర్వాత బెర్లిన్‌లో ప్రపంచ రికార్డు కొల్లగొట్టాడు. అయితే బోల్ట్ హీట్స్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో పరిగెత్తలేక పోయాడు. హీట్స్‌లో అతడు లక్ష్యాన్ని 10.7 సెకండ్లలో పూర్తిచేయడం విశేషం. ఇది చాలా బ్యాడ్ అంటూ ఆ తర్వాత బోల్ట్‌నే వ్యాఖ్యానించాడు. అయితే బోల్ట్‌తో ఈ రన్‌లో పోటీపడి 10 సెకండ్లలోపు పూర్తిచేసిన వారిలో జమైకాకే చెందిన జూలియన్ పోర్టే (9.99 సె), క్రిస్టియన్ కోల్‌మాన్ (9.82 సె) దక్షిణాఫ్రికాకు చెందిన థాండో రోటో (9.95 సెకండ్లు) ఉన్నారు.

100 మీ బోల్ట్ ప్రపంచ రికార్డు 9.58 సెకండ్లు (2009 బెర్లిన్)

మహిళా క్రికెటర్లకు వేతనాల పెంపు యోచన

బీసీసీఐ పరిశీలనలో

ముంబై: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో మిథాలీసేన ఫైనల్‌కు చేరిన నేపథ్యంలో మహిళా క్రికెటర్ల వేతనాలు సైతం పెంచాలనే యోచనలో బీసీసీఐ ఉంది. వేతనాల పెంపు, సవరణ ప్రతిపాదన బోర్డు కోశాధికారి ముందు ఉన్నట్లు ఒక బీసీసీఐ అధికారి తెలిపారు. లండన్‌లో జరిగిన ఫైనల్‌లో ఇండియా ఓడిపోయి కేవలం రన్నరప్‌గా మిగిలినా ఆ స్థాయివరకు వెళ్లడంపట్ల అభిమానులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. వీరి అద్భుత ప్రదర్శనకు బహుమతిగా బీసీసీఐ..జట్టు సభ్యులకు ఒక్కొక్కరికి రూ 50 లక్షలు, సహాయ బృందానికి తలో రూ 25 లక్షలు నజరానా అందించనుంది. ఈనెల 9న జరిగే బీసీసీఐ పాలకుల కమిటీ, బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదన చర్చకు వచ్చే వీలుంది.

గోడ బద్దలు కొట్టాడు

● చైనా బాక్సర్‌కు విజేందర్ పంచ్

చైనా గోడలను విజేందర్ బద్దలు చేశాడు. అద్వితీయమైన పంచ్‌ల వర్షం కురిపించి నా సత్తాకు తిరుగులేదన్న మైమైతియాలిని కంగుతినిపించాడు. ప్రొఫెషనల్ బాక్సర్‌గా మారిన తర్వాత దీనికి ముందు వరకు 8 బౌట్లలో తిరుగులేని విజయాలు అందుకోవడంతోపాటు ఒక టైటిల్‌ను కూడా సొంతం చేసుకున్న ఒలింపిక్స్ మాజీ కాంస్య విజేత విజేందర్ మరోసారి అంచనాలకు అనుగుణంగా రాణించాడు. చైనా సరకులో దమ్ములేదని మాటలతోనే కాదు..ఏకంగా చేతలతో సైతం నిరూపించాడు.

వరుసగా తొమ్మిదవ విజయం



ముంబై: ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో ఇంతవరకు అపజయం ఎరుగని 31 ఏళ్ల విజేందర్‌సింగ్ తన పంచ్ పవర్ ఏమిటో చూపించి మరో ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. శనివారంనాడు తన తొమ్మిదవ పోరుగా చైనాకు చెందిన మైమైతియాలితో తలపడి 10 రౌండ్ల పోరులో చిత్తుచేసి చాంపియన్‌గా నిలిచాడు. ప్రత్యర్థి అనవసరపు తప్పిదాలకు దిగినా, కొట్టరాని చోట పిడిగుద్దులకు దిగినా ఏమాత్రం చలించకుండా బ్యాటిల్ గ్రౌండ్ ఆసియా విజేతగా నిలిచాడు.ఈ గెలుపుతో ఒలింపిక్ కాంస్యవిజేత అయిన విజేందర్ డబ్ల్యుబీఓ ఆసియా పసిపిక్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌తోపాటు ఇప్పటివరకు ప్రత్యర్థి మైమైతియాలి వద్ద ఉన్న డబ్ల్యుబీఓ ఓరియంటల్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్‌ను సైతం హస్తగతం చేసుకోగలిగాడు. మరోవైపు ఈ పోరుకు ముందు అపజయం ఎరుగని మైమైతియాలి తొలిసారి పరాజయాన్ని అందుకున్నాడు. ముందుగా తాను చెప్పినట్లు చైనా వస్తువులు నాసిరకమైనవన్న తీరులోనే ప్రత్యర్థిని కూడా అలవోకగా 96-93, 95-94, 95-94 తేడాతో విజేందర్ చిత్తుచేశాడు. మొదటి రెండు రౌండ్‌లు చాలా జాగ్రత్తగా ఎదుర్కొన్న విజేందర్ ఆ తర్వాత రిథమ్ సంపాదించి భారీ పంచ్‌లతో ప్రత్యర్థిపై విరుచుకు పడ్డాడు.

గతంలో ప్రత్యర్థులను మొదటి రెండు మూడురౌండ్లలో నాకౌట్ చేయగలిగిన విజేందర్‌కు చైనా ప్రత్యర్థితో మాత్రం పోరు క్లిష్టంగానే సాగింది. ఎడమచేతి వాటంతో తన పంచ్‌లను విజేందర్‌పై విసిరిన మైమైతియాలి తదుపరి రెండురౌండ్లలోనూ అదే తీరుతో కొనసాగాడు.

రెఫరీ వార్నింగ్: ఈ క్రమంలో చైనా బాక్సర్ క్రీడా సంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తించి విజేందర్‌పై షాట్లను కురిపించడంతో రెఫరీ హెచ్చరించాడు. 10 రౌండ్ల వరకు సాగిన పోరులో తొమ్మిదవరౌండ్ ముగిసేటప్పటికీ అలసిపోయి ఓడిపోతాడా? అనుకున్న దశలో, జుల్పికర్ పంచ్‌లతో ఒకవైను నోరు, ముక్కునుంచి రక్తం కారుతున్నప్పటికీ వాటినుంచి విజేందర్ తేరుకుని కొన్ని అద్భుత పంచ్‌లతో అతడిని చిత్తుచేయగలిగాడు. విజేందర్ కొట్టిన పంచ్‌లకు జుల్పికర్ సైతం ముక్కు,.నోరు రక్తం కారిపోయింది. కాగా ఈ విజయంతో విజేందర్ మరోసారి తన అజేయ రికార్డును నిలుపుకోగలిగాడు. పోరులో అక్రమంగా ప్రవర్తించినప్పటికీ చివరకు మైమైతియాలి తన తలమీద టోపీని విజేందర్ తలమీద పెట్టి క్రీడాస్ఫూర్తిని చాటుకున్నాడు.



టెస్టుల్లో అత్యంత వేగంగా 150 వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా జడేజా రికార్డులకెక్కాడు. లంక తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీయగానే అతను ఆ ఘనత సాధించాడు. అశ్విన్ 29, జడేజా 32 టెస్టుల్లో ఈ ఫీట్ చేశారు. ప్రసన్న, కుంబ్లే 34 మ్యాచ్‌ల్లో ఈ ఘనత సాధించారు.

ద్యుతి, అనాస్ ఔట్



ద్యుతీచంద్

లండన్: భారత జాతీయ గ్రహీత ద్యుతీచంద్ ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ మహిళల 100 మీటర్ల తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఇండియన్ గ్రాండ్ ప్రీలో 100 మీ లక్ష్యాన్ని 11.30 సెకండ్లలో పూర్తిచేసిన ద్యుతీని ఆఖరి నిమిషంలో ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. అయితే ఈ రౌండ్‌తో రాణించడంలో విఫలమైంది. ఆమె లక్ష్యాన్ని 12.07 సెకండ్లలో పూర్తిచేయడం ద్వారా తదుపరి రౌండ్‌కు అర్హత పొందలేకపోయింది. ఇక ఆమె తదుపరి ఆగస్టు 19న తైవాన్‌లో జరిగే ప్రపంచ వర్శిటీగేమ్స్‌లో పోటీచేస్తుంది. అలాగే జాతీయ రికార్డు గ్రహీత మహమ్మద్ అనాస్ సైతం పురుషుల 400 మీటర్లలో తొలిరౌండ్‌లో లక్ష్యాన్ని 45.98 సెకండ్లలో పూర్తిచేయడం (అనాస్ అత్యుత్తమ టైమింగ్ 45.32 సె) ద్వారా అర్హత కొల్పోయాడు. ఈ రెండు విభాగాల్లోనూ ఆరు హీట్స్‌లో టాప్ 3 లో ఉన్న ముగ్గురే తదుపరి రౌండ్‌కు అర్హత పొందుతారు. 400 మీ రిలేలోనూ అనాస్ పోటీచేయనున్నాడు. ఇకహెప్థాలిన్‌లో పోటీపడిన స్వప్నా బర్మన్ 100 మీ హర్డిల్స్, హైజంప్‌ల్లో విఫలమై 1826 పాయింట్లే సాధించగలిగింది.

ఎదురులేని ఫరా

● 10,000 మీ. పరుగులో బంగారు పతకం




లండన్: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి బంగారు పతకాన్ని బ్రిటన్‌కు చెందిన ప్రముఖ డిస్టెన్స్‌రన్నర్ మో ఫరా గెలుచుకున్నాడు. 34 ఏళ్ల ఫరా ఈ చాంపియన్‌షిప్ అనంతరం రిటైర్ కానుండగా, తనకు ఎదురులేదంటూ పురుషుల 10,000 మీటర్ల పరుగులో అద్భుత విజయాన్ని సాధించాడు. ఫరాకు ఇది వరుసగా 10వ స్వర్ణం. కాలిగాయాన్ని సైతం లెక్కచేయకుండా అతడు ఈ టైటిల్ అందుకున్నాడు. ఫరా లక్ష్యాన్ని 26 నిమిషాల 49.51 సెకండ్లలో పూర్తిచేసి 2017 లో ఈ విభాగంలో ఫాస్టెస్ట్ టైమింగ్ నెలకొల్పాడు. మేజర్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకు అజేయంగా కొనసాగుతూ వస్తున్న ఫరా సొంతమైదానంలో 55 వేలమంది అభిమానుల మద్దతు పలుకుతుండగా ఈ విజయాన్ని పూర్తిచేశాడు. తదుపరి అతడు బుధవారంనాడు 5000 మీటర్లలోనూ పోటీపడనున్నాడు. నా కెరీర్‌లో ఇది చాలా క్లిష్టమైన రేస్ అని ..ఇంకో ల్యాప్ చేరాల్సి ఉన్న సమయంలో రెండుసార్లు కాలు ట్రిప్ పడి పోబోయానని చెప్పాడు.

ఫరా గత మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌ల్లో బంగారు పతకాలను అందుకుంటూ వచ్చాడు. 2011 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కేవలం 5000 మీటర్లలోనే స్వర్ణం గెలిచిన ఫరా 2012 ఒలింపిక్స్‌లో 5 వేలు అలాగే 10 వేల మీటర్లలో స్వర్ణం అందుకున్నాడు. ఆ తర్వాత 2013, 2015 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆ రెండింటిలోనూ స్వర్ణాలు అతడివే. అలాగే 2016 ఒలింపిక్స్‌లోనూ అతడే విజేతగా నిలిచాడు.

రెండోస్థానాన్ని ఉగండాకు చెందిన జోషువా కిప్రూయి కెపెగి లక్ష్యాన్ని 26 నిమిషాల 49.94 సెకండ్లలో పూర్తిచేసి సాధించగా మూడోస్థానంలో కెన్యాకు చెందిన పాల్‌కిప్‌గెటిచ్ తనూయి (26:50.60 సె) నిలిచాడు.

అర్జున ఇవ్వరా?

● తన పేరు సిఫారసు చేయకపోవడంపై బోపన్న ఆగ్రహం



న్యూఢిల్లీ: తనను అర్జున అవార్డుకు సిఫారసు చేయకపోవడంపై ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రోహన్ బోపన్న భారత టెన్నిస్ అసోసియేషన్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. తనకు బదులు చివరకు సాకేత్ మైనేని కూడా అర్జునకు సిఫారసు చేశారని అన్నాడు. అర్జున అవార్డు అనేది మనదేశంలో క్రీడాకారులకు చాలా ప్రతిష్ఠాకరమైన అవార్డు. కానీ నాకు దక్కలేదు. అందుకోబోతున్న మైనేనికి అభినందనలు తెలియజేస్తున్నానని బోపన్న తెలిపాడు.

దీనిపై అసోసియేషన్ కార్యదర్శి హిరోన్మయ్ చటర్జీ స్పందిస్తూ 29 ఏళ్ల మైనేని నామినేట్ చేయడంలో ఎలాంటి పొరపాటులేదని, ఎందుకంటే అతడు దేశం తరఫున పలు పతకాలు అందుకున్నాడని తెలిపారు. 2014 ఆసియా గేమ్స్ (దక్షిణకొరియా)లో మిక్స్‌డ్ డబుల్స్ బంగారు పతకం అందుకోవడంతోపాటు పురుషుల డబుల్స్‌లో రజతం సాధించాడన్నారు. బోపన్న 2017 ఫ్రెంచ్‌ఓపెన్‌లో రాణించి నందున దాని ఆధారంగా అతడిని అర్జున అవార్డుకు వచ్చే సంవత్సరం సిఫారసు చేస్తామని ఆయన వివరణ ఇచ్చారు. ఫ్రెంచ్‌ఓపెన్‌లో కెనడాకు చెందిన డొబ్రోస్కీ, బోపన్న కలిసి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సాధించిన విషయం తెలిసిందే.

దబాంగ్ ఢిల్లీపై ముంబా విజయకేతనం

నాగపూర్: ప్రొ కబడ్డీలో శనివారం నాడు యు ముంబా 36-22 తేడాతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. తొలి 2పాయింట్లను ఢిల్లీ సాధించిన ప్పటికీ, ఆపై ముంబా జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కెప్టెన్ అనూప్ కుమార్ ముందుండి జట్టు నడిపించడంతో ముంబా ఏకంగా 10-2 పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆపై ఢిల్లీ పోరాట పటిమ ప్రదర్శించినా..కానీ ముంబాను అందుకోలేక పోయింది. ఢిల్లీకి కెప్టెన్ మీరజ్ షేక్ అత్యధికంగా 7 పాయింట్లు అందించగా, ముంబాకు షబ్బీర్ బాపూ 7 పాయింట్లు సాధించి పెట్టాడు. ప్రథమార్థం ముగిసేసరికి ముంబా 14-8 తేడాతో పైచేయిలో ఉంది.

యుపి యోధ చేతిలో బుల్స్ ఓటమి: ఉత్కంఠగా సాగిన రెండో మ్యాచ్‌లో యుపి యోధ 32-27 తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. యుపికి వరుసగా ఇది రెండోవిజయం. ఈ గెలుపుతో యుపి పాయింట్ల పట్టికలో సైతం 10 పాయింట్లను అందుకుని రెండోస్థానంలోకి వెళ్లింది. అదే బుల్స్ ఓడినా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో 11 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. యుపి జట్టుకు నితిన్ తోమర్ 9 పాయింట్లు సాధించిపెట్టాడు.

ప్రొ కబడ్డీలో నేడు

మొదటి మ్యాచ్
బెంగాల్ వారియర్స్ - యుపి యోధ
(నాగపూర్ రా 8 గంటలనుంచి)

రెండో మ్యాచ్
బెంగళూరు బుల్స్ - పాట్నా పిరేట్స్
(నాగపూర్ రా 8 గంటలనుంచి)


దబాంగ్, యుముంబా మధ్య మ్యాచ్ దృశ్యం

సౌతాఫ్రికాను దెబ్బతీసిన అండెర్సన్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులో రెండోరోజున దక్షిణాఫ్రికా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 220/9 పరుగులతో (68.3ఓవర్లలో) ఉంది. అండెర్సన్ ధాటికి ఆ జట్టు పూర్తిగా చేతులెత్తేసింది. బావుమా ఒక్కడే అత్యధికంగా 46 పరుగులు చేయగా అమ్లా 30 పరుగులు చేశాడు. అండెర్సన్ 4, మొయిన్ అలీ, బ్రాడ్ చెరో రెండేసి వికెట్లు కూల్చి సౌతాఫ్రికాను దెబ్బతీశారు. అంతకుముందు ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 362 పరుగులకు ఆలౌట్ అయింది.

స్కోరు: ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ 362 (కుక్ 46, రూట్ 52, బెన్‌స్టోక్స్ 58, బెయిర్‌స్టో 99 రబడా 4 వికెట్లు) సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్

బాంబ్రి ఓటమి

వాషింగ్టన్: సిటీ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో అద్వితీయంగా రాణించి క్వార్టర్ ఫైనల్ వరకు చేరుకోగలిగిన భారత ఆటగాడు యుకి బాంబ్రీ ఓటమిపాలయ్యాడు. దక్షిణాఫ్రికాకు చెందిన కెవిన్ అండెర్సన్ అతడిని 4-6, 6-4, 3-6 తో చిత్తుచేశాడు. దీంతోసెమీస్ ఆశలు పోయాయి. మరోవైపు అండెర్సన్ సెమీస్‌లో జాక్ సాక్‌ను ఎదుర్కొంటాడు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

ప్రపంచంతో కలిసి ఉన్నా నువ్వో ఒంటరి. నీ జీవితం కేవలం నీ వ్యక్తిగతం. మనకు మాత్రమే తెలిసిన మనల్ని...పంచుకోవడానికి ఉన్న ఒకే ఒక బంధం స్నేహం. కుటుంబం, బంధువులు, వారసులు..ఇలా ఎవరి దగ్గరైనా చనువుకు హద్దులు ఉంటాయి. కానీ హద్దులే లేని సాన్నిహిత్యం స్నేహం. 'మనకున్న' సంతోషాలను, బాధలను అచ్చంగా చెప్పుకోగల ఆప్తుడు మిత్రుడే. నువ్వెవరి సమక్షంలో సమయాన్ని మరిచి అంతులేని ఆనందంలో ఉంటావో...అతనే నిజమైన స్నేహితుడు. అలా తమకున్న మిత్రుల గురించి మన టాలీవుడ్ తారలు 'స్నేహితుల దినోత్సవం' సందర్భంగా ఇలా చెబుతున్నారు....



తారలు... స్నేహతీరాలు!

నేడు ఫ్రెండ్‌షిప్ డే



ఏడేళ్ల స్నేహం...ఏడడుగులకు.. : సమంత

స్నేహితుడే జీవిత భాగస్వామి అవుతున్నాడు. నాగచైతన్యతో నాకు ఏడేళ్ల స్నేహం ఉంది. మేమిద్దరం మంచి స్నేహితులం. ఇక ముందూ అలాగే ఉండాలనుకుంటున్నాం. తొలి పరిచయం నుంచేస్నేహం ఏర్పడింది. అప్పటి నుంచి నా కష్టసుఖాల్లో తను అండగా ఉన్నాడు. నేను అనారోగ్యంతో నెలల పాటు తెరకు దూరమైనప్పుడు మనోధైర్యాన్ని నింపాడు.

ఆ ముగ్గురు దగ్గరి మిత్రులు : ఎన్టీఆర్



నటించడం తర్వాత నాకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చే విషయం స్నేహితులతో సరదాగా ఉండటం. లవ్‌రాజ్, స్నేహాల్, రాజీవ్ కనకాల ..ఈ ముగ్గురూ నాకు బాగా దగ్గరైన మిత్రులు. షూటింగ్ లేనప్పుడు మా ఇంట్లో క్రికెట్ ఆడుతుంటాం. మా మధ్య సినిమా సంగతులు రావు. ఇక ఇండస్ట్రీలో మంచు మనోజ్ నన్ను బాబాయ్, అన్నాయ్ అని పిలుస్తుంటాడు. చరణ్, మహేష్, అల్లు అర్జున్ మంచి మిత్రులు.



వాళ్లు వెన్నంటి ఉంటారు : ప్రభాస్

నాకు స్నేహితులు ఎక్కువ. అంతా బాల్య స్నేహితులే. ఓ ఇరవై మంది ఉంటాం. రోజూ కలిసే స్నేహితుడికి, ఇరవై రోజులకు ఒకసారి కలిసే స్నేహితుడికీ తేడా ఉంటుంది. స్నేహితులు లేకుంటే నేను ఇంత సాధించే వాడిని కాదని అనిపిస్తుంటుంది. నా సుఖాల్లో, కష్టాల్లో మిత్రులదే కీలక పాత్ర. నేను బాహుబలి సినిమా ఒప్పుకున్నప్పుడు వాళ్లంతా మంచి సలహాలు ఇచ్చారు. నాలుగేళ్లు ఒక సినిమా చేస్తున్నావు. చూసుకో...ఆర్థికంగా కూడా నీకు ఉపయోగపడుతుందా ఈ సినిమా చేయడం ఆలోచించు అన్నారు. నా ఫిట్‌నెస్ ట్రైనర్ లక్ష్మణ్ రెడ్డి మంచి మిత్రుడు. ఇరవై నాలుగు గంటలూ నాతోనే ఉంటాడు. రాజమౌళి ఆప్తుడైన మిత్రుడు. అతను నాకు 'మగధీర' ముందు తెలుసు తర్వాత తెలుసు. బాహుబలి తర్వాత కూడా అతని వ్యక్తిత్వంలో ఏ మార్పూ రాలేదు. ప్రతి విజయానికీ రాజమౌళి వ్యక్తిగా ఎదుగుతున్నాడు.



మనసున్న మిత్రురాలు అనుష్క : తమన్నా

చిత్ర పరిశ్రమకు చాలా చిన్న వయసులో వచ్చాను. తెలుగులో నా తొలి సినిమా 'శ్రీ'. అంతకు ముందు హిందీలో నటించినా...నాయికగా నాకు అనుభవం తక్కువ. ఓ హీరోయిన్‌కు ఎవరెవరి సహాయం అవసరం. షూటింగ్‌లో వెంట ఎవరుండాలి అనే కనీస విషయాలు కూడా తెలియవు. అలాంటి సందర్భంలో అనుష్క నాకు సలహాలు ఇచ్చింది. మంచి కాస్ట్యూమ్ డిజైనర్‌ను పరిచయం చేసింది. నేను నటిగా వచ్చేప్పటికే అనుష్క పేరున్న నాయిక. నాకు సహాయం చేయాల్సిన అవసరం తనకు లేకున్నా...మంచి మిత్రురాలిగా తోడ్పడింది. తర్వాత ఇద్దరం సన్నిహితంగా మారిపోయాం. 'బాహుబలి' లాంటి భారీ చిత్రంలో కలిసి నటించాం. అనుష్క మంచి మనసున్న మిత్రురాలు.

మిత్రుల సంఖ్య పెరిగింది :రకుల్ ప్రీత్‌సింగ్



నాకున్న స్నేహితుల జాబితా చాలా పెద్దది. అంతకు ముందు నాకున్న మిత్రులు కాకుండా...ఇప్పుడు పరిశ్రమ వాళ్లూ కలిశారు. అలా మిత్రుల సంఖ్య పెరిగింది. రానా, రవితేజ, సందీప్ కిషన్, రాశీ ఖన్నా, రెజీనా, అఖిల్..అందరం తరుచూ కలుస్తూ ఉంటాం. వీళ్ల స్నేహంతో నేను ఇక్కడి అమ్మాయిని కాదు...నాకు ఎవరూ తెలిసిన వాళ్లు లేరు అనే భావం ఎప్పుడూ కలగలేదు. హైదరాబాద్ నా సొంతూరు అనిపించేలా మార్చేశారు. వీళ్లలో రెజీనా నాకు మంచి స్నేహితురాలు. మేమిద్దరం కలిసి ఒకే హోటల్ గదిలో ఉండేంత చనువుగా ఉంటాం. ఒకసారి కొత్త ఏడాది వేడుకలు జరుపుకునేందుకు గోవా వెళ్లాం. రోజంతా సందడిని ఆస్వాదిస్తూ గడిపాం. రెజీనా ఉదయమే లేవదు. సందడి చేద్దామని వెళ్లి విశ్రాంతి తీసుకోవడం ఏంటి అనేది నా అభిప్రాయం. రోజూ ఉదయమే లేస్తాను. రెజీనాను లేపితే...పదింటి వరకు నిద్రలేపితే చంపేస్తానంది. నేను ఏ సమయంలోనైనా, ఏ విషయమైనా పంచుకునే స్నేహితురాలు తను.

- రమేష్ గోపిశెట్టి

తమన్నాలా ఉండాలని... : కాజల్



తమన్నా నాకు మంచి స్నేహితురాలు. ఇద్దరం దాదాపు ఒకేసారి నట ప్రయాణం ప్రారంభించాం. వృత్తి పట్ల ఆమె చూపించే అంకితభావం నన్ను ఆకట్టుకుంటుంది. విజయంలో తమన్నా చూపే వినయం నేనూ అనుసరించేలా చేస్తుంది. తనలా ఉండాలనే స్ఫూర్తి కలుగుతుంటుంది. ఇండస్ట్రీలో చాలా మంది స్నేహితులున్నారు. అవసరం ఉన్నప్పుడు అందరి సలహాలు తీసుకుంటా..



పోటీలేదు...స్నేహం ఉంది :రెజీనా

నాకున్న మిత్రుల్లో రకుల్ ప్రీత్‌సింగ్, రాశీ ఖన్నా ముఖ్యమైన వాళ్లు. ఎక్కువగా కలుస్తుంటాం. షూటింగ్ లేనప్పుడు కలిసి బయటకు వెళ్తాం. మేము కలిసినప్పుడు సినిమాల విషయం చర్చకు రాదు. వ్యక్తిగతమైన విషయాలు చెప్పుకుని నవ్వుకుంటాం. అలా మా స్నేహం కొనసాగుతోంది. వర్తమాన నాయికల్లా మా మధ్య పోటీ ఉంటుందని అంతా అనుకుంటారు. నేనైతే అలా భావించను. ఎవరి అవకాశాలు వాళ్లకుంటాయి. ఎవరికి తగిన పాత్రలకు వాళ్లు ఎంపికవుతారు. ఏ వృత్తిలో ఉన్నా స్నేహితులుగా ఉండొచ్చు. నాయికలు కలిసి ఉండొద్దని లేదు కదా. షూటింగ్ ప్యాకప్ చెప్పేవరకే సినిమా సంగతి గుర్తుంటుంది. చిత్రీకరణ పూర్తయ్యాక మా వ్యక్తిగత జీవితాలకే ప్రాధాన్యమిస్తాం.

రాకింగ్ రాఖీలు

రేపు రాఖీ పౌర్ణమి









బంధాలు పాతవే అయినా...మన భావాలు మారుతున్నాయి. కొత్తగా మరింత కొత్తగా కనిపించాలని నేటి యువత కోరుకుంటోంది. అందుకే పండుగల్లోనూ పాత సంప్రదాయాలను కొత్తగా పాటిస్తున్నారు. ఇది రేపటి రాఖీ పండుగకు సైతం వర్తిస్తుంది. మార్కెట్లో అన్నాచెల్లెళ్ల బంధాన్ని మరింత అందంగా, వినూత్నంగా, ఆడంబరంగా, అత్యాధునికంగా మొత్తంమీద ట్రెండీగా వెల్లడించే రాఖీలు అనేకం కనబడుతున్నాయి.

చిన్నారులకోసం... ఇలా కట్టగానే అలా నోట్లో వేసుకుని తీనేయగల చాక్లెట్ రాఖీలు వచ్చాయి. అన్నా వదినలకు కలిపి కట్టేందుకు భయ్యా బాబీ రాఖీలు రూపుదిద్దుకున్నాయి. వదినలకు మరదళ్లు సరదాగా కట్టుకునేందుకు వీలుగా అలంకార భరితంగా ఉండే లంబా రాఖీలు వచ్చాయి. ఇవి బ్రాస్‌లెట్‌లా అందమైన డిజైన్లలో ఉండటం వలన పండుగ తరువాత కూడా అలాగే అలంకరణగా ఉంచేసుకోవచ్చు. కార్టూన్ క్యారక్టర్లను ఇష్టపడే బుజ్జి తమ్ముళ్లు చెల్లెళ్ల కోసం ఛోటాభీమ్, డోరెమాన్ లాంటి రాఖీలు వచ్చాయి. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింతగా మెరిపించే జర్దోసీ రాఖీలు అందమైన బంధానికి ప్రతిబింబంలా రిచ్‌గా కనబడుతున్నాయి. ఆణిముత్యాల్లాంటి అన్నాచెల్లెళ్లను అలరించే ముత్యాల రాఖీలు మార్కెట్లో దొరుకుతున్నాయి. నెమలి బొమ్మతో రంగులీనుతున్నవి, అల్లరి తమ్ముడిలో జోష్‌ని పెంచే పోకెమాన్ రాఖీలు, మరింత ట్రెండీగా కనిపించే బ్రాస్‌లెట్ రాఖీలు....ఇలా బోలెడన్ని రకాలు మార్కెట్లో దొరుకుతున్నాయి. మనసులోని భావాలను అచ్చంగా ప్రతిబింబిస్తూ....తోబుట్టువుల బంధానికి తళుకులద్దుతున్నాయి.





ఈ శ్రావణ పూర్ణిమ జంధ్యాల పూర్ణిమేనా?

శ్రావణ పూర్ణిమని జంధ్యాల పూర్ణిమ అంటారు. ఆ రోజు కొత్త జందెం వేసుకునే ఆచారం ఉంది. అలాగే కొత్తగా వడుగు అయిన వారికి ఆ రోజు ఉపాకర్మ చేస్తారు. ఈ సంవత్సరం శ్రావణ పూర్ణిమకు చంద్ర గ్రహణం వచ్చింది. కాబట్టి యధావిధిగా ఉపాకర్మ చేయవచ్చా అనే విషయంపై సామాజిక మాధ్యమాలలో చర్చ జరుగుతోంది. ఈ విషయంలో కొన్ని ధర్మ శాస్త్ర ప్రమాణాలను పరిశీలిద్దాం.

కొత్తగా ఉపనయనం అయిన తర్వాత చేసుకునేది నవోపనీతోపాకర్మ. పూర్వం ఉపనయనం అయిన వారు చేసుకునే ఉపాకర్మ కూడా ఉంది. ఉపాకర్మ చేసుకోకపోయినా వడుగు అయిన వారందరూ నూతన యజ్ఞోపవీతం ధరించడం జరుగుతుంది. ఋగ్వేదులు, యజుర్వేదులు సామవేదులు వీరందరూ ఉపాకర్మ, యజ్ఞోపవీత ధారణం చేయాలి. దీని గురించి ప్రయోగ పారిజాతం ఇలా చెప్పింది.

**శ్లో॥ అథాతఃశ్రావణేమాసి శ్రవణర్క్షయుతే దినే
శ్రావణ్యాం శ్రావణేమాసి పంచమ్యాం హస్త సంయుతే
దివసే విదధీత్తైత దుపాకర్మ యథోదితమ్॥**

ఋగ్వేదం వారు శ్రావణమాసంలో శ్రవణానక్షత్రంతో కూడిన పూర్ణిమనాడుగాని, పంచమి నాడు హస్తానక్షత్రంలో గాని ఉపాకర్మ చేయాలి. కాని ఈ సంవత్సరం శ్రావణ పూర్ణిమ నాడు గ్రహణం వచ్చింది.

**శ్లో॥ ఉపాకర్మ నకుర్వన్తి క్రమాత్ సామర్గ్యజుర్విదః
గ్రహసంక్రాంతియుక్తేషుహస్తశ్రవణ పర్వసు॥**

గ్రహణం వచ్చిన రోజున ఉపాకర్మ చేయరాదని హేమాద్రి నిషేధించింది. అందుకని ఋగ్వేదులు శ్రావణ శుక్ల పంచమి నాడు ఉపాకర్మ చేయవచ్చు. భాద్రపద శుక్లపక్షంలో హస్తా నక్షత్రంలో సామవేదం వారు ఉపాకర్మ చేయవచ్చు. ఇక యజుర్వేదులు ఎప్పుడు చేయాలని ప్రశ్న.

**శ్లో॥యదిస్యాత్ శ్రావణం పర్వ గ్రహసంక్రాంతి దూషితమ్
స్యాదుపాకరణం శుక్లపంచమ్యాం శ్రావణస్యతు
సంక్రాంతిర్గ్రహణం వాపి యదిపర్వణి జాయతే
తన్మాసే హస్త యుక్తాయాం పంచమ్యాం వా తదిష్యతే॥**

పంచమి, హస్తలలో చేయవచ్చని మదనరత్నం అనే గ్రంథంలోని శ్లోకాలు తెలిపాయి.

హేమాద్రి అనే గ్రంథంలో 'గ్రహయోగో గురుంహన్తి' అని గ్రహణం వచ్చిన తిథినాడు ఉపాకర్మ చేస్తే చేసిన గురువుకు నష్టం కలుగుతుందని చెప్పారు.

చతుర్వర్గ చింతామణిలో

**శ్లో॥సంక్రాంతౌ గ్రహణే చైవ సూతకే మృతకే తథా
అథచేద్దోష సంయుక్తే పర్వణిస్యాదుపక్రియా
దుఃఖ శోకామయగ్రస్తా రాష్ట్రే తస్మిన్ ద్విజాతయః॥**

అని గ్రహణకాలంలో ఉపాకర్మ చేయడం వల్ల దేశంలో ద్విజులు దుఃఖం, శోకం, రోగం పొందుతారని హెచ్చరించారు.

శ్రావణ పూర్ణిమనాడు గ్రహణం వచ్చింది కనుక "ప్రౌష్ఠ పద్యాం తైత్తిరీయాః' అని నిర్ణయ సింధువు తైత్తిరీయ వేదం వారిని భాద్రపద పూర్ణిమనాడు ఉపాకర్మ చేసుకోమని తెల్పింది.

శ్లో॥ ఉపాకర్మోత్సర్జనఞ్చపవిత్రమదనార్పణమ్

అనే వాక్యం శుక్రమౌఢ్యంలో కూడా ఉపాకర్మ చెయ్యమని చెప్పింది. కొత్తగా ఉపనయనం అయినవారు ఉపాకర్మనాడు వేదవేదాంగాలను ఉపదేశం పొందాలి. వారికి మాత్రం శుక్ర మౌఢ్యం మొదలయినవి ఉన్నపుడు ఉపాకర్మ చెయ్యకూడదు. చేస్తే కర్మవినాశం కలుగుతుంది.

శ్లో॥ ప్రథమోపాకృతిర్నస్యాత్కృతంకర్మ వినాశకృత్

అని కశ్యపుడు చెప్పాడు. తైత్తిరీయులు మొదలయిన వారిలో ఈ సంవత్సరం కొత్తగా ఉపనయనం అయినవారు, ఇతరులు కూడా గ్రహణ దోషం ఉన్న శ్రావణ పూర్ణిమను వదలి భాద్రపద పూర్ణిమనాడు ఉపాకర్మ చేయాలి.

శ్రావణ్యాం పౌర్ణమాస్యాం గ్రహణాది దుష్టాయాం కాతీయ భిన్నైః ప్రౌష్ఠ పద్యాం కార్యమ్ తైస్తు శ్రావణ పఞ్చమ్యామ్ సాంఖ్యాయనైస్తుహస్తే కార్యమ్, ఆపస్తంబైరాథర్వణైశ్చ ప్రౌష్ఠపద్యామ్'' అని నిర్ణయసింధువు చెప్పింది.

శ్రావణ పౌర్ణమి గ్రహణంచే దుష్టమయితే కాతీయులు తప్ప మిగిలినవారు భాద్రపద పూర్ణిమనాడుపాకర్మ చేయాలి. వాజసనేయులు, ఋగ్వేదులు, పంచమినాడు చేయాలి. సాంఖ్యాయనులు హస్తా నక్షత్రంలో చేయాలి. ఆపస్తంబ సూత్రం వారు అధర్వణ వేదంవారు భాద్రపద పూర్ణిమనాడు చేయాలి. అప్పుడు కూడా కుదరకపోతే మరి కొన్ని సమయాల్లో చెప్పారు.

ఇక యజ్ఞోపవీత ధారణ విషయం. ఉపాకర్మలో యజ్ఞోపవీత ధారణం ఉంది. చదివినది, చదువబోయేది అయిన వేద విద్య శక్తివంతంగా ఉండడం కోసం వేదర్షుల ఆరాధన ఉపాకర్మలో చేస్తారు. దీనిలో శ్రౌత స్మార్త కర్మలను ఆచరించే యోగ్యత కోసం యజ్ఞోపవీత దేవతలను పూజించి యజ్ఞోపవీత ధారణం చేస్తారు.

వేదం చదవనివారు, వేదం దృఢంగా చదివినవారు ఇపుడు ఉపాకర్మ చేయడం లేదు. వేదశాస్త్రాలు చెప్పిన కర్మలు చేసే యోగ్యత కోల్పోవడం ఇష్టంలేక యజ్ఞోపవీతధారణం మాత్రం చేస్తున్నారు. అదెప్పుడు చెయ్యాలని ప్రశ్న.



ఉపాకర్మ చేసుకునేవారు దానిలో భాగంగా అపుడు యజ్ఞోపవీతం ధరిస్తారు. ఉపాకర్మ చేసుకోనివారు తాము ఉపాకర్మ చేయవలసిన కాలం లో యజ్ఞోపవీతం ధరించడం సమంజసం.

**శ్లో॥యజ్ఞోపవీతం కర్తవ్యం శ్రావణేగురు శుక్రయోః
బాల్యేవావార్ధకేవాపి నిత్యవత్కర్మ చోదితమ్**


అని ధర్మప్రవృత్తి శ్రావణమాసంలో గురుశుక్రులు బాల్య వార్ధకావస్థలలో ఉన్నా యజ్ఞోపవీతం ధరించమంటోంది. పైన ఉపాకర్మ మూఢంలో చేయవచ్చునన్నారు. ఉపాకర్మలో యజ్ఞోపవీతం ధరించాలి. కాబట్టి యజ్ఞోపవీత ధారణానికి మూఢం అడ్డం కాదు. కొత్తగా వడుగయినవారికి ఉపాకర్మలో వేదాల ఉపదేశం ఉంటుంది. తరువాత ఉపాకర్మ చేసుకునే వారికి కొత్తగా వేదోపదేశం ఉండదు. కాబట్టి శుక్రమౌఢ్య బాల్య వార్ధక్యాలలో ఉపాకర్మ చేయవచ్చు. ఉపాకర్మలో ఎలాగూ యజ్ఞపవీత ధారణం కూడా ఉంటుంది. ఒకవేళ వీరు ఉపాకర్మ చేసుకోకపోయినా యజ్ఞోపవీతం ధరించవచ్చు.

గ్రహణం తిథినాడు ఉపాకర్మ చేస్తే దుఃఖం, శోకం, రోగం వస్తాయని చెప్పారు. కాబట్టి అప్పుడు ఉపాకర్మ పనికి రాదు. ఉపాకర్మలో భాగమైన యజ్ఞోపవీత ధారణం కూడా చేయకపోవడమే సముచితం. పుణ్యం రాకపోయినా దుఃఖం తెచ్చుకోకూడదు కదా. యజ్ఞోపవీత ధారణానికి వేరే నిషేధం లేదు. అదెందుకు ధరించకూడదని ప్రశ్నించవచ్చు. యజ్ఞోపవీతం శ్రావణంలో ధరించమని చెప్పిన శ్లోకంలో గ్రహణం తిథి నాడు ధరించవచ్చని లేదు. ఉపాకర్మకు పనికి వచ్చే కాలమే యజ్ఞోపవీత ధారణానికి చెప్పారు. గ్రహణం తిథినక్షత్రాలనాడు ఉపాకర్మను నిషేధించారు. ఆ నిషేధం ఉపాకర్మలో భాగమైన యజ్ఞోపవీత ధారణానికి కూడా వర్తిస్తుంది. గ్రహణం తిథినాడు యజ్ఞోపవీతం ధరించవచ్చునే వాక్యం ఎక్కడా కనబడదు. కాబట్టి తాము ఉపాకర్మ చేసుకోదగిన రోజునే యజ్ఞోపవీత ధారణం ప్రశస్తం.

స్మృత్యర్థ సారంలో ఇలా చెప్పారు.

**మౌఢ్యాది దోషే గ్రహణం యదిస్యాత్
ఓషధ్య భావో యదికర్కటస్థః
భానుర్ద్విజాశ్శ్రావణ కర్మ కుర్యు
ర్నత్యాజ్యమేవం మునయో వదన్తి**

మూఢం, గ్రహణం మొదలైన దోషాలున్నా శ్రావణ కర్మ చేయమని ఉంది. పైన గ్రహణంలో ఉపాకర్మ చేయడం వల్ల దుఃఖరోగాలు వస్తాయన్నారు. కాబట్టి ఇక్కడ శ్రావణ కర్మ అంటే ఉపాకర్మ కాక సర్పబలి అని అర్థం. భాద్రపద పూర్ణిమ నాడు తైత్తిరీయ శాఖ వారు, ఆపస్తంబసూత్రం వారు, అథర్వణ వేదం మొదలైన వాటికి చెందిన వారు కొత్తగా ఉపనయనం అయిన వారు, ఇతర ద్విజులు, ఉపాకర్మ, యజ్ఞోపవీత ధారణం చేయవచ్చు. గ్రహణం ఉన్న శ్రావణ పూర్ణిమ నాడే సముచితం కాదని సారాంశం.



- డా॥ చిర్రావూరి శివరామ కృష్ణ శర్మ
9963455584

చింతన

హయగ్రీవ జయంతి




శ్రావణ పూర్ణిమని హయగ్రీవ స్వామి జయంతిగా కూడా వ్యవహరిస్తారు. హయగ్రీవుడు అనే రాక్షసుడు బ్రహ్మ నుండి వేదాలను అపహరించుకొని పోగా బ్రహ్మప్రార్థనతో నారాయణుడు హయగ్రీవ రూపాన్ని ధరించి సామగానం చేసి హయగ్రీవ రాక్షసుడిని మోహింపచేసి సంహరించి వేదాలు తెచ్చి బ్రహ్మకు అందజేసాడు. పూర్ణిమ నాడు యజుశ్శాఖవారు ఉపాకర్మ, నూతన యజ్ఞోపవీతధారణ, సమిధాదానం, వేదస్వీకారం చేసి హయగ్రీవ జయంతిని జరుపుకునే ఆచారం వచ్చింది

దేవతలకు మోహినీ రక్ష రాఖీ పండగ




శ్రావణ పూర్ణిమ రోజు ధన్వంతరి అవతార ఆవిర్భావం కూడ జరిగిందని బ్రహ్మాండ పురాణంలో తెలుపబడింది. అమృత కలశంతో వచ్చిన ధన్వంతరి మోహిని ద్వారా అమృతాన్ని దేవతలకు మాత్రమే అందేటట్లు ప్రణాళిక చేసాడు. మోహిని రాక్షసులను మోహింపచేసి, మైమరపించి దేవతలను మాత్రం సోదరులుగా భావించి రక్ష కట్టి అమృతాన్ని తాగించింది. శ్రీమహావిష్ణువు, దేవతలు, రాక్షసులు అందరూ కశ్యప మహర్షి సంతానమే. కావున దేవతల సోదరుడు నారాయణుడే అని గుర్తుచేసి అమృతాన్ని దేవతలకు మాత్రమే తాగించిన పండుగ రాఖీ పండుగ. ఈనాడు ఉత్తరభారతదేశం వారు సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీపూర్ణిమ జరుపుకుంటారు. తమ సోదరులు సురక్షితంగా ఉండాలని కోరుకుంటూ సోదరీమణులు వారి చేతికి రక్షగా రాఖీని కడతారు. అందుకే దీనిని రక్షాబంధన్ అని వ్యవహరిస్తారు. సోదరులు తమ శక్తి కొలదీ సోదరీమణులకు కానుకలు అందిస్తారు. పర స్త్రీని సోదరిగా భావించాలని సందేశమందించే పండుగ రాఖీపూర్ణిమ.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ కృష్ణస్తుతి



మృగముల కధిపతి వౌరా!
యోగుల ఆనందాబ్ధివి యోగానందా!
ఖగములు సారథి నీవే
జగతికి జీవం నీవే జాగృతి కృష్ణా॥

లీలాకృష్ణా! హేలలు
లీలలు జూపీ, ధరణిని జీవుల పాపం
బులు కాచుదువయ! కేళీ
లోలా! మమ్ములనూపేడోలవు కృష్ణా॥

నారీమణి కాచితివీ
ధీరుండగురామదాసునిం బ్రోచిన శ్రీరామా!
శ్రీరఘువీరా! ఓ! మా
తారకరామా! పృథ్వీ తారక కృష్ణా॥

కాళింది మడుగుననిలచి
కాళియు గర్వము నణచితివౌరా! గో, గో
పాలక బృందము కాచిన
నాళీకము నీవేరా! నాథా! కృష్ణా॥

శివకేశవు లొకరేగద!
భవసాగర మీదించే నావలు మీరే!!
జీవము, రాగము, భోగము
భావము, నవజీవనరాగమువే కృష్ణా॥

రామా! ద్రాక్షా రామా!
రామా! సోమారామా అమరారామా!
రామా! కొమరారామా!
రామా! క్షీరారామా! రామా! కృష్ణా॥

- ఊటుకూరి సుహాసిని

కల్కి పలుకు



Sri
Amma
Bhagavan


వివరణ :
కూనపురెడ్డి
అరుణ్ కుమార్

ప్రతి ఆలోచనకు ఒక తరంగదైర్ఘ్యం ఉంటుంది. ఆలోచనలు అయస్కాంత శక్తిని వెల్లడిస్తుంటాయి.

Every thought has a frequency thoughts send out a magnetic energy.

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

సమాధి అంటే యేమి?



శ్రీ రమణాశ్రమం
9-6-46

ఈ మధ్యాహ్నం భగవాన్ భక్తులతో ఇష్టాగోష్టిగా అనేక విషయాలు మాట్లాడుతూ మధ్యమధ్య ఆధ్యాత్మిక బోధ చేస్తూ చాలా ప్రొద్దుగడిపారు. విసుగు విరామం లేకుండా మాట్లాడటం చూచి, కొత్తగా వచ్చిన పాంథులొకరు లేచి, ''భగవాన్! తామెప్పుడు సమాధిలోకి వెడతారు?'' అని ప్రశ్నించారు. భక్తులంతా పక్కున నవ్వారు. భగవంతులకు కూడా నవ్వు వచ్చింది. రవంత తాళి, ''ఓహో, అదా నీ సందేహం, సరే చెపుతాగాని అసలు సమాధి అంటే యేమి? ఎక్కడికి పోవాలి? కొండమీదికా? గుహలోకా? ఆకాశం మీదికా? సమాధి అంటే ఎట్లా వుండాలి? ఏమిటి? చెప్పు''మన్నారు భగవాన్.

పాపమతడేమీ చెప్పలేక చతికిలబడి కొంతసేపు పలకకుండా వుండి ''ఇంద్రియ సంచలనమణగితేగాని సమాధి కాదంటారే, ఆ సమాధిలోకి తామెప్పుడు దయచేస్తారని అడిగా''నన్నాడు. ''ఆ, అదీ సమాచారం, ఏమిరా, ఈ స్వామి ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాడే. ఈయన యేమి జ్ఞాని? అని వారి ఉద్దేశ్యం. పద్మాసనం వేసుకొని, చేతులు కట్టుకొని ఊపిరి బిగబట్టి కూర్చుంటే గాని సమాధి కాదు. ఒక గుహ కూడా ఉండాలి. నిత్యం దానిలోకి పోతూ, వస్తూ వుండాలి. అప్పుడు 'ఈ స్వామి బలే దొడ్డవాడురా!' అంటారు. నేనో ఈ భక్తులు, ఈ కార్యక్రమం అంతా పెట్టుకొని ఎప్పుడూ మాట్లాడుతూ వుంటే, ఇదేమి స్వామిరా? అని వారి సందేహం. పాపం, ఏం జేసేది నేను? పూర్వం కూడా అట్లాగే జరిగిందొకటి రెండుసార్లు. నేను గురుమూర్తంలో ఉండగా చూచిన వారొకరిద్దరు స్కందాశ్రమం వచ్చి, అందరితో మాట్లాడుతూ కార్యక్రమం గమనిస్తూ ఉండటం చూచి చాలా ఆదుర్దాతో 'స్వామి, స్వామి, మీ వెనుకటి రూపంతో దర్శనమీయండి స్వామి' అని దుఃఖించటం కూడా కద్దు. అయ్యో ఈ స్వామి చెడిపోతున్నాడే, అని వారి తలంపు. మనమేం చేస్తాం? అప్పుడట్లా వుండవలసి వచ్చింది. ఇప్పుడిట్లా వుండవలసి వచ్చింది. ఏ కాలానికి ఎట్లా నడవాలో అట్లా నడుస్తుంది. కాని, వీరి దృష్టికి అన్నం తినకుండాను, మాట్లాడకుండాను వుంటే చాలు. స్వామిత్వం వచ్చేస్తుంది. లోకం ఇదే భ్రమలో పడతారు'' అన్నారు భగవాన్.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

నిజంగా శ్రమించడం తెలిస్తేనే దైవానుభవం

దైవాన్ని తమ అనుభవంలోకి తెచ్చుకోవడానికి ఒక సులువైన మార్గం సంపూర్ణంగా శ్రమించడమే అని, నిష్కర్మను తెలుసుకోవాలంటే ముందు కర్మ చేయడం తెలియాలని, ఆ స్థితిలోనే దైవం నిజంగా అనుభవంలోకి వస్తుందని సద్గురు చెబుతున్నారు.

తార్కికంగా చూసినప్పుడు, తన జీవితంలో ఎన్నడూ శ్రమించనివాడికి శ్రమలేకుండా ఉండడమంటే ఏంటో తెలిసి ఉండాలి. కానీ అది నిజం కాదు. శ్రమలేకపోవడం ఏమిటో తెలియాలంటే, ముందు శ్రమించడం తెలియాలి. మీరు ఈ ప్రయత్నంలో అత్యున్నత స్థాయిలో శ్రమించినప్పుడు, సునాయాసంగా ఒక పనిని చేయడం తెలుస్తుంది. పనిచెయ్యడం అంటే ఏమిటో తెలిసిన వ్యక్తికి, విశ్రాంతి అంటే ఏమిటో అర్థం అవుతుంది. వైరుధ్యమేమిటంటే, ఎప్పుడూ విశ్రాంతి తీసుకునేవారికి, విశ్రాంతి అంటే ఏమిటో తెలియదు. వాళ్లు సోమరితనంలోకి, జడత్వంలోకీ జారుకుంటారు. జీవితం పనిచేస్తున్న తీరు అదే.

రష్యాకు చెందిన బాలే డాన్సరు 'నిజిన్స్కీ'కి అతని జీవితం అంతా నృత్యమే. మానవులకి అసాధ్యమనిపించేలా అతను ఎగిరి విన్యాసాలు చేసిన కొన్ని క్షణాలున్నాయి. ఒకవేళ ఒక వ్యక్తి కండరాలు వాటి అత్యుత్తమ ప్రదర్శన చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాయనుకున్నా, ఒక మనిషి ఎగరగల ఎత్తుకి కొన్ని హద్దులున్నాయి. కాని ఆ క్షణాల్లో ఇతను ఆ పరిమితులను కూడా దాటగలడనిపిస్తుంది. ప్రేక్షకులు తరచూ ఇతడిని, ''మీరిలా ఎలా చెయ్యగలిగారు?'' అని అడిగేవారు. దానికతను: ''నేనే విన్యాసాన్ని ఎన్నడూ చెయ్యలేను, అక్కడ నిజిన్స్కీ లేనప్పుడే అది జరుగుతుంది'' అని వినయంగా సమాధానం చెప్పేవాడు.

ఒక వ్యక్తి నిరంతరం తన 100శాతం సమర్థతని ప్రదర్శిస్తుంటే ఏదో ఒకనాడు అతను ఆ పనిని అవలీలగా చేయగలిగిన స్థితి వస్తుంది. అవలీలగా చేయడం అంటే, మందకొడిగా తయారవడం కాదు. దానర్థం భౌతికచర్య అవసరం లేని నైపుణ్యస్థితి. మీరు ఎన్నడైతే మీ పూర్తిసామర్థ్యంతో పనిచేసి, అత్యున్నత శ్రమను తట్టుకుని నిలబడగలరో, అప్పుడు మీరీ స్థితికి చేరుకుంటారు. ఈ రోజుల్లో చాలామంది ఆధ్యాత్మిక వికాసానికి ''జెన్'' అనుసరిస్తానని అనడం వింటున్నాం. ఎందుకంటే అందులో వాళ్లు ఏమీ చేయనవసరం లేదు అని అనుకుంటున్నారు. నిజానికి జెన్‌లో చాలా ఎక్కువ పరిశ్రమ చెయ్యాలి. ఎందుకంటే, అది


సద్గురు బోధ

జీవితం నుండి ఏవిధంగానూ దూరంగా పారిపోవడం లేదు.

జెన్ సన్యాసికి జెన్ తోటలో గులకరాళ్లు ఒక క్రమంలో పేర్చడానికి కొన్ని వారాలు పట్టొచ్చు. ఆ పనిచేయడంలో నిమగ్నమై, మీరు నిష్క్రియ స్థితికి చేరుకోవచ్చు. ఆ స్థితికి రావడానికి కారణం, మీరు 'నేను చేస్తున్నాను' అనే అనుభూతిని అధిగమించడమే. ఆ స్థితిలోనే మీకు ఆ అతీత స్థితి ఏమిటో అనుభవంలోకి వచ్చేది.

మీరు ఆ స్థితిని నిజిన్స్కీ, మరికొందరిలా, ఉన్నత స్థాయి పరిశ్రమ చెయ్యడం ద్వారా అందుకోగలిగితే, ఆ క్షణాలు మీకు ఇంద్రజాలంలా ఎంతో మధురానుభూతిని కలిగిస్తాయి. కాని మీరు ఆ స్థితిని క్రియలేని తీవ్రత ద్వారా చేరుకుంటే, అది ఒక యోగ ముద్ర అవుతుంది. ఆ స్థితిని మీరు ఎక్కువ కాలం నిలుపుకోగలరు.

ధ్యానం యొక్క పరమావధి మిమ్మల్ని తీవ్రమైన పరిశ్రమ ద్వారా అటువంటి చైతన్యస్థితికి తీసుకు



వెళ్లడం, కొంతకాలం తరువాత, మీరు ఏ ప్రయత్నమూ చేయవలసిన పనిలేదు. అప్పుడు ధ్యానం ఒక క్రియగా కాకుండా మీరప్పటికే అందుకోగలిగిన చైతన్యస్థితికి సహజపరిణామం అవుతుంది. మీరు కేవలం ఆ స్థితిలో ఉంటారు. ఇటువంటి ఏ నిర్బంధం లేని అస్తిత్వ క్షణాల్లోనే, ఒక వ్యక్తి సృష్టిలో భాగంగా వికసించడానికి అనువైన అవకాశాలు సృష్టించబడతాయి.

మనం వ్యక్తులుగా, సమాజాలుగా, అటువంటి వికాసానికి తగిన వాతావరణం కల్పించకుండా కాలాన్ని దొర్లిపోనిస్తే మనం ఒక అద్భుతమైన అవకాశాన్ని చేజార్చుకున్నట్టే. స్వర్గం, అక్కడి సుఖాలు అనే చిన్నపిల్లల మాటలు ఎందుకు అంత ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయంటే, ఒకమనిషిగా ఉండడంలోని మహత్వాన్ని పూర్తిగా శోధించకపోవడం వల్లనే, మీ మానవత్వం పెల్లుబికినప్పుడు దైవత్వం దానంతట అదే అనుసరిస్తుంది. మీకు సేవ చేస్తుంది. దానికి మరో గతిలేదు.

- సద్గురు జగ్గీ వాసుదేవ్

భగవద్గీత



నిత్యతృప్తునికి అహమనే భావం ఉండదు

అధ్యాయం 4

శ్లోకం 21:

నిరాశీర్యచచిత్తాత్మా
త్యక్తసర్వపరిగ్రహః।
శారీరం కేవలం కర్మ
కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥

తాత్పర్యము : అట్టి అవగాహనము కలిగిన మనుజుడు నియమిత మనోబుద్ధులచే తనకున్నవానిపై తనదనెడి భావము విడిచి కేవలము జీవనావసరముల కొరకే కర్మ చేయును. ఆ విధముగా వర్తించుచు అతడు పాప ఫలములచే ప్రభావితుడు కాకుండును.

భాష్యము : కృష్ణచైతన్యవంతు డు తన కర్మల శుభా శుభ ఫలములను ఆశించడు. అతని మనోబుద్ధులు సదా నియమితములై ఉండును. తాను భగవంతునిలో అంశయై ఉన్నందున అంశగా తనచే చేయబడు కార్య ము వాస్తవమునకు తాను చేయుట లేదనియు, ఆ కార్యము తన ద్వారా భగవానునిచే చేయబడుచున్నదని ఎరుగును. ఎట్లనగా దేహమునందలి హస్తము తనకు తోచిన రీతిగా కాక దేహము కొరకే దాని ప్రోద్బలముతో పనిచేయును. యంత్రము సరిగా పని చేయుటకు యంత్రము నందలి భాగమును శుభ్రపరచుట, తైలాదులతో పోషించుట, వంటివి అవసరమైనట్లే తన భగవత్సేవను సరిగా చేయుట కొరకే తన దేహమును పోషించును. భక్తుడు యజమాని అధీనములో ఉండే జంతువువలె తన దేహముపై యాజమానిత్వము కలిగి ఉండడు. భగవత్సేవలో ఎంతగా నిమగ్నుడై ఉంటాడంటే భౌతికమైన వాటిని పొందటానికి కూడా తీరిక లేకుండా ఉంటాడు. పేరాశ లేనందున పాపముచే ఎన్నడునూ అంటబడడు. ఈ విధముగా అతడు సమస్త కర్మఫల ముల నుండి ముక్తుడై ఉండును.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీ శ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



సంస్కృతి

భిల్లులు జాతి లక్షణాలను అనుసరించి వీరు ద్రావిడ జాతివారితో పోల్చవచ్చునని పలువురు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. గుట్టలపై, చిన్న చిన్న కొండల మీద కిటికీలు లేని గుడిసెలు కర్రస్తంభాలను బొట్టుపెట్టి కట్టెలను ఉపయోగించి గృహనిర్మాణం చేసుకుంటుంటారు. 'ఖాప్రియాల్' లేక మిద్దె వేసుకుని మట్టితోనే ఇళ్ల నిర్మాణం చేసుకుంటారు. కిటికీల్లేకుండా ఇల్లు నిర్మించడం వీరి ప్రత్యేకత.



వైవిధ్య భరితం భిల్లుల జీవనం

సర్వసాధారణంగా గిరిజన తెగల్లో ''ఏకపత్నీ వ్రతం'' అనేది చాలా తక్కువగా కనిపిస్తుంటుంది. కాని 'భిల్లులు' గిరిజన తెగలో 'ఏకపత్నీ వ్రతం' నేటికీ సత్సంప్రదాయంగా కొనసాగుతున్నదనే చెప్పాలి. ద్రావిడ భాషలకు సంబంధించి 'భిల్' అంటే 'విల్లు' అనే అర్థం చోటు చేసుకోవడమే కాకుండా, వీరు విల్లు ధరించి, దానిని ఉపయోగించడంలోనూ నిష్ణాతులైనందు వల్ల వీళ్లకా పేరు వచ్చి ఉండవచ్చునని చెబుతారు. ఈ భిల్లుల్లో ఉపతెగలు ఉంటూ అరవై లక్షల జనాభా వరకూ ఉండొచ్చునని ఒక అంచనా మూలంగా తెలియుచున్నది. భిల్లులు నేడు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా కర్ణాటక రాష్ట్రం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ వగైరా రాష్ట్రాలలోనూ దర్శనమిస్తుంటారు.

శారీరకంగా వీరంతా ముదురు గోధుమ వర్ణంతో ఉండి, నిడుపాటి వెంట్రుకలు కలిగి ఉంటారు. వంటిపై వెంట్రుకలు తక్కువగా ఉన్నా, తలపై జుట్టు మాత్రం బాగా పొడవైనదై ఉంటుంది. భిల్లులు జాతి లక్షణాలను అనుసరించి వీరు ద్రావిడ జాతివారితో పోల్చవచ్చునని పలువురు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. గుట్టలపై, చిన్న చిన్న కొండల మీద కిటికీలు లేని గుడిసెలు కర్రస్తంభాలను బొట్టుపెట్టి కట్టెలను ఉపయోగించి గృహనిర్మాణం చేసుకుంటుంటారు. 'ఖాప్రియాల్' లేక మిద్దె వేసుకుని మట్టితోనే ఇళ్ల నిర్మాణం చేసుకుంటారు. కిటికీల్లేకుండా ఇల్లు నిర్మించడం వీరి ప్రత్యేకత.

వీరిలో వేరు వేరు తెగల మధ్య పెళ్లిళ్లు జరిగినా, వారిలో శాఖలు, గోత్రాలు తేడాబాడాలుంటాయి. ఈ గోత్రాల్ని 'వంశావళులు'గా విభజిస్తారు. ఐదారు తరాల వరకూ చెప్పే వంశక్రమాన్ని కొన్ని కుటుంబాలు కలిగి ఉంటాయి. వీళ్ల కుటుంబాలకు ఒక ప్రత్యేక నామం 'వశీలు'. చిన్న కుటుంబం నేటి వ్యష్ఠి కుటుంబంలో భార్య,భర్త ఇద్దరు పిల్లలు. వీరి కుటుంబాలే పితృస్వామ్య వ్యవస్థ వున్నందువల్ల. ఒకవేళ అనేకమంది గల పెద్ద కుటుంబాల్లో కూడా ఇంటిపెద్ద మాటకు తిరుగులేదు. ముఖ్యంగా వీరిలో అంతర్వివాహ పద్ధతికి ఎంత ప్రాధాన్యత ఇస్తారంటే బైట తెగవాళ్లని పెండ్లి చేసుకుంటే తమ తెగ నుంచి బహిష్కారంగాని, భారీ జరిమానానో, లేదా రెండూ తప్పక పోవచ్చు కూడా. ఎక్కడో చాలా అరుదుగా కేవలం ఏ కొద్దిమంది మాత్రం ఒకరికంటే ఎక్కువ మందిని పెండ్లాడినా, సాధారణంగా మాత్రం వారు ఏకపత్నీ వ్రతులే. భిల్లు జాతి గిరిజనులు సాంప్రదాయ-సంస్కృతీపరంగా పరిశీలిస్తే బావని పెండ్లాడే పద్ధతికి ఆస్తిలో ఆస్తి కలిసిపోతుందనే ఉభయతారకమైన ఆలోచనలతో ఈ మధ్యకాలంలో పెళ్లి చేసుకోవడం వీరి నుంచే నాగరికులు నేర్చుకుని ఉంటారు. ఎక్కువగా దగ్గర చుట్టరికాల వారినే పెండ్లాడేటందుకు ఇష్టపడతారు. భర్త చనిపోతే స్త్రీ పునర్వివాహం చేసుకునే పద్ధతి భిల్లుల్లో ఉంది. ఇంకా చెప్పాల్సి వస్తే భర్త చనిపోయిన ఆడదాన్ని భర్త తమ్ముళ్లలో ఒకర్ని పెండ్లాడవచ్చు. అదేవిధంగా భార్యను కోల్పోయిన మగాడు భార్య తాలూకు చెల్లెళ్లో ఒకర్ని పెండ్లి చేసుకునే అవకాశం లేకపోలేదు. జానపదుల, గిరిజనుల మాదిరిగానే విడాకులు తీసుకోవడం వీరిలోనూ సహజం. కాకపోతే విడాకులు తీసుకున్న స్త్రీ సంతానం మొదటి తండ్రి దగ్గరే పెరగడం రివాజు. ఇంకా భిల్లుల్లో వారసత్వ నియమాలు గలవు.

కుటుంబంలో తండ్రి ఆస్తిలో ఎక్కువ భాగం పెద్దకొడుక్కి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది అనాదిగా వస్తున్నాయటువంటి ఆచారం. చిన్న కొడుక్కి తక్కువ భాగం అంటే వారి వారి వయస్సులను బట్టి ఆస్తి పంపకాలు జరగడం ఆనవాయితీ! ఇదేవిధంగా ఆస్తిని పంచుకున్నట్టుగానే ఆ యజమాని చనిపోతే అప్పులు సొప్పులను అదే నిష్పత్తిలో పంపకాలు చేస్తారు. ఇటువంటి విషయాల్లో ఆడబిడ్డలకు మాత్రం ఎటువంటి ప్రమేయం అసలు ఉండదు.

భాషాపరంగా వీరు ఒకదానికి ఒకటి పోలికలు లేనటువంటి మాండలికాల్ని మాట్లాడుతుంటారు. అయితే ప్రతీ మాండలికం ఆయా ప్రాంత భాషా సంపర్కంతో కూడుకొని ఉండటం విశేషం. వీటి అన్నింటినీ కలగలిపి వీరి భాషకున్న ప్రత్యేక భాషగా భిల్లుల భాషగా 'భిల్లీ'అని పిలవబడుతుంది. ద్రావిడ ముండారి భాషా సంబంధమైన పదాలు వీరు మాట్లాడే భాషలో దొర్లుతుండటం సర్వసాధారణం. ప్రాంతీయ ప్రభావం చేత గుజరాత్, మరాఠీ, మార్వాడీల ప్రభావం కూడా వీరి మాట్లాడే భాషపై అధికంగానే ఉంటూ ఉంటోంది. దీన్ని బట్టి పరిశీలించినట్లయితే భిల్లులు ఏ భాషైనా నేర్చుకోగల చతురులు. అలాగే వీరి జ్ఞాపకశక్తి కూడా అసాధారణం. వీరిలో ఎవరైనా చనిపోయిన సందర్భాలలో వారిని పాతిపెడతారే గాని, దహనసంస్కారాలు ఉండవు. ప్రముఖంగా చిన్నపిల్లల్ని, అసాధారణంగా చనిపోయినవారిని మాత్రం సమాధి చేస్తుంటారు. భిల్లులు దేవుళ్లని నమ్ముతారు. అంతేకాదు దయ్యాల్ని కూడా బాగా నమ్ముతారు. ఇంకా జంతువుల్ని, తమతమ పూర్వీకుల్నీ కూడా పూజిస్తూ ఉండటం ఎక్కువే! తమకు సాంప్రదాయబద్ధంగా సంక్రమించిన పండగలను, పబ్బాలను జరుపుకోవడం పట్ల మక్కు ఎక్కువే! హిందువులతో మైత్రీ భావంతో దీపావళి, దసరా, హోళీ పండగలని కూడా ఆనందంగా జరుపుకుంటారు. ప్రముఖంగా






భిల్లులు అంటే ముందుగా గుర్తుకు వచ్చేది వారి ఆయుధాలైన విల్లంబులే! కేవలం అడివిని నమ్ముకుని బ్రతికే వాళ్లయినా వ్యవసాయం చెయ్యడంలోనూ వారు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. మొదట్లో వారు ఎక్కువగా పోడు వ్యవసాయం చేస్తుండేవారు. కాలక్రమంలో తాము స్థిరనివాసాలు ఏర్పరచుకున్నాక, స్థిరమైన వ్యవసాయం పట్ల ఆసక్తి చూపుతూ వచ్చారు. వీరి ప్రధానమైన ఆహార ధాన్యం మొక్కజొన్న. వాణిజ్యం కోసం రానురాను వారు ప్రత్తిసాగుకు అలవాటు పడ్డారు. ఇంకా ఆర్థికలబ్ధికోసం, జీవితాన్ని సుఖమయం చేసుకునేటందుకు పప్పుదినుసులు, గోధుమలు, చెరకు, నూనెగింజలు పండించడంలో కూడా తర్ఫీదు పొందారు. నాగరికతకు అలవాటుపడ్డాక వీరు ఒకరికొకరు సహకరించుకోవడం ఆనందదాయకంగా తోస్తుంది. పండిన పంటలు కోత సమయంలో వీరి పరస్పర సహకారం ''హెల్మా'' అనే పేరుతో పిలవడం గమనిస్తాం. విల్లంబులను ప్రయోగించడంలో ప్రావీణ్యాన్ని సంపాదించిన భిల్లులు వేటాడటంలో అసాధారణ ప్రతిభను ప్రదర్శిస్తుంటారు. తమకున్న సాధారణమైన ఆయుధాలతోనే క్రూరమృగాలను సహితం చంపగల ధైర్యం కలవారై ఉంటారు. అటవీ సంపదలైన తేనె,దుంపలు, పండ్లు, విప్పపువ్వు, జిగురు, వగైరాల సేకరణలో వీరిది అందెవేసిన చెయ్యి.

చెట్లు కూల్చడం, కట్టెలు కొట్టడం కూడా చాలా తేలికగా చేయగల సమర్థులై ఉంటారు వీరు. కోళ్లను పెంచడం, చేపల వేట కూడా నేర్చుకున్నారు. కొన్ని గిరిజన జాతులవారిలా తమ బట్టలు తాము నేయడం చేయకుండా, సంతల్లో వాటిని కొని తెచ్చుకుంటారు. భిల్లులు ఎప్పటికప్పుడు తమకు తెలిసినదే కాకుండా కొత్తవి అధ్యయనం చేస్తూ మునుముందుకు దూసుకుపోవడం ఎక్కువ. జనాభా పెరుగుదల, భూకబ్జాల వల్ల వారు నష్టపోతూ వెనుకబడటం చూస్తున్నాం. నేడు 'గిరిజనాభివృద్ధి సంస్థల పుణ్యమా అని వీరికి కొన్ని వెసులుబాట్లు జరుగుతున్నా, అరకొర వసతుల మూలంగా ఇంకా ఇబ్బందులు మాత్రం తప్పడం లేదనేది అక్షర సత్యం.

- డా॥మంతెన సూర్యనారాయణ రాజు



శాతవాహనుల కాలంలో బౌద్ధమతం

శాతవాహన సామ్రాజ్యంలో బౌద్ధ మతం అన్ని విధాలా జనాదరణ పొందింది. బుద్ధుని కాలం నుండి తెలుగు నేల బౌద్ధమతముపై భక్తి తాత్పర్యాలు కలిగి వుంది. తరువాత కాలంలో బౌద్ధమతంలో ఎన్నో భేదాలు ఏర్పడి అవాంతర శాఖలు ఏర్పడినాయి. వీరిలో పూర్వాచార పరాయణుల శాఖకు థేరవాదమని పేరు. ఆచారాలలో సంస్కారము, మార్పుకోరేవారిని మహాసాంఘికులు అంటారు.

మహాసాంఘిక సిద్ధాంతాలను అశోకుడు దేశదేశాలలో ప్రచారం చేయించాడు. బౌద్ధమత ప్రచారానికై అశోకుడు మహాదేవ భిక్షువు అనే అతనిని ఆంధ్రదేశానికి పంపాడు. మరికొంత కాలానికి బౌద్ధమతంలో హీనయాన మహాయానాలనే రెండు ప్రధాన మార్గాలేర్పడినాయి.

గృహపతులు యజ్ఞాలు ఆచరించేట్లుగా యజ్ఞశ్రీ శాతకర్ణి చినగంజాం శాసనా లను బట్టి ఊహించవచ్చు.

ఈ కాలంలో విదేశీయులైన శక, యవన, పహ్లావులు దేశంలో స్థిరనివాసా లేర్పరుచుకొన్నారు. వీరజాతులైన వీరికి శాంతి ప్రధానమైన బౌద్ధ మతం అంతగా నచ్చలేదు. కావున వీరిలో పలువురు వైదిక మతానుయాయులైనారు. స్వధర్మ రక్షణార్థమై బ్రాహ్మణులు వీరిని క్షత్రియులుగా పరిగణించి సంఘంలో ఉన్నత స్థానాన్ని కల్పించారు. ఈ విధంగా ఈ శూరులు బ్రాహ్మణులకు అండగా ఉండి బౌద్ధధర్మాన్ని ప్రతిఘటించడంలో వారికి అండగా నిలిచారు. శక, పహ్లావ రాణులు బ్రాహ్మణులను మంత్రులుగా చేసికొని పరిపాలన సాగించారు. సహపాణుని మంత్రి ఆయముడను బ్రాహ్మణుడు. ఈ విదేశీయుల నుండి వైదిక మతానికి గొప్ప రక్షణ లభించింది.

ఋషభదత్తుడు గొప్ప దానకర్తగా పేరు పొందాడు. ఇతని దాన శాసనాలు నాసిక్ గుహలలో దొరికాయి. ఇతడు గోవర్ధనంలోని పర్వత శిఖరాలపై గుహలు, చెరువులు త్రవ్వించాడు.

మహాయానాన్నే మాధ్యమిక వాదమంటారు. ఆంధ్రదేశంలో వెలసిన బౌద్ధం మహాయాన పథానికి చెందింది. ఆంధ్రదేశపు శాసనాలలో చైత్యక, రాజగిరి, పూర్వశైలీయ, అపర శైలీయ శాఖలు పేర్కొనబడినవి. యజ్ఞశ్రీ శాతకర్ణికి సమకాలికుడుగా చెప్పబడిన ఆచార్య నాగార్జునుడు మాధ్యమిక వాదానికి గొప్ప ప్రవక్తగా, మూలస్తంభంగా ఉన్నాడు.


శాతవాహనయుగంలో బౌద్ధమతం గొప్పగా ప్రకాశించినా వైదికమతం దేదీప్యంగా వికసించింది. వేదప్రోక్తలైన యజ్ఞయాగాది క్రతువులు, వర్ణాశ్రమ ధర్మవిధానం ఆదరణను పొందింది. దేవి నాగనిక భర్త అయిన మొదటి శాతకర్ణి రెండశ్వమేధములు, అగ్న్యాధేయము, అనారంభణీయము, అప్తోర్యామము మొదలగు విశేష క్రతువులనెన్నో ఆచరించాడు. గౌతమీ పుత్ర శాతకర్ణి చాతుర్వర్ణ్య సంకరము నివారించినవాడని ప్రశంసింపబడెను.



బ్రాహ్మణులకు మూడు లక్షల గోవులు దానం చేసాడు. భరుకచ్ఛంలో చతురస్రాలనే విశ్రాంతి ప్రదేశాలను నిర్మించాడు. బాటసారుల సౌకర్యా నికై రాజమార్గాలకు రెండు వైపులా విశ్రాంతి స్థలాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేసాడు. ఋషభదత్తుడు వైదిక మతాభిమాని అయినా బౌద్ధభిక్షువులను కూడా ఆదరించాడు. గోవర్ధనంలోని నేత పనివాళ్ల కూటమి వద్ద రెండువేల కర్షపణములు నిక్షేపంగా ఉంచాడు. దీనిపై వచ్చే వడ్డీ నూరు కర్షపణములు. ఈ ధనంతో తాను నిర్మించిన గుహా విహారాలలో నివ సించే బౌద్ధభిక్షువులకు వర్షాకాలంలో దుప్పట్లు కొని ఇచ్చేటట్లుగా నేత సంఘం వారితో ఏర్పాట్లు చేసాడు. ఈ ఆజ్ఞలు గోవర్ధనంలోని పౌరసభ వారిచే తీర్మా నింపబడి విహారం తలుపు మీద లిఖింపబడినవి. ఋషభదత్తుని దానశాసనా లలో కనిపించే మత సామరస్యము అతని ప్రత్యేకత కాక, శాతవాహన యుగ చరిత్రలోని సర్వసాధారణ లక్షణము. వైదిక బౌద్ధ ధర్మాల మధ్య తాత్త్విక సంగ్రామం జరిగినా ఉభయ మతావలంబకుల మధ్య యుద్ధాలు, రక్తపాతం మచ్చుకైనా లేకపోయేది. జైనమతం కూడా ఆ కాలంలో వ్యాప్తిలో ఉంది. కళింగరాజైన ఖారవేలుడు జైనమతావలంబకుడు. శాతవాహనుల చరిత్ర అంతా పరమత సహనానికి, ప్రజాక్షేమ పరాయణతకు గొప్ప నిదర్శనము. 'యథా రాజా తథా ప్రజా' అన్న సూక్తి మేరకు ఈ యుగంలో గృహస్తులు ఏ మాత్రం సిరిసంపదలు కలవారైనా బౌద్ధగురువుల కోసం గుహలు తొలిపించి, విహారాలు నిర్మించి తమ భక్తిని చాటుకొన్నారు. ధనవంతులైన వణిజులు ఈ విధమైన దానాలు విరివిగా చేసారు. కార్మికులు కూడా యథాశక్తిగా దానధర్మాలు ఆచరించారు.

- గుణుగుంట్ల శైలజ

ప్రాచీన కళారూపం జముకు కథ



ఆంధ్రదేశంలోని ఈనాటి ప్రజలకు తెలియని కళారూపమీ జముకుల కథ. కాకతీయుల కాలంలో జనాదరణ పొందిన ఈ కళ నేడు కోస్తా జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే ఉంది. ప్రస్తుతమీ కళ కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. కాకతీయులకాలంలో ఓరుగల్లులో ఉన్న ఎల్లమ్మపై జానపద కళాకారులు ఈ కథ చెప్పేవారని అంటారు.

జముకుల కథలనే జక్కుల కథ అనే పేరుతో పిలుస్తారు. కోస్తా జిల్లాలైన విశాఖ పట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాలలో ఈ కళాకారులున్నారు. జక్కుల కథనే కొన్ని ప్రాంతాలలో బుడికి అని, బుణికి పాట అని, బుడ బుక్కల పాట అని పిలుస్తారు. ఈ కథ చెప్పేవారిలో వంత పాటగాళ్ల వద్ద వుండే వాయిద్యాన్నే బుడికి అని, బోను అనీ అంటారు. ఆ పేరు మీద ఈ కథలకు ఆ పేరు వచ్చింది.

జముకుల కథకు మొత్తం ముగ్గురు వ్యక్తులు చెబుతారు. బుర్రకథలో వలె ఇద్దరు వంత పాటగాళ్లు, ఒక ప్రధాన కథకుడు ఉంటారు. జముకుల కథను సాధారణంగా రాత్రి వేళలలో గ్రామం కూడళ్ల వద్ద ప్రదర్శిస్తారు. చిన్నపాటి వేదిక ఉంటే సరిపోతుంది. సుమారు మూడు గంటల నుంచి ఆరేడు గంటల పాటు ఈ కథ చెబుతారు.

జముకుల కథ ప్రదర్శించే వేదిక మధ్య ఒక స్తంభాన్ని అమర్చుతారు. ఈస్తంభం చుట్టూ కథకులు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ తిరుగుతూ వాయిద్యం వాయిస్తూ కథ చెబుతారు. ఈ దీపపు స్తంభాన్ని గిరడు అంటారు. జముకుల కథలో చెప్పేవన్నీ పౌరాణిక గాథలే అయి ఉంటాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బడుగు వర్గాల వారు ఈ కథ చెప్పడంలో నిష్ణాతులని పేరు తెచ్చుకున్నారు. వీరు పాడే పాటలు నిజానికి వినసొంపుగా ఉండవు. భాష కూడా సరిగా ఉండనప్పటికీ పామరులీ కథను ఆదరించడంతో మనగలిగింది. జముకుల కథలు చెప్పేవారిది సంచార జీవనం. దేశం మీద కుటుంబంతో కథలు చెప్పేవారిది సంచార జీవనం. కుటుంబంతో సహా వివిధ గ్రామాల్లో సంచరిస్తూ ఆ గ్రామాలలో జక్కుల కథ చెబుతూ కడుపు నింపుకుంటారు. ఇదే వీరి జీవనశైలి. జక్కుల కథే వీరి ఉపాధి. అయితే ఏడాది రెండేళ్లకొకసారి వారి స్వగ్రామాలకు చేరుకుని తమ పెద్దలతో గడపడం వీరి సంప్రదాయం.



జక్కుల కథకు ఆయువు పోసేది వంతపాటగాళ్లు వాయించే జమిలిక వాయిద్యం, కథకుడి చేతిలో ఉండే రుమాలు. ఈరెండూ జముకుల కథలో అతి కీలకమైన పాత్ర పోషిస్తాయి. వీటి గురించి స్థూలంగా తెలుసుకుందాం.

జక్కుల కథకు ఆయువు పోసేది వంత పాటగాళ్లువాయించే జమిలిక వాయిద్యం. కథకుడి చేతిలో ఉండే రుమాలు. ఈ రెండూ జముకుల కథలో అతి కీలకమైన పాత్ర పోషిస్తాయి. వీటి గురించి స్థూలంగా తెలుసుకుందాం.

జక్కుల కథ చెప్పే వంత పాటగాళ్లు చేతిలో ఉండే జమిలిక వాయిద్యాన్నే జమిడిక, బుడికి అని కూడా అంటారు. ఈ వాయిద్యం ఒక లోటా ఆకారంలో ఉంటుంది. దీనిలో ఖాళీగా ఉండే వైపు ఒక చర్మంతో మూస్తారు. చెక్కతో చేసిన కొయ్యముక్క అమరుస్తారు. ఈ వాయిద్య చర్మం మీద దరువు వేస్తే శ్రావ్యమైన సంగీతం పుడుతుంది.

జముకుల కథలో ప్రధాన పాత్ర వహించే మరో ముఖ్యమైన వస్తువు కథకుడి చేతిలో రుమాలు, చేతిలో రుమాలు లేనిదే కథకుడి గొంతు పెగలదని జముకుల కథ గురించి పరిశోధన చేసినవారు చెబుతుంటారు. ఊహాత్మక వస్తువులకు, ప్రాణులకు ప్రతీక ఈ రుమాలు. అవసరమైతే రుమాలునే విల్లులా, ఒక పక్షిలా, కథకుడు మూకాభినయం ద్వారా చూపుతాడు. అభినయంతో చూపగల అన్ని వస్తువులు, ప్రాణులకు ఈ రుమాలునే వాడుతూ కథను ముందుకు నడుపుతారు. కథాక్రమం చూస్తే బుర్ర కథలో వలె కథకుడు, వంత పాటదారులు కథ చెబుతున్నప్పటికీ, ఒక్కోసారి వారే కథలో పాత్రలుగా మారిపోయి ఆయా పాత్రలను అభినయిస్తారు. కథకుడు రాజు వేషం వేస్తే వంత పాటగాళ్లు వంది మాగధులుగానో, సైనికులుగానో నటిస్తారు. కథకుడు గురువు పాత్ర వేస్తే వంతలు శిష్యులుగా రూపాంతరం చెందిపోతారు. ఇలా వీరే కథ చెబుతూ, పాత్రలుగా మారుతూ ఆసక్తికరంగా ఆ గాథ వివరిస్తారు.

హరికథలకు, బుర్రకథలకు రచయితలు ఉన్నట్టే ఒకనాడు ఆంధ్రదేశంలో పేరు మోసిన జముకుల కథలకు రచయితలుండేవారు. స్వాతంత్రోద్యమకాలంలో వారనాసి సత్యనారాయణశాస్త్రి, పుట్టే సుబ్బారావు, తర్వాత కాలంలో నెదునూరి గంగాధరం ప్రసిద్ధ రచయితగా వాసికెక్కారు. ప్రజా నాట్యమండలి కళాకారులైన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు, పి.ఉమామహేశ్వరరావు తదితరులు కథకులుగా పేరు తెచ్చుకున్నారు. నేడు ప్రజలు ఆదరించని ఈ కళారూపం ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు దేశభక్తిని ప్రబోధించే యువతను జాగృతం చేసిన కళారూపాలలో ఒకటిగా ఖ్యాతి గడించింది.

- ఉన్నం వెంకటేశ్వర్లు
8919479134



ప్రభాస్

అనుష్కతో అలాంటిదేం లేదు...!

ప్రభాస్ అనుష్క పెళ్లికి సిద్ధమవుతున్నారంటూ కొద్దికాలంగా వార్తలు వస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకే యంగ్ రెబల్‌స్టార్ తన కొత్త చిత్రం 'సాహో' లో స్వీటీని తీసుకోలేదని చెప్పుకున్నారు. ఇక ఈ వార్తలను తాజాగా ప్రభాస్ ఖండించారు. అనుష్కతో తనకున్నది స్నేహమేనని ..పెళ్లి చేసుకునే ఉద్దేశాలు తమకు లేవని చెప్పారు. అనుష్కనే కాదు..అసలు ఇప్పట్లో పెళ్లి ఆలోచనే తనకు లేదని చెప్పారు. ఈ విషయంపై ప్రభాస్ మాట్లాడుతూ..'ఒక నాయికతో రెండు మూడు సినిమాలు చేస్తే...ప్రేక్షకులు ఇలాంటివే ఊహిస్తారు. పుకార్లు రాసేవాళ్లు రాస్తూనే ఉంటారు. మొదట్లో బాధపడేవాడిని ఇలాంటివి ప్రచారం జరుగుతున్నాయని. కానీ ఇప్పుడు తేలిగ్గా తీసుకుంటున్నాను. ఏదైనా అనుకోండి మా మధ్య ఉన్న బంధాల గురించి మాకు తెలుసు. నన్ను అభిమానించే అమ్మాయిలు నిశ్చింతంగా ఉండొచ్చు. నేను ఇప్పట్లో పెళ్లి చేసుకోను.' అన్నారు.



పవన్ కళ్యాణ్

ప్రియమణి పెళ్లి బాజా



పెళ్లైన కొత్తలో చిత్రంతో తెలుగు తెరకొచ్చిన కన్నడ భామ ప్రియమణి పెళ్లి పీటలు ఎక్కబోతోంది. తన స్నేహితుడు ముస్తఫా రాజ్‌ను ప్రియమణి వివాహం చేసుకోనుంది. ఇప్పటికే నిశ్చితార్థం జరగ్గా...ఈ నెల 23న వీళ్లిద్దరి పెళ్లి జరగనుంది. బెంగళూరులోని రిజిస్ట్రార్ కార్యాలయంలో పెళ్లి కార్యక్రమం నిరాడంబరంగా చేసుకోనున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, పరిశ్రమలోని ప్రముఖులు హాజరయ్యేలా భారీ రిసెప్షన్ చేయాలని నిర్ణయించారు. ఇక నటిగా తెలుగు తమిళ కన్నడ మలయాళంలో ప్రియమణి మంచి గుర్తింపు తెచ్చుకుంది. దశాబ్దంన్నరగా ఆమె కెరీర్ కొనసాగిస్తోంది. ఆమె గతేడాది 'మనవూరి రామాయణం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రస్తుతం కన్నడలో నాయికగా నటిస్తూనే టీవీ కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తోంది.

'జయ జానకి నాయక' నా ఉత్తమ ప్రదర్శన

- బెల్లంకొండ శ్రీనివాస్



అల్లుడు శీను చిత్రంతో తెరకు పరిచయమైన కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్. తొలి చిత్రంతో కమర్షియల్ హీరోగా పేరు తెచ్చుకున్న శ్రీనివాస్ 'స్పీడున్నోడు' తో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వం వహించిన 'జయ జానకి నాయక' తో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆగస్టు 11న 'జయ జానకి నాయక' విడుదలవుతున్న సందర్భంగా ఈ యువ కథానాయకుడు చిత్ర విశేషాలు తెలిపారు..

☆ 'అల్లుడు శీను' లో నటిస్తున్నప్పుడే బోయపాటి శ్రీనుతో సినిమా ఒప్పందం జరిగింది. కథ పూర్తవడానికి ఆరు నెలల సమయం పట్టింది. అందుకే వేసవికి రావాల్సిన మా సినిమా ఇప్పుడు విడుదలకు వస్తోంది. ఈ సినిమా చేయడానికి తొలి కారణం బోయపాటి గారే. ఆయన దర్శకుడు అంటే ఎవరైనా ఆలోచించడానికి ఏముంటుంది. బోయపాటి దగ్గర చాలా కథలుంటాయి. నా కోసం ఆయన ఒక మంచి కథ చెప్పారు. నేను విన్న కథల్లో చాలా బాగుంది అనిపించింది. ఇంతకంటే మంచి కథ దొరకదు అనుకున్నాను.

☆ సీతమ్మను లంక నుంచి శ్రీరాముడు తీసుకొస్తుంటే అంతా 'జయ జానకి నాయక' అంటూ పిలిచారట. అలా ఈ పేరు వచ్చింది. మా చిత్రానికి పేరు పెట్టేందుకు కథలో ఇలాంటి నేపథ్యమే ఉంటుంది. ముందు ఈ టైటిల్ చూసి పెద్దగా ఉంది. త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్లదు అన్నారు. బోయపాటి సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌కు ఫోన్ చేసి టైటిల్‌కు మ్యూజిక్ చేయండి. బాగుండాలి అని అడిగారు. దేవీ ట్యూన్‌తో మా సినిమా పేరు మరింత ఆకట్టుకునేలా తయారైంది.

☆ 'జయ జానకి నాయక' మంచి ప్రేమ కథ. యాక్షన్ అంశాలుంటాయి. తొలి భాగంలో ప్రేమించే సన్నివేశాలుంటాయి. ఇవి దర్శకుడిగా బోయపాటిలోని కొత్తదనాన్ని చూపిస్తాయి. ఇక యాక్షన్‌లో ఆయన మార్క్ ప్రేక్షకులకు తెలుసు. దాన్ని అందుకునేందుకు చాలా సన్నద్ధమయ్యాను. హంసల దీవిలో చేసిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ఆకర్షణ అవుతాయి.

☆ నాకు ఈ సినిమా గొప్ప అవకాశం అని తెలుసు. అందుకే చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. హావభావాలు, ఉచ్చారణ, అభినయం లాంటి అన్ని విషయాల్లో ఉత్తమ ప్రదర్శన చేయాలనుకున్నాను. గతంలో నేను చేసిన రెండు సినిమాల్లో సన్నగా కనిపించాను. అందుకే ఈ చిత్రం కోసం పాతిక కిలోల బరువు పెరిగి..మళ్లీ పది కిలోలు తగ్గాను. యాక్షన్ హీరోకుండాల్సిన శరీరాకృతి తెచ్చుకున్నాను.

☆ తొలి సినిమా నుంచీ పేరున్న నాయికలతో నటిస్తున్నాను. ఇందులో రకుల్ ప్రీత్‌సింగ్ తో కలిసి నటించాను. రకుల్ సరసన హీరోగా నటించడం సంతోషంగా ఉంది. ప్రగ్యా జైశ్వాల్‌ది మరో ముఖ్యమైన పాత్ర. ఆమె పాత్ర వల్లే కథ మలుపు తిరుగుతుంది. క్యాథరీన్ ట్రెసా ప్రత్యేక గీతంలో కనిపిస్తుంది.

☆ ఈ చిత్రంలో అనుభవమున్న నటీనటులతో కలిసి పనిచేశాను. వాళ్లతో కలిసి నటించడం నా అదృష్టం. జగపతిబాబు, శరత్‌కుమార్ లాంటి వాళ్లంతా కథలో ముఖ్యమైన పాత్రలు చేశారు. వాళ్ల పాత్రలు మరెవరూ చేయరు అన్నట్లు ఉంటాయి.

☆ నాకు కొంత గుర్తింపు ఉంది. అయితే ఇంత పెద్ద బడ్జెట్‌తో, పేరున్న నటీనటులతో సినిమాలు చేస్తున్నప్పుడు ప్రత్యేక గీతాలు ఉండాల్సిందే. సినిమా అన్ని వర్గాల వారికీ చేరువ కావాలనేది మా ప్రయత్నం. అన్ని కమర్షియల్ హంగులు ఉన్నప్పుడే నా లాంటి కథానాయకుడి సినిమా వాటి మధ్య నిలబడుతుంది.

☆ దర్శకుడిగా బోయపాటి నాకు సోదరుడు లాంటి వారు. నువ్వు సినిమా చేయి...కావాలంటే మరో సినిమా చేద్దాం అనే భరోసా ఇచ్చారు. నమ్మకాన్ని కలిగించారు. ఆయన వల్లే ఆత్మ విశ్వాసంతో నటించగలిగాను.

☆ సినిమా చేయడం ఆలస్యమైనా మంచి చిత్రాలు చేయాలనే నిర్ణయానికి వచ్చాను. ఎంత పెద్ద హీరో సినిమా అయినా బాగుంటేనే జనం చూస్తున్నారు. సినిమా విడుదలైన శుక్రవారమే మనది. సోమవారం మర్చిపోతారు. మరో సినిమా వస్తుంది. అందుకే కథ, దర్శకుడు బాగుండి అంతా కుదిరితేనే సినిమాలు చేస్తాను. ఏడాదికి సినిమా రెండు సినిమాలు అనే నియమాలేం పెట్టుకోలేదు.

☆ శ్రీవాస్ దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నాను. ఇది మరో అందమైన కథ. ఇరవై రోజులు చిత్రీకరణ పూర్తి చేశాం. త్వరలో మరో షెడ్యూల్ షూటింగ్‌కు వెళ్తున్నాం. హీరో కావాలని కలగన్నాను. మా నాన్న అది తన కలలా భావించి నన్ను నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

గోపాల కృష్ణుడు ఎలా ఉంటాడంటే...!

పవర్‌స్టార్ నటిస్తున్న కొత్త చిత్రం పేరు 'గోకుల కృష్ణుడు' అని నిర్ణయించారట. ఇది పవన్‌కళ్యాణ్‌కు 25వ సినిమా. సినిమా ప్రారంభం నుంచి 'ఇంజినీర్ బాబు'ను వర్కింగ్ టైటిల్‌గా తీసుకున్నారు. త్రివిక్రమ్ పవన్‌ల హ్యాట్రిక్ సినిమాగా ఈ చిత్రానికి భారీ క్రేజ్ ఏర్పడింది. కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ పవర్‌స్టార్ సరసన నటిస్తున్నారు. హారికా హాసినీ క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. చిత్రీకరణ వేగంగా సాగుతోంది. కీలక ఘట్టాలను తెరకెక్కించారు. మరికొంత చిత్రీకరణ, పాటల కోసం యూనిట్ బల్గేరియా వెళ్తోంది. పవన్, కీర్తి, అనూ పాల్గొనే ముఖ్యమైన సన్నివేశాలు, పాటలను ఇక్కడ రూపకల్పన చేస్తారు. దీంతో దాదాపు సినిమా పూర్తవుతుంది. తగినంత సమయం తీసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలు చేస్తారు. ఈ ఏడాది చివర్లో గానీ వచ్చే సంక్రాంతి పండక్కి గానీ 'గోకుల కృష్ణుడు' తెరపైకి రానున్నాడు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ఆగస్టు 15న విడుదల చేస్తారని సమాచారం. పవన్ రాజకీయ అరంగేట్రం, ప్రజా జీవితంలో చురుకుగా అడుగులు వేస్తుండటం, ఎక్కడికి వెళ్లినా జాతీయ భావంతో మాట్లాడటం...ఇవన్నీ అతని సినిమాలైనా ప్రభావం చూపిస్తున్నాయి. అందుకే స్వాతంత్ర్య దినోత్సవాన 'గోకుల కృష్ణుడు' ఎలా ఉంటాడో చూపించాలని యూనిట్ భావిస్తోంది. పవర్‌స్టార్ కొత్త సినిమా ఫస్ట్‌లుక్ విడుదల చేసేందుకు ఇప్పట్లో ఇంతకంటే మంచి సందర్భం లేదని పవన్ కూడా అనుకుంటున్నాడట. పవర్‌స్టార్ నటిస్తున్న పాతిక చిత్రం, త్రివిక్రమ్ కాంబినేషన్ లో హ్యాట్రిక్ సినిమా అవడం వల్ల... 'గోకుల కృష్ణుడు' చిత్రానికి భారీ బిజినెస్ జరుగుతోంది. ఈ చిత్రానికి దాదాపు 150 కోట్ల రూపాయల ప్రీ రిలీజ్ వ్యాపారం జరిగినట్లు సమాచారం.

ఆది, బన్ని వాసుల నెక్స్ట్ నువ్వే



వైభవి, ఆది

ఆది హీరోగా, ప్రభాకర్.పి. దర్శకత్వంలో వి4 మూవీస్ సంస్థ పతాకంపై బన్ని వాసు నిర్మిస్తున్న చిత్రం నెక్స్ట్ నువ్వే. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేశారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కథకి సరిపోయే విధంగా ఉండనే ఉద్దేశంతో నెక్స్ట్ నువ్వే టైటిల్ ఖరారు చేసినట్టు నిర్మాత తెలిపారు. హిలేరియస్ కామెడీ, థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వైభవి, రష్మి నాయికలుగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి విజయదశమి కానుకగా ఈ సినిమా విడుదల చేయడానికి నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు.

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆశీస్సులతో చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టారు బన్ని వాసు. మొదటి చిత్రాన్ని సుకుమార్ దర్శకత్వంలో 100 లవ్ తీశారు. ఆ తర్వాత పిల్లా నువ్వులేని జీవితం, కొత్తజంట, భలేభలే మగాడివోయ్ చిత్రాలను తీశారు. కమర్షియల్ కాన్సెప్ట్‌తో సినిమాలు తీస్తూ విజయం సాధిస్తున్న బన్ని వాసు ఇప్పుడు నెక్స్ట్ నువ్వే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

బుల్లితెర దర్శకుడిగా పేరున్న ప్రభాకర్ తొలిసారి సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన కథ నచ్చడంతో ఆది అంగీకరించారు.

నిర్మాత బన్నివాసు మాట్లాడుతూ వి4 మూవీస్ తొలి చిత్రమిది. మంచి కాన్సెప్ట్‌తో తీస్తున్న ఈ చిత్రం లక్ష్యం ప్రేక్షకులకు వినోదాన్ని అందించడం. ఆది క్యారెక్ట్ చాలా కొత్తగా ఉంటుంది. ఇతర పాత్రధారులవి కూడా ప్రాధాన్యత ఉన్నవే. విజయదశమికి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం అని చెప్పారు.

ఈ చిత్రానికి కథ డి.కె., మాటలు శ్రీకాంత్ విస్సా, నిరుపమ్ పరిటాల, పాటలు కె.కె.సాగర్, ఛాయాగ్రహణం కార్తిక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్య గమిడి, స్క్రీన్‌ప్లే దర్శకత్వం ప్రభాకర్.పి.



రామ్ చిత్రం పేరు ఉన్నది ఒకటే జిందగి

రామ్ నటిస్తున్న కొత్త చిత్రానికి ఉన్నది ఒకటే జిందగి అనే టైటిల్ నిర్ణయించారు. పి.ఆర్.సినిమాస్ సమర్పణలో స్రవంతి సినిమాటిక్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతోంది. కృష్ణచైతన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కిశోర్ తిరుమల (నేను శైలజ ఫేమ్) దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అనుపమా పరమేశ్వరన్, లావణ్యా త్రిపాఠి నాయికలుగా నటిస్తున్నారు.

స్రవంతి రవికిషోర్ చిత్ర విశేషాలు తెలుపుతూ స్నేహం, ప్రేమ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం నాడు ట్రెండ్ మారినా.... ఫ్రెండ్ మారడు అనే పాటకు సంబంధించిన లిరికల్ వీడియోను విడుదల చేస్తున్నాం. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ పాటను చంద్రబోస్ రచించారు. ఊటిలో జరిపే భారీ షెడ్యూల్‌తో ఒక పాట మినహా సినిమా పూర్తవుతుంది. బ్యాలెన్స్ ఉన్న పాటని ఇటలీలో చిత్రీకరించి, దసరాకి సినిమాను విడుదల చేస్తాం అని తెలిపారు.

ఈ చిత్రానికి సంగీతం దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్ శ్రీకర్ ప్రసాద్, ఛాయాగ్రహణం సమీర్‌రెడ్డి.

సప్తగిరి సూపర్ ఫాస్ట్ మొదలైంది



సప్తగిరి కథానాయకుడిగా 'సప్తగిరి సూపర్ ఫాస్ట్ ' అనే కొత్త చిత్రం ప్రారంభమైంది. నట్టీస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మాతలు. 'సప్తగిరి సూపర్ ఫాస్ట్ ' చిత్ర ప్రారంభోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నిర్మాత పి. కిరణ్, రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకుడు బి గోపాల్ అతిథులుగా హాజరయ్యారు. కిరణ్ క్లాప్‌నివ్వగా, విజయేంద్రప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. బి గోపాల్ గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర ప్రారంభోత్సవం అనంతరం దర్శకుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ...' కొంత విరామం తీసుకుని ఈ చిత్రాన్ని రూపొంది స్తున్నాను. అందరికీ నచ్చే కథాంశమిది. విజయేంద్రప్రసాద్ గారు కథను అంగీకరించాక చిత్రాన్ని ప్రారంభించాం. సప్తగిరి కథానాయకుడిగా మరో మెట్టు ఎక్కే చిత్రమిది. నిర్మాతలకు పేరు తీసుకొస్తుంది. త్వరలో చిత్రీకరణకు వెళ్తాం.' అన్నారు. నిర్మాతలు నట్టి కరుణ, క్రాంతి మాట్లాడుతూ...' నాన్నగారు మమ్మల్ని ఈ రంగంలో ప్రోత్సహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఆయన పేరు నిలబెడతాం. మమ్మల్ని, మా జట్టును నమ్మి సినిమా చేస్తున్న సప్తగిరికి కృతజ్ఞతలు.' అన్నారు. సప్తగిరి మాట్లాడుతూ..'మంచి విషయం ఉన్న కథ ఇది. నా సినిమా ప్రారంభోత్సవం విజయేంద్రప్రసాద్, బి గోపాల్ లాంటి వాళ్లు రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాతో అందరికీ విజయం దక్కాలని కోరుకుంటున్నా.' అన్నారు. రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ..'వర్షవర్ధన్ నా చిరకాల మిత్రుడు. నాతో కలిసి చాలా సినిమాలకు పనిచేశాడు. సప్తగిరి సూపర్ ఫాస్ట్ కథను సిద్ధం చేసి నాకు చెప్పాడు. మంచి కథ. సప్తగిరికి బాగా సరిపోతుంది.' అన్నారు.

ఇతర పాత్రల్లో నరేష్, పోసాని, శివప్రసాద్, తనికెళ్ల భరణి, జయ ప్రకాష్ రెడ్డి, షాయాజీ షిండే, రఘుబాబు, శకలక శంకర్, రఘు, ప్రగతి, విద్యుల్లేఖ రామన్ నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్ - కెవి రమణ, ఎడిటింగ్ - గౌతంరాజు, ఫైట్స్ - రామ్ లక్ష్మణ్.

నేటి ఆకలిరాజ్యం

భాగ్యలక్ష్మీ ఆర్ట్ పిక్చర్స్ సంస్థ నేటి ఆకలిరాజ్యం పేరుతో చిత్రం నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. శ్రీభాగ్య దర్శకత్వం లో మంజులా భాగ్యలక్ష్మీ, యం.శ్యామల ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తారు.

ఆనంద్, కావ్యశ్రీ, అంజలి, జబర్దస్త్ ఆది, షేకింగ్ శేషు తదితరులు నటించే ఈ చిత్రం షూటింగ్ ఈ నెల చివరివారంలో మొదలవుతుంది. కృషి పట్టుదల, ఏకాగ్రతతో యువత తాము అనుకున్నది ఎలా సాధించగలరు?, స్నేహసంబంధాలు మరిచిపోయి డబ్బే ప్రధానం అనుకుని బ్రతికే యువత నిజమైన స్నేహం విలువ ఏమిటో ఈ చిత్రంలో చూపే ప్రయత్నం చేస్తున్నాం. అంతేకాకుండా ఇరవై మందికి పైగా సీనియర్ నటీనటులు, సాంకేతిక నిపుణులతో నిర్మిస్తున్నాం అని దర్శకుడు తెలిపారు.

ఈ చిత్రానికి ఛాయాగ్రహణం రామ్ పినిశెట్టి, మాటలు రైటర్ మోహన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం శ్రీభాగ్య